
# భూదేవి



తోటపల్లి జగన్మోహనరావు

# భూదేవి

## తోటపల్లి జగన్మోహన రావు




*Photo by : M. Vedakumar*

తెలంగాణ రిసోర్స్ సెంటర్

హిమాయత్‌నగర్, హైదరాబాద్

# భూదేవి

# BHOODEVI

*by* ***Thotapalli Jaganmohan Rao***

*First Edition : September, 2013*

*Copies : 1000*

*Price :* ***Rs. 100/-***

*Published by :*
***M. Vedakumar**, Chairman*
*Telangana Resource Centre*

*For Copies :*
**Telangana Resource Centre**
*"Chandram" 490, Street No. 11,*
*Himayatnagar, Hyderabad-500029.*
email: trchyd@gmail.com
*Mobile : 9030626288*
***website : www.trchyd.org***

**Thotapalli Jaganmohan Rao**
*Flat No. 504, Maruthi Residency,*
*Old Vegetable Market,*
*Mukurampuram, Karimnagar.*
*Phone : 9963608930*
email : jaganseethaadi@gmail.com

Disha Book House ● Sahachara Book Mark ● Navodaya Book House

*Cover Photo :* T. Swamy

*Layout :* **Charita Impressions**, Azamabad Industrial Area, Hyderabad - 500 020.

*Printed at :*
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# వనరుల పరిరక్షణే ప్రవృత్తి

తెలంగాణ రాష్ట్ర సాధన మరియు పునః నిర్మాణం కోసం తెలంగాణ రిసోర్స్ సెంటర్ పనిచేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ సంస్కృతి, వనరుల పరిరక్షణ, విశాలాంధ్రలో తెలంగాణకు జరిగిన విధ్వంసాన్ని, వివక్షను ప్రజలముందుకు తీసుకువెళ్తూ, అనేక కార్యక్రమాలను మా రిసోర్స్ సెంటర్ కొనసాగిస్తోంది. అందులో భాగంగా టిఆర్సి ఇప్పటికే నెగడు, మనిషి, దక్కన్‌ల్యాండ్ లాంటి ప్రచురణలను ప్రజల ముందుకు తీసుకువచ్చింది.

ఈ ప్రయాణంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వనరుల పరిరక్షణకోసం అనుక్షణం తపించే వ్యక్తి శ్రీ జగన్‌మోహన్‌రావుగారు ఉద్యమకారుడిగా ఉద్యమాలు చేస్తూనే, మరోవైపు విధ్వంసం, వివక్ష, క్షేత్రస్థాయి విశేషాలను సమాజానికి తెలియజేసేందుకు వారు వివిధ అంశాలపై అనేక వ్యాసాలు వ్రాసి ఉన్నారు. సహజ వనరులను కాపాడాలనే తాపత్రయంతో పనిచేస్తున్న జగన్మోహన్‌రావుగారు గతంలో “మరో సరస్వతి కానున్న గోదావరి” అనే పుస్తకాన్ని కూడా ప్రజలకు అందించారు. అలాంటి పర్యావరణ ప్రేమికుడు, ఉద్యమకారుడు తన కళ్ళ ఎదుట జరిగిన కరీంనగర్ గుట్టల విధ్వంసంపై ఎంతో శ్రమకు ఓర్చి నవలను తీసుకువస్తున్నారు. ఈ నవలను తను వ్రాయడమే కాకుండా ఎంతో ఆసక్తితో వరవరరావుగారితో మరియు సుజాత సూరేపల్లిగారితో ముందుమాటను వ్రాయించారు. ఈ ప్రయత్నంలో వనరుల విధ్వంసాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చే ఈ పుస్తకాన్ని తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురణల విభాగం ప్రచురిస్తోంది.

గుట్టల విధ్వంసం వాటి చుట్టూ ఉన్న పెట్టుబడిదారి శక్తులు ఆ గుట్టల చుట్టూ అల్లుకున్న వ్యాపారాలు, ఈ స్వార్థ ప్రయోజనాలలో అస్తవ్యస్తమవుతున్న సామాన్యుల జీవితాలను, విధ్వంసమవుతున్న పర్యావరణాన్ని కళ్ళముందు ఉంచుతున్నాము.


మీ

**– వేదకుమార్. యం**

ఛైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్



మొలంగూరులో చెరువును మట్టితో నింపుతున్న మైనింగ్




ఆకునూరు గ్రామ గుట్టల విధ్వంసం సైదాపూర్ మండలం, కరీంనగర్ జిల్లా

# విన్నపము

తెలంగాణాలో బొగ్గు గనుల ఓపెన్ కాస్టుల్లో జరుగుతున్న విధ్వంసం గురించి చందుగారు తన "భూ నిర్వాసితులు"లోను, ఇతర కథల్లోను విస్తృతంగా చిత్రించారు. వారు రాసిన "భూమి పుత్రుడు" మరియు "దేవుని గుట్ట" నవలలు ఇంకా వెలుగు చూడాల్సిన అవసరం వుంది.

నేను రాసిన ఈ "భూదేవి" నవల నిజానికి చిన్న కథగా రాస్తానను కొని మొదలు పెట్టిన తరువాత పేజీలు పెరిగి పెరిగి ఈ రూపం తీసుకున్నది. నిజానికి ఇది నవల అనతగునా కాదా అన్నది నాకు తెలియదు. మొదట కరీంనగరంలో జరుగుతున్న విధ్వంసాన్ని, దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను చిత్రించడమే జరిగింది.

కరీంనగరం జిల్లాలోని ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వబడిన గ్రానైటు మరియు కంకర గనుల పట్టిక నెగడులో రానున్నాయి. కావున ఇందులో చేర్చలేదు.

ఈ పుస్తకంలో గ్రానైటు గనులకు వాటికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల ఫోటోలు కొన్ని ఇవ్వబడినవి. లోగా ప్రకటించిన నా "మరో సరస్వతి కానున్న గోదావరి" పుస్తకములో గల గ్రానైటు వ్యతిరేక కరపత్రాలు పుస్తక విస్తృతి దృష్ట్యా ఇందులో చేర్చబడలేదు. కానీ ఇటీవల రాసిన చిన్న వ్యాసాన్ని దీనిలో చేర్చినాను.

ఆ చిత్తు ప్రతిని తీసుకువెళ్ళి చందు గారికి చూపగా ఓపికగా చదివి ఇది కేవలం వ్యాసాలు మాత్రమేనని, ఇందులోని సంఘటనలకు సంభాషణ రూపం ఇస్తే మంచిగుంటదని చెప్పుతూ, ఎక్కడెక్కడ ఏలా సంభాషణలు రాయచ్చో వివరించినాడు. ఈ సూచనలకు అనుగుణంగా మొత్తం పుస్తకాన్ని తిరిగి రాసినాను. అమూల్యమైన సూచనలు ఇచ్చి, నా తప్పుఒప్పులను తీర్చిదిద్దిన చందు గారికి ఋణపడి ఉన్నాను.

ఇక పూర్తి చేసిన తరువాత ప్రతిలోని తప్పుడు వాక్యాలను, భాషా దోషాలను సరిచేసి ఇచ్చిన మిత్రులు శ్రీ సంకేపల్లి నాగేంద్రశర్మ, శ్రీ జి. సత్యనారాయణ, వీరగోపాల్, తోటపల్లి సీతామహాలక్ష్మి, తగిన సూచనలిచ్చిన చంద్రశేఖర్ గారలకు శతధా వందనాలు.

ముందు మాటలు కవితాత్మకంగా రాసి ఇచ్చిన శ్రీ వరవరరావుగారికి సర్వదా రుణపడి ఉండగలను.

ఈ రచనకు ప్రేరణగా ఉండి, మరియు మా "తెలంగాణ భూమిరక్షణ సంఘానికి కన్వీనర్ గారైన సూరేపల్లి సుజాతగారు తమ బాధ్యతగా నాలుగు ముందు మాటలు రాసి ఇచ్చినందులకు మరియు ఈ పుస్తక ప్రచురణలో తమ సహాకారాలను అందించిన మార్వాడి సుదర్శన్, మాదన కుమారస్వామి, దుర్వాస రెడ్డి గారలకు కృతజ్ఞతలు.

ఈ నవలలోని "బండారిగాడు" ఊరిడ్సి దారిడిస్సి.... నుండి ఎడతెగని గాయాలు చేసే ఈ మానిని" (పాటలో మిగతా 10 చరణాలు మరియు "భూస్థాపితం" కవిత నావి) వరకు, "రాతి బండో రాతి బండ" "కుండమ్మ కుండా–ఓ మట్టి కుండా" "సెరలడె గుట్టా వాల్ల చేతులకు జెట్టబుట్ట" పాటలను సందర్భానుసారం నేను వాడుకొనుటకు అనుమతినిచ్చిన శ్రీ వెంగల నాగరాజుగౌడు గారికి కృతజ్ఞతలు.

నా పుస్తకానికి అవసరమైనప్పుడల్లా కావలసిన జిరాక్సు కాపీలను తీసిఇచ్చిన సాయి జిరాక్సు శ్రీ రవి గారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి సందోర్భచితంగా కార్టూను దించి ఇచ్చిన చి॥ ప్రసన్నలక్ష్మికి శుభాశీస్సులు.

ఈ పుస్తకానికి లోపలి కవర్ పేజీలో బొమ్మలమ్మ గుట్టను అందముగా ఫోటో తీసిన శ్రీ వేదకుమార్‌గారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని వ్యయప్రయాసలకు ఓర్చి ముద్రించిన తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఛైర్మన్ శ్రీ వేదకుమార్ గారికి సదా రుణపడి ఉండగలను.

ఈ పుస్తకాన్ని ముద్రించిన దక్కన్ ప్రెస్ వారికి, డిటిపి చేసిన చరిత ఇంప్రెషన్స్ వారికి, కృతజ్ఞతలు.

ఈ పుస్తకం మీ చేతుల్లో ఉంది, ఖండన, మన్నలను సమదృష్టితో స్వీకరించగలను.

21–08–2013

**– తోటపల్లి జగన్మోహన రావు**

సెల్ : 9963608930

ఫోన్ : 0878–2230003

e-mail: jaganseetaadi@gmail.com

# బండల మాటున మోగుతున్న గుండెలు

ఈ నల్లనిరాలలో ఏ కన్నులు దాగెనో
ఈ బండలమాటున ఏ గుండెలు మ్రోగెనో

కదలలేవు మెదలలేవు పెదవివిప్పి పలుకలేవు
ఉలి యలికిడి విన్నంతనె జలజలమని పొంగిపొరలు

పైన కఠినమనిపించును - లోన వెన్న కనిపించును
జీవమున్న మనిషికన్న - శిలలే నయమనిపించును

(సి. నారాయణరెడ్డి - అమరశిల్పి జక్కన)

కరీంనగర్ గుట్టల విధ్వంసం గురించి తోటపల్లి జగన్మోహనరావుగారి దృశ్యనవల ఏకబిగిని చదివి ముగించగానే నాకు ఈ పాట గుర్తుకురావడం యాదృశ్చికం కాకపోవచ్చు. సినారేది సిరిసిల్ల కావడం కూడ కాకతాళీయం కాకపోవచ్చు. ఎందుకంటే ఆయన హనుమాజిపేటలోని రైతుకుంటుంబం నుంచి వచ్చాడు. అప్పటి పల్లెటూళ్లోని రైతు జీవితం చూసాడు. అయితే 'అమరశిల్పి జక్కన'లో ఈ పాట రాసినపుడయినా, రామప్ప గుడిమీద కావ్యం రాసినపుడయినా ఆయనది పర్యావరణ దృష్టి కాదు. సౌందర్యదృష్టి.

ఉలి యలికిడి విన్నంతనే - శిల్పాన్ని అవుతున్నాను కదా అని పొంగిపొరలే మానసికతను శిలకు కవి కళాదృష్టినుంచి ఆపాదిస్తున్నాడు. తోటపల్లి గారయితే తను కడుపులో నీళ్లు దాచుకున్న రాళ్లు ఉలి, సుత్తి - ఏమొచ్చె ఇవ్వాల్టి కాలంలో పొక్లెయినర్లు, క్రేన్లు తమ గుండెల్లో ఉక్కు గోళ్లు దించుతున్నప్పుడు కన్నీళ్లయి పొంగి పొరలడమే కాని, ఆనందంలో పరవశించడం లేదంటారు.

'మునులవోలె కారడవులలో మూలలందు పడియున్న' కొండలు, గుట్టలు, రాళ్లు కూడా కావు ఇవి. హనుమకొండ కరీంనగర్ దారిలో కరీంనగర్‌లో ప్రవేశించడానికన్న

కొంచెం ముందు మానకొండూరు నుంచి కరీంనగర్ పట్టణ పరిసరాల్లో జనావాసాల మధ్యనే, కళ్లముందే కరిగిపోతున్న, అదృశ్యమవుతున్న గుట్టలు ఇవి. వీటిగురించి పర్యావరణవాదుల వేదన ఈ నవల.

'పాపాలకు తాపాలకు బహుదూరములో' కూడ లేవు ఇవి. మనుషుల పాపాలకు తాపాలకు మనుషుల మధ్యనే బలయిపోతున్న ప్రాణులు ఇవి. అవును, రాళ్లు ప్రాణులే. రాళ్లు ప్రాణులు. రాళ్లు ప్రాణవాయువులు. రాళ్లు నీళ్లు. రాళ్లు భూసారం, రాళ్లు దేవుళ్లు ఉండే గుళ్లు కాదు. మనుషుల ఆవాసాలు – అనే పర్యావరణదృష్టి ఒక కొత్త కోణం నుంచి ఎంత అలవడితే అప్పుడు ఈ నల్లని రాళ్లలో ఉన్న వెన్న నుంచి వెన్న చిలకగా మిగిలిన చల్ల, వెన్న కరిగించిన నెయ్యి, మన ఆరోగ్యాలు బాగుండి జీర్ణం చేసుకోగలిగితే వెన్నముద్దలే తినిపించగల పౌష్టికాహారాన్ని ఇవ్వగలిగిన రాళ్లు, గుట్టలు, కొండలు. అందుకే అవి జీవమున్న మనిషికన్న నయమైనవి.

ఇంతగా సినారె పాట ప్రస్తావన అయినా, ఆయన ప్రస్తావన అయినా ఎందుకంటే ముఖ్యంగా ఆయన ఈ నవల చదవాలి. కర్ణాటకలో శివరామకరంత్ పర్యావరణం గురించి పట్టించుకుని పశ్చిమకనుమల విధ్వంసం గురించి, కుర్దుముఖ్ పర్వతాల్లో ఇనుపరజం తవ్వకాలను, పర్యావరణ విధ్వంసాన్ని ప్రశ్నిస్తూ గొప్ప ఉద్యమాన్ని నడిపినట్లు (ఇప్పటి సినారెగారి వయసులోనే) నారాయణరెడ్డిగారు కరీంనగర్ గుట్టల విధ్వంసం గురించి, సిరిసిల్ల చేనేతకార్మికుల ఆత్మహత్యల గురించి, గోదావరిఖనిలో లోయల ఓపెన్‌కాస్ట్ విధ్వంసాల గురించి మాట్లాడాలి. ఒక మేఘం చూసే వారి దృష్టికి ఎన్ని ఆకారాలుగా ఊహించుకోవడానికి భావస్ఫోరకమవుతుందో, ఒకే కొండ మానవ జీవితానుభవంలో, విభిన్న జీవన వ్యావృత్తులో ఉన్నవారికి ఒకరికి కవితావస్తువైతే మరొకరికి నవలావస్తువు సౌందర్యదృష్టితో కాలేదు. జీవనవిధ్వంసం దృష్టితో అయింది.

కొండల, గుట్టల విధ్వంసం ఎప్పుడు మొదలయింది. దేవుడు కొండలమీద వెలసినప్పటినుంచా? నరసింహస్వామి అయితే సగం జంతువు కనుక యాదగిరి గుట్టలోనయినా, అహోబిలంలోనయినా, సింహాచలంలోనయినా సొరికెలోనే దాక్కున్నాడు. అయ్యప్ప ఇంకా గుడికట్టుకోని అఖండజ్యోతిగా ఉన్నాడు గనుక అడవి మిగిలింది. మనిషి సృష్టించి కొండమీద ప్రతిష్టించిన దేవుడి దగ్గరికి మనిషి కాలిబాటనో, కొండదారినో పోవడం మానిన దగ్గర్నించీ, యంత్రాల వ్యాపారాలు మొదలయిన దగ్గర్నించి, ఏడుకొండల శేషాచలాలు బాలాజీ మాయాబజార్లుగా మారిపోయినవి. తిరుపతి క్షవరం మనిషికే కాదు, అడివికీ, కొండలకూ తప్పలేదు. దేవుడు కూడా బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాలం నుంచి భూస్వామ్య, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దళారీ కమీషన్ ఏజెంటువలె వడ్డికాసుల

దేవుడయ్యాడు. ఇపుడంతా కమీషన్ వ్యవహారమే. మార్కెట్లో ఎద్దుకొమ్ములను చూపి, అమ్మే రైతునుంచి కొనే రైతునుంచి కమీషన్ పొందే దలాల్ నుంచి ఇవ్వాళ వ్యవస్థయే ప్రభుత్వాన్ని ఒక దళారీగా ఎన్నుకుంటున్న స్థితికి ఎగబాకింది. అనాలా, దిగజారిందనాలా–

ఈ స్థితిలో ఇవ్వాల్టికివ్వాళ కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ కంపెనీల కోసం విధ్వంసమవుతున్న గుట్టల గురించి, ఆ గుట్టలను కాపాడుకోవడానికి ప్రజలు చేస్తున్న పోరాటాల గురించి, ఆ పోరాటాలను సంఘటితం చేస్తున్న పర్యావరణవాదుల కృషి గురించి, బయటినుంచి ప్రజాస్వామ్యవాదుల నుంచి వస్తున్న సంఘీభావం గురించి ఈ నవల చిత్రిస్తుంది. దీనికి అంతస్సూత్రంగా ఒక కథావస్తువును ఎంచుకున్నాడు రచయిత. కరీంనగర్ జిల్లా నుంచి వేలాదిమంది యువకులు బతుకుదెరువు కోసం దుబాయికి పోతున్నారు. వాళ్ల బతుకులు దుర్భరం. అటువంటి దుర్భరజీవితానుభవాలను రోజూ గల్ఫ్‌లేఖల్లో చూస్తూనే ఉన్నాం. రుద్రంశంకర్ అదే ఒక ఉద్యమంగా వాళ్లు మన మధ్య నుంచి వెళ్లి శవాలై కూడ తిరిగిరాలేకపోతున్న అమానుషస్థితి గురించి చెప్తూనే ఉన్నాడు. అట్లా గల్ఫ్‌కి వెళ్లి తిరిగి వచ్చిన గౌడ యువకుడు వెంకటగౌడ్‌ను నాయకునిగా చేసుకొని ఈ నవల రాసాడు. వెంకటగౌడ్‌ను నవలకు నాయకునిగా మలచడంలో రచయితకు చారిత్రక దృష్టి, ప్రాపంచిక దృక్పథం, నవలానిర్మాణశిల్పం మూడూ తెలుసునని మనం సులభంగా గ్రహించవచ్చు. కార్మిక జీవితానుభవం ఉండడం ఈ రోజుల్లోనయితే, అసంఘటిత కార్మికుల మధ్యన పనిచేసిన కార్మికజీవితానుభవం ఉండడం, గ్రామాల్లో రైతాంగాన్ని కూడగట్టడానికి ఒక చైతన్యంగా పనికివస్తుంది. వెంకటగౌడ్ దుబాయిలో కడుతున్న అల్‌బురుజు అనే ప్రపంచంలోనే ఎత్తైన భవన సముదాయంలో ప్లంబర్‌గా పనిచేసినాడు. ఆ భవన నిర్మాణం తర్వాత ఆ కంపెనీ అల్‌ఖైమారస్ అనే మరో అరబ్ ఎమిరేటుకు పంపించింది. వెంకటగౌడ్ పనిచేసే ప్రదేశానికి దగ్గరలోనే తూర్పు వైపున ఎత్తైన నల్లటి కొండలు ఉన్నాయి. కాని ఆ కొండలలో బండలు తప్ప పచ్చదనం లేదు. ఎంత పెద్ద బిల్డింగులు కట్టినా, ఏర్‌పోర్టులు, హాస్పిటల్లు, హోటళ్లు, రోడ్లు నిర్మించినా వాళ్లు ఇండియానుంచే బండలు, కంకర, మరి ఇతర భవన నిర్మాణ సామాగ్రి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ వాళ్ల కొండలను, పరిసరాలను కాపాడుకోవడంలో తీసుకుంటున్న శ్రద్ధ మన దగ్గర స్థితితో పోల్చుకొని బాధపడ్డాడు.

మరి కరీంనగర్ గుట్టలు ఎటువంటివి – తేనెతెట్టు గుట్టలు. పెద్ద, పచ్చని సజీవ గుట్టలు. సీతాఫలాలు, అడవిరేగు, పరికిమొర్రి, మేడి, తునికి, అల్లనేరేడు, మోదుగుచెట్లు, మట్టిదిబ్బలపై మొలచిన మేడిచెట్లు, కానుగుచెట్లు, ఆ చెట్ల కొమ్మలకు బండారిగాడు అనే పక్షులు పెట్టేగూళ్లు, ఆ కొమ్మలు వంగిన బావినీళ్లు – ఇవన్నీ వెంకటగౌడ్ మనసును ఊరివైపు తిప్పాయి.

దానికి తగినట్లే హైర్ అండ్ ఫైర్ ఆధునిక మార్కెట్ వ్యవస్థ ఐదు సంవత్సరాలు గడువు ముగిసాక తిరుగు ప్రయాణానికి టికెట్ కొని యిచ్చింది. ఇంక ఆయన తన తిరుగు ప్రయాణంలోనే కరీంనగర్ వెళ్లే రోడ్డులో మార్పులు చాలా చూసాడు. కురిక్యాల దాటుతుండగా కుడివైపున రెండుమూడు కిలోమీటర్ల దూరాన గల గుట్టపై మైనింగు మిషీన్లు పనిచేయడం మొదట దృష్టిలో పడింది. రచయిత అట్లా కథానాయకుణ్ని గుట్టల విధ్వంసంలోకి ప్రతిఘటనా ప్రతినిధిగా ప్రవేశపెట్టాడు. నవల ప్రారంభం కావడం 'లింగారెడ్డి తన బుల్లెట్ సైకిల్‌మోటారు వాహనంపై డుగ్‌డుగ్ శబ్దంతో ధర్మరం గ్రామంలో ప్రవేశించడంతో అవుతుంది. అతడు హైదరాబాదులో ఉండే ఎంఎల్ఎ నుంచి గ్రామంలో ఉండే పెత్తందారు జనార్ధనరెడ్డి దగ్గరికి వచ్చిన దూత. అతనికి హైదరాబాదులో ఒక ఫామ్‌హౌజ్ ఉంది. ఆయనకు వోల్వోకారు, ఇన్నోవాకారు కూడ ఉన్నాయి. కాని ఈ బులెట్ కొన్నప్పటినుంచీ వ్యాపారం అచ్చి వచ్చిందిగనుక – పైగా ఇప్పుడు పట్టణాల్లో నక్సలైట్ల భయం కూడ లేదుగనుక బండిమీద వచ్చాడు.

'రగ్డ్ ట్రౌజర్స్ ఫిలాంథ్రఫిస్టు' అనే అద్భుతమైన ఇంగ్లీషు నవలలో ఇటువంటి ప్లంబరే నాయకుడు. 'రహ్‌నెకో ఘర్‌నహీ హై సారే మహల్ హమారా!' – తలదాచుకోవడానికి ఇళ్లు లేని వాళ్లే భూతలమంతా ఆకాశసౌధాలు నిర్మాణం చేసినవాళ్లు. అయితే భారతదేశంలో రైతుల, వృత్తిపనివాళ్ల గతం అది కాదు. ముఖ్యంగా చేనేత, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, గౌడ కులస్తుల వృత్తులు నైపుణ్యంతో కూడిన వృత్తులు. కష్టసహిష్ణుతతో కూడినవే కాని గ్రామీణ రైతుజీవితం, వ్యవసాయంతో ముడిపడినది. గౌడకులస్తుల వృత్తిలో ఆధునిక సాంకేతిక ఏ మార్పూ తేలేక క్రమంగా ఆ వృత్తి మరుగున పడుతున్నప్పటికీ కల్లుగీతతో, కల్లు అమ్మకాలతో వాళ్లకు భూవసతి కూడ సాధ్యమయ్యేది. ప్రతిగ్రామంలోనూ చేనేత, గౌడ కులస్తులే ఎక్కువగా కూడ ఉంటారు. వెంకటగౌడు చదువుకున్న కాలానికి ఆయన తండ్రి కులపెద్ద. అబ్కారీ వ్యవహారాలు తెలిసినవాడు. కనుక చతుశ్శాల భవంతి ఉండేది. వెంకటగౌడు ఇంటర్‌దాకా చదివేవరకు కరీంనగర్ జిల్లాలో రాడికల్ ఉద్యమం వెల్లువెత్తింది. చిన్నప్పుడే యక్షగానాలకు, జానపద పాటలకు, చిన్న చిన్న పాత్రలు వేసే నటనకు అలవాటుపడిన వెంకటగౌడ్ విప్లవగీతాలకు ఆకర్షితుడయ్యాడు.

బతుకుదెరువు కోసమే కాదు రాడికల్ ఉద్యమంపై నిర్బంధం వల్ల కూడా సింగరేణి కార్మికులు, కరీంనగర్ జిల్లాలో గ్రామీణ యువకులు దుబాయికి వలసపోవాల్సి వచ్చింది. అక్కడ ఇసుకపనులు మొదలు, ఇటుకపనులు, భవన నిర్మాణపనులు వంటి ఎన్నో కష్టభూయిష్టమైన పనులు, 'తివిరి ఇసుమున తైలమ్ము తీయ'డం అసాధ్యం అని భర్తృహరి

అన్నాడుగానీ చమురుతో షేక్‌లైన్ వాళ్ల ఎడారుల్లో సుందరహార్మ్యాలు నిర్మించేపని గోదావరి పరీవాహకప్రాంత తేనెతెట్టు తెలంగాణ ప్రజలకు రావడం ఎంత విషాదం.

రెండు రకాల వలసలను తెలంగాణ చవిచూస్తున్నది. బతుకుదెరువు కోసం వలసవెళ్లి దోపిడీపీడనలకు గురయ్యే బతుకు – మొదట బొంబాయి, షోలాపూర్, భివాండీ, సూరత్‌లకు వెళ్లిన చేనేత కార్మికులు, ఇతర కులస్తులు, బట్టల మిల్లులు మూతపడ్డాక ఇప్పటికీ భూగర్భ కేబుల్స్ వేయడం వంటి ఎన్నో పనుల్లో ఒళ్లుదాచుకోకుండా దుర్భర జీవితాలు గడుపుతున్నారు. దేశమంతా అన్ని నిర్మాణాల్లో పాల్గొంటున్న పాలమూరు లేబర్ గురించి చెప్పాల్సిన పనేలేదు. ఇంక దుబాయి వలస. ఇటు తెలంగాణకు దోచుకోవడానికి వచ్చిన సీమాంధ్ర సంపన్నవలస వాదులు. పోయినవాళ్ల బతుకులట్లా ఉంటే ఉన్నవాళ్లకు పాలమూరులో కరువు. గోదావరి లోయలో ఓపెన్‌కాస్ట్ విధ్వంసం. మైదానప్రాంతాల్లో గుట్టల విధ్వంసం. వృత్తుల విధ్వంసం. రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు. ఈ రెండు వలసలకూ ఉన్న రాజకీయార్థిక లంకెను పట్టుకున్నాడు రచయిత. విషాదమల్లా మనదగ్గరి రాజకీయ నాయకులు, ఏ పార్టీ అనే తేడాలేకుండా సర్పంచ్ మొదలు ఎంఎల్ఏ వరకు ఈ విధ్వంసదళారులుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఈ విధ్వంస ఏజెంట్లంతా కరీంనగర్ జిల్లావాళ్లే. హైదరాబాదులో స్థిరపడి గ్రామాల్లో భూములపై, ఆస్తులపై పట్టు కోల్పోని నిన్నటి దొరలు, ఇవ్వాల్టి రాజకీయ నాయకులు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి నడమంత్రపుసిరితో దళారులైనవాళ్లు – ఒకరని కాదు, వారు వీరూ అందరూ ఈ గుట్టల విధ్వంస గ్రానైటు క్వారీ కంపెనీల సేవలో నిమగ్నమైనవాళ్లే. కాకపోతే ఈ కంపెనీ ఎగుమతి చేసే గ్రానైటు విదేశాలకు వెళ్తుంది. ఈ విధ్వంసాన్ని గ్రామాల్లో రెక్కల కష్టంతో బతికే ప్రజలు తప్ప ప్రతిఘటించేవాళ్లెవరు?

ఒక్కొక్క గ్రామంలో జరుగుతున్న గుట్టల విధ్వంసాన్ని, గుట్టలనాశ్రయించి ఉన్న చెట్టు, చేమ, జంతుజలాల విధ్వంసాన్ని, నీటి ఊటల విధ్వంసాన్ని, అడవి విధ్వంసాన్ని ఒకవైపు చిత్రిస్తూ, ఇట్లా ఎడారి అయిపోతున్న అడవి, పచ్చదనం స్థానంలో భయంకరమైన మైనింగ్ యంత్రాలు సృష్టిస్తున్న కాలుష్యంలో గ్రామీణ జీవితంలో కూడ గాలి, నీరు (అంటూ ఉంటే) ఎంత విషపూరితమవుతున్నవో కూడ సాధికారికంగా చిత్రించాడు రచయిత. ఒక్క దృశ్యం. ఒక్క సంఘటన కూడా అవాస్తవం కాదు. అన్నీ రచయిత స్వయంగా చూసినవి. పోరాట ప్రజలతో పాటు పాల్గొన్నవి. మానకొండూరు పోలీసుస్టేషన్‌లో ప్రతిఘటించే ప్రజల నిర్బంధం, రాస్తారోకో, వాళ్లను విడువక తప్పని స్థితి నాటికి జిల్లావ్యాప్తంగా క్వారీ వ్యతిరేక పోరాటం విస్తరించింది. జిల్లాలో గుట్టల విధ్వంస వ్యతిరేక ఉద్యమానికి దుర్గాదేవి నాయకురాలయింది. బహుశా ఇదొక్కటే

మారుపేరు. ఈ నవలాశిల్పంలోని మరొక్క వైచిత్రి ఏమిటంటే ఇందులో వాస్తవ వ్యక్తులు, ఘటనలు తమ నిజమైన పేర్లతో ఒక కథలో భాగస్తులవుతారు. ఎందుకంటే ఇది కథకాదు గనుక. కథకన్నా గగుర్పాటు కలిగించే వాస్తవ నవల కనుక. ఎవరో ఒకరిద్దరివి ఉద్యమ కథానాయిక పేర్లు మాత్రమే మార్చినట్లున్నాడు. ఇంత సమకాలీనత ఉన్న నవల ఇది. గుట్టలను క్వారీలు తొలచివేస్తుంటే క్వారీల దుర్మార్గాన్ని బట్టబయలుగా వొలిచి చూపే కన్‌సర్న్ ఈ నవలలో ఉంది.

కరీంనగర్ నుంచి వచ్చిన రచయితలంతా సమకాలీన జీవితాన్ని, పోరాటాలను రాసినవాళ్లే. తాడిగిరి పోతరాజు, ఎంవి తిరుపతయ్య, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య, రఘోత్తమ్, పి. చంద్ మొదలు ఇవ్వాళ పెద్దింటి అశోక్‌కుమార్ వరకు. అయితే మొదటితరం రచయితలకు సమకాలీన జీవితం, పోరాటం – అంటే ఆ పోరాటం సాయుధ పోరాటం కూడ. రాడికల్ పోరాటం కూడ. విప్లవం ద్వారానే ప్రజాస్వామ్యం సాధ్యమనే అవగాహనతో కరీంనగర్‌లోనే ప్రారంభమైన విప్లవం నక్సల్బరీ, శ్రీకాకుళం సెట్‌బ్యాక్‌ల తర్వాత – మళ్లా తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆవాహన చేసుకుని ప్రారంభమైన విప్లవం. ఇవ్వాళ దేశాన్నంతా అతలాకుతలం చేస్తున్న విప్లవం. అది జగిత్యాలలో మొదలైంది. ఇవ్వాళ ఏ గుట్టల విధ్వంసం గురించి ఇంత నిర్దిష్టమైన సమాచారంతో ఒక నడుస్తున్న రిపోర్టింగ్, వ్యాఖ్యానం వలె ఈ నవల నడుస్తుందో, ఆ విధ్వంసం గురించి ఆ జగిత్యాల మార్గం ఇవ్వాళ దండకారణ్యంలో మనకు ఒక పర్‌స్పెక్టివ్‌ను ఇస్తుంది. కరీంనగర్ గుట్టల విధ్వంసం విడిగా సాగుతున్న విధ్వంసం కాదు. సింగరేణి వనరుల విధ్వంసం, గోదావరి జలాల విధ్వంసం, కరీంనగర్ భూముల విధ్వంసం, మొత్తంగా జిల్లాలో కష్టజీవుల శ్రమ విధ్వంసంకు భిన్నంగా, విడిగా జరుగుతున్నది కాదు. కరీంనగర్ గుట్టల విధ్వంసం. ఇది కరీంనగర్ చిత్రం మాత్రమే కాదు. ఉత్తర తెలంగాణ చిత్రం. తెలంగాణతో ప్రారంభమై దేశమంతా విస్తరించిన చిత్రం. ఈ చిత్రంలో విధ్వంసం ఉన్నట్లే సృజన కోసం జరిగే పోరాటం ఉంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంస అభివృద్ధి నమూనాను ప్రతిఘటించే స్వావలంబన అభివృద్ధి నమూనా ఉంది.

అయితే ఇవ్వాళ అది తెలంగాణలో గాయపడి ఉంది. ఉత్తర తెలంగాణలో 96–2000 సంవత్సరాల మధ్యన వందలాది గ్రామాల్లో, గ్రామరాజ్య కమిటీల నాయకత్వంలో గ్రామీణాభివృద్ధి సంఘాలు అటువంటి అభివృద్ధి కోసం ప్రయత్నించి ప్రపంచ బ్యాంకు సిఇవోగా చంద్రబాబు తెలంగాణనొక ప్రయోగశాలగా మార్చినప్పుడు కూలిపోయిన కల ఇది. ఈ నవల అటువంటి కలను మళ్లీ ఆవాహన చేసుకుంటుంది.

అందులో గుట్టల విధ్వంస వ్యతిరేక పోరాటం జగిత్యాల డివిజన్‌కు విస్తరించగానే రచయితకు 'జగిత్యాల జైత్రయాత్ర' గుర్తుకొచ్చినట్లున్నది. 'కొమురంభీము' నవల ముగింపులో తెలంగిరావు స్వప్నం వలె రచయిత ఈ పోరాటంలోకి నాయకురాలు, సమ్మక్క, సారలక్కలు మొదలు చాకలి ఐలమ్మలు, రాంజీగోండులు, కొమురంభీములను తెస్తున్నాడు. స్పష్టంగా ఇది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమనే అవగాహన ఉండడం వల్ల తుర్రెబాజ్‌ఖాన్, బిర్సాముండా, గుండాదర్‌లను తెస్తున్నాడు. దొడ్డికొమురయ్య, సర్వాయిపాపయ్యలు స్థానికంగా ఉండనే ఉన్నారు. సీతారామరాజు, సుబ్బారావు పాణిగ్రాహిల పట్ల కూడా ఆయనకంతే గౌరవ ప్రపత్తులున్నాయి.

ఇందులో వెంకటగౌడ్ కవి, కళాకారుడు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో కవులు కళాకారులు – గాయకులే కాదు నాయకులు కనుకనే కాళోజీ, దాశరథి, మగ్దూములు కూడ సహజంగానే ఉంటారు. తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణాలర్పించిన తెలంగాణ కోకిల బెల్లిలలిత ఉంది. నిన్నటి శేషగిరిరావు, అనభేరి ప్రభాకరరావులున్నారు. ఇవ్వాల్టి కిషన్‌జీ తుపాకి పట్టుకొని ముందున్నాడు.

మార్కెట్ మాయకు వ్యతిరేకంగా ఒక కుగ్రామంలో జరుగుతున్న గ్లోబల్ సంగ్రామ విశ్వజనీనత ఈ నవలలో ఉంది.

**– వరవరరావు**

25.07.2013

# భూమిని మింగేసిన అభివృద్ధి

తోటపల్లి జగన్‌మోహన్‌రావ్ గారి అనుభవాల మాల ఈ నవల భూదేవి! సరిగ్గా అర్థాన్నిచ్చే పేరుతో సజీవ పాత్రలతో అల్లబడ్డ నవల. అది కూడా తెలంగాణలో, గనులకు పుట్టినిల్లు అయిన ఉత్తర తెలంగాణా కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న జీవన విధ్వంసం గురించి. ఇది నిశ్శబ్ద యుద్ధ ప్రాంతం, నిషిద్ధ ప్రాంతం కూడా. ఈ నేల దేశం దశ దిశ లను మార్చేసే ఉద్యమ కారులని కన్నది. ప్రాణాలకన్నా ప్రజాస్వామ్య విలువలని ఎక్కువగా ప్రేమించే వీరులను కన్నది. ఇక్కడనుంచే తెలంగాణా విప్లవోద్యమాలకు బీజాలు పడినై. దొరల గడీలను గడ గడలాడించిన జిల్ల. జిల్లా పేరు చెపితేనే జల్లుమనాలె అని పాటలు పాడుకుంటూ మలి తెలంగాణా ఉద్యమాన్ని ఉగ్రూతలూపిన జిల్లా. సహజ సంపదలు పుష్కలంగా ఉండి దేశానికి వెలుతురిని పంచి పెట్టే సిరిగల్ల తల్లి సింగరేణిని, సికాసాని కన్న జిల్లా కూడా ఈ ప్రాంతమే అయితే ఈ చిత్రం నాణానికి ఒక వైపు మాత్రమే.

మరొక వైపు ఏ ఊరు, ఏ మూల కనుచూపు మేరలో ఎక్కడ చూసినా విధ్వంస భరిత చిత్రమే ఒక వైపు ఓపెన్ కాస్ట్‌ల బొందల గడ్డలు, మరొక వైపు ప్రతి గుట్టకి ఒక క్రషర్ మిషన్, పెద్ద పెద్ద బండ రాళ్ళను మోసుక పోతున్న లారీలు, వేల మీటర్ల లోతున నుండి బోర్లు వేసి నిరంతరం నీటిని గుంజి రాళ్ళను ముక్కలు ముక్కలుగా చేసే పాలిషింగ్ యూనిట్లు పచ్చని పంట పొలాల మధ్యన, పల్లెల మధ్యన చిచ్చుపెడుతున్న క్వారీ కంపెనీలు. ప్రత్యక్షంగా పరోక్షంగా జీవన విధానాన్ని జీవనోపాధిని నష్టపోతున్న దళిత బహుజన కులాలు. అవే కాకుండా విపరీతమైన పర్యావరణ కాలుష్యం, ప్రకృతి విధ్వంసం. వన్య ప్రాణుల వధ నిత్యకృత్యం. ఇది ఇప్పుడు వద్దన్నా కనిపించే కరీంనగర్ ముఖ చిత్రం బహుశ తెలంగాణా ప్రాంతమంతా ఇదే చిత్రం అని కూడా చెప్పొచ్చు. ఒక్కో దగ్గర ఒక్కో వినాశనకర అభివృద్ధి.

జగన్‌మోహన్‌రావు గారితో పరిచయం ఎవరికైనా ఒక అదృష్టమే నిరంతరం హక్కుల కోసం, ముఖ్యంగా వనరుల కోసం పరితపించే మనిషి. ఒక పుస్తకం, ఒక సంచి, కాటన్ లాల్చి వేసుకొని నిత్యం ఏదో ఒక వార్తను చర్చకు తీసుకొని వస్తారు. అది ఖచ్చితంగా

బొగ్గు, ఇనుము, గ్రానైట్ గుట్టలు, నీళ్ళు వీటన్నిటితో కలిసి ఉన్న తెలంగాణా. పాత కొత్త ఉద్యమాల అనుభవాలతో కూడుకున్న నిత్యాన్వేషి తెలంగాణా పది జిల్లాల భౌగోళిక చిత్రాన్ని అవలీలగా చదువు రాని వారికి కూడా అర్థం అయ్యేలా చెప్పగలిగే మనిషి. ఇంకా కరీంనగర్ జిల్లాలో తనకున్న అనుభవం అనుబంధం వివరించడం కష్టం నా లాంటి వాళ్ళు కొద్దిగా పని చేస్తున్నారంటే జగన్ మోహన్ రావ్ లాంటి వారి అండ దండలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వెన్నంటి ఉండే ప్రోత్సాహం ముఖ్య కారణం

నేను కరీంనగర్‌లో అడుగు పెట్టక ముందు జగన్ సార్ (మేము పిలుచుకునే పేరు) ని హైదరాబాద్ 2008 లో భూ నిర్వాసిత ఐక్య సంఘటన సదస్సులో చూసినట్టు గుర్తు సార్ కి భీష్మా చార్య అని ఇష్టంగా పిలుచుకునే ఇంకొక పేరు కూడా ఉంది 2009 లో పరిచయం అతి కొద్ది కాలం లోనే తెలంగాణా భూమి రక్షణ సంఘం ఆవిర్భావానికి దారి తీసినది. అందులో భాగంగా చేసిన అనేక కార్యక్రమాలు, చివరికి కోర్టులను కూడా వదలకుండా చేసిన ప్రయత్నాలు అన్ని కూడా ఈ నవలలో కనిపిస్తయి. రాజకీయ నాయకుల స్వార్థ ఆలోచనలను ప్రభుత్వం మతి లేని చట్టాలు పల్లెల్లోని రాజకీయాలను, ఉద్యమ క్రమంలో ఎదుర్కొనే అనేక పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించినారు.

ముఖ్యంగా పర్యావరణ కోణంలోనే జరిగే నష్టం కొందరికి కనబడుతుంది, ప్రభుత్వం నమ్మే ఒక ఒక్క కారణం కూడా అదే కాని ఈ గుట్టల వెనుక అనేక అంశాలు ఉన్నట్టు మాకు అనుభవంలో తెలిసి వచ్చినది బొమ్మలగుట్ట ఆందోళన జరిగినప్పుడు చరిత్ర కారులు, రచయితలూ అందరూ అక్కడ ఉన్న మొట్ట మొదటి జినవల్లభుడి శాసనం పోతుందని ఆందోళన చెందినారు, చాల పెద్ద ఎత్తున అనేక విధాల ప్రయత్నాలు చేసినంక అది నిలిపివేయబడి ఇప్పుడు పర్యాటక కేంద్రంగా ప్రకటించబడింది. అట్లనే ఎలగందుల ఖిల్లా, ఒక్క ఖిలాని ముట్టుకోకుండా చుట్టూ ఉన్న గుట్టలను అన్ని తవ్వడంతో అక్కడ ఉన్న ఎలుగుబంట్లన్ని కూడా ఖిలాలోకి రావడం, చుట్టూ పక్కల ఉన్న ఊర్లల్లో ప్రజలని భయ భ్రాంతులకు గురి చేయడం జరుగుతున్నది, ఖిలా పైకి పర్యాటకులు కూడా పోవడానికి భయపడుతున్నారు, అటవీ శాఖ కూడా ఏమి చేయలేక చేతులెత్తేసింది. ఇక్కడ విషయం పర్యావరణం కాదు కాని చరిత్ర, ప్రాంతానికున్న విశిష్టత అట్లనే ప్రతి గుట్ట మీద ఏదో ఒక గుడి ఉండడం అక్కడ ప్రజల నమ్మకాలు ముడిపడి ఉండడం కూడా పరి పాటి. దేవుడు పోతున్నాడనే భయంతోనే హసన్పర్తి లోని చింతగట్టు గ్రామస్తులు ఆందోళన చేసి మా సంఘాన్ని వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ చేసినట్టే అక్కడ కూడా చేయడంతో తాత్కాలికంగా గుట్ట తవ్వకం నిలిపివేయబడింది ఇట్లా చెప్పుకుంటూ పోతే కరీంనగర్ లోని దాదాపు 700 క్వారీలకు ఒక్కొక్క కథ కనపడుతుంది ఇంకా జీవనోపాధులు

విపరీతంగా నష్టపోయి బిచ్చగాళ్ళుగా మారిన ప్రజలను చూడడం జరిగినది బద్దిపల్లి, అన్నారం గుట్టల కథ దేవుడి నమ్మకాలు మరియు చెరువులు, కుంటలు

ఇంకా జీవించే హక్కును హరించి వేస్తుంది అని చెప్పినా ఎవరికీ వినపడదు ఎందుకంటే ఇక్కడ అందరూ రాజకీయ నాయకుల పాత్ర వ్యాపారస్తుల పాత్ర, కరీంనగర్ నుండి సింగపూర్, చైనా, ఇండోనేసియ వరకు ఉన్న సంబంధాలు. కనపడని ఒక దోపిడీ, కనపడినా మాట్లాడనివ్వని అశక్తత. పెద్ద పెద్ద మైనింగ్ లను గురించే మాట్లాడ లేనప్పుడు, ఈ మైనర్ మినరల్స్ పేరు మిద జరిగే దోపిడీ గురించి ఎవరికీ పట్టినది? నవలలో కనపడుతున్న పాత్రలన్నీ సజీవ చిత్రాలే, చూసిన అనుభవాలే ఇక్కడ జగన్ మోహన్ రావ్ గారు నన్ను దుర్గా దేవిని చేయడం ఆయనకున్న అభిమానం, అట్లనే మార్వాడి సుదర్శన్‌ని హనుమంతు పాత్రలో చూపించారు. నిజానికి మార్వాడి సుదర్శన్ లేకపోతే సగం పనులు చేయడం కూడా కష్టం. మాతో కొంత కాలం పని చేసిన కుమార స్వామి, పెంటయ్యగారు, ఇప్పటికి కలిసి నడుస్తున్న దుర్వాస రెడ్డి, రామణా రెడ్డి, రేణుక, మ్యాడం పల్లి నిర్మల, బద్దిపల్లి పరశురాములు అందరూ ఏదో ఒక రూపంలో తారస పడతారు

నిజానికి వలసల గురించి తెలుసుకున్నప్పుడు అర్థమయిన విషయం, ఇక్కడ ఉద్యమాలకి నిర్బంధానికి ఉన్న సంబంధం, నిర్బంధానికి వలసలకి ఉన్న సంబంధం, విధ్వంసానికి జీవనోపాదులకు ఉన్న సంబంధం. ఇవన్ని కూడా విడదీయరాని అంశాలు. వీటితో ముడిపడి ఉన్నదే తెలంగాణ కూడా. ఈ వనరులు ఇంత లేకపోతే ఇక్కడ రాజకీయ నాయకులు వ్యాపారస్తులు కాకపోయే వారు, ఈ వ్యాపారస్తుల వల్లనే ఇపుడు తెలంగాణ అలస్యమైతుంది. వనరుల దోపిడిని, వలసల జీవితాలని వేరుగా చూడడం వల్లనే తెలంగాణ అసంపూర్తిగా అర్థం అయితుంది. దళిత బహుజన ఆదివాసీ, స్త్రీల అస్తిత్వం వీటితో ముడి పడి ఉందన్న అంశం కూడా అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాము, ఈ నవలలో కూడా పోరాడేది అత్యధిక శాతం స్త్రీలే అని చెప్పడం జరిగినది

ఏది ఏమైనా, ఈ భూదేవి ఒక చరిత్రగా నిలబడి పోయే నవల. మాయమౌతున్న పల్లె జీవితాలని సజీవంగా అక్షర రూపంలో మిగిల్చే నవల. రేపటి తెలంగాణలో వనరులను కాపాడ లేకపోతే జరిగే జీవన విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూపించే రచన.

కొద్ది మంది ఒక విధ్వంసం గురించి మాట్లాడితే ఆగిపోయే పరిస్థితులు లేవు ఒక దృక్పథం లేకుండా పోరాటాలు చేస్తే ఎక్కువ కాలం నిలబడవు. నిలబడినా అది తాత్కాలికమే. ఈ నవల ద్వారా చెప్పదలచుకున్నది కూడా సమాజం అంతటిని ఈ విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగస్వామ్యం చేయడం.

కరీంనగర్ జిల్లలో జరిగే దోపిడీ వ్యవస్థని బహిర్గతం చేయడంలో అంతో ఇంతో

సంఘం ఫలితాలు సాధించినట్టే కాని వీటి గురించి విస్తృతంగా చర్చ జరగాలి, విభజన మీద కాదు వనరుల మీద, వాటి మీద ఆధారపడ్డ ఆదివాసిల మీద, రెండిటింటికి మధ్య నలుగుతూన్న బహుజనులు, దళితులూ, వీళ్ళందరిలో భాగస్వామ్యమైన స్త్రీల మీద సమస్య సమాజం మీద పడ్డప్పుడు ఉద్యమకారుల పాత్ర తగ్గి, ఇంకా ప్రజలను ఉత్తేజ పరచడంలో ముందడుగు వేయాలి

ఈ నవల తోనన్న తెలంగాణ రాజకీయాలలో మార్పు రావాలని ఆశిద్దాం. రాబోయే తెలంగాణాలో ఈ విధమైన దోపిడీ జరగకూడదని ఈ నవల ద్వారా ఒక సందేశం, చరిత్ర లో మైలు రాయిగా నిలబడి పోయే నవలను అహర్నిశలు, రేయింబవళ్ళు కష్టపడి తీసుకువచ్చినందుకు జగన్ సారుకు మరియు ఆయనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించే జీవిత భాగస్వామి సీత, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ పుస్తకం, పుస్తకానికి సహకరించిన ప్రతి ఒక్కరూ ఉద్యమ భాగస్వాములే.

**– డా. సుజాత సూరేపల్లి**
కన్వీనర్, తెలంగాణా భూమి రక్షణ సంఘం.
(శాతవాహన యునివర్సిటీ)
కరీంనగర్

**లింగారెడ్డి** తన బుల్లెట్ సైకిల్ మోటారు వాహనం పై డుగ్, డుగ్ శబ్దంతో ధర్మారం గ్రామంలో ప్రవేశించినాడు.

ఆయనకు వోల్వో కారు, మరొక ఇన్నోవా కారు ఉన్నా ఆ సైకిల్ మోటారు కొన్నప్పటి నుండి అచ్చివచ్చిందని చాలా నమ్మకం. దాంతో ఆయనకు ఎప్పుడు ఏ కార్యక్రమం మొదలు పెట్టినా ఆ వాహనం పైననే వెళ్లడం అలవాటు.

ధర్మారం గ్రామంలోని తన దూరపు బంధువైన జనార్ధన రెడ్డి ఇంటి ముందు ఆపి, లోనికి ప్రవేశించిండు, ఎదురుగా సోఫాలో కూర్చున్న జనార్ధన రెడ్డిని చూచి, పాత కాలపు సినిమాలోని యస్. వీ రంగారావు లాంటి వెడల్పయిన బట్టతలతోను, దట్టమైన గుబురు మీసాల మధ్య తెల్లని పలువరస మెరియంగా అప్రయత్నంగా చిరునవ్వును మొఖం నిండా పులుముకొని "బావా బాగున్నావా" అంటు పలకరించిండు.

ప్రతిగా జనార్ధనరెడ్డి లేచి లింగారెడ్డి చేతిలో చేయి కలిపి "ఏమిటి బావగారికి మాపై అపారమైన దయగల్గింది" అంటూ ఎదురుగా ఉన్న కుషన్ కుర్చీని కుడి చేత్తోచూయిస్తూ కూర్చోమ్మని చెప్పకనే చెప్పిండు.

"ఏయ్ మీ అన్నచ్చిండు, చాయ్ పంపించు" అంటూ ఆయన భార్య శాంతకు కేక వేసి ఉల్లాసంగా లింగారెడ్డితో మాటల్లోకి దిగిండు జనార్ధనరెడ్డి.

చాయ మంచినీళ్లతో వచ్చిన శాంత ముఖం విప్పారింది. "వదినే, పిల్లలు బాగున్నారె" అంటూ అడిగింది.

"ఆ అంతా బాగే చెల్లే, బావను చూసిపోదామని వచ్చిన" అంటూ బదులిచ్చే సరికి అందరూ ఉల్లాసంగా నవ్వుకున్నారు. ఇద్దరు కలసి చాయ్ తాగినంక కప్పులు పట్టుకుని ఆమె వంటింట్లోకి నడిచింది.

"హైద్రాబాద్‌లో ఉండేటోల్లు రాకరాక మా ఇంటిని వెతుక్కుంటూ దారితప్పి వచ్చారేంటి బావా" అంటూ అసలు విషయాన్ని కదిలించిండు జనార్ధనరెడ్డి.

"మీరు ఈఊరి సర్పంచైతిరి దాంతో కొద్దిగా పనిపడ్డది" లింగారెడ్డి.

"ఏంటో అది చెప్పరాదే" జనార్ధనరెడ్డిగారు అడిగిండు.

"ఇప్పుడు ఇక్కడ చెప్పేది కాదు బావా ఎల్లుండి శ్రమ అనుకోకుండా కొద్దిగా హైద్రాబాద్ దాకా రండి, మన యం. ఎల్, ఏ గారు ఏదో మీటింగ్ హైద్రాబాద్ లోని మన పార్మ్‌హౌజ్‌లో పెట్టిండు, వారు నిన్ను తీసుకొని రమ్మని చెప్పినారు, మన పార్మ్‌హౌజులో రాత్రి డిన్నరు వుంటుంది మీరు ఎన్ని పనులున్నా వీలు చూసుకొని తప్పక రావాలి బావా" అన్నాడు లింగారెడ్డి.

"సరే యం. ఎల్. ఏ సాబ్ పిలిచినంక రాకుండా ఉంటామా మంచిది" అంటూ తలఊపిండు జనార్దనరెడ్డి,

"సరే కలుద్దాం" అంటూ లింగారెడ్డి పోవడానికి లేసిండు,

"గిదేంది బావా తినకుండనే పోతున్నరు"అన్నాడు జనార్ధనరెడ్డి.

"కొద్దిగ జరూరు పనులున్నయి బావా'మరెప్పుడైనా వస్తా"అంటు,

లింగారెడ్డి లేచి "పొయ్యస్త చెల్లె" అంటూ కేక వేసి

"బావా మీ కోసం కారు పంపిస్తా తప్పక రావాలి" అంటూ సైకిల్ మోటారు స్టార్టు చేసిండు. ఊరికి కొద్ది దూరంలో గల గుట్టను తనివితీరా చూసిండు ఆయన మనుసులో ఆ గుట్ట ఎత్తులో రకరకాల విదేశీ కరెన్సీ కట్టలు కుప్పలుగా కనపడగా, చిరునవ్వు మొఖం నిండా పులుము కొని కరీంనగరం వైపు దారి తీసిండు లింగారెడ్డి.

లింగారెడ్డిది చందుర్తి మండలంలోని మామిడిపల్లి గ్రామం. ఈ ఊరి చుట్టుప్రక్కల గ్రామాల నుండి అరబ్బు దేశాలకు వెళ్ళేవారికి పాస్‌పోర్టులు తెచ్చిఇచ్చి క్రమంగా లైసెన్సు పొందిన ఏజెంటుగా మారి లక్షలాది రూపాయలు సంపాదించిండు. ఆ పైసలతోనే ఇటీవలనే గ్రానైటు వ్యాపారిగా మారినాడు. జిల్లా గ్రానైటు వ్యాపారుల సంఘానికి అధ్యక్షుడైనాడు.

ఆ రోజు పట్టపగలు ఇన్నోవా కారు ధర్మారం లోని జనార్ధన రెడ్డి గారి ఇంటి ముందు ఆగింది, అన్నం తిన్న తరువాత ఆ కారులో హైదరాబాదుకు బయలు దేరిండు జనార్దనరెడ్డి.

శంషాబాదు రోడ్డులోని లింగారెడ్డికి చెందిన పదిహేను ఎకరాల మామిడి తోటలోని అందమైన ఫాంహౌజు ముందు దిగే సరికి సాయంత్రమైంది.

ఆ ఫాంహౌజులో ఒక పెద్ద హాలుతో పాటు ముపై గదులు ఉన్నాయి. అవన్ని సెంట్రల్ ఏర్ కండీషనింగ్ చేయబడి, అత్యంత అధునాతన హంగులతో అలంకరించ బడ్డాయి.

జనార్దనరెడ్డి ఫాంహౌజు ముందుగదిలోనికి అడుగు పెట్టే సరికే, పది మంది దాకా హాలులోని సోఫాలలో కూర్చున్నారు. అందులో తన మండలానికి చెందిన ఐదుగురు సర్పంచులు వున్నారు. వారికి “నమస్కారాలు” అంటూ పలుకరించి పోయి లింగారెడ్డి ప్రక్కన సోఫాలో కూర్చున్నాడు.

“ఇంకా టైముందా బావా అంటు” లింగా రెడ్డిని పలకరించిండు.

“ఇంకా కొంత మంది సర్పంచులు రావలసి ఉంది, వారేకాదు, మన జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఐదుగురు యంఎల్ ఏలు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు రావలసి ఉందని” లింగా రెడ్డి జవాబిచ్చిండు.

“అబ్బో ఏమో అనుకున్న, ఇంత పెద్దపెట్టున మీటింగ్ పెట్టినవ్ ఎందుకో చెప్పకనే పోతివి అంటూ జనార్ధనరెడ్డి, లింగారెడ్డివైపు ఆశ్చర్యంగా చూసిండు.

“తినబోతు రుచడుగుటెందే బావా” అంటూ లింగారెడ్డి మార్మికంగా నవ్వింది.

“బావంటే ఎందో అనుకున్న మహా ఘటికులే”, అంటూ జనార్దన రెడ్డి గారు పరాచికమాడిండు.

“ఇంత లోనే శంకరపట్నం, మానకొండూరు తిమ్మాపూర్ కరీంనగరం, గంగాధర, మల్యాల మండలాల నుండి మరో పదిహేను మంది సర్పంచులు, ఆ గదిలోనికి వచ్చిమిగతా కుర్చీలలో కూర్చున్నారు. అందరికి చాయ్‌లు తేవలసిందిగా పని మనిషికి చెప్పిండు, వచ్చిన అతిథులు చాయలు త్రాగుతున్నరు.

అందరూ వచ్చినట్లుగా నిర్ధారించుకున్న లింగారెడ్డి, ఎంఎల్ఏ రాజయ్యకు, అందరు వచ్చినారని ఫోన్ జేసిండు.

మరో పావుగంటలో ఎంఎల్ఏలు ఐదుగురు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, ఇద్దరు మంత్రులు వచ్చింద్రు. వారు రాగానే సర్పంచులంతా లేచి నిల్చున్నారు. వారితో పాటు మైనింగ్ అధికారులు గ్రానైటు వ్యాపార సంఘానికి చెందిన ఐదుగురు కూడా వచ్చింద్రు.

ఎదురుగా గోడ దిక్కు ఉన్న సోఫాలలో మంత్రులు, యంపీలు ఎంఎల్‌యేలు, వారితో వచ్చిన మైనింగ్ ఆఫీసర్ కూర్చోగా, ఎదురుగా నున్న కుషన్ కుర్చీలలో సర్పంచులంతా కూచున్నారు. వారికి మరోవైపున గ్రానైటు వ్యాపార సంఘసభ్యులు కూర్చున్నారు.

అంతా కుర్చున్నాక “ఇంక ఆలస్యం దేనికి, సమావేశాన్ని కానిద్దాం” అన్నాడు లింగారెడ్డి.

మంత్రి గారు ప్రారంభిస్తూ“ఇక్కడ మనం ఎందుకు సమావేశం పెట్టుకున్నామో మైనింగ్ ఆఫీసర్ వివరిస్తారు”అంటూ, బట్టతల ఆఫీసర్ వైపు చూసిండు.

లైటు వెలుగులకు తలతల మెరుస్తున్న తలను గోక్కుంటూ ఆ మైనింగ్ అధికారి "గౌరవనీయులైన మంత్రివర్యులకు, ఎంఎల్ఏలకు మరియు వివిధ గ్రామాల సర్పంచులకు విన్నవించునది ఏమనగా మన కరీంనగరం జిల్లాలో అపారమైన మంచి రకం గ్రానైటు రాయి పెద్దఎత్తున మీమీ గ్రామాలలో గల గుట్టలపై దొరుకుతుంది. దానిని త్రవ్వితీసి విదేశాలకు ఎగుమతి చేస్తే కోట్లాది రూపాయిల విదేశీ మారక ద్రవ్యం మనకు లభిస్తుంది. దానిపై వచ్చే రాయల్టీతో మీమీ గ్రామాలకు లక్షల రూపాయిల ఆదాయం వస్తుంది. దానితో మీ గ్రామాలలో రోడ్లు, మురుగు కాలువలు, బడులు, గ్రామపంచాయితీ ఆఫీసులు కట్టుకోవచ్చు, మరియు గ్రామాలలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు లభిస్తాయి. అట్టి బండలను రవాణా చేయడానికిరోడ్లు, లారీలు అవసరమౌతాయి. పెట్టుబడి పెట్టుకొనే వారికి ఇవ్వన్ని మంచి అవకాశాలను కలిగిస్తాయి. కావున మీరంతా ఈ గ్రానైటు పరిశ్రమను మీ గ్రామాలలో పెట్టుటకు గ్రానైటు వ్యాపారులకు, అధికారులకు సహకరించ గలరని కోరుతున్నాను" అంటూ ముగించిండు.

ఒక ఎం ఎల్ ఏ మాట్లాడుతూ, "మీరు మీ గ్రామాలకు సర్పంచులు కావడానికి చాలా పైసలు ఖర్చు చేసి ఉంటారు. ఇప్పుడు మీ గ్రామాల్లో ఈ మైనింగ్ త్రవ్వకాల వల్ల మీకు నాలుగు రాళ్ళు సంపాదించే మంచి అవకాశమే కాక మీ ఊరిని అభివృద్ధి చేసే అవకాశం వస్తుంది. అటు మంచి పేరుతో పాటు ఇటు మీరిన్ని రాళ్ళు వేసుకేసు కోవచ్చుని" అంటూ ఊదర గొట్టిండు.

మంత్రులు గూడా తమ ప్రసంగాలలో గ్రానైటు తవ్వకాల అవసరం గురించి చెప్పుతూనే మీకు ఈ పనులలో అన్ని విధాలుగా ప్రభుత్వం, అధికారులు. మరియు పోలీసు వారు ఎల్లప్పుడు సహాయసహాకారాలు అందిస్తారని హామీలు ఇచ్చినారు.

ఇక సర్పంచులలో ఒక సర్పంచు మాట్లాడుతూ "గత కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామంలో ఒక ఎం ఎల్ ఏ కుటుంబ సభ్యులతో త్రవ్వబడుచున్న గ్రానైటుల వల్ల లక్షల రూపాయల ఆదాయం గ్రామ పంచాయితీకి వచ్చిందని, ప్రస్తుతం గ్రామ పంచాయితీ సర్పంచు పదవికి పదిహేను లక్షల రూపాయిల నుండి ఇరవై లక్షల రూపాయిల వరకు సర్పంచు పోటీ దారులు ఖర్చు చేస్తూన్నారని, అంతే కాక తానే ఇటు కరీంనగరం లోను ఆటు హైదరాబాదులోను ఇండ్లు నిర్మించుకున్నానని, కారు కూడా కొన్నానని రెండు గ్రానైటు క్వారీలు కూడా సంపాదించినానని" చెప్పుతూ,

"ఇంతటి మంచి అవకాశం మళ్ళీరాదని, కావున సద్వినియోగం చేసికొండని" చెప్పినాడు.

దీనితో మైదాన ప్రాంత గ్రామాల సర్పంచులు అన్ని విధాలుగా అధికారులకు,

మరియు గ్రానైటు వ్యాపారులకు సహకరించుటకు తమ సమ్మతి తెలిపినారు.

ఇక అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గ్రామ సర్పంచులు "అన్నలతో సమస్యలు తల ఎత్తవచ్చని" అన్నారు. దానితో జిల్లా నుండి ఎం ఎల్ ఏ గా ఎన్నికై రాష్ట్ర కాబినేటులో చేరిన మంత్రి వర్యులు "ఆ సమస్యను మాకు వదలి వేయండి, మేము ఆ సమస్యను పరిష్కరిస్తామని" వారికి హామీ ఇచ్చినాడు.

ఇక ఒక సర్పంచు లేచి "మేమేం చేయాలి మరి" అని అడిగిండు.

దానికి మైనింగ్ ఆఫీసర్ జవాబు చెపుతూ "ఏం లేదు, మైనింగ్ కోసం గ్రానైటు వ్యాపారి చేసుకున్న విన్నపం కలెక్టరు నుండి మీ స్థానిక యంఆర్ఓ ద్వారా మీ గ్రామ పంచాయితీకి వస్తుంది. దానిపై మీ గ్రామపంచాయతీ, ఈ మైనింగ్‌వల్ల మా గ్రామానికి జరిగే నష్టం ఏం లేదంటూ ఒక అనుమతి తీర్మానాన్ని ఆమోదించి యంఆర్ఓకు పంపిస్తే చాలు" అన్నాడు.

మరో సర్పంచు లేచి"సరె మేమంటే ఒప్పుకుంటాం కాని మా ఇతర పంచులు ఒప్పుకోవాలిగా" అన్నాడు.

దానికి మళ్ళీ మరో యంఎల్ ఏ గారు లేచి "ఆ పంచులను గ్రానైటు వ్యాపారుల వద్దకు పంపండి వారు వారికి నచ్చచెప్పుతారు" అంటూ గ్రానైటు వ్యాపారులవైపు కన్నుగొట్టిండు.

దానితో గ్రానైటు వ్యాపారుల సంఘాధ్యక్షులైన లింగా రెడ్డి గారు మాట్లాడుతూ "మీ ఊళ్ళల్ల ఏమయినాచిన్న చితకా సమస్యలు వస్తే మేము పరిష్కరించు కుంటాం" అంటూ తెలిపిండు.

దానితో అక్కడకు వచ్చిన సర్పంచులంతా సంతృప్తి చెందినట్లుగా అనిపించగానే మళ్ళీ లింగారెడ్డి "ప్రస్తుతానికి ప్రతి గ్రామ సర్పంచుకు పది లక్షల రూపాయలు గ్రానైటు వ్యాపారులు ఇవ్వగలరని, మీరు మీ గ్రామాలకు పోగానే అనుమతులు పొందుటకు మీ శాయాశక్తుల ప్రయత్నించాలని" కోరినాడు.

ఇక ఆయా గ్రామసర్పంచులు ఉబ్బితబ్బిబ్బులౌతూంటె, లింగా రెడ్డి గారు "అందరు ఒప్పుకొన్నట్లే కదా" అంటూ, జనార్ధనరెడ్డి గారికి ఇషారా జేసిండు.

దానితో జనార్ధనరెడ్డి లేచి"తామంతా ఒప్పుకున్నాం"అని సర్పంచుల తరఫున చెప్పిండు, దానికి సర్పంచులంతా సప్పట్లుగొట్టి తమ ఆమోదాన్ని తెలిపిండ్రు.

ఇక మీటింగ్ అయిపోయినట్లు ప్రకటించిన లింగారెడ్డి, ఈ శుభ సంధర్భంగా మీ అందరికి టూనా చేపలవిందుతో పాటు మందు పార్టీ వుందని కావున మీరంతా మా ఆతిథ్యాన్ని మన్నించాలి" అన్నాడు.

"మరి అదో" అని అంటూ ఓ యువ సర్పంచు అరచిండు.

లింగారెడ్డి నవ్వుతూ "అదీ ఉంది" అన్నడు.

అందరినీ హాలు లోనికి తీసుకుని వెళ్ళినాడు. ఈ రాత్రంతా విందు, మందులతో పాటు బోగంమేళా శృంగార తారలతో ఏర్పాటు చేయబడిన పొందు పార్టీలతో ఆ గెస్టుహౌజు తెల్లవార్లు తరించి పోయింది.

## 2

మార్చ్ మాసంలో జరుప బడిన జిల్లా పరిషత్ వార్షిక బడ్జెట్టులో వంద కోట్ల రూపాయలతో కరీంనగరం గంగాధర, పెగడపల్లి. జగిత్యాల, ధర్మారం. మానకొండూరు, పెద్దపల్లి, తిమ్మాపూర్ శంకరపట్నం మండలాలో గ్రామాలన్నిటిని ప్రధాన రాష్ట్రరహదారులకు కలుపుతూ రెండు వందల కిలోమీటర్ల తారు రొడ్డు నిర్మించడానికి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదన పెట్టినారు. ఈ రోడ్డు నెట్‌వర్కుతో శాంతిభద్రతలతో సహా ప్రజలకు ఉపయోగం ఉంటుందని, అందు వల్ల యస్సి. యస్టీలకు ఈ సంవత్సరం కేటాయించిన బడ్జెటు కూడా ఈ రోడ్లు వేయుటకు వాడుదాం, పైగా ఆయా గ్రామాలలో యస్సి, యస్టీల వాడలకు మరియు కొన్ని అవసరమైన గ్రామాలకు కాంక్రీటు రోడ్లు వేయబడతాయని జిల్లా పరిషత్తు అధ్యక్షులు వివరించగానే. వార్షిక బడ్జెట్టు ఆమోదం పొందింది. ప్రతిపాదిత రోడ్ల నిర్మాణ భాద్యతలను ఆయా మండలాలోని గ్రామాల సర్పంచులను బినామీ సబ్ కంట్రాక్టర్లుగా నియమించుకొని యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేసినారు.

అట్ల వేయబడిందే గంగాధర క్రాసింగ్‌నుండి పెగడపల్లి మండలం మీదుగా ధర్మారం నుండి చిల్వకోడూరు వరకు డబుల్ రోడ్డు, ఆయా మండలాల గుట్టలు గల గ్రామాల నుండి వేయబడింది. ముఖ్యంగా గ్రామాల నడుమనుండి గుట్టలకు వెళ్ల వలసిన రోడ్లు కాంక్రీటుతో వేయబడినవి. ఆ విధంగానే ధర్మారం గ్రామ మద్యనుండి కాంక్రీటు రోడ్డు గుట్టవరకు వేయబడింది. చిల్వకోడూరు నుండి ధర్మపురికి మరో పదిహేను కిలో మీటర్ల రోడ్డు వేస్తే కరీంనగరం నుండి పుణ్యక్షేత్రమైన ధర్మపురికి గంగాధర, చిల్వకోడూరుల మీదగా డైరెక్టు రోడ్డు జిల్లా వాసులకు అందుబాటులోనికి రాగలదు, కాని చిల్వకోడూరు, ధర్మపురి మధ్యలో గ్రానైటు గుట్టలు లేనందున అనవసరపు వృధాఖర్చు చేయడం ఎందుకని వదలివేసినారు.

జగిత్యాల, పెగడపల్లి, గొల్లపల్లి, మల్యాల మండలాలకు సిఐ గా పరశురాం గౌడు వచ్చినాడు. ఆయన పోలీసు శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా నియమించబడి, నాలుగైదు

ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నందులకు త్వరలోనే ప్రమోషన్ల మీద ప్రమోషన్లు పొంది సిఐ గా కొత్త ప్రమోషన్‌తో ఛార్జీ తీసుకున్నాడు.

చార్జ్ తీసుకున్న వారంలోనే ఒక వంద మంది రిజర్వ్ పోలీసులతో గోరుకొయ్యలాల్లకు బిలబిల మంటూ ధర్మారం గ్రామానిలోని ఇళ్ళన్నిటిని చుటుముట్టి ఎనభై మంది యువకులను పట్టుకొని పోలీసువ్యాన్లలో జగిత్యాలకు తరలించినాడు. వారందరిని పోలీస్ స్టేషన్ ఆవరణలో కింద వరుసగా కూర్చోబెట్టి"మీరంతా అన్నలకు సహకరిస్తూన్నారని మాకు రిపోర్టులున్నాయి. కొందరైతే దళాలకు కొరియర్ గాపని చేస్తూన్నారని, కావున మాకు అన్నల గురించి మీకు తెలిసిందంతా చెప్పాలి లేక పోతే నా సంగతి మీకు తెలుసుగదా"అంటూ చేతిలోని పిస్టల్ ఊపుతూ గర్జించిండు.

వెంకటి అనే గొల్ల యువకుడు "మాకు ఏందెల్వది సార్" అని చెప్పేలోగానే సి.ఐ. వచ్చి ఆ యువకుని చెంప చెల్లుమనిపిస్తూ

"లంజాకొడకుల్లారా ఎదురుచెప్తార్రా ముందు మేంచెప్పేది వినుండ్రి లేకపోతే తోలోలిచి డోలు కట్టిస్తా ఎమనుకుంటుండ్రురా పోలీసోల్లంటే"అంటూ,

"వీరందరి పేర్లు, వివరాలు వేలి ముద్రలు తీసుకొండ్రి"యస్. ఐ. కి చెప్పి, జీబు ఎక్కి ఇంటికి కెల్లి పోయిండు.

తమ పిల్లలను పట్టుకెల్లిన తల్లి, తండ్రులు సర్పంచు జనార్ధనరెడ్డి ఇంటికి పరుగుపరుగున పోయి, "దొర్సానీ దొర ఉన్నాడా" అడిగిండ్రు.

దొర్సాని "దొర గారు మొన్ననే పట్నంబోయిండు ఇవ్వల ఈ పాటికే రావల్సేదుండే ఇంత వరకు రాలేదని" చెప్పింది.

అయితే "దొరసాని, దొర టెలిఫోన్ నంబరుంటె ఇయ్యండ్రి" పెగడపల్లికి పోయి ఫోన్ జేస్తమని" అడిగిండ్రు.

దొరసాని ఫొన్‌నెంబరు ఇవ్వగానే ఆటో దీసుకుని ఇద్దరు పెగడపల్లికి పోయి సర్పంచుకు ఫోన్ జేసి, జరిగింది చెప్పిండ్రు.

తన స్వంత బావింట్లో వున్న జనార్ధనరెడ్డికి వివరాలు చెప్పి, అయ్యా! మీరు జరూరుగా జగిత్యాలకే రాండ్రి మేము ఇటునుంచే వస్తామని చెప్పిండ్రు

సర్పంచు సరే అనగానే, ఎనబై మంది తల్లి తండ్రులతో పాటు మరి కొందరు పెద్దమనుసులను తీసుకొని, జగిత్యాలకు బైలెల్లిండ్రు.

వీరంతా జగిత్యాల పోలీసుస్టేషనుకు చేరుకున్న తరువాత అరగంటకు జనార్ధనరెడ్డి జగిత్యాల పోలీసుస్టేషన్ ముందు దిగిండు. సర్పంచును చూడగానే కొందరు తల్లులు గొల్లుమన్నరు. వారందరిని సముదాయిస్తూ.

"మీరు ఫోన్ చేయగానే నేను సిఐ గారికి ఫోన్‌జేసిన, పన్నెండు గంటలకు సిఐ స్టేషనుకు వస్తనన్నడు"అని చెప్పిండు.

"ముందు పోరగాల్లు ఏమైనా తిన్నారా లేదా" అని అడిగిండు.

"లేద్దోరా వారికోసం సద్దులు పట్టుకచ్చినం కాని పోలీసోల్లు పోనిస్తలేరు"అన్నారు.

"సరె నేను మాట్లాడుతా"అంటూ సర్పంచు స్టేషన్ లోనికి వెల్లి "నమస్తే" అంటూ యసైని పలకరించి "నిన్న మాఊరి పోరగాండ్లను పట్టుకొచ్చింద్రట గద ఎక్కడున్నరు"అని అడిగిండు.

దానికి "ఆ విప్లవకారులంతా స్టేషన్ వేనుక కూర్చున్నరు" అని వెటకారంగా అన్నాడు యస్.ఐ.

"తెల్లారిగట్ల పట్టుకస్తిరి వారికి మంచి నీల్లయినా ఇచ్చారా లేదా సార్"అని అంటూ "వాల్ల తల్లి తంద్రులు వాళ్ళకు సద్దులు తెచ్చింద్రు వారికి పెట్టించండని"అన్నడు.

"దాందేముందిసార్" అంటూ ఇద్దరు పోలీసుల్ని పిలచి "ఒక్కొక్కరు గా వచ్చి వారి పిల్లలకు సద్దులిచ్చి పోమ్మని చెప్పండి"అన్నడు.

తల్లి దండ్రులు ఒక్కోక్కరుగా వచ్చి వారి వారి పిల్లలకు సద్దులిచ్చి స్టేషన్ బయటకు వచ్చినారు.

కొందరు తల్లులు తమ పిల్లలను ఆస్థితిలో చూచి గొల్లుమనగా పోలీసోల్లు "ఎయ్ స్టేషన్లో ఏడ్వకూడదు" అంటూ గదమాయించింద్రు. దానితో ఆ తల్లులు తమ కన్నీల్లను గుడ్లలోనే కుక్కుకొని తాము తెచ్చిన సద్దులను వారికి అందజేసిద్రు. అరెస్టయిన యువకులు స్టేషన్ వెనుక వున్న పంపు దగ్గర గబగబా మొఖాలు కడుక్కొని ఆవురావురంటూ వారి సద్దులు తిన్నారు.

పన్నెండు గంటలకు వస్తానన్న సిఐ మెల్లగా నాలుగున్నరకు స్టేషన్‌కు వచ్చిండు. ఈ లోపు సర్పంచు, నలుగురైదుగురు పెద్ద మనుసులు హోటల్లో భోజనాలు చేసిరాగా, ఆ యువకుల తల్లితండ్రులు స్టేషన్ ముందు గల చాయ్ బండిలో చాయ్‌లు త్రాగుతూ గడిపింద్రు.

సిఐ వచ్చిన వెంటనే సర్పంచ్ స్టేషన్‌లోనికి పెద్ద మనుషులతో నడిచిండు. సిఐ ముందు గల గదిలో గల కుర్చీలో సర్పంచును కూర్చోమ్మని మర్యాద జేసిండు యస్ఐ. వెంటనే సిఐ గదిలోకి వెల్లి ధర్మారం సర్పంచు వచ్చిన సంగతి చెప్పిండు.

సరే "మంచిది లోనికి ఒక్కరినే రమ్మని చెప్పుతూ రెండు చాయ్‌లు కొన్ని బిస్కట్లు తెప్పించ" మని చెప్పగానే, సర్పంచ్ గారిని లోనికి పంపించి, ఒక కానిస్టేబుల్‌ను చాయ్ బిస్కట్లు కొరకు పంపిండు యస్ఐ. మిగిలిన నలుగురు పెద్దమనుషులకు తన టేబుల్

ముందు గల కుర్చీలలో కూర్చోమ్మని చెప్పిండు యస్ఐ. గంటన్నర తరువాత సర్పంచు సిఐ గది నుండి బైటపడ్డడు. ఆయనతోనే ఆ పెద్దమనుషులు స్టేషన్ బయటకు వచ్చింద్రు.

వారు వచ్చిందే ఆలస్యం ఆ యువకుల తల్లి తండ్రులు వారి చుట్టూచేరి "సిఐ సాబ్ ఏ మన్నరని" అడిగింద్రు.

దానికి సర్పంచు బదులిస్తూ "నేను శాయశక్తుల ప్రయత్నించిన కాని సిఐ ఇంటలేదు. వెంకటితో సహా పన్నెండు మందిని విడిచిపెట్టేది లేదంటూ, చెప్పినారు. మిగతా వారిని ఇంకొద్ది సేపట్లో విడిచిపెడుతున్నారని" చెప్పినారు. "అ పన్నెండు మంది యువకులు మొన్న తెట్టుగుట్టలో అన్నలతొ సమావేశం జరిపినారని తనకు రిపోర్టు ఉందని, వారిపై నక్సలైట్లకు సహకరించినందులకు కేసులు పెడుతామని" సిఐ చెప్పిండన్నడు.

ఆ గుంపులోగల తెనుగు కులస్తులు కొందరు "ఆయ్యా! మొన్నరాత్రి తెట్టుగుట్టకు తేనె తియ్యడానికి మాతో పాటు మా పిల్లలు కూడా వచ్చినారని, అన్నలతో మీటింగ్లేదు గీటింగ్లేదు" అన్నారు.

"అంతే కాక ఆనవాయితీ ప్రకారంగా పెగడపల్లి యస్ఐ, సిఐ, డియస్పీ లకు మరియు యస్పీ సాబులకు తేనె సీసాలు కూడా తీసుకచ్చినం" అని చెప్పినారు.

దానితో సర్పంచు వారిలో ఒకరిని ఆ సీసాలతో సహా యస్ఐ సాబ్ వద్దకు తీసికెల్లి ఆ తేనె సీసాలను వారికి అప్పగించి బైటపడ్డారు. తాను ఒకటి ఉంచుకున్న యస్. ఐ, మిగతా మూడు సీసాలను సిఐ టేబుల్పై ఉంచి తమకు ఒకటి, ఒకటి డియస్పి సాబ్కు మరోటి యస్పి సాబ్కు పంపాలి" అన్నడు.

"తెట్టుగుట్ట నుండి దులిపి తెచ్చిన పట్టు తేనె, ఇది చాలా బాగుంటుంది" అన్నాడు యస్ఐ

"తెట్టు గుట్ట తేనేంది" అంటూ కొత్తగా వచ్చిన సిఐ అడిగిండు. దానితో ఆ యస్ఐ తాను ఆంతకు ముందు పెగడపల్లి మండల యస్ఐ గా పని చేసినప్పుడు విన్న, చూచిన సంగతులు చెప్పసాగిండు..

"ఈ ధర్మారం గ్రామం చాలా పురాతనమైంది. మౌర్యులు మహాపద్మనందుని ఓడించిన పిదప, నవ నందులలో ఒకడైన ధర్మనందుడు దక్షినాదికి పారిపోయివచ్చి ఈ ప్రాంతంలోని కీకారణ్యంలో నందగిరి కోటను కట్టుకున్నారు. దానికి ఆనుకుని ఉన్నదే తెట్టుగుట్ట. ఆ తెట్టు గుట్టకు ఉత్తరంవైపు రెండు పెద్ద శానబండలు ఓక దాని ప్రక్కన ఒకటి యాబై అడుగుల ఎత్తున ఉన్నాయని వాటి మధ్య పన్నెండు నుంచి పద్నాలుగు అడుగుల సొరంగం తీరుగా ఒక సహజసిద్ధమైన గుహ యాభై అడుగుల లోపల వరకు వుంది. ఆ రెండు నిలువు బండలపై మరో పెద్ద బండరాయిని ఎవరో రాక్షసులు స్లాబు

వేసినట్లుగా వుంటుంది, ఆ రాతి స్లాబుపై చిన్న పెద్దమ్మగుడి, దానితో పాటు పైన ఒకచిన్న నీటి గుండంకూడా ఉంది, దానితో ఆ రాతి స్లాబు సీలింగ్ చల్లగా వుండి తేనెటీగలకు తేనెతెట్లు పెట్టుటకు అనువుగా వుంటుంది.

గ్రామపు తెనుగువారు అతికష్టపడి తేనె దులుపుకొని కనీసం సంవత్సరానికి మూడులక్షల రూపాయల దాక సంపాదిస్తారు. ఆ తెనేనే ప్రతి సంవత్సరానికి నాలుగు సీసాలు పోలీసు వారికి, నాలుగు పారెస్టు వారికి మరో నాలుగు రెవిన్యూ ఆపీసర్లకు ఆ గ్రామ తెనుగు కులస్తులు నజరానా ఆందజేస్తారు. అని చెప్పిండు..

ఆయన ఇంకా ఇలా చెప్పసాగిండు"ఆ ధర్మారం ప్రక్కనే గల కోట్ల నర్సింహులపల్లె ఉందని ఆ ఊరిగుట్టపై రాతికోటవుంది, ఆ గుట్టకే మన కరీంనగరం లోనే పెద్దదయిన పురాతన నరసింహ్మాస్వామి దేవాలయం ఉంది. ఆది కూడా శాతవాహనుల కాలంలోనే కట్టబడింది". అని ఆ ప్రాంతానికి గల చారిత్రిక ప్రాధాన్యతను సిఐ గారికి వివరించిండు యస్ఐ.

"అయితే రేపు ఒక్కసారి ఆ ప్రదేశాలను చూసద్దాం" అంటూ సిఐ అన్నాడు. సరే మంచిది సార్ అంటూ యస్ఐ తలూపిండు.

పోలీస్స్టేషన్ నుండి బయటకు వచ్చిన యువకులు, వారి తల్లి తండ్రులు గ్రామానికి మరలిండ్రు. ఇంక స్టేషన్లోనే వున్న యువకుల తల్లి తండ్రులను, నలుగురు గ్రామ పెద్దలను వెంటబెట్టుకుని సర్పంచు జగిత్యాలలోనే వకాలత్ చేస్తున్న భుజంగరావు వకీలు ఇంటివైపు నడిచిండు.

మరునాడు ఉదయం తొమ్మిది గంటలకే సిఐ. యస్ఐ మరి నలుగురు గన్మెన్లతో జీపులో తెట్టుగుట్టను కోట్ల నరసింహ్మాస్వామిని దర్శించు కున్నారు. నిజానికి ఈ బండల అమరిక ఒక భూభౌతిక అద్భుతం అని అనుకున్నాడు.

ఇంటికి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజనంచేసి, కొంచెం తేనె తీసుకుని రుచి చూచి, చాలా బాగుంది అనుకొన్నాడు సిఐ.

తీవ్ర వాదంతో చైతన్యులైన యువకులను భయభ్రాంతులకు గురిచేసి, రాబోయే గ్రానైటు మైనింగులకు అడ్డు లేకుండా చేయటమే తన ముందున్న కర్తవ్యం. ఇది అన్యాయం అనుకొనిక్షణకాలం అంతర్ముఖుడైనాడు.

సిఐకి తన రెండు సంవత్సరాల వయస్సులో తన ఊరిలో జరిగిన సంఘటనలను, తాను పెరిగిన తరువాత, తన తల్లి, తండ్రులు మరి ఇతరులు చెప్పిన విషయాలు మదిలో మెదిలినాయి.

"అప్పుడు ఇంకా తెలంగాణాలో నైజాం పాలన ఉండేది. తన ఊరు కూడా ఒక దొర కింద ఎలా నగిలింది, ఆ తరం వారు కథలుకథలుగా చెప్పేది విన్నాడు. ఆనాడు ఆ

భూస్వామి పేరే ఎవరికి తెలిసేదికాదు. దొరగానే ఊరందరికి తెలుసు. అతనే ఊరికి సర్వాధికారిగా పెత్తనం చెలాయించే వాడని, ఆనేక వృత్తుల వారు ఆయన క్రింద వెట్టిచాకిరి చేసే వారని, వృత్తి పని వారు కూడా ఆ దొరకు ఉచితంగా పనులు చేయవలసి వచ్చేది,

ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆబ్కారీ పన్నుకు అదనంగా దొరకు కూడా చెట్టుకు ఇంత అని చెల్లించ వలసి వచ్చేది, పైగా ఆ దొర ఇంట్లో ఏదైనా పండగలకు, పబ్బాలకు, లేదా పెండ్లి లాంటి కార్యక్రమాలకు ఆయన బంధుగణానికి, ఆ గ్రామానికి అప్పుడప్పుడు వచ్చే గిర్దావరు, పోలీసు అమీన్ సాబు లాంటి అధికారులకు కూడా ఉచితంగా కల్లు. సరఫరా భాద్యత కూడా కుల పెద్దయిన తన నాయన మీదనే పడేది, తన కుటుంబంకూడా అతని గడికి ఉచితంగా కల్లు పోయవలసివచ్చేది

కోమట్లు ఉచితంగా కిరాణం సామాను, గొల్ల, కుర్మలు ఉచితంగా గొర్రె, మేకలను ఆ మూకలకు ఇయ్య వలసి వచ్చేది, అదే విధంగా అన్ని వృత్తుల వారు ఉచిత సేవలే కాక తలా కొంత పైకాన్ని ఆ అధికారులకు నజరానాలుగా సమర్పించ వలసి వచ్చేది, చాకలి వారు వారి బండ్లముందు పరిగెత్త వలసి వచ్చేది, అదే విధంగా మంగలి వారు ఉచితంగా క్షుర కర్మలు చేయవలసి వచ్చేది, దానితో ఆ ఊరికి ఎవరైనా అధికారులు వచ్చారంటే ఊరంతా హడలి చచ్చేవారు, ఆ ఊరిలోని చాలా మంది ఆడవారిపై లైంగిక వేదింపులు జరిగేవి, ఎవరైనా ఈ ఆన్యాయం ఏమిటని అడిగితే చాలు వారిని రకరకాల చిత్రహింసలకు దొర గురి చేసేవాడు, అతని దౌర్జన్యాలకు అంతుండేదే కాదు.

కొంత కాలానికి ఆంధ్రమహాసభల ద్వారా సంఘాల నిర్మాణం జరిగింది, అందులో భాగంగా తమ ఊరిలో కూడా ప్రజలు ఆ సంఘం కింద సంఘటితమైనారు. ఆ సంఘంలో తన నాయన ముఖ్యమైన భూమిక పోషించాడని, దొర దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగు బాటు జరిపిండ్రు, ఆ క్రమంలోనే ప్రజలు కొంత మంది సాయుధపోరాటంచేసింద్రు, దానిని అణచడానికి ఆ దొర కొంత మంది రజాకార్లను గ్రామానికి పిలిపించి ప్రజలను చిత్రహింసల పాలు చేసిండు. వారు తన నాయన కోసం తెగ గాలించింద్రు, చివరకు ఆయన దొరకకపోవడంతో మా ఇంటితో పాటు గ్రామంలోని చాలా మంది ఇండ్లను కాలబెట్టింద్రు, ఆ క్రమంలో గ్రామస్తులను ఐదుగురిని చంపింద్రు, దానికి ప్రతీకారంగా కొన్ని రోజుల తరువాత సంఘంలోని దళనాయకుల సారధ్యంలో ప్రజలు దొరగడిపై దాడి చేసింద్రు, కాని దొర, మరియు రజాకార్లు తప్పించు కొని పారి పోయింద్రు. కొంత కాలానికి భారత సైన్యాలు నిజాం రాజ్యాన్ని ఆక్రమించాయి.

తరువాత మూడు సంవత్సరాల కాలం ఆ సైన్యాలు, ప్రజల విముక్తికై పోరాడుతున్న కమ్యూనిస్టులను ఊచకోత కోసారు. ఆ క్రమంలోనే తన నాయన దళాన్ని వారు చుట్టి

ముట్టి కాల్పులు జరిపారు. అందులో దళ సభ్యులు ఐదుగురు మరణించారు. ఎట్లాగో తన నాయన తప్పించుకున్నారు, తరువాత కొన్ని రోజులకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మేరకు తన నాయనను పోలీసులు అరెస్టు చేసింద్రు, కోర్టు వారు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు, దాదాపు రెండు సంవత్సారాలు గుల్బర్గా జైలులో నిర్భంధిచారు, తరువాత సాయుధ పోరాటం విరమించగా విడుదలై వచ్చిండు.

ఆ కష్ట కాలంలో తన తల్లి తనను కంటికి రెప్పలాగా కాపాడింది, తరువాత మానాయన తాలూకా కమ్యునిస్టు పార్టీ కార్యదర్శిగా పని చేసిండు. తరువాత కమ్యునిస్టు పార్టీ వారికి కూడా స్వతంత్ర సమరయోధుల పించను ఇవ్వగా, తన నాయనకు కూడా వచ్చింది, అంతే కాక ఒక పది ఎకరాల భూమి కూడా ఇచ్చింద్రు, దానితో కొంత వరకు ఆర్థికంగా పుంజుకున్నారు, తన నాయనకు చదువు పట్ల వున్న అవగాహన వల్ల తనను చదివించాడు, హెచెస్సీ పాసవగానే మోరీల్ సాబు ఉద్యోగం పోలీసు డిపార్ట్‌మెంటులో వచ్చింది.

ఆనాడు నైజాంకు, దొరలకు వ్యతిరేకంగా ప్రజలు అనుభవించిన కష్టాలు, కడగండ్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణా సాయుధ పోరాటం, అదే విదమైన పోరాటం కూడా నక్సలైటు పోరాటం, కాని తెలంగాణా సాయుధపోరాటానికి లేని విస్తృతి, లక్ష్యము నక్సల్ బరీ పోరాటానికి ఉన్నది. తాను కూడా ఈ పోరాటాన్ని అణచడానికి దిగడం చాలా బాధ కలిగించే విషయం.

నిజానికి తెలంగాణాలో తన గౌడు కులస్తుల పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుంది, కుల వృత్తిని నమ్ముకున్నవారి పరిస్థితి ఏమాత్రం బాగా లేదు, మరో వైపు పాత తరం భూస్వాముల సంతతి వారు ఇబ్బడి ముబ్బడిగా బ్రాందీ షాపులు, బార్లు, సారా దుకాణాలు తెరిచారని, మరో వైపు తోటి గౌండ్లను రక్షించాల్సిన గౌడ కుల పెద్దలు కొందరు, పెట్టుబడి దారులతో కుమ్మక్కు అయినారని, గౌడ కులం నుండి ఎన్నికైన ప్రజాప్రతి నిధులుకాని, మంత్రులు కాని ఏంచేయలేక పోతున్నారని, నిజానికి కల్లుగీత వృత్తిని సహకార పద్దతిలో నడిపి, కల్లును తొందరగా పులిసి పోకుందునట్లు పాశ్చరైజేషన్ చేసి, ఆకర్షణీయమైన ప్యాకెట్లలో సాఫ్టు డ్రింకుగా అమ్మిస్తే ఇటు వృత్తి పనివారు, అటు వినియోగదారులు బాగుండేవారు, కాని నేటి గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ ప్రక్రియలో కోకాకోలా లాంటి కూల్ డ్రింకులు ఒకవైపు, మరోవైపు వివిధ దేశాల బ్రాందీ, విస్కీలు, జిన్నుల తోను ఇతర సారాలు దేశ మధ్యపరిశ్రమలను ఎదగకుండా చేయడమేకాక, మన దైన సంస్కృతీ సంప్రదాయాలను మట్టికరిపిస్తున్నాయి" అనుకున్నాడు సిఐ.

ఇంతలోనే ఆయన మనస్సు తన కొడుకుపైకి మరలింది. "ఇప్పటికి అతని కొడుకుకు

ఇరవైఎనిమిదిసంవత్సరాల వయసు వచ్చింది. ప్రవేటు ఇంజనీరింగ్ కాలేజీలో చేరి ఇంజనీరింగ్పూర్తి చేసినాడు. కాని ఇంతవరకు ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఇదే మధ్యపరిశ్రమ మొత్తం తమ కుల సంఘాల చేతుల్లో ఉన్నట్లయితే, చాలా వరకు తమ వారసులు ఏం చేయాలి, ఏ వృత్తిలో కొనసాగాలే అనే విషయంపై ఏలాంటి అందోళనలు ఉండేటివి కావు. ఈ విధంగా కుల వృత్తులు ప్రజలకు ఉద్యోగ భద్రత కలిగించేవి. కాని మారిన పరిస్థితుల్లో ప్రతీ తల్లి తండ్రులకు తమ సంతానం జీవితంలో స్థిరపడే వరకు ఆందోళనలు, టెన్షన్లతోనే గడుపుతున్నారు.

ఈ సందర్భంలో తాను గోదావరిఖనిలో యస్ఐ గా పని చేస్తున్నప్పుడు జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చినాయి. "సింగరేణి కంపెనీ, అప్పుడు వాలంటరీ రిటైరయిన ఉద్యోగుల, వారసునికి ఉద్యోగం ఇచ్చేది. దానితో నిరుద్యోగులైన యువకులు తన తండ్రిని ముందుగానే రిటైరయి, అతని ఉద్యోగాన్ని తనకు ఇప్పించమని ఒత్తిడి తెచ్చేవారు. కొన్ని సందర్భాలలో ఇది తండ్రులను హత్య చేసేవరకు వెళ్ళేది. అదే విదంగా అన్ని ప్రభుత్య రంగ సంస్థల్లోను, ప్రభుత్య ఉద్యోగాల్లోను కారుణ్య నియామకాల వల్ల, వారసుల చేతుల్లో ఎంతమంది తల్లి, తండ్రులు హత్యలకు గురిఅవుతున్నారో కదా! అనుకున్నాడు.

తీవ్ర వాదంతో చైతన్యులైన యువకులను భయభ్రాంతులకు గురిచేసి, రాబోయే గ్రానైటు మైనింగులకు అడ్డు లేకుండా చేయటమే తన ముందున్న కర్తవ్యం. నిజానికి తాను చేయబోయేది అన్యాయం అనిపించింది. కాని ఇంతలోనే తేరుకొని, తాను నిమిత్తమాత్రుడనని రాజ్యయంత్రంలో ముఖ్యంగా పోలీసు డిపార్టుమెంటులో తాను కేవలం ఒక పని ముట్టును మాత్రమేనని, తాను చేయక పోతే వేరెవరైనా ఈ పని చేయాల్సిందేనని, దానితో తాను అతి త్వరలోనే డియస్ పీ గా ప్రమోషన్ పొంది రిటైర్ అయిన తరువాత బంగారు బాతు గుడ్లు పెట్టే ఈ గ్రానైటు వ్యాపారంలోనికి దిగాలను కున్నాడు. ఉద్యోగం లేక బేకారుగా ఉన్న తన కొడుకును గ్రానైటుమైనింగులో ఇరికిస్తే వాడి బతుకు వాడు బతుకుతాడను కొన్నాడు

దానికి ఈ సిఐ పోస్టును స్ప్రింగ్ బోర్డుగా ఉపయోగించాలని నిశ్చయించు కున్నాడు. ఆ నిశ్చయానికి రావడంతో తన అంతరాత్మను ఖాకీ యూనిఫాంలో బంధించిండు సిఐ.

ఆ అర్ధ రాత్రి పోలీసు స్టేషన్లో వెంకటితో సహా పన్నెండు మంది గొల్ల, కుర్మ, తెనుగు యువకులకు పోలీసులు తమదైన పద్దతిలో ట్రీట్మెంటు ఇచ్చినారు. వారి హృదయవిదారక ఆక్రందనలతో చలించిపోయిన లాకప్పు గది తల్లడిల్లి పోయింది.

తెల్లవారి సాయంత్రానికి వారిని స్థానిక కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టగా, వారి వకీలు బెయిల్ పిటీషన్ న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టినాడు, దానిని న్యాయమూర్తి

తిరస్కరిస్తూ, వారిని పదిహేను రోజుల రిమాండుకు స్థానిక సబ్‌జైలుకు పంపినాడు. పదిహేను రోజుల రిమాండు తరువాత, పెగడపల్లి పోలీసు స్టేషన్‌లో ప్రతీరోజు వచ్చి సంతకాలు చేయాలనే షరతులతో కూడిన బేయిల్ వారికి దొరికింది.

# 3

ఇక జనార్ధన రెడ్డి తన కుటుంబాన్ని, గ్రామం నుండి కరీంనగరానికి మార్చిండు, తాను ఇటీవలనేకొన్న ప్లాటులో కొత్త ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిండు. ఆయన తల్లి మాత్రం ఊరిలోనే వుండి పోయింది. ఇంక నాలుగు సంవత్సరాల సర్పంచు పదవీ కాలాన్ని కరీంనగరం నుండే నిర్వహించాలని నిర్ణయించుకున్నడు. అవసరమైనప్పుడు మాత్రం తన గ్రామానికి వెళ్లివస్తున్నాడు. ఈ సంవత్సరం వేలం వేయబడిన ఆబ్‌కారిశాఖ వారి బ్రాండీ షాపు లైసన్సుల్లో బూరుగు పల్లి, గంగాధర క్రాసింగ్‌లల్లో రెండు బ్రాండీ షాపులను చేజిక్కించుకున్నడు.

ఒక్క మూడు నెలల కాలంలోనే దాదాపుగా ఏడెనిమిది దఫాలుగా పోలీసులు రాత్రనక పగలనకా ధర్మారం గ్రామ యువకుల్ని పట్టుకు పోయి చిత్ర హింసల పాలు చేస్తూన్నారు. దాదాపు ఆ గ్రామంలోని యువకులందరిపైనా చిన్నా చితుక కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైనాయి. వారితో పాటు కొందరు కాపు. పెరిక యువకులపై కూడా కేసులు బనాయించినారు. దీనితో ఆ గ్రామానికి ఏ వాహనం వచ్చినా చిన్నాపెద్దలందరు హడలి పోతున్నారు.

ఎక్కడో దొరికిన ఇద్దరు తీవ్రవాదులతో పాటు వెంకటిని కూడా కాల్చి, ఆ మూడు శవాలను గ్రామానికి ఆనుకుని ఉన్న తెట్టుగుట్టలో వేసినారు. దానితో ఆ గ్రామస్తు లందరు విపరీత భయోత్పానికి గురైండ్రు.

ఆ గ్రామంలో దాదాపు అన్ని కుటుంబాల వారు, వారి కొడుకులపై పెట్టిన కేసుల చుట్టు తిరగడానికి అప్పుల పాలైనారు.

ఆ గ్రామం అడవి ప్రాంతాన్ని ఆనుకొని ఉన్నందున. అందులో తెట్లుగుట్టతో పాటు మరో ఐదారు గుట్టల సముదాయంపై గల సీతాఫలాలతో పాటుగా, తేనె మరియు ఇతర అటవీ వుత్పత్తుల ఆదాయంతో, సుఖంగా కాలం వెళ్ళదీస్తున్న తెనుగు వారికి, చుట్టు ప్రక్కల గ్రామాల తెనుగు వారు ఆడపిల్లలను ఇచ్చి వివాహాలు జరుపడానికి ముందుకొచ్చేవారు. దానితో ఆ కులస్తులలో బాల్య వివాహలు సామాన్యం. దానితో పోలీసు కేసులల్లో ఇరికించబడిన యువకులకు ఏ ఒక్కరిద్దరికో తప్ప అందరికి వివాహాలు అయినయి. పాపం తరచుగా పోలీసు దాడులవల్ల వారు నిశ్చింతగా సంసారాలు గడుపలేక

పోతున్నారు. పైగా చాలా మంది యువకులకు ఒకరిద్దరు పిల్లలు కూడా ఉన్నారు, కొందరికైతే ముగ్గురు కూడా ఉన్నారు

మొదటిసారిగా కేసులో ఇరుక్కున్న వెంకటితో పాటు, రాజేశం కొద్దిగా చదువుకున్నాడు. ఆయన ఒక పారి జగిత్యాలలో తన సమీప బంధువు కొమురయ్య పెండ్లికి పోయిండు, అక్కడ ఆడ పెల్లి వారి తరపున వచ్చిన రామయ్యను కలిసిండు.

రామయ్యది చందుర్తి ప్రక్కన గల మల్యాల గ్రామం. ఆయన చేతికి బంగారు పట్టీ, వేళ్ళకు ఉంగరాలు, మెడలో గొలుసు అందరికి కనిపించే విధంగా ఖరీదైన బట్టలు వేసుకోని ఉన్నాడు. ఆయన చుట్టూ ఆ పెండ్లికి వచ్చిన యువకులు చేరడాన్ని గమనించి, ఆయనతో మెల్లగా మాటల్లోకి దిగి వివరాలు రాబట్టిండు, రామయ్య పది ఏళ్ల క్రితమే దుబాయికి పోయిండని. అక్కడ మేసన్‌గా పని చేసి ఓ ఇరవై లక్షల రూపాయలు సంపాదించాడని ఆ డబ్బుతోనే ఆ ఊరి కరణాల భూములు కొని స్థిరపడ్డాడని తెలుసుకున్నాడు.

తరువాత ఒక సారి, తన సమీప బందువు కొంరయ్యతో మల్యాలలోని రామయ్య ఇంటికికూడా వెళ్లింద్రు. రామయ్య వారిద్దరికి మంచి విందు ఇచ్చిండు. తను కొన్న పొలాలన్నిటిని చూయించిండు దాంతో రాజేశానికి ఇక్కడి పోలీసు కేసులు, తన్నులు గుద్దుల కన్న తాను కూడా దుబాయి పోయి మస్తుగా సంపాదించి, కేసుల కొరకైన అప్పుల నుండి బయట పడచ్చు గదా అనుకున్నడు.

తన ఆలోచనను తనతో పాటు ఇరికించబడిన ఇతర యువకులకు చెప్పిండు, వారికి కూడా ఆ ఆలోచన నచ్చింది. ముఖ్యంగా పోలీసు వేదింపుల నుండి బయటపడే మార్గం వారికి దొరికిందని వారనుకున్నారు.

వారందరి తరపున రాజేశమే రామయ్య దగ్గరికి వెళ్లి దుబాయి పోవడానికి కావలసిన వివరాలు తెలుసుకొని వచ్చిండు. ఆ తర్వాత తన తల్లి తండ్రులతో తాను దుబాయికి పోతానని చెప్పిండు,

మొదట తల్లి తండ్రులు వద్దంటూ "రాజేశం కలో గంజో త్రాగుతూ ఇక్కడే వుండు, వయస్సు మీదున్న భార్యను చిన్న పిల్లలను ఇద్దరిని విడిచి వెళ్లడం బాగుండదని" బతిమాలింద్రు. కాని ఈ పోలీసు దెబ్బలకు, కోర్టు కేసులతో తిరిగి వేసారి, ఇరవై వేల అప్పు గుర్తుకు వచ్చి గట్టిగా కొడుకు నిశ్చయాన్ని అడ్డుకొలేక పొయింద్రు.

మిగతా యువకుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

అలాగే ఆలోచన చేస్తున్న పది మంది యువకుల తరపున, రామయ్యను కలిసి, తాము పదకొండు మందిమి దుబాయి పోవడానికి తగిన ఏర్పాట్లు చేయ వలసిందిగా కోరినాడు.

దానితో రామయ్య లింగారెడ్డి ఫోన్‌నంబరు రాజేశానికి ఇచ్చి "మీరు హైదరాబాదు వెళ్ళి లింగారెడ్డి దొరను కలవండి. ఆయన దుబాయికి పోవడానికి ఎంత ఖర్చు అవుతుందో చెప్పుతాడు

ఇప్పుడు డెబ్బై వేల రూపాయిల నుండి ఎనభై వేల రూపాయిల ఖర్చు వస్తుందని, మీరు ఏమన్నా గిరి గీచి బేరమాడుతే ఆయన కొంత తగ్గవచ్చు"అని చెప్పి పంపినాడు. అందరి తరఫున రాజేశం జగిత్యాల నుండే లింగారెడ్డితో మాట్లాడింద్రు.

లింగారెడ్డి "మీదే గ్రామమని" అడుగగానే "పెగడపల్లి మండలం, ధర్మారం గ్రామం" అనగానే, "మీ ఊరి సర్పంచు మా బంధువని" అయన చెప్పిండు.

దానితో వారు కరీంనగరం పోయి జనార్దన రెడ్డిని కలిసి తాము పదకొండు మందిమి "దుబాయికి పోతామని కొద్దిగా లింగారెడ్డి దొరకి ఫోన్ చేసి సహాయం చేయాలని" అన్నారు.

దానితో జనార్ధన రెడ్డి లింగారెడ్డికి ఫోన్ చేసి"బావ గారు మా గ్రామపు పదకొండు మంది యువకులు గల్ఫుదేశాలకు వెళ్లడానికి వీసా, పాస్ పోర్టులు మరియు ఆ దేశాలలో ఉద్యోగాల కొరకు ఒక్కొక్కరికి ఎంత ఖర్చు అవుతుందో చెప్పు" అన్నాడు.

దానితో లింగారెడ్డి "పొయే వారు మీఊరోల్లే అంటున్నావు కాబట్టి బావా, మనిసొక్కంటికి అరవై వేల రూపాయిలయితయి"అన్నాడు. అదే విషయాన్ని జనార్ధన రెడ్డి వారికి చెప్పిండు. రామయ్య చెప్పిన దానికంటే తక్కువే కాబట్టి, "మరి ఎప్పుడు రమ్మంటరో చెప్ప మనండి" అని జనార్ధన రెడ్డిని అడిగింద్రు.

దానికి "మీదే ఆలస్యం" అన్నాడు రెడ్డి.

వారు ధర్మారం తిరిగివచ్చి పైసలవేటలో పడ్డారు. అందిన చోటల్ల అప్పులు తెచ్చింద్రు. ఇంట్లో వున్న కాస్తా బంగారు వెండి నగలను అమ్ముకున్నరు. గొల్ల యువకులు తమకుటుంబానికి చెందిన గొర్రెలను అమ్మింద్రు మొత్తానికి తలా అరవైఐదు వేల రూపాయలతో ఒక మంచి రోజున జగిత్యాల నుండి హైదరాబాదు బస్సెక్కింద్రు.

సికింద్రాబాద్‌లోని బేగంపేట ఏర్‌పోర్టుకు ఎదురుగా వున్న లింగారెడ్డి ఆపీసుకువెళ్లి, లింగారెడ్డి చేతిలో తలో అరవై వేలు పోసి, ఆయన ముందు చేతులు కట్టుకుని నిలబడ్డరు. ఆయన ఆపీసులో పని చేసే ఉద్యోగులు, వీరిని తీసుకువెళ్లి పోటోలు తీయించి ఏవేవో కాగితాల మీద సంతకాలు, వేలి ముద్రలు వేయించుకుని, మెడికల్ టెస్టులు వైగారాలన్ని పూర్తి చేయించి, ఇక మీరు మీ ఇండ్లకు వెళ్లమని చెప్పింద్రు. అంతే కాక మీ ఇంటికి త్వరలోనే పెగడపల్లి పోలీసులు వచ్చి ఎంక్వైరీ చేస్తారని, వారికి మనిషొక్కంటికి వెయ్యి రూపాయలు ఇవ్వాలని చెప్పింద్రు.

"సరే" నంటూ ఆ పదకొండు మంది యువకులు తిరిగి ధర్మారం చేరుకున్నరు.

కొద్ది రొజులకే పెగడపల్లి పోలీసులు ఇద్దరు వచ్చి మనిషొక్కరికి వెయ్యిరూపాయలు తీసుకుని వెళ్లిపోయింద్రు. ఆ రోజు రాత్రే మళ్లీ పోలీసులు గ్రామంపై దాడి చేసి, దొరికిన కొద్ది మంది యువకులను జగిత్యాల పోలీసు ఠాణాకు పట్టుకొని పోయింద్రు, ఈ సారి పోలీసులు ఈ పదకొండు మంది యువకుల జోలికి మాత్రం పోలేదు. మరి కొన్ని రోజలకు. ఈ పదకొండు మంది యువకులను పెగడపల్లి యస్ఐ పిలిపించి "మీరంతా తీవ్రవాదాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసారు కాబట్టి మీ పై పెట్టిన కేసూలన్నింటిని కోర్టువారు కొట్టివేసినారని" తెలియ చేసిండు.

మరి కొన్ని రోజల్లో వారికి వీసా, పాసు పోర్టులు, రాజేశంతో పాటు మరో ముగ్గురికి దుబాయిలో ఒక ఇండియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలోను, మరో నలుగురికి సౌదీలోని మరో కంపెనీలోను మిగతా వారికి కువైట్‌లో ఒక కొత్త ఏర్ పోర్టు నిర్మాణ సంస్థలలో సాధారణ వర్కర్లుగా నియామక ఉత్తర్వులు అందినాయి. వాటిని పట్టుకు వచ్చిన పోస్టుమ్యాన్‌కు తలో వంద రూపాయల ఇనాం ఇచ్చినారు ఆ యువకులు.

తర్వాత పది రోజులకు పెట్టేబేడా సర్దుకొని, జగిత్యాలనుండి బొంబాయి వెళ్లే గంగారాం బస్సులో బెయలు దేరడానికి జగిత్యాలకు పోయింద్రు. ఆ యువకులతో పాటు వారి భార్యా పిల్లలు, తల్లి తండ్రులు, బంధుమిత్రులు వారిని సాగనంపడానికి పోయింద్రు. వారు బస్సుఎక్కేముందు, వారి తల్లి తండ్రులు, భార్యా పిల్లలు ఒక్కసారి వారిని పట్టుకొని గొల్లుమని ఏడ్చింద్రు. వారు కూడా ఏడ్చినారు

ఇది హృదయ విదారక దృశ్యం జగిత్యాలలోని పాత హైస్కూలు ప్రాంతం వారికి అలవాటైనా. వీరికి మాత్రం చాలా వ్యధను కలిగించింది. గంగారాం బస్సు బయలు దేరడానికి సిద్ధంగా డ్రైవర్ హారన్ కొట్టగానే, ఈ యువకులు గబగబా బస్సు ఎక్కి కిటీకీల నుంచి వారి భార్యాపిల్లలకు చేతులూపింద్రు. వారి భార్యాపిల్లలు, తల్లీతండ్రుల కండ్లల్లో కన్నీళ్ళు ఉబికి వస్తూండగా, బస్సు దుమ్ము, పొగ రేపుతూ బస్సు బయలు దేరింది. కన్నీళ్ళతో నిండిన వారి కళ్లలో దుమ్ము, పొగ పడగా, కళ్ళను నలుపుకుంటూ బస్సు కనుమరుగయ్యే వరకు చూస్తూండి పోయింద్రు.

వారు వెల్లిన రెండు నెలలకే ఒక్కొక్కరు పది వేల రూపాయలను ఇంటికి పంపించారు.

ఈ విషయం ఈ నోటా ఆ నోటా ఊరంతా ప్రాకింది. దానితో గ్రామం లోని మిగతా యువకులు గల్పు దేశాలకు వెళ్ళడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింద్రు. నెల రోజుల్లో మరో ఇరవైఐదు మంది యువకులు ముంబాయి నుండి జెట్ ఏర్ వేస్ విమానంతో అరేబియా సముద్రం దాటింద్రు. మరో మూడు నెలల్లోనే మరో ఇరవై మంది యువకులు

అరబ్బు దేశాల బాట పట్టిండ్రు కాని ఈ సారి వారికి మనిషి కొక్కరికి లక్ష రూపాయల ఖర్చు వచ్చింది.

మరో నెలలోపునే మరో ఇరవైఐదు మంది యువకులు విమానం ఎక్కిండ్రు. కాని వీరికి అక్కడ ఎలాంటి కంపెనీలలో ఉద్యోగాలు లేక, టెంపరరీ విజిటింగ్ వీసాలపై పంపబడ్డారు. ఈ విధంగా ఆ గ్రామంలోని ముఖ్యంగా తెనుగు, గొల్ల, కుర్మ యువకులతో పాటు కొద్ది మంది కాపు యువకులు పంపబడ్డారు.

ఈ విధంగా ఆ గ్రామంలోని కొత్తతరం మానవశక్తులైన యువకులు తమ ప్రాణ ప్రదమైన వాళ్లను, వారి స్వంతగ్రామాన్ని వదలి, తమ యవ్వన శ్రమశక్తిని, పడచుదనపు కోరికలను నిరర్ధకంగా ఎడారి పాలు చేయుడానికి, ఆ ఎడారి ప్రాంతాలకు విసరివేయబడినారు.

ఆదే కాలంలో దాదాపు పది మంది మోతుబరి రెడ్డి, కాపు యువకులు, యువతులు తమ ఉన్నత సాంకేతిక విద్యను పూర్తి చేసికొని ఉద్యోగాలకై అమెరికాలో అడుగుపెట్టినారు. అట్లు విమానమెక్కిన వారిలో జనార్ధనరెడ్డి ఏకైక కూమార్తె కూడా వుంది.

ఈ విధంగా వున్నత సాంకేతిక విద్యను నేర్చిన వారి సేవలు కూడా ఈ దేశానికి ఉపయోగపడక పోవడం చాలా విచారకరం.

గ్రామంలోని పెద్ద రైతుల వారసత్వ సంపద వారి వద్దనుండి దూరమవడం వారికి కూడా ఖేదానికి దారి తీసింది. నడి ఈడుకు పై బడ్డ తల్లి తండ్రులకు తమ ఇంట్లో మనుమలు మనుమరాళ్ళు లేక పోవడం చాలా కృంగదీస్తూన్నది. కాని ఇండియాలో గౌరవప్రదమైన మేధోవలస బానిసత్వం వారిని బహిరంగంగా బాధపడకుండా భంగపరుస్తూన్నది. ఈ విధంగా ఇటు నిరాక్షరాస్యుల వలస బతుకుల వల్లను, అటు మేధోబానిసత్వం వల్ల దేశంలోని యువ శ్రామికశక్తి విదేశీ పాల బడింది.

మొత్తంగా ఆ గ్రామం నుండిశ్రామిక యువశక్తి ఎడారుల్లోకి, మేధో వలసలు అమెరికా లోకి తరుమబడ్డ తరువాత, ఇక మిగిలి వున్న తల్లి తండ్రుల్లో పని చేయాలన్న ఉత్సాహం క్రమకమంగా తగ్గుతున్నది. ఏదో నైరాశ్యం వారి జీవితాల్లో చోటుచేసి కొంటున్నది. యువతులైన కోడల్లను, వారికి ఉన్న చిన్న పిల్లలను చూచి తరచుగా కన్నుల్లో నీళ్లు నింపుకుంటున్నారు. మళ్లీ గట్టిగా ఏడిస్తే, కోడల్లు, వారి పిల్లల మనోస్థైర్యం సడలు తుందని మౌనంగా బాదలను దిగమింగుతున్నరు.

ఏవైనా పండగలు, పబ్బాలు వచ్చినప్పుడైతే ఇక వారి బాద వర్ణనా తీతం. ఆ సమయంలో ఏదో ఒక సంధర్భలో పెద్దపెట్టున రోదించడం సర్వసాధారణ దృశ్యం. బతుకమ్మ దసరా పండుగలకు గాని, బోనాలపండుగ గాని, గొల్ల కుర్మల బీరప్ప పండుగలు

గాని పేలవంగా, లాంచనంగానే జరుపబడుతున్నాయి. మొత్తానికి అ గ్రామానికి జీవకళ తప్పింది.

## 4

తమిళనాడుకు చెందిన గోపన్ యునైటెడ్ స్టోన్ మైనింగ్ కంపెనీకి కరీంనగరం జిల్లాలో మేనేజరుగా పని చేస్తున్నాడు. ఆ కంపెనీకి ఇప్పటికే ఒద్యారం, కమాన్‌పూర్, గట్టుదుద్దెనపల్లి, ఖాజీపూర్ కదంబాపూర్‌లలో గ్రానైటు క్వారీలు ఉన్నాయి, ఆ కంపెనీకి ఇక్కడే కాక, చిత్తూరు జిల్లాలోని కుప్పం, కర్నాటక, తమిళనాడులలో మరో పదకొండు క్వారీలు ఉన్నాయి.

వారి కరీంనగరం ఆఫీసు ఒద్యారంలో కరీంనగరం నుండి సిరిసిల్ల రోడ్డుకు ప్రక్కన గల వారి గ్రానైటు క్వారీవద్ద ఉంది. వారి క్వారీలలో పని చేయడానికి కావలపిన నిపుణులైన కార్మికులను తమిళనాడు నుండే తెచ్చుకున్నారు. వారే కాక ఇతర క్వారీలలో కూడా తమిళ కార్మికులు ఉన్నారు. సామాన్యంగా వారు బండలను పేల్చేపని, బండలకు డ్రిల్లింగ్ చేసే వారిగాను, క్రేన్ ఆపరేటర్లుగా, వివిధ రకాల వాహనాల డ్రైవర్లుగా. ఆపీసు గుమాస్తాలుగా, సూపర్‌వైజర్లుగా పని చేస్తూన్నారు. వారి కొరకై కరీంనగరంకు పది కిలోమీటర్ల దూరంలోగల కమాన్ పూర్‌వద్ద, వారికే లీజుకీయబడిన మరో కొండ ప్రక్కన టెంపరరీ షెడ్లు వేసినారు.

యన్. టీ. రామారావు ముఖ్యమంత్రిగా నున్నప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రితో చెప్పించు కొగా, యన్.టీ.ఆర్. తమిళకాలనీ పేర ప్రభుత్వ డబ్బుతో తమిళ కాలనీ నిర్మించబడింది. ఆ కాలనీకి కరీంనగర్ నుండి నీటి వసతి కూడా కల్పించటమే కాక. ఆక్కడి స్థానిక బడిలో తమిళుల పిల్లల కొరకై ఒక తమిళ టీచరును కూడా ప్రభుత్వం నియమించింది.

పొద్దున ఎనిమిది గంటలకు ఒక క్వాలిస్ జీపు కరీంనగరం లోని జనార్ధన రెడ్డి ఇంటి గేటు ముందు ఆగింది. ఆందులో నుండి నల్లటి పెద్ద తుమ్మమొద్దు లాంటి శరీరాన్ని లాక్కుంటూ గోపన్ దిగిండు కాలింగ్ బెల్ నొక్కిండు, జనార్దన రెడ్డి గేటు తీసి ఎవరు మీరన్నట్లు గా మొఖం పెట్టగానే, గోపన్ తనకు తాను పరిచయం చేసికొన్నాడు, "సరే లోనికి రమ్మంటు"ముందు గదిలో కూచొమ్మంటు సోఫా చూయించిండు. రెండు చాయ్‌లు అంటూ కొంత గట్టిగ వంటింట్లోని తన భార్యకు వినపడునట్లుగా చెప్పిండు. జానకి తెచ్చి ఇచ్చిన చాయ్ తాగుతూ గోపన్ నేరుగా విషయంలోకి వచ్చిండు.

"సర్పంచు గారు, మీ ఊరిలో గల తెట్టుగుట్ట గ్రానైటు క్వారీ కొరకు మా కంపెనీ

ప్రపోజల్‌ను, మైనింగ్ శాఖ వారు కలెక్టరు గారికి పంపగా, వారు దానిని పెగడపల్లి యం. ఆర్. ఓకు పంపించినారు. యం. ఆర్. ఓ గారు కూడా దానిపై మీ గ్రామ పంచాయతీ తీర్మానం కోరుతూ మీకు పంపిండు. దానిపై మీరు త్వరలో తీర్మానం చేస్తే మాకు ప్రాంతీయ మైనింగ్ ఆఫీసు ద్వారా అనుమతి వస్తూంది. కావున దానిని త్వరగా పంపించండి దానికి ఏమైనా పార్మాలిటీస్ వుంటే నేను పూర్తిచేస్తాను"అన్నాడు.

దానికి సర్పంచు "ఆ పార్మాలిటీస్ ఏమిటో మీరే చెప్పండి" అన్నాడు.

దానితో గోపన్"తమ కంపెనీ ఐదు లక్షల రూపాయిలు సర్పంచు గారికి, ప్రతీ పంచువుకి లక్ష రూపాయిలు బహుమతిగా ముట్టచెబుతుంది" అన్నాడు. "అంతే కాక మీరు బ్యాంకు లోను ద్వారా కొన్న రెండు గ్రానైటు లారీలను తమ కంపెనీ అద్దెకు తీసుకుటుందని, మరియు మీరు చూయించిన ఐదుగురిని గ్రానైటు పనిలో పెట్టు కొంటామన్నాడు.

దానికి "సరే" అంటూ "పంచులను ఎల్లుండి కరీంనగరంకు పిలిపించి మాట్లాడుతానని" అన్నాడు జనార్ధనరెడ్డి.

తరువాత ఒక రోజు, సర్పంచుకు, పంచులకు గోపన్ స్థానిక హోటల్ గీతలో డిన్నర్ అరేంజి చేసినాడు. ఆ విందులో ప్రతీ పంచువుకు, ఒక్కో లక్షరూపాయిలు తమ క్వారీ కంపెని లోగో ముద్ర ఉన్న క్యాష్ భ్యాగులో పెట్టి పంచులకు అందించినాడు. కాక్‌టైల్ పార్టీతో డిన్నర్ పూర్తి చేసుకొన్న అందరిని, గోపన్ తన క్వాలిస్‌లో ఎక్కించు కొని సర్పంచును ఆయన ఇంటిలో దిగబెడుతూ ఐదు లక్షల రూపాయల బ్యాగును అందించిండు.

మిగాతా వారిని అదే క్వాలిస్‌లో వారి గ్రామాంలో దింపి. రాత్రి ఒంటి గంటకు నవ్వుకుంటూ తన ఇంటికి చేరిండు గోపన్.

కొద్ది రోజులకు గ్రామ పంచాయతీ సమావేశంలో తెట్టుగుట్టకు గ్రానైటు క్వారీ పెట్టుటకు మా గ్రామపంచాయితీకి ఎలాంటి అభ్యంతరము లేదని, కావున మంజూరు చేయవచ్చని తీర్మానం ఆమోదించింది. నాలుగు గోడల మధ్య జరిగిన ఈ తతంగమంతా గ్రామస్తులకు తెలియనే తెలియదు.

నిజానికి ఆ ప్రపోజల్స్‌పై రాష్ట్ర అసెంబ్లీలో చేసినచట్ట ప్రకారం అయితే ఒక్క యం. ఆర్. ఓ అనుమతి చాలు ఎంత పెద్ద గుట్టకైనా పర్మిషన్ ఇవ్వటానికి. గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం లేదు. కాని, దానిని సర్పంచులకు పంపడానికి యంఆర్‌ఓలకు రెండు ప్రయోజనాలు ఉన్నాయి. మొదటిది యం. ఆర్. ఓ ఒక్కడే ఇస్తే గ్రామస్తులంతా ఆ గ్రామ సర్పంచు ఆధ్వర్యంలో క్వారీకి వ్యతిరేకంగా ఉద్యమించే ప్రమాదం

ఉందని. రెండవది ఎలాంటి ఆధారం లేకుండా తానే ఇస్తే మునుముందు ఏమైనా సమస్యలు వస్తే, తాను ఆ భాధ్యతను సర్పంచులపై నెట్టవచ్చు అని ఆలోచించారు యం. ఆర్. ఓ లు.

సర్పంచులకు పంచువులకు తలా కొంత ముట్ట చెప్పితే మును ముందు గ్రామంలో తమకు వారి వత్తాసుకూడా ఉంటుందని ఆలోచించారు గ్రానైట్ యజమాన్యాలు. గ్రానైటు క్వారీలు వచ్చిన ప్రతీ గ్రామంలో ప్రజాప్రతినిధులు ద్రోహులుగా అవతారమెత్తుతున్నారు. ఈ విధంగా గ్రామ ప్రజల సాధికారతకు తూట్లు పొడుస్తున్నారు యం. ఆర్. వోలు, మరియు ప్రజా ప్రతినిధులు.

## 5

ఇంకో నెల రోజుల్లో వసంత కాలం వస్తాంది ఆ కాలంలోనే తెట్టుగుట్టపై గల తెట్టుబండ గుహలో పెట్టిన తేనెపట్ల నుండి తేనెను దులుపుతారు. ఇదే అదనుగా భావించిన తెనుగు పంచువు ఓదేలు "ఈ ఏడు తమ కులస్తుల యువకులంతా విదేశాలకు వెళ్ళి నందున, ఆంతా పెద్ద వారు మాత్రమే ఈ సారి తేనె దులపాల్సి వుంటుదని. అసలే ఆ గుట్ట ఎక్కడం కష్టం, దానితో ఆ తెట్టు బండల చుట్టూ పెద్దపెద్ద నల్లసరపు బండలు ఎవరో రాక్షసులు పెట్టినట్లు వుంటాయి, గుట్ట మొదలు కొని పై వరకు కూడా దట్టమైన చెట్టుచేమలతో పచ్చగా వుంటుంది. తెట్టు బండల సొరికెల్లోను, దాని చుట్టుమట్ల వున్న బండల మధ్య గల సొరికెలలో ఎలుగుబంట్లు వుంటాయి, కొన్నిసార్లు చిరుతపులి కూడా వస్తాంది అటు వంటి గుట్టలు మన పోరగాండ్లు లేకుండా ఎక్కలేమని, మన లాంటి వయసు మల్లిన వారికి మరీ కష్టమౌతుందని, అందుకు పరిష్కారంగా ఆ తెట్టుగుట్టకు ఆ ప్రక్కనుండే పోతున్న కాంక్రీటు రోడ్డు నుండి తేనె తెట్ల గుహ వరకు గుట్టపైన రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని" ప్రచారం మొదలు పెట్టిండు.

దానికి గుట్టపట్లా, వేటలోను, పరిసరాలపట్ల అవగాహన వున్న ముసలి వారు వ్యతిరేకించారు. "అసలు ఆ గుట్టమొత్తంగా దట్టంగా చెట్టుచేమలున్నందుకే, మరియు సామాన్యులకు అందనంత ఎత్తు వున్నందుననే, తేనెటీగలు తెట్లుపెడుతాయని, ఆ పరిసరాలను చెడగొడితే అసలుకే మోసం వస్తుందని" అన్నారు.

కాని మధ్యవయస్కులైన కొందరు "రోడ్డు వేస్తే మంచిదే" అన్నారు.

ప్రతీ సంవత్సరం ఆ ప్రాంతం నుండి తేనే తీసే సమయానికి ఎలుగుబంట్లను అక్కడి నుండి వెళ్లగొట్టాలి. అట్లా చేయడం కొంత కష్టం కూడా, ముఖ్యంగా పిల్లలున్న ఎలుగు బంట్లు, అప్పుడే ఈనిన ఎలుగు బంట్లు మరీ ప్రమాదకర మైనవి, గతంలో

వాటిని అక్కడి నుండి వెళ్లగొట్టడానికి జరిగిన ప్రయత్నంలో గాయపడ్డవారు ఉన్నారు, ఒకరిద్దరు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. పైగా ఈ వయస్సులో తాము గుట్టఎక్కడమే గగనం, ఇక తెట్టుబండ పైకెక్కి, తాళ్ళ సాయంతో వేలాడుతూ, కమ్మకత్తితో రాలగొట్టటం తమ శక్తికి మించిన పని. కావున తెట్టు గుట్ట పైకి రోడ్డు వేస్తే బాగుంటుందని భావించారు మరి కొందరు.

ఇదే అదనైయిన సమయం అని పంచువు ఓదేలు రెండు తెల్లకాగితాలు, ఒక ఇంక్ ప్యాడ్ తీసుకువచ్చి, అమాయకులైన తెనుగు వారి మరియు వారి భార్యల వేలి ముద్రలు తీసుకున్నడు. వాటిపై కొందరు గొల్ల, కుర్మల వేలి ముద్రలు కూడా తీసుకున్నడు.

ముగ్గురు తెనుగు పెద్దమనుషులు మాత్రం వేలి ముద్రలు వేయడానికి నిరాక రించినారు. అందులో పాత కాలంలో పంచువుగా పని చేసిన కొంకటి మదనయ్య ఒకడు.

అతనికిప్పుడు డెబ్బయి ఎనిమిది సంవత్సారాల వయస్సు. ఈ చాదస్తపు ముసలోళ్ళు ఒప్పుకుంటేంది, ఒప్పుకోక పోతేంది అనుకున్నారు తరువాత తరంవారు.

ఆ వేలి ముద్రల కాగితాలను, అంతకు ముందు గ్రామ పంచాయతీ గ్రానైటు క్వారీకి అనుమతిస్తూ చెసిన దానికి జత పరుస్తూ యం.ఆర్.ఓ. కు పంపిందు గ్రామ సర్పంచు. అది కలెక్టరు ద్వారా మైనింగ్ కార్యాలయానికి అటు నుండి ప్రాంతీయ మైనింగ్ డైరెక్టరు గారికి పంపినారు. నూటాయాభై ఎకరాల గుట్టలో ఇరవై ఎకరాలు తెట్టుగుట్టను, నాలుగు లైసెన్సులుగా విడగొట్టి, ఒక్కొక్కటి ఐదు ఎకరాల వంతున ఒకే గ్రానైటు క్వారీ కంపెనీకి ముప్పై సంవత్సరాలకు లీజుకు ఇచ్చినారు, మైనింగ్ అధికారులు.

తెట్టుగుట్ట ధర్మారానికి ఆరకిలో మీటరు దూరంలో ఉత్తరం వైపున వుంటుంది, అది తూర్పువైపున భూమట్టానికి ఎగుడుగా ప్రారంభమై, పడమరకు పొయే వరకు వంద అడుగుల ఎత్తు వరకు వుంటుంది. దానికి ఉత్తరం వైపున ఎత్తైన బండలు గోడ పెట్టినట్టుగా వుంటాయి. దక్షిణం వైపున కొద్దిగా ఎత్తు తక్కువగా వుంటుంది, ఆ గుట్టనిండా సీతాఫలాల చెట్లు, తునికి చెట్లు, మంగచెట్లు, అందుగ, కానుగ, రకరకాల దట్టమైన పొదలు ఆవరించు కొని వుంటాయి.

సీతా ఫలాలను ఆ ఊరి తెనుగు వారు జగిత్యాల, సిరిసిల్ల. వేములవాడ, మరియు కరీంనగరం మార్కెట్లలో అమ్ముకొంటారు. ఆ విధంగా సంవత్సరానికి ఒక్కోకుటుంబం పదివేల రూపాయల వరకు సంపాదిస్తారు.

ఆ గుట్టపై గల మోదుగు, తునికి ఆకులను సేకరించి ఉపాధి పొందుతారు కొందరు ఆడవాళ్లు. గుట్టలో అక్కడక్కడా నల్లశానపు బండల మధ్య సహజసిద్దమైన నీటి బుగ్గలు

వుండి ఏ కాలంలోనైనా గుట్టమీది జీవజాలాలకు త్రాగునీటినందిస్తాయి, సంవత్సరం అంతా ఈ గుట్ట పచ్చగా వుండి చూపరులను ఆకర్షిస్తూ వుంటుంది వర్షకాలంలో కురిసిన వాన నీటితో గుట్టకు ఉత్తరాన, మరియు దక్షిణాన వున్న రెండు చెరువులకు నీటినందిస్తూంది. ఆ చెరువుల నుండి బయలు దేరిన ఒర్రెలు ఆ గ్రామానికి ఉత్తరాన గల చిల్వకోడూరు చెరువును చేరుకుంటాయి, ఆ చెరువు నుండి బయలు దేరిన అలుగులు ఆ వూరిప్రక్కనే ప్రవహిస్తూ ఉన్న పెద్ద వాగులో కలుస్తాయి. ఆ పెద్దవాగే కోటి లింగాల వద్ద గోదావరిలో కలుస్తుంది. దక్షిణ దిక్కున బతికెపల్లి, బూరుగుపల్లి చెరువులను నింపుతూ చిన్న నదిగా మారి రామడుగు నగునూరు, ఇరుకుల్లల మీదుగా ప్రవహించి చేగుర్తి వద్ద మానేరులో కలుస్తుంది ఇరుకుళ్ళవాగు.

ఓ మంచి ముహూర్తంలో ఒక ఎర్త్‌మూవింగ్ మిషన్ రోడ్డును తూర్పు వైపునుండి తేనె తెట్టుబండల వైపు రోడ్డును వేయడం ప్రారంభించింది. పది రోజుల్లోనే తేనెతెట్ల గుహల వరకు రోడ్డు పని పూర్తి అయిపోయింది. ఆ క్రమంలో వున్న పెద్దపెద్ద రాళ్ళను తొలగించగా ఆ రాళ్ల మధ్యన వున్న సహజ జలాశయాలు పూడిపోయినయి.

అడ్డంగా వున్న రాళ్లను బ్లాస్టింగ్‌లతో తొలగించినారు. బ్లాస్టింగ్ దెబ్బలకు భయపడిన ఎలుగు బంట్లు, కోతులు మొదలగు అడవి ప్రాణులు గ్రామంపై పడటం జరుగుతున్నది. నీటికై పంటపొలాలను ఆశ్రయిస్తూవున్నాయి. వందల కొద్ది కోతులు ఆ గ్రామస్తులే తమ ఆవాసాలను నాశనం చేస్తున్నారను కొన్నయేమో ఆ గ్రామంపై బడి ప్రతీ ఇంటి గూనపెంకలను పగుల గొట్టినాయి. వారి ఇండ్లలోనికి జొరబడి నానా అల్లరి చేసేవి. ఆ గ్రామాన్నే కాక చుట్టు పట్ల గ్రామాల్లోకి కూడా వెళ్ళి నాన గొడవ చేసేవి. వాటి బాధ పడలేక వారు పగిలిన గూనపెంకల స్థానే సిమెంటు రేకులు ఇంటి కప్పులుగా వేసుకున్నారు. దానికి దాదాపుగా ఇంటికి ఒక్కంటికి ఇరవై వేల నుండి ముప్పై వేలు ఖర్చు అయినాయి. కోతుల దాడిలో కొందరు గ్రామస్తులు, పిల్లలతో సహా మహిళలు కూడా గాయాలపాలైనారు.

ఒక చిన్న కంట్రాక్టరు తన సైకిల్ మోటారు పై ఆ గ్రామం గుండా పోతుంటే ఓ కోతి ఆయన వాహనం కింద పడి చచ్చిపోయింది. హనుమంతుని ప్రతి రూపమైన కోతి తన వాహనం కింద పడి మరణించినందుకు పాప పరిహారార్థం ఎక్కడైతే ఆ కోతి చనిపోయిందో అక్కడ చిన్న స్మృతి చిహ్నంగా కోతి విగ్రహన్ని కట్టించిండు.

ఒక్కకోతి చనిపోతే దానికి గోరి కట్టిన ఈ మానవులు వందల కొలదిగా, కోతులు, అడవి జంతువులు, నెమళ్లలాంటి పక్షులకు. రకరకాల. జంతు, వృక్ష జాలానికి ఆశ్రయమిస్తువున్న గుట్టల నరికి వేతను అడ్డు కోవాలనే ఆలోచన చేయక పోవడం దారుణం.

# 6

తేనెతెట్టు గుహ వరకు రోడ్డుపని అయిపోయిన తరువాత కూడా ఇంకా పడమటి వైపు రోడ్డుపని కొనసాగించడం చూచి కలవర పడిన తెనుగు వారు కొందరు ఇంకా రోడ్డుపొడగించడం ఎందుకని సందేహ పడ్డారు.

తేనెబండలకు ఎగువభాగాన పడమరవైపున వున్న గుట్ట పైభాగాన, సుమారు నాలుగు ఎకరాల ప్రాంతాన్ని యంత్రాలతో చదును చేయడం చూచినారు. చదును చేసిన ప్రదేశంలో షెడ్లు నిర్మించడం మొదలు పెట్టినప్పుడు కాని గుట్టను క్వారీగా మార్చుతున్నారని వారికి అర్ధమైంది, దాంతో కొందరు తెనుగు వారు వారి పంచువును నిలదీశారు.

"పైనేం జరిగిందో నాకేంతెలియదని" పంచువు ఓదేలు బూకాయించిండు.

ఇంకో నాలుగైదు రోజుల్లో ఆమావాస్య వస్తుంది ఈ లోగానే తేనెను దులపాలని తెనుగు కుటుంబాల వారు సన్నాహాలు మొదలు పెట్టింగ్రు.

గ్రామానికి చెందిన యువకులంతా దుబాయికి వెళ్లినందున, వారి సమీప గ్రామాల నుండి బంధువుల యువకులను ఈ సారికి సహాయంగా పిలుపించు కున్నారు.

అంతకు ముందు తమ దేవత యైన తేనెబండ పై గల పెద్దమ్మ గుడికి బోనాలతో జాతర చేసినారు. నాలుగు గొర్రె పోతులను పెద్దమ్మతల్లికి బలి ఇచ్చి జాతర చేసికున్నారు. ఆ సందర్భంగా ఆ కులస్తులంతా ఆ గుట్ట వద్దనే వంటలు చేసికొని, దేవతకు నైవేద్యంపెట్టి తమ తేనేతీసే కార్యక్రమాన్ని, తమ పిల్లాజెల్లలను చల్లంగా చూడమని ప్రార్థించినారు. వారి పూజారులైన దుబ్బులవాళ్లతో పెద్దమ్మ కథను చెప్పించుకొని, వారిని ఘనంగా సన్మానించి సాగనంపినారు.

మరుసటి రోజుఅందరికందరు, తేనెతీయటానికి అవసరమైన తాళ్ళు, చిక్కాలు, పొడవాటి కమ్మకత్తులు, వలలతో, మగవారు ముందు నడువగా వారి వెంట స్త్రీలు సీమెండి తట్టలతోను, గంజులతోను, ప్లాస్టిక్ గోనె సంచులతో కుట్టబడిన పెద్ద చాపలతో వారి ననుసరించారు. అందరూ దొడ్డుగా నున్న నల్ల గొంగళ్ళను దట్టంగా చుట్టుకున్నారు. ప్రొద్దుటే గుహలోనికి వెళ్ళిన కొందరు పచ్చి కట్టెలతో పెద్ద పెద్ద చీపుర్ల లాంటి మోపులను వెలిగించి, పొడవాటి గయిలతో తేనెతుట్టెలకు పొగ తాకు నట్లుగా చేసింగ్రు. గుహలో పెద్దపెద్ద మంటలు వేసి తేనెటీగలను చెదరగొట్టింగ్రు. దానితో ఆ ప్రాంతమంతా తెనెటీగలు చిందర వందరగా తిరుగుతూ క్వారీ పని వారిని కుట్టసాగాయి. వారు గబగబా తమ పనిని వదలి వారికి కేటాయించిన షెడ్డులోనికి దూరింగ్రు.

కొందరు అనుభవం వున్న వారు, యువకులు గుట్టకు ఉత్తరం వైపునుండి తెట్టుగుట్టను ఎక్కి గుట్ట పైన వున్న చిన్నసైజు పెద్దమ్మగుడికి చేరినారు. ఆ చిన్నగుడికి తాళ్ళను ఒక చివర చుట్టి, ఆ తాటిని గుహకు అభి ముఖంగా కిందికి జార్చినారు.

గుహ క్రింద వున్న యువకులు ఆ తాళ్లచివరన ఒక మనిషి కూర్చోవడానికి అనువుగా బలమైన కంక కట్టెలతో ఉయ్యాల లాంటిది కట్టినారు. ఆ కంక కట్టెల ఊయలలో ఒక యువకుడు దొడ్డు గొంగడి కప్పు కొని, పొడవాటి కమ్మకత్తిని నడుము కున్న రుమాలుకు గట్టిగా కట్టుకున్నాడు. ఆ యువకుడు ఆ కంక కట్టెల ఊయల్లో కూర్చోగానే కొండ పైనున్న వారు తాడును పైకి లాగి, ఆ తొట్టిలో కూర్చున్న యువకుడు క్రింద వున్న గుహముఖద్వారానికి వేలాడునట్టుగా తాడును ఇగ్గి పట్టుకున్నారు.

అప్పుడు ఆ యువకుడు కొండ కొమ్ము నుండి వేలాడుతూ, పొడవాటి ఈటెను ధరించిన, పెద్దదేదో పక్షి ఆ గుహముందు గిరికీలు కొడుతున్న తీరు వేలాడుతున్నాడు. ఇంతలో కొండ పైనున్న వారు మరో తాడును ఆ వేలాడి గుండ్రగా తిరుగుతున్న యువకుని వైపు విసిరినారు. ఆ యువకుడు ఒడుపుగా ఆ రెండవ తాడును అందుకొని గట్టిగా పట్టుకొన్నాడు. అటుఇటు ఊగకుండా రెండవ తాడును కూడా మొలకు చుట్టు కొన్నాడు.

అప్పుడు మొలకు కట్టుకున్న కమ్మకత్తిని రెండు చేతుల్లోనికి తీసుకొని గుహకు అభిముఖంగా వేలాడుతూ, గుహలోనికి చొప్పించి నెమ్మదిగా ఒక్కొక్క తేనెపట్టును కోస్తూఉన్నాడు. ఆ గుహలో క్రింది బాగాన నిలుచున్న స్త్రీలు నలుగురు తాము వెంటతీసుకువెళ్లిన ప్లాస్టిక్ చాప నాలుగు అంచులు పట్టుకొని పైన కోస్తున్న తెనెపట్టులు క్రిందపడకుండా పట్టుకుంటున్నారు. అలా పట్టుకున్న తెనెతెట్టులను కొందరు స్త్రీలు తీసుకొని తాము వెంట తెచ్చుకున్న సీమెండి గిన్నెలలోను గంజులలోను వేసి ఖాళీ అయిన చాపలను మళ్ళీ యువతులకు ఇస్తున్నారు. వాటిని తీసుకున్న యువతులు, మళ్ళీ ఒక కొత్త తేనె పట్టుకింద చాపను పట్టుకోగా, తాడుపైన వేలాడుతున్న యువకుడు, ఆ పైన వేళాడుతున్న తేనె తెట్టును కోయడానికి ఉద్యమిస్తున్నాడు. పది తుట్టెలను కొట్టే సరికి ఆ యువకుడు అలసిపొయిండు. గుట్టపైన తాడు పట్టుకొని వున్న వారు ఆ త్రాడును, స్త్రీలు వున్న గుహా అడుగు వరకు జార విడిచి, ఆ యువకుడు దిగినాక, ఇంకో యువకుడు, ఊయలలో కమ్మకత్తిలో సహకుర్చున్నాక ఆదే తాడు సహయంతో గుహముఖద్వారానికి వేలాడస్తున్నారు. ఈ విధంగా దాదాపు పదిహేను మంది యువకులు దాదాపు నూటాయ్యాబై వరకు వున్న తేనె తెట్టులను క్రిందికి కోసినారు.

తమ శ్రమశక్తితో ప్రోది చేసిన తేనెను దొంగిలిస్తూ వున్న మానవులపై తీవ్రమయిన దాడి చేస్తూ, రొదపెడుతున్నాయి. అందిన వారిని అందినట్లుగా కుట్టినై.

వసంత కాలంనుండి ఆ గుట్టచుట్టూ వున్న వందల ఎకరాల మామిడి, చింత, బత్తాయి తోటల పూలనుండే కాక, వేప మరియు ఇతర చెట్ల నుండే కాక రకరకాల అడవి చెట్ల పూవులనుండి, పూవులకు తెలియకుండా దొంగిలించిన తెనేను కాపాడుకోవడానికి మానవునితో పోరాడి ఓడిపోయినాయి. తుదకు మానవుని చోరకళకు, వేట కౌశలానికి వోడిపోయి ఆ ప్రాంతమంతా చెల్లాచెదరైనాయి పాపం తేనెటీగలు.

తేనెటీగలు ఆ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నవి. జగిత్యాలలో ప్రత్యేకంగా మామిడి, సీతాఫల, బత్తాయి మరి ఇతర రకరకాల పండ్ల మార్కెట్టుకు ప్రసిద్ధి చెందటానికి ఈ తేనెటీగలే కారణం.

ఒక్క రెండు తేనెతుట్టెలను ఆ ఈగలకు కృతజ్ఞతగా వదలివేసినారు ఆ వేటగాళ్ళు. చీకటి పడుతున్న సమయానికి విజయ దరహాసాలతో ఇంటి దారి పట్టినారు. ఆ రాత్రే వారు వారి వీధిలోని పెద్దమ్మగుడి మంటపానికి చేరినారు, అక్కడ మొత్తం తేనెను తెట్టుల నుండి పిండి దాదాపు ఇరవై శేర్ల తేనెపట్టగల ఆరవై రెండు గంజులలో నింపినారు. మిగతా ఇరవై శేర్ల తేనెను సీసాలలో నింపి రివాజుగా అధికారులకు నజరానా కొరకై తమ కుల పెద్ద వద్ద వుంచినారు. వారికి సహాయంగా వచ్చిన వారి బంధు యువకులకు ఒక్కొక్కరికి ఐదు శేర్ల చొప్పున తేనెను ఇవ్వగా వారు ఆనందంగా తీసుకున్నారు. మిగతా ఒక్కొక్క గంజును ఒక్కొక్క కుటుంబం వారు తీసుకున్నారు తమ వంతుగా. పంపకాలైన తరువాత స్త్రీలంతా తమతమ తేనెను తీసుకొని ఇంటికిపోగా, పురుషులంతా పిల్లలతో సహా గౌండ్ల వాడకు వెళ్ళినారు.

తెల్లవారగానే ఆడవారు తేనెను కొద్దిగా కాచి శుద్ధిచేసి తమ ఇంట్లోవున్న లీటరు సీసాలలోకి తేనెను నింపినారు.

ధర్మారంలో తేనెను దులిపినారన్న వార్త తెలిసి, కరీంనగరం, జగిత్యాల. సిరిసిల్ల, వేములవాడ, గంగాధర, పెగడపల్లి, మండల ధర్మారం, వెల్గటూరు ధర్మపురి మొదలగు ప్రాంతాలనుండి చాలా మంది ఆయుర్వేద వైద్యులు వంశపారంపర్యంగా ఏండ్ల తరబడి వారు కొంటున్న తెనుగు కుటుంబాలనుండే వారికి కావలసిన స్వచ్ఛమైన తేనెను కొనుగోలు చేసినారు. వారి తదుపరి అవసరాలకు గాని, లేదా తమకు డబ్బులు అవసరమైనప్పుడు అమ్ముకోవడానికి మిగతా తేనెను తమ ఇంటిలోనే దాచుకున్నారు. ఆ ఊరి తెనుగు ఇండ్లలో సంవత్సరం పొడుగుతా ఎవరిదగ్గరో ఒకరి దగ్గర తప్పక తేనె దొరుకుతుంది.

# 7

తెనుగు వారు, గొల్ల, కురమ పెద్దలు తమ గుట్టను క్వారీకి ఇస్తే తమతమ కుల

కశిపికి ముప్పేనని తలచినారు. కావున అందరకి అందరూ కలసి సర్పంచు దొరను అడుగాలనుకున్నారు.

ఒక నాడు సర్పంచు గ్రామానికి వచ్చింది చూచి, అందు బాటులో ఉన్న గొల్ల, కురమ, తెనుగు వారు వారి స్త్రీలతో సహా దొర ఇంటిముందు గూమి కూడినారు.

వారందరిని చూచి ముఖంమాడ్చిన జనార్ధన రెడ్డి "ఎందు కచ్చినట్లు" అన్నాడు.

దానితో తెనుగు పెద్ద అయిన చేతి నర్సయ్య ముందుకు వచ్చి "దొరా! మీకు తెలియందేమున్నది, మన తెట్టుగుట్టను క్వారీకి ఇస్తిరి, మరి మేము సీతపలక పండ్లు ఏడ తెంపుకొవాలె" అన్నడు.

గొల్ల యాదయ్య అందు కొని "మా గొర్రె మ్యాకల్నేడ మేపుకొవాల్దొరా" అన్నడు.

దానితో దొర లౌక్యంగా "ఆ గుట్ట మనది కాదు గవర్నమెంటుది, ఆ గుట్టలో నున్న రాయంతా గవర్న మెంటు సొమ్ము. గవర్నమెంటు ఆ రాయిని అమ్ముకుంట మంటే మనం వద్దంటే కుదురుతుందా?ఆపడం మనతోనౌతుందా?" అన్నడు.

అప్పుడు రాయలింగు అనే నడీడు తెనుగు మనిషి "ఆయ్యా దొరా! మరి గుట్ట గవర్నమెంటుదే కదా మరే గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందని ఓదేలు చెప్పిండు దాని సంగతేంది దొరా" అన్నడు. .

దానికి జనార్దన రెడ్డి "ఒరే రాయలింగు మాకు గుట్టఅక్కర లేదని మీరే రాసిత్తిరి కదా, దానిని బట్టి మా గ్రామపంచాయితీకి కూడా అభ్యంతరం లేదని రాసినం" అన్నడు.

"మేం ఎప్పుడు మాకు గుట్టవద్దని రాసిచ్చినం దోరా" అన్నరు అమాయకంగా చాలా మంది. "నాకేం తెలుసు మీ పంచువు ఓదెలును అడుగుండ్రి అన్నడు జనార్దన రెడ్డి,

"ఒరే ఓదెలు !"అని రాయలింగు వెనుకకు తిరిగి చూచిండు, పంచువు ఓదెయ్య జాడలేడు, ఎప్పుడో చల్లగా జారుకున్నడు.

ఇక చేసేదేం లేక తమ ఖర్మఅనుకుంటూ వెనుకకు తిరిగి పోవడానికి తయారైండ్రు. వారిని స్త్రీలు అనుసరించిండ్రు.

వెనుకకు తిరుగుతూ, ఒక స్త్రీ కోపంతో పెద్దగా అరచింది. "అన్నల సంపనిత్తిమి, మన పోరగాండ్లనేమో దేశమెల్లగొడ్తిమి, లంజకొడుకులేమో వూళ్లమ్ముకోబట్టిరి. థూ వీళ్ల పుట్టుక పాడు గాను" కాండ్రకిచ్చి ఉమ్మేసింది. జనార్ధనరెడ్డికి కోపం వచ్చింది, కాని ఇది సమయం కాదని మౌనంగా ఉండి పోయిండు.

మరో రెండేళ్ళు గడిచే సరికి యునైటెడ్ స్టోన్ కంపెనీ వాడు ఆదే గుట్టకు మూడు మైనింగ్ యంత్రాలతో మొత్తం నూటిరవై ఎకరాల గుట్టను బ్రెడ్ ముక్కలు కోసినట్టుగా

పెద్ద పెద్ద ముక్కల క్రింద కట్ చేసి క్రేన్ల ద్వారా, పెద్దపెద్ద బల్లపరుపు లారీలకు ఎత్తి విదేశాలకు, ముఖ్యంగా చైనాకు ఎగుమతి చేసింద్రు. ఇక గుట్టంత అయిపోవచ్చింది. దానితో ఆ కంపెనీ భూగర్భం లోనికి వెళ్ళి బండలను అధునాతన యంత్రాల సహాయంతో కట్ చేసి బయటకు తీస్తున్నది. అంతకు ముందు గుట్టను కోయగా మిగిలిన చిన్న బండ ముక్కలను, మట్టిని, గుట్టకు ఆనుకొని ఉన్న చెరువు శిఖంలో పారపోయడం మొదలు పెట్టింది. అక్కడ చిన్నచిన్నరాళ్ళు, మట్టి చిన్నసైజు గుట్టలాగ పేరుకు పోయింది.

కొందరు గ్రామస్తులు కంపెనీ చెరువు శిఖం భూమిని ఆక్రమించిందని పై అధికారులకు ఫిర్యాదు చేసింద్రు. కంపెనీ వారితో ములాఖత్ అయిన అధికారులు పట్టించు కోలేదు. ఎందు కైనా మంచిదని కంపెనీవాడు ఆ శిఖం భూమిని ఆనుకొని వున్న, లక్ష రూపాయిల విలువ చేయని అసైన్డు భూమికి ఎకరాకి మూడు లక్షల రూపాయిలిచ్చి, దాని పట్టా దారుచే రాజీనామా చేయించి, అట్టిభూమిని గవర్నమెంట్ వద్ద అధికారికంగా ముప్పై సంవత్సారాల లీజుకు తీసుకున్నారు. దానితో శికం భూమి కాస్తా వాడి హక్కు భుక్తం అయింది.

గుట్ట భూస్థాపితమైనప్పటి నుండి వర్షాకాలంలో గుట్టనుండి వచ్చు నీటి ఒరవడి లేక చెరువు నిండ లేదు. మిగతా రైతులు ఇబ్బంది పడ్డారు. గుట్ట దాదాపు ఖతం అయి భూగర్భం లోనికి వెళ్ళి మైనింగ్ చేయడం వల్ల క్రమంగా వ్యవసాయ బావులు, ఊరిలో వున్న మంచి నీటి చేదబావుల నీళ్ళు అడుగంటినై, దానితో రైతులు బోరుబావులు త్రవ్వడం మొదలు పెట్టినారు, కొంత కాలానికి అవి కూడా నీరందించని పరిస్థితి ఏర్పడింది.

ఈ లోగా గ్రామానికి పడమటి దిక్కున అరవై మీటర్ల లోతున గోదావరి వరద కాలువ తవ్వడం వల్ల పడమటి నుండి వచ్చు భూగర్భ జలాల జాడ లేకుండా పోయినాయి. ఒకప్పటి సాంప్రదాయ వ్యవసాయం పూర్తిగా దెబ్బతిన్నది. ఈ పరిస్థితుల్లో పూర్వపు తరిభూములలో వాణిజ్య పంట అయిన ప్రత్తి పండించడం మొదలు పెట్టినారు, దానితో పాటు గ్రామం లోని యువ శక్తి అంతా వలసల బాటపట్టడంతో వ్యవసాయం భారమౌతుంది. ఈ పరిస్థితులను ముందుగా గ్రహించిన ధనిక రెడ్డి, కాపు రైతులు తమ భూములను క్రమంగా అమ్మకానికి పెట్టినారు అట్టిభూములను మొదటగా వలస బాటపట్టి, కొద్దో గొప్పో సంపాదించిన గొల్ల, తెనుగు, కుర్మలు అధిక ధరలకు వారి భూములను కొన్నారు.

అట్టిభూములు అమ్మిన ధనిక రైతులు ఆ డబ్బు తోనే జగిత్యాల కరీంనగరం హైదరాబాలలో బ్రాందిషాపులు, రియల్ ఎస్టేటు మరి ఇతర వాణిజ్య వ్యాపారాలవైపు మళ్ళినారు. గ్రామాన్ని వదలినారు.

ఇటు మొదటగా అరబ్బు దేశాల కంపెనీలలో ఉద్యోగాలు పొందిన కుటుంబాల

వారు లోగా తెచ్చిన అప్పులు తీర్చగా, కొత్త అప్పులతో భూములు కొన్నారు. బోర్లు వేసినారు, అంత చేసినా వారు కూడా చివరకు వారి భూముల్లో ప్రత్తి పండించి, ప్రతీ సంవత్సరం లాభనష్టాలతో కుస్తీలు పడుతున్నరు.

క్వారీ వల్ల గుట్టపోగా, భూగర్భ జలాలు అడుగంటడం వల్ల చుట్టుపట్ల గల వందల ఎకరాల మామిడి, బత్తాయి తోటలు ఎండి పోయినాయి. దానితో సంవత్సరం పొడుగూత ఏదో ఒక పండ్లను అమ్మి ఉపాధి పొందుతున్న తెనుగు కులాల వారికి పని లేక పొయింది. దానితో వారు ప్రత్తి చేలలో కూలి పనికి వెలుతున్నారు.

గుట్టలు ఉన్నప్పుడు ప్రతీ సంవత్సరం సీతా ఫలాలను, ఇటు తేనెతో పాటు మామిడి, రేగు, అడవి రేగు పళ్ళతోని జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగరం పట్టణాలలో అమ్ముకొని ఒక్కో కుటుంబం ఏటా దాదాపుగా ముప్పది వేల వరకు సంపాదించుకొని, నిశ్చింతగా పిల్లాజెల్లలతోను పండుగలు, పబ్బాలతో గడిపిన వారు నేడు దుర్భర దారిద్రం పాలైనారు.

ఇప్పుడు వారు పొరుగూరైన మ్యాడంపల్లి తెనుగు వారి నుండి పండ్లు ఫలాలు కొని మారు బ్యారం చేసుకోవలసిన దుస్థితికి నెట్టబడినారు.

అంతే కాక త్రాగటానికి కూడా నీరు కరువౌతున్న క్రమంలో ఒక రెడ్డి యువకుడు నీళ్లవ్యాపారం ప్రారంభించినాడు. ఆ శుద్ధి ప్లాంటుకు కావలసిన నీటిని మరో ఊరిలోని బోరుబావినుండి కొని టాంకర్ల ద్వారా తెస్తూవున్నాడు. త్రాగాటానికే దొరకని స్థితిలో ఆ గ్రామంలోని పశు సంపద అంతరించింది చివరకు ఆ గ్రామంలో పాడి పశువులు కూడా లేకుండా పోయినాయి. దానితో మరో చిరు వ్యాపారి పాలను జగిత్యాల డైరీనుండి ఊరికి సరఫరా చేస్తూన్నడు

గొల్లకుర్మలకు కూడా వారి సన్నజీవాలను మేపడానికి జాగాలు లేక, వాటికి మేతతో పాటు నీరుకూడా దొరకనందున, ఒకప్పుడు ఐదు వేల గొర్రెమేకల మందలన్నిటిని అమ్మి వేసినారు. మరో యువకుడు ఆ ఊరిలో మాంసం దుకాణం తెరిచినాడు. దానితో మిగిలిన గొల్ల కుర్మలు కూడా కూలిపనుల కోసం పట్టణాలకు వలస వెళ్ళినారు.

క్వారీలో నిత్యం జరుగుతున్న బ్లాస్టింగ్ వల్ల వారి ఇండ్లగోడలన్ని బీటలు వారి కూలడానికి సిద్దంగున్నయ్, ఆ ఊరి మధ్య గుండా నిర్మించిన కాంక్రీటు రోడ్డు ఎతైయి ఇండ్లు పల్లం పాలైనాయి. వాస్తు ప్రకారం ఆ లాంటి ఇండ్లళ్ళో ఉండకూడదన్న కారణంగా వారు కొత్త ఇళ్ళ నిర్మాణాలు మొదలు పెట్టినారు. కాని ఆ ఊరిలో యువ శక్తి లేనందున. మరియు కొత్త కాంక్రీటు ఇళ్ళనిర్మాణ నైపుణ్యం వారికి లేనందున ప్రకాశం జిల్లా నుండి వచ్చిన గృహ నిర్మాణకార్మికులు, మేస్త్రీలు దాదాపు నలభై మంది ఆ ఊరిలో ఇళ్ల నిర్మాణాలకు పూనుకున్నారు. వారంతా ప్రకాశంజిల్లా చీమకుర్తి, పాణ్యం మొదలగు

ప్రాంతాల్లో జరుగుతున్న మైనింగ్ గనుల వల్ల తమతమ గ్రామాల్లో ఉపాధులను కోల్పోయిన వారే కావడం విషాదం.

గల్ఫ్‌కు పోయినవారు పంపే పైసలతోనే, వారి కుటింబీకులు రోజువారి ఇంటి అవసరాలు సర్దుతున్నరు. దానికి తోడు రోగాలు, రొస్టులకు కూడా చాలా పైసలు ఖర్చౌతున్నయి, పైగా కొత్తగా కొన్న పొలాలకు, వేయించిన బోర్లకు చేసిన అప్పులతో సతమతమౌతున్నారు.

ఇక విజిటింగ్ వీసాలపై పంపబడిన యువకుల పరిస్థితి మరింత దయనీయంగా ఆ దేశాలలో తయారైంది. అక్కడ వారికి సరియైన ఉపాధి లేక, వీసాల గడువు పూర్తి అయినందున, ఆయా దేశాలలో వారు నేరస్తులుగా బ్రతుకుతున్నారు.

వారికి అక్కడ సరియైన నివాసాలుగాని, వైద్య సదుపాయాలు గాని పొందలేరు. ఆ పరిస్థితుల్లో వారు ఇక్కడి రోజూ కూలీల కంటే కూడా తక్కువ ధరలకు తమ శ్రమశక్తిని అమ్ముకుంటున్నారు. క్రమంగా "కలివేళ్ళ" జీవితాలకు బలియైనారు. వారికి వచ్చే అదాయం వారి కనీస అవసరాలు తీర్చడం లేదు. కావున వారు ఇంటికి పైసలు పంపేదేంలేదు.

వారు ఇక్కడికి తిరిగి రావాలన్నా వారి వీసా, పాస్ పోర్టులు చెల్లవు. ఇట్టి స్థితిలో వారు అక్కడి ధూర్త, అత్యాశాపరుల పాల బడి కొన్నిసార్లు ఉచిత పనులు కూడా వారి తాత్కాలిక యజమానులకు చేయాల్సి ఉంటుంది. దీనితో ఇద్దరు ముగ్గురు యువకులు అక్కడి జైల్లపాలైనారు.

అట్లు సౌదీలో రాజపోచం ఒక గొర్రెల యజమానికి గొర్రెల మేపడానికి కుదురుకున్నాడు. అతనికి తన గొర్రెలను ఆ ఎడారిలో మేపడానికి అవసరమైన పొడవాటి బూట్లను, చలి నుండి కాపాడు కోవడానికి కోటు, ఒక ఉన్ని దుప్పటి ఇచ్చి ఎడారిలోనికి పంపిండు యజమాని.

ప్రతీ శుక్ర వారం నాడు, వారానికి సరిపడా తిండికి కభూస్ రొట్టెలు, ఎండలలో నీరు త్రాగడానికి, పది లీటర్ల నీటి క్యానును ఒక్కటి మాత్రం రాజపోచానికి, ఆ యజమాని ఇచ్చేవాడు. ఆ ఏడారిలో ఏలాంటి స్నాన సదుపాయాలు లేక తీవ్రమైన ఎండలకు, చలికి ఇరవైఐదు సంవత్సరాల యువకుడు యాభైసంవత్సరాల ముసలివాడుగా ఐపోయిండు, తన మొఖాన్ని అద్దంలో చూచుకొడానికి కూడా లేదు. ఈ విదంగా చాలిచాలని జీతంతోను, అతి భారంగా ఐదు సంవత్సారాలు గడిపిండు.

అతనికి, ధర్మారంలో చిన్నప్పుడు తమ కుటుంబానికి వున్న గొర్రెల మందను ఏ విధంగా కాసింది, తన గ్రామీణ గొల్ల జీవితం పదేపదే యాది చేసుకొని, ఇక్కడి తలరాతకు విచారించేవాడు. పదేపదే తన భార్యా. పిల్లలు గుర్తుకు వచ్చేవారు మానసిక రందితోను,

తీవ్రమైన చర్మరోగానికి బలైన రాజపోచం ఇక పని చేయలేని స్థితికి చేరినాడు. అతని యజమాని ఇంకో యువకుడిని తన గొర్రెల కాపరిగా నియమించు కొని, ఐదు సంవత్సరాలుగా చాలా నమ్మకంతో పని చేసిన యువకుని పట్ల కొంత ఔదార్యంతో ఇంటికి పంపించినాడు. అతడు తన తిరుగు ప్రయాణ సమయంలో అక్కడి ఏర్ పోర్టులో దాదాపు ఐదు సంవత్సరాల తరువాత మొదటిసారి తన మొఖం అద్దంలో చూచు కొని కళ్ళనీళ్ళు పెట్టుకున్నడు.

ఇక్కడికి వచ్చిన తరువాత తాను సౌదీకి పోయిన అప్పుల క్రింద తమకు ఉన్న నాలు గెకరాల భూమిని అమ్మి వేసినాడు. ఇంకా కొంత మిగిలిన డబ్బుతో వైద్యం చేయించుకుని ఊరిలో ఏలాంటి ఉపాధి దొరకనందున కరీంనగరంలో ఒక ప్రవేటు కాలేజీ హాస్టల్లో వంట వాడికి సహాయకుడిగా నెలకు పదిహేను వందలకు పని చేయడం మొదలు పెట్టిండు. అతని భార్యాపిల్లలు, తల్లితండ్రులు గ్రామంలోనే ఉండిపోయారు. ఒకప్పుడు వంద గొర్రెలతో నాలుగు ఎకరాల భూమితో ప్రశాంత జీవితం గడిపిన ఆ కుటుంబం నేడు కేవలం రెక్కల కష్టం పై, ఏ మాత్రం రేపటి జీవితంపై భరోసా లేని దుర్భర దారిద్రానికి నెట్టివేయబడినారు

ఇక చిన్న కూమారస్వామిది మరో విషాద గాథ! కూమారస్వామి విజిటింగ్ వీసాపై ఖతార్ దేశానికి వెళ్ళినాడు. అక్కడ ఏ ఉద్యోగం లేనందున “కలివెళ్ళి” కూలీగా పని చేయసాగిండు. అతని సంపాదన అతని ఖర్చులకే సరిపోనందున గత నాలుగు సంవత్సరాలుగా సంపాదించింది ఏంలేదు. ఓ రోజు కూలీగా ఓ బహుళ అంతస్తూ నిర్మాణంలో పని చేస్తూ ఉండగా, ఎక్దమ్మున ఛాతిలో విపరీతమైన నొప్పితో మెలికలు తిరుగసాగిండు. ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపే మరణించినాడు.

అక్కడ పని చేస్తూన్న ఇతర ప్రవాస భారతీయులు ముఖ్యంగా తోటి తెలంగాణా వారు తలా కొన్ని రియాళ్ళు వసూలు చేసినారు. అవి దాదాపు ఇక్కడి లక్షరూపాయిలతో సమానం. అవి కుమారస్వామి మృత శరీరాన్ని స్వంతూరుకు పంపడానికి సరిపోతాయి.

అవి పోగుచేయడంలో ప్రముఖపాత్ర వహించిన పెద్ద ఒకాయన ధర్మారం లోని కుమారస్వామి భార్య నరసమ్మకు ఫోన్ చేసి, కూమారస్వామి పోయినసంగతి చెప్పి, అతని శవాన్ని పంపటానికి లక్ష రూపాయలు ఖర్చు అవుతాయని, అంత వరకు తమ వద్ద పైసలు ఉన్నాయని, కాని ఒకవేళ ఆతనిని ఖాతర్లోనే ఖననం చేస్తే, ఆ లక్ష మీ కుటుంబ అవసరాలకు పంపిస్తామని, లేకుంటే అదే లక్ష రూపాయిలతో అతని శవాన్ని పంపిస్తామని చెప్పిండు. ఆమాట విన్న నరసమ్మ కుప్ప కూలింది. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. మొన్ననే ఫోన్ చేసి వచ్చే వేసవిలో నేను తప్పక తిరిగి వస్తాను అనిచెప్పిన

మాటలను పదేపదే తలచుకుని ఏడ్చింది

చివరకు కూడదీసుకొని "లక్ష వద్దు మన్ను వద్దు కడసారి చూపులకు తన మగడి శవం కావాలని" అరచింది. గ్రామస్తులెవరికి కాదనే చెప్పే ధైర్యం లేక పోయింది. ఐదు నెలలకు అతని శవపేటిక వారి ఇంటికి వచ్చింది. ఐదు నెలలుగా ఆతనిభార్య పిల్లలు, అతని తల్లి తండ్రుల దుఖం ఆగింది లేదు. శవం వచ్చిన రోజు, వారి బందు మిత్రులు, ఊరిలోని సమస్త జనం వారి ఇంటి ముందు పోగయ్యింద్రు. తమ గ్రామానికేదో శని పట్టిందని అందుకు కారకులైన పెద్దలను కసితీరా తిట్టిపోసింద్రు. ఆనాడు శవానికి అంతిమ క్రియలు జరిగే దాక ఎవరు నోట్లో మంచినీళ్లు కూడ పోయలేదు.

విజిటింగ్ వీసా మీద దుబాయ్ వెళ్ళిన చిన్న మైసయ్య అనే బెస్త యువకునిది మరో కథ!

అతను దుబాయికి వెళ్ళిన సంవత్సరం వరకు ఇంటికి అప్పుడప్పుడు ఫోన్ ద్వారా క్షేమ సమాచారాలు తెలిపేవాడు. ఆతడు పోయిన దసరానాడు ఆయన తన తల్లి, తండ్రులతోను, భార్యతోను, పిల్లల తోను మాట్లాడినాడు. ఆతను వెళ్ళే నాటికి అతని భార్య గర్భవతి, అతను అక్కడికి వెళ్ళినంక ఆడపిల్ల పుట్టింది. అంతకు ముందే అతను ఇద్దరు మగ పిల్లల తండ్రి. అందరిని పలుకరించినాడు, అదే అతని నుండి చివరి ఫోన్, తరువాత ఏ సమాచారమూ లేదు. అతను ఏమైంది ఎవరికీ తెలియదు.

ఆ కుటుంబీకులు మాత్రం ఎప్పటికైనా వస్తాడనే గంపెడాశతో, కొండకు ఎదురు చూస్తున్నట్లు ఎదిరి చూస్తూనే ఉన్నారు!

# 8

తెట్టు గుట్టను క్వారీ కొరకు తీసుకున్నప్పుడు. క్వారీ యాజమాన్యం ఊళ్లో చాలా మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేసినారు. కాని ఆ ఊరి వాళ్ళకు పది మందికి కూడా ఉద్యోగాలు రాలేదు. ఆదీ కూడా మజ్దూరు ఉద్యోగాలు మాత్రమే. ఒక్క రెడ్డి యువకునికి మాత్రం సూపర్‌వైజరు పని ఇచ్చినారు ఆదీ సర్పంచు దగ్గరి బంధువు కావటాన్నే. ఇంకొద్ది మంది నిపుణులైన పని వారంతా తమిళులే. వారు వారి కుటుంబాలను తమిళకాలనీలో ఉంచి వారాంతానికి అక్కడికి వెళ్ళి వస్తుంటారు. వారో పదిహేను మంది దాకా ఉంటారు. వారుకాక మిగతా అన్‌స్కిల్డు వర్కర్లంతా సుమారుగా ఇరవై మంది ఉంటారు. వారంతా బండలను కోయడంలోను, బండలకు డ్రిల్లింగ్ చేయడం, యంత్రాలను శుభ్రపరచుటకు మరియు క్వారీని సంబంధించిన ఇతర సహాయక పనులలో వినియోగిస్తారు.

వారిని ఒరిస్సా లోని మల్కన్ గిరి, కాలహండి జిల్లాల నుండి సంవత్సరానికి ఐదు వేల రూపాయిలు అద్వాన్సు చెల్లించి తీసుకరాబడ్డవారు. ఇట్లా తీసుకురావడానికి కొందరు ఏజంట్లు ఉంటారు. ఒక్క వ్యక్తికి పది వేల రూపాయిలను ఏజంట్లకు ముట్టచెప్పుతారు క్వారీ యజమాన్యాలు. వారు సప్లయి చేసిన వారిలో సామాన్యంగా పన్నెండు నుండి పదిహేను సంవత్సరాల బాలురే ఎక్కువ. వారికొరకై ఆ క్వారీ వద్దనే పన్నెండు అడుగుల వెడల్పున ఇరవై అడుగుల పొడగున తడకలతో షెడ్లు నిర్మిస్తారు. ఆదే వారి నివాసం. వారికి మూడు పూటల అన్నం వండి పెట్టడానికి మరో ఇద్దరి గ్రామస్తులను యజమానులు నియమించు కున్నారు. వారికి రెండు డ్రస్సులు మాత్రం యజమానులు ఇస్తారు. వారి వద్ద ఇక ఏలాంటి పైసలు ఉండవు. వారికి ఇన్ని పని గంటలు అని లేదు. వారు కటిక నేలపైనే నిద్రించ వలసి ఉంటుంది. వర్షా కాలంలో వారి నిద్రించుటకు మాత్రం క్వారీ లోని కొన్ని పనికి రాని బండలతో రెండు గుహల లాంటివి క్రేన్ల సహాయంతో నిర్మించినారు. ఇంకో చిన్న రేకుల షెడ్డును వంటగదిగా ఉపయోగిస్తారు సామాన్యంగా సూపర్వైజర్లుకు, మిగతా తమిళ వారికి అక్కడే ప్రత్యేక వంటలు, టీలు సరఫరా చేస్తారు.

ఈ విధంగా వచ్చిన బాల కార్మికులను రాళ్లకు డ్రిల్లింగ్ వేయటానికి వినియోగిస్తారు. వారికి ఎలాంటి రక్షణ సాధనాలు ఇవ్వబడవు. దానితో వారు డ్రిల్లింగ్ చేయగా వచ్చిన దుమ్ముతో వారి శ్వాసకోశ వ్యాధుల పాలవుతుంటారు. ఆ క్వారీ పరిసరాలలో దుమ్ము, ధూళులతో జీవించడం తరచుగా రోగాలపాలై, సరాసరిన పది సంవత్సారాలు మాత్రమే పని చేయగలుగుతారు. తరువాత సిలికోసిస్ అనే ప్రాణాంతక వ్యాధి వారిని పట్టిపీడిస్తూ ఉంటుంది. అట్టి పరిస్థితుల్లో వారిని వారి ఊళ్ళకు పంపించి మరో కొత్త బ్యాచీలను తీసుకు వస్తారు ఏజంట్లు.

కొన్ని సార్లు జిలిటిన్ స్టిక్‌లు పేలి, మరి కొన్ని సార్లు బండలు మీద పడగా, బండలపై నుండి జారి పడగా గాయాల పాలైన వారికి ఏలాంటి నష్టపరిహారం చెల్లించ బడదు, ప్రమాదాలు జరిగి చని పోతే దాతు పిర్యాదు లేకుండా శవాన్ని మాయం చేస్తారు యజమానులు. ఆలా అర్ధాంతరంగా ముగిసిన జీవితాలు ఎన్నో, అటువంటి చావులను గవర్నమెంటు కార్మిక శాఖగాని, కార్మిక సంఘాలు కాని ఇంత వరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. కార్మిక సంఘాలు క్వారీలలో పని చేసే స్థానిక కార్మికులను మాత్రమే పట్టించు కుంటాయి కాని ఈ వలస కార్మికుల గురించి పట్టించుకోవు. అందులకు ఆయా ట్రేడ్ యూనియన్ నాయకులకు, వారి రాజకీయ పార్టీలకు యజమాన్యాలు చందాలు ఇస్తారు, కార్మిక శాఖ వారు వారి మామూళ్లను వారు దండు కుంటారు.

నిర్బంధ పని విధానికి తట్టుకోలేక వారు పారిపోకుండా, వస్తాదులాంటి వాచ్

మెన్‌లను నియమిస్తాయి యాజమాన్యాలు. ఒక వేళ వారు పారి పోతే, పట్టి తెచ్చి ఇచ్చిన స్థానికులకు పది వేల రూపాయిలు బహుమతిగా చెల్లిస్తారు గని యాజమానులు.

ఈ విదంగా దేశాంతర్గత వలస వాదుల బతుకులు, ఇక్కడి నుండి ఆరబ్బు దేశాలకు వెళ్లిన వారికి ఏలాంటి తేడా లేదు. సెంట్రల్ మైనింగ్ సేఫ్టీ డిపార్టు మెంటు వారు ఈ క్వారీల వైపే చూడరు.

## 9

ధర్మారం గ్రామ మధ్యలో చిన్న పురాతనమైన హనుమంతుని గుడి, దానికి ఎదురుగా వేప చెట్టు, రావి చెట్టు కలిసి ఉన్నాయి. ఆ చెట్లచుట్టు గుండ్రగా రాతి కణీలతో వెనుకట ఎవరో కట్టించిన గద్దె వుంది. రోజూ సాయంత్రం గ్రామం లోని పెద్దమనుషులు ఆ గద్దెపై కూర్చొని పిచ్చాపాటి మాట్లాడు కుంటారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయంతో సహా చెట్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ వుంటారు.

తెట్టుగుట్ట క్వారీ దెబ్బలకు హనుమాన్ దేవాలయం దెబ్బతింది. దానిని సరి కొత్తగా కట్టాలని కొందరికి ఆలోచన వచ్చింది, దాంతో వారు సర్పంచును అడిగినారు. సర్పంచు క్వారీ యజమానులతో గుడి కట్టించుటకు ఒప్పించినాడు. క్వారీ యజమానులు పది లక్షల రూపాయిలు ఇచ్చింద్రు. ఎండోమెంటు డిపార్టు వారు కూడా కొంత ఇచ్చినారు. దానితో గుడిని కాంక్రీటుతో నిర్మించినారు, గుడిలో అందమైన నల్లని రాయితో ఫ్లోరింగ్ చేసినారు. ఆ చెట్ల చుట్టూ అదే గ్రానైటుతో గద్దెలు నిర్మించినారు. దానితో తమ వంతుగా గ్రామాభివృద్ధికి ఎంతో సహాయం చేసామని ప్రకటించు కుంది క్వారీ యజమాన్యం.

ఆ గుడిని శాస్త్రోక్తంగా ఆవిష్క రించడానికి, చిన్న జీయర్‌ను, మరి కొందరు అయ్యవార్లను పిలిపించినారు, ఆ నియోజక వర్గ యమ్. ఎల్. ఏ మరి కొందరు రాజకీయ నాయకులు ఆ ఉత్సవానికి హాజరైనారు. ఊరి వారందరికి అన్నదానం, వచ్చిన అయ్యవార్లకు ఘనంగా సంభావనలు ముట్టచెప్పినారు.

ఇక క్వారీ యజమానుల కన్ను తెట్టుగుట్టపై గల తేనె గుహపై పడింది. ఏసి ఓల్వో కారులో చైనా రాక్ మైనింగ్ ఇంజనీర్లు వచ్చి, ఆ గుహ బండలను కొలచి ఒక వైపున నాలుగు పెద్ద సైజు బండలకు, రెండో వైపున మూడు బండలకు. పై కప్పున రెండు బండలకు మార్కింగ్‌లు ఇచ్చి అదే కారులో కరీంనగరం లోని ఏసి హోటలు గీతకు చేరినారు.

అదే రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో మూడు మార్కింగ్‌లు ఇచ్చిన వైపున రాక్ కటింగ్ యంత్రాలతో ఆ తేనె గుహ గోడను సైజుల వారీగా కోసి, మిగతా పనికి రాని బండలను

తెల్లారంగ డైనమేట్లతో కూల్చింద్రు.

ఆ వార్త తెల్లవారగానే దావనలంలా ఊరినిండా పాకింది. ఊరిజనం తండోపతండాలుగా కూలిన గుహను చూడటానిక వెళ్ళింద్రు. తెనుగు కులస్తులు ముసలి, ఆడా, మగా, పిల్లాజల్లా అందరూ అక్కడ చేరి పెద్దగా రోదించ సాగింద్రు. తేనె గుహకు పైన గుడి ఉన్న కారణంగా ముట్టుకోరని వారు అమాయకంగా ఇన్ని రోజులు అనుకున్నారు. ఈ విధ్వంసం వారు ఊహించలేదు. దాంతో ఉద్రేకంచెంది, క్వారీ వారు ఒరియా కార్మికులకు వేసిన తడకల షెడ్లను కూల్చినారు. ఆ ప్రక్కనే ఉన్న డిజిల్ డ్రమ్ములను పగుల గొట్టి డిజిల్ నేల పాలు జేసినారు.

ఆడవారు ఆ క్వారీ వారిని, ఆ వూరి సర్పంచుని తిట్టిపోసింద్రు, శాపనార్థాలు పెట్టింద్రు.

ఇంతలో క్వారీ వారు పోలీసులకు ఫోన్ చేయగా ఓ యాభై మంది పోలీసులు. ఇద్దరు యస్. ఐలు, సి. ఐ రెండు వ్యానుల్లో చేరి ఆక్కడ గూమిగూడిన వారిపై లాఠీ చార్జీ చేసి చెల్లాచెదరు చేసినారు. ఆ దొమ్మిమీద క్వారీ యజమానులు ఏలాంటి ఫిర్యాదు చేయలేదు. ఓ నలుగురు పోలీసులను వారికి రక్షణ కొరకై అక్కడే వుంచివెళ్ళిపోయినారు. వారు ఫిర్యాదు చేయక పోవడానికి కారణం ఉంది.

నిజానికి నూటా ఇరవై ఎకరాల గుట్టలో, ఆ కంపెనీకి, మైనింగ్ డిపార్టుమెంటు వారు లీజుకిచ్చింది కేవలం ఇరవై ఎకరాలు మాత్రమే. కాని వారు మొత్తం నూటాఇరవై ఎకరాల గుట్టను మైనింగ్ చేసినారు దానివల్లనే గ్రామస్తులతో లేని పోని తలనొప్పు లెందుకని దొంగకు తేలు కుట్టినట్లుగా చప్పుడు చేయలేదు.

ఆ రాత్రే సైజుల వారీగా కోసిన బండలను క్రేన్లతో బల్లపరుపు లారీల్లో ఎక్కించి చైనాకు పంపడానికి కాకినాడ రేవుకు పంపినారు. తదుపరి మరో మూడు రోజుల్లో ఆ తేనె గుహ పై కప్పు నుండి రెండు పెద్ద సైజు బండలుగా కోసినారు. ఆ తర్వాత మూడు రోజుల్లో ఇంకో వైపు నాలుగు పెద్దసైజు బండలుగా కోసినారు, మిగిలిన అక్కరకు రావనుకున్న బండలను డైనమేట్లతో ప్రేల్చివేసినారు.

చేతి నరసింగం ఆ విరిగి పడిన గుహ బండలను చూచి హతాశుడైనాడు. అతడు మంచి గాయకుడు, ప్రకృతి ప్రేమికుడు, చదువు రాకున్నా జానపద బాణిలతో పాటలుకట్టి పాడేవాడు. ఒగ్గు కళా కారులతో పాటు తాను కూడా వారి కార్యక్రమాల్లో పాల్గోనే వాడు. ఇతడు ముఖ్యంగా తెట్టు గుట్టను గాఢంగా ప్రేమించినవాడు. దానిని కూల్చినప్పటి నుండి రొజూ ఆ గుట్ట దగ్గరికి వెళ్ళి బీరిపోయి చూచేవాడు. కొన్ని రోజులకు అతను పిచ్చివాడై పోయాడు. రోజూ ఉదయం ఆ తెట్టుగుట్టపై గల తేనె బండలున్న చోటికి వెళ్లి

పిచ్చి చూపులు చూచి వచ్చేవాడు. గ్రామమంతా తిరిగి అంజనేయ స్వామి గుడి ముందు ఉన్న చెట్ల గద్దెలపై పడుకునే వాడు. సాయంత్రం కాగానే ఒక ఖాళీ సీసాను తీసుకొని తేనె, తెట్టుగుట్ట తేనె అంటూ అరుస్తూ ఊరంతా తిరిగే వాడు. ఇతని వాలకం చూచి ఆయన బంధువులు, భార్యా హైదారాబాదు లోని ఎర్ర గడ్డ ఆసుపత్రిలో వేసినారు.

ఈ విధంగా రెండు వందల యాబై కోట్ల సంవత్సరాల చరిత్ర గల నూటా ఇరవై ఎకరాల విస్థీర్ణంతో, దాదాపు వంద అడుగుల ఎత్తైన గిరిరాజం నేలకొరిగింది. నిజానికి ఆ గుట్ట పుట్టినప్పుడు హిమాలయాల కన్నా ఎత్తుగా ఉండేది. దాని చుట్టు ఇప్పుడున్న పంట పోలాలు, గ్రామాలు గాని అప్పుడు లేవు. నిజానికి ఆ కొండకు అడుగు వారగా ఉన్న బండ లోయలు, ఇన్ని కోట్ల సంవత్సరాల ఉష్ణ. శీతా వర్షాకాల వైపరీత్యాలకు గురియై, గుట్టపై నున్న బండల పై పొరలు చిన్నచిన్న మట్టిశకలాలుగా మారినాయి. అట్టి మట్టి, ప్రతీ వర్షాకాలంలో గుట్టక్రిందకు నీటి జాలులతో క్రింది లోయల్లోకి జారగా గుట్ట క్రింద వున్న బండ లోయలు క్రమంగా మట్టిచే కప్పివేయబడింది. ఇప్పటికి ఆయా చుట్టుప్రక్కల గ్రామాల్లో యాభై నుండి వంద ఆడుగుల లోతున బండనే వుంటుంది. క్రమక్రమంగా ఆ మట్టిచే కప్పి వేయ బడిన భూముల్లో చెట్లు చేమలు పెరిగి, నేల సారవంతమైంది. దానితో బాటుగా వివిధ రకాల జంతు జాలాలకు, చివరకు మనుష్యుల ఆవాసాలకు నిలయమైంది.

శాతవాహనుల కాలంలో, మౌర్యులచే ఓడింప బడిన నవ నందులలో ఒక డైన నందరాజు ఇక్కడికి పారి పోయి వచ్చి శాతవాహనుకు సామంతుడిగా ఈ గుట్టలోనే వన దుర్గాన్ని నిర్మించు కున్నాడు. ఈ గుట్టకు తూర్పు వైపున ఉన్న కోట్ల నరసింహుల పల్లె వద్ద గల గుట్టకు పెద్ద నరసింహా స్వామి దేవాలయము కట్టించినారు, ఆ గుట్టపై కోటను కూడా నిర్మించు కున్నారు. ఆ తెట్టుగుట్టకే పడమరలో గల మరో గుట్టపై కూడా ఒక పురాతన కోట ఆనవాళ్ళు ఉన్నాయి.

కొన్ని వేల సంవత్సరాలుగా ఆ గ్రామస్తులకు పండ్లు, ఫలాలను సరఫరా చేసింది. రకరకాల జంతువుల ఏట మాంసాలను అందించింది. గుట్టకు క్రింద వందల కొలదిగా పెరిగిన తాటి, ఈత వనాల వల్లను, గుట్టపైన గల ఇప్పపూల వల్లను వారికి స్వచ్ఛమైన కల్లు, మధ్యాలను ఆ గుట్టే అందించింది. గుట్ట ప్రక్కనే గ్రామం ఉండటం వల్ల పిడుగుల బారి నుండి ప్రజలకు రక్షణ కూడా దొరికింది. అక్కడి రైతులు తమ పశువులతో గలపని అయిపోయిన తరువాత మేతకై గుట్టకే వదిలే వారు.

వర్షాకాలంలో నల్లటి వాన మబ్బులు ఆ కొండ సానువులతో దోబూచులాడేవి. దానితో ఆ గుట్టపై అధిక మొత్తంలో వర్షం కురిసి బొయ్ మనే హోరుతో నీటి జాలులు

జలపాతంలా క్రిందికి దుముకుతుండేవి. శాత వాహనుల గుట్టకు పడమటి దిక్కున, ఒక చెరువు ఎవరో జైన సన్యాసులతో నిర్మించ బడింది. కాక తీయ రెడ్డిరాజుచే తూర్పు వైపున ఊరు నానుకొని రెడ్డి చెరువు త్రవ్వించ బడింది. తరువాతి బహమనీ, మరియు నైజాం సుల్తానుల జమానాలలో ఆ చెరువులకు మత్తళ్లు నిర్మించ బడినాయి, ఆ రెండు చెరువుల క్రింద ఆరు వందల ఎకరాల తరిభూముల్లో వరిని పండించే వారు గ్రామస్తులు.

వర్షా కాలంలో గుట్టనుండి వచ్చే వరదలు మంచి సారవంతమైన సేంద్రియ ఎరువులతో కూడిన మట్టిని గుట్ట చుట్టు పట్ల గల చేలలోనికి పంపిచేది. పైగా రైతులు గుట్టపై గల అందుగు, గానుగ ఆకులను బండ్లలో తీసుకువచ్చి తమ తరి పొలాలో తొక్కి సహజ సిద్దమైన ఎరువులను పొలాలకు అందించేవారు.

ప్రతీ శ్రావణ మాసంలో కులాల వారీగా గ్రామస్తులంతా వన భోజనాలకు ఆ గుట్టపైకే వెళ్ళేవారు. బతుకమ్మ పండుగలకు అవసరమైన తీరొక్క కట్లతీగ పువ్వులను, పార్వతీ పరమేశ్వర పువ్వులను ఆ గుట్టనుండే సేకరించేవారు. ఆ ఊరిలోని వారు చిన్నప్పటి నుండే తరచుగా గుట్టంతా కలియ తిరిగే వారు దానితో ఆ గ్రామస్తులకు సహజసిద్దంగా ఓర్పు, సహనశీలత, ధైర్యసాహసాలు అలవడేవి, అవి వారి తరువాత జీవితాలను నిబ్బరంగా ఎదుర్కోవడానికి సరిపడా చైతన్యాన్ని ఇచ్చేది.

ఆ గుట్టకే గ్రామానికి చెందిన గొల్ల కురుమలు గొర్రె, మేకలను మేపేవారు. గొర్రెల నుండి తీసిన ఉన్నితో నేసిన గొంగళ్లు ఆ గ్రామస్తులను ఎండలనుండి, చలి నుండి వర్షం నుండి రక్షించేవి. ఆ గుట్ట ఆ వూరికి ఉత్తరాన ఉండటం వల్ల చలి కాలంలో ఉత్తరాది నుండి వచ్చే చలి గాలులను ఆపి గ్రామాన్ని వెచ్చగా ఉంచేది. అదే విధంగా ఎండా కాలంలో వేడి వడగాలులు వీచకుండా వారిని రక్షించేది. ఎలాగైతే ఒక తల్లి తన రొమ్ము పాలతోని తన శిశువును పెంచి పోషిస్తూందో, అదే విధంగా భూదేవికి సహజ సిద్దమైన "తెట్టుగుట్ట" అనే రొమ్ము ఆ గ్రామాన్ని కొన్ని వేల సంవత్సరాలనుండి పెంచి పోషిస్తుంది. అట్టి గుట్టను ప్రభుత్వ అండ దండలతో బండాసుర రాక్షసుడు నేడు నేల మట్టం చేయడమే కాక, కూకటి వేళ్లను కూడా పెకలించుతున్నాడు.

ఆ గుట్ట చుట్టుపట్ల గల నాలుగు వందల యభై ఎకరాలలో నూటా యాభై ఎకరాలు చెరువు శికం పోగా మిగిలిన మూడు వందల ఎకరాలు గ్రామ సామూహిక అవసరాలకు వదలి వేయ బడింది. ఆ పరంపోగు భూములనే ఆ గ్రామంలోని మాల, మాదిగ కుటుంబాలకు రెవిన్యూ ఆధికారులు అసైన్డ్ చేసినారు. కాని అట్టి భూములకు ఎలాంటి సాగు నీటి వసతి కల్పించ లేదు. వారి వద్ద బోరు బావులు వేసుకునే ఆర్థిక వనరులు లేనందున వారు వర్షాధారపు పునాస పంటలు వేసేవారు. దానితో వారికి పెద్ద ప్రయోజనం

చేకూరలేదు. ఆసమయంలోనే క్వారీ కంపనీ వాడికి ఆ గుట్ట నుండి తీసిన పనికి రాని చిన్న చిన్న బండలను మట్టిని ఆ గుట్ట చుట్టూ పోయడానికి భూములు కావలసి వచ్చింది. కాబట్టి, లక్ష రూపాయిలు ధర చేయని భూములను ఎకరానికి మూడు లక్షల రూపాయిలు చెల్లించి చుట్టుప్రక్కల మూడు వందల ఎకరాల భూములను దళితులనుండి కొనుగోలు చేసినారు. నిజానికి చట్టప్రకారం వారు ఆ భూములను అమ్మడానికి లేదు, వీరు కొనడానికి లేదు. కాని వారి అవసరాలను తీర్చని భూములను వారు అమ్మినారు, క్వారీ వాడు కొన్నాడు. గుట్ట చుట్టూ ఆ మూడు వందల ఎకరాల్లో ఎక్కడ పడితె అక్కడ బండలను వేసినారు, పైగా వాడి లారీలు గుట్టచుట్టూ యధేచ్ఛగా తిరగడానికి దాని వల్ల వీలైంది. దళితులు ఆ విధంగా వారి భూములపై హక్కులు వదులు కున్నారు కావున వారికి గుట్టతో మాకేం పని అన్నట్లుగా పట్టించు కోవడం లేదు.

పైగా వారిలో కొందరు ఆ క్వారీవారికి తాబేదారులుగా మారినారు కూడా. కొన్ని సందర్భాలలో క్వారీ వారికి, మరియు ప్రక్కన ఉన్నరైతులకు సరిహద్దుల విషయం పై తగాదాలు రాగా, క్వారీ వారు తమకు తాబేదారుగా మారిన దళిత యువకునిచే, ఆ రైతులపై దళిత, గిరిజన అత్యాచార చట్టం క్రింద కేసులు పెట్టించినారు.

# 10

మొదటగా దుబాయి పోయిన వారిలోని గౌడ యువకుడైన వెంకటగౌడు దుబాయిలో కడుతున్న అల్‌బురుజు అనే ఎత్తైన భవన సముదాయంలో ప్లంబరుగా పని చేసినాడు. ఆతడు దుబాయికి పోయేనాటికి ఇంటర్ పూర్తి చేసిండు. తరువాత చదువుకు స్వస్తిచెప్పి కుల కసిపి లోనికి దిగిండు. వాళ్ళ తండ్రికి వార సత్వంగా లభించిన ఒక మోస్తరు చతుశ్శాల భవంతి ఉంది. ఆ ఊరిలో వారి తండ్రి గౌడ కుల పెద్దగా గౌరవం లభించేది. ఆయన పేరు సూరయ్యగౌడు. ఆయనకున్న లౌక్యం తోను, వ్యవహార దక్షతతో ఆ ఊరిలో గల పది గౌడ కులస్తులకు ఏదైనా సమస్యలు, గ్రామస్తులతోగాని, లేదా ఆబ్కారీ అధికారులతోను మాట్లాడి పరిష్కరించే వాడు.

ఆగ్రామంలో గౌడ కులస్తులలో వారిదే పెద్ద ఇల్లు కావున, వారి యాచక కులస్తులైన గౌడశెట్టిలు సంవత్సరానికి ఒక్క సారి వారి ఊరికి వచ్చి నప్పుడల్లా సూరయ్య ఇంట్లోనే కొన్ని రోజులు మకాం వేసి, చుట్టుప్రక్కల గల గ్రామాలలో గల గౌడ కుటుంబాలను కూడా దర్శించు కునేవారు.

గౌడసెట్లు గౌడ కుల దేవతయైన రేణుకా ఎల్లమ్మ దేవత మరియు ఇతర పౌరాణిక బాగోతాలను యక్షగానంలో వీధినాటకాలుగా వేసేవారు.

చిన్నప్పుడు వెంకటగౌడు వారి యక్షగానాన్ని, జానపద పాటలకు చాలా ఆకర్షితుడైనాడు. తరచుగా వారితో కలసి చిన్నచిన్న పాత్రలు కూడా వేసేవాడు, పెద్దపెరిగినా కొద్ది తరచుగా గ్రామీణులు పాడే జానపద పాటలన్నిటిని గుర్తు పెట్టుకోవడమే కాక, గొంతెత్తి శ్రావ్యంగా పాడే వాడు. బడిలోను, కాలేజీలలోను తెలుగు పట్ల అభిరుచి పెంచుకున్నాడు. ఆ క్రమంలోనే దాశరథి, శ్రీ. శ్రీ. లాంటి కవులతో పాటు అనేక శతకాలు యక్షగాన నాటకాలను కంఠతా పట్టేవాడు. ఒకటో తరగతి నుండి ఇంటరు వరకు గల తెలుగు వాచకాలలోని తెలుగంతా శ్రద్ధతో చదివే వాడు.

ఆ కాలంలో జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాలలో తీవ్రవాద ఉద్యమం ఎక్కువగా ఉండేది. ఎదో ఒక గ్రామంలో గద్దరు, లేదా విమలక్కలు తమ తమ విప్లవ గేయాలతో గ్రామీణులను ఉత్తేజపరుస్తున్న రోజులవి. వెంకటగౌడు కూడా వారి మీటింగులు ఎక్కడ వుంటే అక్కడకు చేరుకొని ముందు వరసలో కూర్చోని వారి పాటలలోని సాహిత్యాన్ని, బాణీలను పట్టుకొనే వాడు. ఆ పాటలను కూని రాగంతో పాడుకునేవాడు.

తమ దూరపు బంధువుల కూతురైన స్వాతితో వెంకటగౌడు వివాహం జరిపించినారు తల్లి, తండ్రులు. వివాహం అయి ఒక్క సంవత్సరం కూడా కాక ముందే ఆఊరి యువకులతో పాటు దుబాయికి వెళ్ళిండు వెంకటగౌడు. అక్కడ దుబాయిలో నిర్మితమౌతున్న అల్‌బురజ్ అనే ప్రపంచం లోనే ఎత్తైన బహుళ అంతస్తుల భవంతి నిర్మాణంలో ప్లంబింగ్ పనులలో తల మునకలయిండు వెంకటగౌడు.

అ భవన నిర్మాన సయమం లో నిర్మాణ టెక్నాలజీకి. ప్రపంచంలోని చాలమంది భవన నిర్మాణ నిపుణులు చీమల్లాగా పని చేస్తూన్నదాన్ని నిశితంగా గమనించే వాడు. తన ఊరిలో కరణాల బావి చుట్టూ ఊన్న ఎత్తైన బావి మట్టి దిబ్బలపై మొలచిన మేడిచెట్లు, కానుగ చెట్ల కొమ్మలు ఆ బావి నీటి పై వ్యాపించగా వంగిన చిటారు కొమ్మలకు బండారి గాడు అనే పక్షులు పెట్టే గూళ్లు మదిలో మెదిలి వాటిపై జానపదశైలిలో ఒక హృద్యమైన పాటను రాసి. తోటి తెలంగాణా నుండి పని చేస్తున్న కార్మికులకు ఇలా వినిపించాడు

"బండారిగాడ, బండారిగాడ, బాయిగడ్డల చెట్లమీదుండు వాడా!
బాయిలంగిన మండ నీదవుర జాడ
వర్ణించ సాధ్యమా సోద్యాల మేడ..! బండారిగాడా!

శత్రువు చేతికి చిక్కకుండు వాడ
చెట్టుకొన కొమ్మల్లో కొలవెయ్యినోడా

పాములాని కాడ పదిలమైనకాడ
పొల్లునారతో ఇల్లుకట్టినోడ
పొలముల్లో, వనముల్లో తిరిగిగేటి వాడా
పిల్లజెల్లలతోని కలిసుందువాడా! బండారి గాడా!

నీళ్లబాయికాడ నీవుందువంటా
బాయెంత నిండినా నువ్వుందవంటా
నీళ్ళకు గజమైన మీదుందువంటా
నింగి నేల మధ్య నీ ఇల్లెనంటా
గాలితో గాలిన ఊగుదు వంటా
చూసినా అందరి కన్నుల పంటా! బండారి గాడా!

ఎండ వాన చలి నెదురుకొనేటి
గుణమున్నదంటా నీ గూటికి...
జల్లుజల్లు జడివానెంత గురిసినా
ఉరువదాయే ఇల్లు తడువని నీ వొల్లు

ఇన్నితీర్ల ఇగురమున్న వాడ....
ఇంజనీరులనే మించిన వాడా! బండారి గాడా!

పొద్దుకంటే ముందు నువ్వు లేస్తావో
ప్రకృతికి నువ్వు ప్రార్థిస్తావో
కండ్లు తెరువని నీ కన్నబిడ్డల
కంటికి రెప్పయ్యి కాపాడుకుంటావో
కాయ పండోదెచ్చి కడుపునిండాపెట్టి
కడుపుతీపికి సంతోషిస్తావో
సొంత గూటిలోని నీ సంసారం
మౌనంగ బోధించు మహా సారం! బండారి గాడా!

బండారి గాడా.. బండారి గాడా..
నీకు నువ్వేసాటి ఓ మొనగాడ...

పాట విన్న సాటి తెలంగాణా వలస కార్మికుల హృదయాలు బరువెక్కినై. వారికి తమ. తమ గ్రామాలు, పొలాలు, గుట్టలు, చెట్లు చేమలు. ఊరు వాడ భార్య, పిల్లలు బంధు మిత్రులు అంతా యాదికచ్చినారు, ఈ పాట విని సంతోషవిచారాలతో కూడినవారై బాగున్నదంటూ సప్పట్లతో వెంకటగౌడును మెచ్చుకున్నరు. దానితో వెంకటగౌడు దుబాయిలో తీరిక దొరికి నప్పుడు తన పాటలతో వారికి ఉల్లాసం కలిగించేవాడు..

ఆ భవన నిర్మాణం తర్వాత ఆ కంపెనీ అల్ ఖైమారస్ అనే మరో అరబ్ ఎమిరేటుకు పంపించింది. అక్కడ నివాస గృహ సముదాయాలకు ప్లంబింగ్ పనులు చేస్తూ కాలం నెట్టుకు వస్తున్నాడు. వెంకటగౌడు పని చేసే ప్రదేశానికి తగ్గరలోనే తూర్పు వైపున ఎత్తైన నల్లటి కొండలు ఉన్నాయి. కాని ఆ కొండలలో బండలు తప్ప పచ్చదనం ఉండేది కాదు. ఎంత పెద్ద బిల్డింగ్‌లు కట్టినా, ఏర్‌పోర్టులు, హస్పిటల్లు, హోటళ్లు, రోడ్లు నిర్మించినా వారు ఇండియా నుండే బండలు, కంకర మరి ఇతర భవన నిర్మాణ సామాగ్రి దిగుమతి చేసుకుంటున్నారు, కాని వారి కొండలను పరిసరాలను కాపాడు కోవడంలో కనపరుస్తున్న తీరుకు ఆశ్చర్యపడ్డాడు.

తీరిక సమయల్లో ఆ గుట్టల దగ్గరగా వెళ్ళి బండలపై కూర్చుండి, తమ ఊరిలోగల తేనెతెట్టుగుట్టతో దానిని పోల్చుకునేవాడు. ఆంత పెద్ద, పచ్చని సజీవ గుట్ట తమ ఊరి స్వంతం అని గర్వపడే వాడు. చిన్నప్పుడు దానిని ఎక్కిన సంధర్భాలు, సీతాఫలాలు కాయలుగా ఉన్నప్పుడే తెంపి. చుట్టుపట్ల గల ఎండు పుల్లలతో కాల్చి ఎలా తినేవారో గుర్తు చేసికొన్నాడు, అడవిరేగు పరికి, మొర్రి, మేడి, తునికి, అల్లనేరేడు పండ్లను తినడం గురించి, అప్పుడప్పుడు తమకు కనపడే కొండ చిలువలను ఎలా చూచి బెదిరేదో, నాగు బాములను చూచి ఎలా పారి పోయేదో గుర్తు చేసికొన్నాడు. తమ కులస్తులందరూ వండుక తినడానికి ఆ గుట్టకు వెళ్ళి ఎలా ఆనంద పడేదో పదేపదే గుర్తు చేసుకునేవాడు. గుట్టకు పెరిగిన మోదుగు చెట్లకు వసంత రుతువుతో ఎర్రనినిప్పు గుత్తుల్లా వేలాడుతున్న మోదుగు పూలను తెంపి అందులో ఉన్న తేనె బిందువులను ఎలా నాలుకలకు రాసుకొనేదో, వాటిని తెచ్చి సహజమైన హోలి రంగులను ఎలా తయారు చేసికొనేది యాదికి తెచ్చుకునేవాడు.

కాని ఇక్కడి గుట్టలకు పచ్చటి సోయగాలు లేవు. ఆ గంభీరత, సజీవత కొరవడ్డది అనుకున్నడు. అయినా ఆక్కడి గుట్టలపై గల బండల అమరికను చూచి ఆనందించే వాడు. అప్రయత్నంగా రాయిపై ఒక పాటను అల్లుకున్నడు. తరువాత దానిని తన డైరీలో వ్రాసుకున్నడు

రోజులు గడుస్తున్నాయి, ఒక నాడు వెంకటగౌడు ఆ గుట్టల దగ్గరకు వెళ్ళినాడు.

ఆ రోజు ఎందుకో మనసంతా తన భార్య చుట్టూ తిరుగుతున్నది. ఇక్కడకు వచ్చి నాలుగున్నర ఏండ్లు కావస్తుంది. తాను అక్కడే ఉండేదుంటే ఆ వరకే ఒకరో ఇద్దరో సంతానం కలిగేది కావచ్చు అనుకున్నాడు. తన ఇక్కడ, ఆమె అక్కడ తల్లిగారింట్లో, ఆమె ఏంచేస్తుందో, ఇప్పుడు అని అనుకున్నడు. భారమైన విరహవేదన అనుభవించిందు అప్రయత్నంగానే ఆమె అక్కడి నుండి తనక్షేమసమాచారాన్ని, అడుగుతున్నట్టుగాను. తాను కూడా ప్రతి స్పంధింస్తున్నట్టుగా ఊహించు కున్నాడు. ఆ సంధర్భంలోనే ఆ యువ కవి హృదయం నుండి విరహగీతం గొంతులో తచ్చాడింది. ఆ గీతం కూడా డైరీకెక్కింది. ఒక్కడే గొంతెత్తి పాడుకొన్నడు.

ఊరిడ్సి దారిడ్సి కన్నీళ్ళ తోడిడ్సి
బాధ్యతలతో బ్యాగు నింపి, భుజానేసి
బైలెల్లిన ఓ చిన్నోడా
బతుకంతా బాదేనా కూలోడా ఇది మారేనా

ఏలువట్టి పోలుతిరిగి ఏడాది గడువలేదు
ఫోనుల్లో తీరేనా మూగప్రేమ ముచ్చటలు
క్షణమొకయుగముగ గడిసె ఎడబాటుతో
ఎదని ఎడతెగని గాయాలు చేసె ఈ మానినీ

నిను కలసిన వెతల ఎతల హృదయ సంద్రాలు నిండే
మన నుండి నిన్ను, నన్ను వేరు చేసిన రాజ్య రాకాసి
కాలి కూలి పోను.
మన తలల రాత రాసిన
తాత నాలుగు తలల పండ్లు పగిలిపోను
నాకు రెండు పక్షిరెక్కలన్నీయ లేదు
ఎగిరివచ్చి నిన్ను వాటేసికోను
రెండు రెక్కలిచ్చి ఈ ఎడారికెళ్ళగొట్టె
దుర్భర విరహ ప్రేమరాహిత్య మందు.
నిరంతర కఠోర శ్రమ జీవితమ్ము గడప

# 11

ఐదు సంవత్సరాలు ఐంది. వీసా గడువు, ఉద్యోగపు గడువు దగ్గర పడింది. కంపెనీ వారు తిరుగు ప్రయాణానికి టిక్కట్టు ఇచ్చినారు. ఇక్కడికి రావడానికి ఒక రోజు ముందే తన తల్లితండ్రులకు, భార్యకు, బావమరిదికి, మరి ఇతర దగ్గరి బంధువులకు చిన్నచిన్న బహుమతులు తీసుకున్నాడు. ఊరి పిల్లలకని రెండు కిలోల చాక్‌లెట్లు తీసుకున్నాడు. రెండు పెద్ద ఉన్ని రగ్గులను కొన్నడు. అన్నిటిని ఒక పెద్ద సూటుకేసులో వేసిండు, మరికొన్ని చిన్న బ్యాగులో వేసికొన్నడు. ఇంకో చిన్న జబ్బసంచీలో మరి కొన్ని సర్దుకున్నడు. తన డైరీలను జాగ్రత్తగా చిన్నసూటు కేసులో భద్రపరిచిండు, దుబాయిలో, హైదరాబాద్ వచ్చు ప్లేన్‌లో ఎక్కిండు.

ఎక్కేముందు ఇంటికి ఫోన్ చేసి తాను రేపు పొద్దటి వరకు ఊళ్లో దిగుతానని చెప్పిండు. శంషాబాద్ లో రాత్రి తొమ్మిది గంటలకు దిగిండు. ఏర్ లైన్సువారు ఏర్పాటు చేసిన టాక్సీలోనే ఇమ్లీబన్ బస్‌స్టాండులో దిగిండు సామానుతో సహా. అక్కడ పన్నెండు గంటలకు కరీంనగరం వెళ్ళే బస్సు ఉంది. గబాగబా సామాను కూలీతో బస్సులో పెట్టించి, లోనికి వెళ్ళి కరీంనగరం వరకు టిక్కట్టు తీసుకుని, ఇంక బయలు దేరడానికి సమయం ఉన్నందున, చాయ్ తాగి వస్తనని డ్రైవర్‌కు చెప్పి బస్‌స్టాండులో గల టీ షాప్‌లో చాయ్ తాగి, ఒక్కబ్రెడ్, బిస్కట్టు ప్యాకెట్, ఒక నీళ్ళ బాటిల్ తీసుకోని బస్సు ఎక్కిండు.

బస్సు బయలుదేరింది కరీంనగరం చేరే వరకు నాలుగున్నర ఐంది. బస్సు దిగి సామాను దించుకొని, సామానును తోసుకుంటూ కంట్రోలర్ క్యాబిన్ వద్ద ఆగి "పెగడపల్లి ధర్మారం బస్సు ఎప్పుడుంది" అని అడిగిండు. "పొద్దున ఆరున్నరకు" అని కంట్రోలర్ చెప్పగానే చేతికి ఉన్న ఒమేగా స్విస్‌వాచ్‌ను చూసుకొని ఇంక రెండు గంటల టైముందను కొని సామానును లాక్కుంటూ క్లాక్ రూం వైపు నడిచిండు. అక్కడ సామానును ఉంచి రిసిప్టు తీసుకుని, టాయిలెట్సు వైపు వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని, బస్‌స్టాండ్ ముందున్న వాష్ బేసిన్‌లో ముఖం కడుక్కున్నడు. బస్‌స్టాండ్ క్యాంటిన్‌లో చాయ్ తాగిండు ప్రాణం హాయిగా అనిపించింది, క్లాక్ రూం నుండి సామాను తీసుకోని తన ఊరు బస్సు ఆగే ప్లాట్ ఫారం ముందు నిలుచున్నడు. ఇంతలో బస్సు వచ్చింది. తనతో పాటు మరో ఇరవై మంది బస్సు ఎక్కిండ్రు. అందులో తమ ఊరివారెవరైనా ఉన్నారేమో నని ఆతురతగా అతని కండ్లు వెతికినై, ఒక్కరు కూడా లేక పోవడంతో కొంత నిరుత్సాహానికి గురైండు.

లేడి కండక్టరు టిక్కెట్లు ప్రయాణీకులకు టిక్కట్లు ఇస్తున్నది.

ఒక ప్రయాణీకుడు ఐదు వందల రూపాయిల నోటు ఇచ్చి "బూరుగు పల్లి""

అన్నడు కండక్టరమ్మ చిరాకుగా ముఖంమాడ్చి, "పొద్దున్నే నేనేడ చిల్లర తెచ్చేది, చిల్లరియ్యి" అంటూ చిరుబురులాడింది.

"ఉంటే ఇయ్యనా అమ్మా!" అని ఆయన అన్నడు. దానితో టిక్కెటు వెనుక చిల్లర రాసి టిక్కెటు ఆయన చేతిలో పెట్టింది. టిక్కట్లు ఇచ్చిన తరువాత బస్సు బయలుదేరింది.

మేన్‌రొడ్డు ఎక్కి బస్సు వేగాన్ని పుంజుకోగానే కిటికి ప్రక్కన కూర్చున్న వెంకటగౌడు రోడ్డుపై దృష్టి సారించిండు. బస్‌స్టాండు ఎదురుగా పెద్ద ట్రాఫిక్ ఐలాండులో దర్జాగా నిలబెట్టబడిన శ్రీపాద రావు విగ్రహన్ని చూచి, కలెక్టరేటు రోడ్డుకు ఉన్న విగ్రహం ఇక్కడ ఎప్పుడు పెట్టింద్రు అనుకున్నడు. బస్సు కాన్ చిట్టీవరకు వచ్చింది. అక్కడ చాలా పెద్ద ట్రాఫిక్ ఐలాండును, దానికి ఎదురుగా ఉన్న తెలంగాణా దీక్ష శిబిరాన్ని చూచినాడు. తెలంగాణా ఎప్పుడస్తదో కదా మాబ్రతుకులు ఎప్పుడు బాగుపడతాయో, వలసలు ఎప్పుడాగుతాయో అనుకున్నడు. ట్రాఫిక్ ఐలాండును పెద్దగా చేయడాన్ని చూచి కరీంనగరం బాగా డెవలప్ అయింది అనుకున్నడు. కాన్‌చిట్టీ వద్ద ఐదుగురు మహిళా ఉపాధ్యాయురాళ్లు. మరో పది మంది టీచర్లు బస్సు ఎక్కింద్రు. తరువాత బస్సు కోర్టు వద్దఆగింది. అక్కడ మరో పది మంది ఆడ, మగా టీచర్లు బస్సు ఎక్కింద్రు. దానితో పాటు కోర్టు వెనుకాల, చుట్టుపట్ల నూతనంగా నిర్మించ బడిన అపార్టుమెంటులను గమనించి ఆశ్చర్యపడ్డాడు వెంకటగౌడు. కాలేజీ వద్ద మరి కొందరు ఉపాధ్యాయులు బస్సు ఎక్కింద్రు. ఆర్‌టిసీ వర్కుషాప్ బస్ స్టాపులో మరి కొందరెక్కినారు. తరువాత బస్సు వేగాన్ని పుంజుకుంది.

కురిక్యాల దాటుతుండగా కుడివైపున రెండు మూడు కిలో మీటర్ల దూరానగల గుట్టపై మైనింగ్ మిషీన్లు పని చేయడం గమనించినాడు. దానికి పడమరగా ఉన్న "సీతారామస్వామి గుట్టపై నున్న రెండు పెద్ద జైన తీర్థంకరుల ప్రతిమలు కనపడినాయి. భక్తితో దండం పెట్టుకున్నడు.

బస్సు గంగాధర క్రాసింగ్ చేరింది. గంగాధర సెంటర్ వివిధ దుకాణ సముదాయాలతోను, టీ హోటళ్లు, కూరగాయల, ఎరువుల, ఇంజనీరింగ్ దుకాణాలు, భోజన హోటళ్ల తోను, కూర గాయల మార్కెట్టుతో అంగడంగడిగా వుండటం గమనించి చాలా డెవలప్ అయిందను కున్నాడు.

గంగాధర క్రాసింగ్‌లో కుడికి తిరిగి పెగడపల్లి రోడ్డు వారగా బస్సు ఆగింది, అక్కడ మరో ఇద్దరు ముగ్గురు టీచర్లు బస్సు ఎక్కింద్రు. అక్కడి నుండి విశాలమైన డబుల్ తారు రోడ్డు వేసి ఉండటాన్ని విస్మయంగా చూచినాడు వెంకటగౌడు.

తరువాత ఒక్కొక్క గ్రామ బస్సు స్టేజీల్లో ఒకరిద్దరు టీచర్లు దిగుతున్నారు. ఇంతలో బూరుగుపల్లి క్రాసింగ్ వచ్చింది. అక్కడ ఒ పది మంది టీచర్లు ఆ పరిసర గ్రామాలకు

ఆటోలలో వెళ్లడానికి దిగినారు, బూరుగు పల్లి స్టేజీ వద్ద ఒక ఫ్లెక్సిపై "అనుభవజ్ఞులైన కేరళ టీచర్లతో నడవ బడుతున్న ఏకైక ఇంగ్లీష్ మీడియం పాఠశాల, బాల, బాలికలకు సపరేటుగా హాస్టలు సౌకర్యం కలదు" అన్న దానిని చదివిండు.

అక్కడి నుండి తమ గ్రామంలోనున్న తెట్టుగుట్ట శిఖరం కనపడాలి దానికై నాగరాజు కండ్లు వెతికినై. ఆ గుట్ట కనబడలేదు. బహూశా ఇంకా దూరంలో కనబడుతున్న గొల్లపెల్లి ఊరగుట్టే తమ ఊరిగుట్ట కావచ్చు అనుకున్నడు. ఇంకొంత దూరం వెళ్లిన నాగరాజుకు దూరంగా గల సర్వారెడ్డి పల్లె గుట్టపై గ్రానైట్లు తవ్వుతున్న యంత్రాలు అగుపించాయి.

ఆ గుట్టకు ఈవలనే కోట్ల నరసింహస్వామి గుట్ట కనబడింది. భక్తితో రెండు చేతులెత్తి దానికి దండంబెట్టిండు వెంకటగౌడు. తాను ఇక్కడ ఉన్నప్పుడు ప్రతీ జాతరకు ఎలా వెళ్లేది, ఏదైనా మొక్కులకు, సమీప బందువుల పిల్లల పుట్టెంటుకలకు, చెవులు కుట్టడానికి, ఆ గుట్టకు వెళ్ళి అక్కడి గల గుండంలో ఎలా పుణ్యస్నానాలు చేసింది గుర్తు చేసుకున్నాడు. తాను క్షేమంగా తిరిగి వచ్చినందులకు, దేవునికి మొక్కులు చెల్లించ డానికి అతి త్వరలోనే వస్తానని ఆ నరసింహ్మస్వామికి దండంబెట్టిండు.

ఇంతలోనే బస్సు ఐతుపల్లిని దాటింది. దాని తర్వాత వచ్చేదే తన ఊరు. ఊరు ప్రక్కన కొత్తగా ఓ కోతి విగ్రహన్ని చూచి ఇదేదో కొత్తగుందనుకున్నడు.

ఇంతలోనే లేడీ కండక్టర్ "ధర్మారం, ధర్మారం" అంటూ కేక వేసింది. బస్సు ఆగింది. తన పెట్టేబేడతో కిందికి దిగిండు. ఎదురుగా తన తల్లీ, తండ్రీ, భార్యా, బావమరిది ఆమె తల్లి, తండ్రులు మరి కొందరు బంధువులు తన కోసం ఆతురతతో ఎదిరి చూడటం గమనించిండు వెంకటగౌడు.

వెంకటగౌడు బస్సు దిగినాడో లేదో ఆయన తల్లి లక్ష్మీదేవి పరుగుపరుగున వచ్చి కొడుకును పొదివి పట్టుకుని బిగ్గరగా రోదించింది, తన చేతులతో నాగనాజు కడుపును పునికి పునికి తడుతున్నది. తన కొడుకు దేశంకాని దేశంలో ఎంతిన్నడో లేదోనని తల్లి ఆరాటం. ఆమెతో పాటు ఆయన తండ్రీ, వెంకటగౌడు భార్య స్వాతి కూడా శోకం బెట్టింద్రు. వారిని పట్టుకున్న వెంకటగౌడుక్కుడా దు:ఖం ఆగింది కాదు. ఆయన కూడా ఏడుస్తున్నడు. అలా వారి ఏడ్పుల వల్ల తేలిక పడిన హృదయాలతో లోకంలోనికి నెమ్మదిగా వచ్చింద్రు.

అప్పుడు తల్లి తిన్నావురా కొడుకా అని అడిగింది. జవాబుకై ఆగకుండానే బాగున్నావా కొడుకా అంది. "మన వాళ్లంతా బాగున్నారే అవ్వా" అంటూ తల్లి, తండ్రి కాళ్లకు మొక్కిండు.

వాళ్లు అప్యాయంగా మళ్ళీ కొడుకును గుండెలకు హత్తుకున్నరు. ఇంతలో వారి బందువులు తలోబ్యాగు, సూటుకేసులు పట్టుకొని ఇంటివైపు చిన్న ఊరేగింపుగా దారి తీసింద్రు.

ఇంటికి నడుస్తూనే త్రోవలో కనబడిన వారిని "కాక బాగున్నావే," చిన్నాన్నా బాగున్నావే, "తాతబాగున్నావే", పెద్దయ్యా బాగున్నావే" అంటూ మగ వారిని, "అత్తా బాగున్నవా", "అక్కా బాగున్నవా" చెల్లే బాగున్నావా", చిన్నమ్మా బాగున్నవా" అవ్వా బాగున్నవా" అంటూ ఇంటి ముందుకు వచ్చి తనను చూస్తున్నవారి నందరిని వరుసలు కలిపి పలుకరిస్తూ ముందుకు నడుస్తున్నడు వెంకటగౌడు.

# 12

వెంకటగౌడుకు తన ఊరు తనకే కొత్తగా కనపడ సాగింది. తన ఊరిలో వేయబడిన కాంక్రీటు డబుల్ రోడ్డు అతనిని ఆకర్షించింది. ఆలాగే ప్రతీ ఇళ్లపై కప్పులు సిమెంటు రేకులతో కప్పబడటాన్ని గమనించినాడు.

ఒక ఇంటి ముందు, చాపలో కందులు ఎండబెడుతూ, కట్టె పట్టుకొని కూర్చున్న ముసలమ్మ ఈరవ్వను చూచి గుర్తు పట్టి "ఆవ్వా బాగున్నవా" అని అడిగిండు వెంకటగౌడు. సరిగా కనపడక నొసటికి చేతులడ్డం పెట్టుకొని ఎవరైంది గుర్తు పట్టడానికి ప్రయత్నించింది.

దానితో "తాను వంగల సూరయ్య కొడుకు వెంకటగౌడు" అనగానే

"బిడ్డా బాగున్నావా" అని అంది.

"కట్టెపెట్టుకొని కోళ్ళు రాకుండా కావలికి కూసున్నవా అవ్వా" అన్నడు.

"కాదు బిడ్డా"అంటూ ఇంటి పైకి వేలెత్తి చూపింది. వెంకటగౌడు అటువైపు చూపు చూసిండు. సిమెంటు రేకుల ఇంటిపైన ఓ ఇరవై కోతులు వరుసగా కూర్చున్నై. ఈ ముసలి ఎప్పుడు పోతుందా అప్పుడు కందులు బుక్కుతం అన్నట్లు చూస్తున్నాయి. అప్పుడు గాని అతనికి, ఎందుకు ప్రతీ ఇంటి పై కప్పులు సిమెంటు రేకులతో వేసుకున్నారో అర్థమైంది. వెంకటగౌడు కోతులను బెదిరించి వెళ్ళగొట్టిండు.

మరికొంత దూరం నడవగానే నాలుగు వాడల కూడలికి కుడి వైపున నిగనిగ లాడుతూ సిమెంటుతో కట్టబడిన హనుమదాలయం, దాని ముందు వేప. రాగి చెట్ల చుట్లూ అందమైన గ్రానైటు రాయితో నిర్మించిన అరుగు కనపడింది. బూట్లు విప్పి భక్తితో హనుమంతుడికి దండం బెట్టిండు వెంకటగౌడు. ఆయనతో పాటు వున్న వారంతా దండం పెట్టుకున్నరు.

హనుమంతుని గుడి దాటితే మూడవ ఇల్లే వెంకటగౌడుది. తన ఇంటిని తానే గుర్తుపట్ట నంతగా మారింది. ఇంటి పాత పెంకుగూనల జాగనే సిమెంటు రేకులు కప్పినారు. తను దుబాయి పోయే నాటికి చిన్నదిగా వున్న వేప చెట్టు పెద్దగా పెరిగింది. ఇంటి చుట్టూ ఉన్న కాంపౌండు గోడకు ఉన్న పెంకుల కప్పు తీసి సిమెంటు చేయించినారు.

ఇంటి ముందు ఈశాన్యాన గల చేద బావి ప్రక్కన బోరుబావి త్రవ్వినారు. తమ ఇల్లు మొదటి నుంచి ఎత్తైన పునాదుల మీద నిర్మించ బడటంవల్ల, బజారులో వేసిన కాంక్రీటు రోడ్డు కంటే ఇంకా రెండు ఫీట్ల ఎత్తు మీదనే ఉన్నది. పెరిగిన రోడ్డు ఎత్తు వరకు మొరంతో నింపడం వల్ల మునుపటి కంటే బజారుకు ఎత్తు తగ్గింది.

చాలా రోజుల తర్వాత కొడుకు ఇంటి ముందుకు రావటం వలన, లక్ష్మమ్మ తానే ముందుగా లోపలికి వెళ్ళి, ఉప్పు, మిరప కాయ, నిమ్మకాయ, ఊదు పొగలతో దిష్ఠితీసి, మూడుబజార్లలో వేసివచ్చింది.

అంతకు ముందే కొప్పెరలో వేడినీళ్లుకాగవెట్టింది. కొడుకును తొందరగా స్నానం చేయమని చెప్పింది.

వెంకటగౌడు. స్నానం చేసిరాగానే, కోడి కూరతో అన్నం తన కొడుకుకు, భర్తకు, వారి బంధువులకు అందరికి వడ్డంచింది. కొడుకు దగ్గరగా వచ్చి కూచొని ఒక్కముద్ద కలిపి కొడుకు నోట్లో పెట్టింది.

దానితో భర్త సూరయ్య "నీకొడుకు ఇంకా చిన్నపిల్లగాడా" అంటూ లక్ష్మమ్మను ఆట పట్టించిండు.

దానికి ఆమె "ఎంతైనా కొడుకు కొడుకే, ఆక్కడ వాడు సరీగా తిన్నడో లేడో, నేనింత పెట్టితె గాని తృప్తి ఉండదు" అంది. రెండు మూడు బుక్కలు తల్లి పెట్టగా తిన్నాడు వెంకటగౌడు.

"ఇక నేనే తింటగని నీవు నాప్రక్కన కూచోని నువ్వు కూడాతిను"అన్నాడు తల్లినుద్దేశించి వెంకటగౌడు.

తాను కూడా పల్లెంలో ఇంత అన్నం, కోడి కూర పట్టుకచ్చు కొని కొడుకు దగ్గర కూచొని తినడం మొదలు పెట్టింది. తనకు వచ్చిన మెత్తటి కోడి మాంసం ముక్కలు, కాలు ముక్క కొడుకు కంచంలో వేసింది. ఈ విధంగా మొత్తం కుటుంబం అంతా కలసి కడుపార తిన్నది ఐదు సంవత్సరాలలో ఇదే మొదటి సారి. వీరు తిన్నతరువాత మిగతా ఆడభందువులంతా తిన్నారు. తరువాత నిన్నటి నుండి ప్రయాణ బడలికతో నున్న వెంకటగౌడు నిద్ర పోవడానికి పడక గదికి నడచిండు, ఆతనిని అనుసరించింది. ఆయన భార్య స్వాతి.

ఆంతకు ముందే లక్ష్మమ్మ కొడుకు క్షేమంగా తిరిగి వస్తే పోచమ్మకు చేస్తానని మొక్కుకుంది. పొద్దున్నే ఇంటి వారందరు స్నానాదులు పూర్తి చేసికొన్నారు.

తల్లి లక్ష్మమ్మ, భార్యస్వాతి చెరొక బోనంతోను, ఒక గొర్రెపోతును, తాడుతో కట్టి చేతపట్టుకున్నడు వెంకటగౌడు. స్వాతి కోడిపుంజును పట్టుకున్నది. ఆ గొర్రె మెడలో

బంతి పూల దండలు వేసింగ్రు. దాని నుదుట కుంకుమ బొట్టు పెట్టింగ్రు. తనను గొప్పగా ఊరెగేస్తుంగ్రను కున్నది పొట్టేలు. ఇంకో గంటలో తన ప్రాణాలే పొచమ్మపేర బలి తీసుకోనున్నారని పాపం ఆ అమాయక ప్రాణి కేంతెలుసు! ఇంకో బంధువు లావిడ ఒక కల్లు ముంత పట్టుకున్నది. రెండు మాదిగ దప్పులతో ఊరేగింపుగా ఊరికి ఊత్తరాన ఉన్న పోచమ్మ గుడికి బయలు దేరినారు, వారితో వారి బంధువుల గుంపు నడచింది.

వారి కులంలోనే ఉన్న ఎల్లవ్వ జన్నెకిడిసిన మధ్య వయస్కురాలు, రెండు చేతులలో రెండు వేప మండలతో మాదుగులు కొట్టే దప్పుల లయబద్ద శబ్ధానికి అనుగుణంగా ఊగుతూ నాట్యం చేస్తుండగా ఊరేగింపు బైలెల్లింది. బైండ్లోల్లు జమిడికె, సుతి. జాకంట వాయిద్యాలు వాయిస్తూండగా, బైండ్ల లింగయ్య వీరగోల పట్టుకొని వీరంగం వేస్తున్నడు. చేతిలో గంగ్ర గొడ్డలి పట్టుకొని వారింటి చాకలి వెంట నడచిండు. ఆందరూ ఊరికి ఉత్తరాన ఉన్న పోచమ్మ గుడికి చేరింగ్రు.

ఆక్కడ దట్టంగా ఉన్న ఈత చెట్ల, వేప చెట్లు మధ్య, నాలుగు రాతి సలుపలతో భూమికి ఒక రెండు ఫీట్ల ఎత్తులో ఉన్నదే పొచమ్మగుడి, అందులో ఒక కొయ్య బొమ్మతో చేయబడిన చిన్న దేవతా విగ్రహమే పొచమ్మ.

అందరు అక్కడకు చేరుకోగానే లక్ష్మమ్మ పోచమ్మ గుడి ముందు నీళ్ళు చల్లగా, బైండ్ల లింగయ్య పట్నమేసిండు. తరువాత లక్ష్మమ్మ, పోచమ్మకు ధూప, దీప నైవేధ్యాలు పెట్టింది. అగర్‌బత్తీలు ముట్టించింది. కోడలు స్వాతి అందరికి బొట్టు పెట్టింది. లక్షమ్మ ఒక కొబ్బరి కాయపట్టుకొని, తన కొడుకును క్షేమంగా ఇల్లు చేర్చినందుకు పొచమ్మకు దండం పెట్టింది. ఆ పట్నం ముందు పెట్టబడిన ఒక బండపైన ఒక్క దెబ్బతో కొబ్బరి కాయను కొట్టింది. మరోటి స్వాతి కొట్టింది. ఇంకోటి వెంకటగౌడు కొట్టిండు.

అంత వరకు అక్కడి చిన్న వేప చెట్టుకు కట్టేసిన గొర్రెపోతును తెచ్చిన వెంకటగౌడు తండ్రి సూరయ్య తాడుతో సహా చాకలికి అప్పగించిండు. చాకలి ఆ గొర్రె మెడలోని తాడును వెంకటగౌడును పట్టుకొమ్మని చెప్పి. గొర్రెపోతుని తన రెండు కాళ్ళసందున ఇరికించి మెడను పట్టుకొన్నడు. ఇంతలో ముంత లోని కల్లును చాకలి దోసిలిలో పోసింది లక్ష్మమ్మ. ఆ కల్లును గొర్రే పోతు తలపైన. మెడ పైనా పోసి కల్లుతో తడిపిండు చాకలి. మరింత కల్లు లక్ష్మమ్మ పోయగా అది కూడా గొర్రె తలకు మెడకు పట్టించిండు. కొంత కల్లును గొర్రెపోతు నోరు తెరిపించి పోసిండు పోచమ్మతల్లీ అందర్ని చల్లంగ జూడుతల్లీ అన్నడు. అందర్ని మొక్కుకొమ్మన్నడు. అందరూ భక్తి శ్రద్దలతో మొక్కుకున్నరు.

తరువాత గొర్రె పోతుకు కట్టిన తాడును ఇప్పి వేసింగ్రు. దానితో గొర్రెపోతు తన తలను గట్టిగా అటుఇటు దులపరించుకొని జడితిచ్చి తన తలపై పోసిన కల్లును

దులుపుకున్నది. దానిని ఆ గొర్రెపోతు తాను పోచమ్మకు బలి కావడానికి సిద్ధం అనుకున్నట్లుగా భావించిన భక్తుల ముందు ఇద్దరు యువకులు వచ్చి గొర్రెపోతు కాల్లను బలంగా పట్టుకొని ఇక్కడే వున్న ఒక మొద్దుపై చెరొక వైపు గట్టిగా చాచి పట్టుకున్నారు. అప్పుడు డప్పుల చప్పుడు ఎక్కువైంది. పూనకం వచ్చినట్లు చాకలి ఊగిపోతూ గండ్ర గొడ్డలి ఎత్తి "జై పోచమ్మతల్లీ"అంటూ ఒక్క వేటుకు గొర్రెతలను మొండెము నుండి వేరు చేసిండు. బైండ్లోల్లు వేసిన పట్నంపై గొర్రెపోతు మొండెం నుండి కారుతున్న రక్తాన్ని వడిపిండు. దాని తలను పోచమ్మముందు ఉంచిండు, మిగతా ఇద్దరు దాని మొండాన్ని కొద్ది దూరంలో వేసిండ్రు. తరువాత కోడిపుంజును పోచమ్మ ముందు కోసిండు. తరువాత గొర్రెపోతు కాలును, కోడి రెక్కను అక్కడున్న వేప చెట్టు కొమ్మకు కట్టిండు. తనకు రావలసిన గొర్రెపోతు తలను తీసుకున్నడు చాకలి.

తరువాత అంతా ఊరేగింపుగా ఇంటికి వచ్చిండ్రు. ఆ నాడు ఆ గొర్రె మాంసంతో విందును తన బంధు మిత్రులకు ఇచ్చిండు సూరయ్య. ఆ నాడు అలా గడిచింది.

మర్నాడు ఉదయం అంజనేయ స్వామికి చందనం పూయించి కొబ్బరికాయ కొట్టి, మొక్కు తీర్చుకున్నరు. ఆ పూటకు బంధువులు ఉండి సాయంత్రం ఎక్కడోలక్కడికి పోయిండ్రు.

తెల్లారింది, వెంకటగౌడు లేచి భార్య అందించిన చాయ్ తాగి ఊళ్ళోకి నడిచిండు. మొదటగా తన చిన్న నాటి మిత్రుడు సదానందా చారిని కలువడానికి ఎదుటి వాడలో ఉన్న కమ్మరి సత్తయ్య ఇంటికి పోయిండు. అక్కడికి వెళ్ళే సరికి కూలిపోయిన ఇల్లు తప్ప ఎవరు కనబడలేదు. అక్కడున్న వేప చెట్టు కింద కూసున్న లచ్చయ్య అనే పెద్ద మనిషిని అడిగిండు.

ఆ పెద్ద మనిషి భారంగా నోరెత్తి "సత్తయ్య భార్య పోయి నాలుగేళ్ళయిందని. తరువాత సంవత్సరానికే సత్తయ్య పోయిండు, ఊరిలో చేసుకోను పనులు లేక సత్తయ్య పెద్ద కొడుకు సదానందం, ఆయన భార్య, తమ్ముడు బ్రహ్మానందం ఊరువిడిచి పెట్టి కరీంనగరం బతుక బోయిండ్రు, సదానందం ఎదో మేకానిక్‌గా పని చేస్తున్నాడు, ఆయన తమ్ముడు కరీంనగరంలోని ఇత్తడి బోళ్ళ దుకాణంలో పనికి కుదురుకున్నాడు, ఆయన కిరస్తానీ(క్రైస్తవ) మతం పుచ్చుకున్నడు" అని చెప్పిండు.

"గట్లెందుకు జరిగింది తాత" అని అడిగిండు వెంకటగౌడు.

"నువ్వు ఊళ్లో లేక పోతివి నీకు ఈడ జరుగుతున్న వేవీ తెలువదాయె బిడ్డా చెప్పుత విను" అంటూ మొదలు పెట్టిండు "మన తెట్టుగుట్టను క్వారీవాళ్లు బొందలగడ్డ చేసి ఇంకా, భూమి లోతుల్లో తవ్వుతున్నరు. దాంతో గ్రామంలో నీళ్ళు లేకుండా

పోయినాయి. ఎనుకటి యవుసం దెబ్బతిన్నది, ఇప్పుడు ఎక్కడ చూచినా పత్తి చేండ్లే. ఏవో కొద్ది బోర్ల కింద కొంత వరకు వర్లేస్తున్నారు, ఆ పొలాలు, పత్తిచేండ్లన్నిటిని ట్రాక్టర్లు దున్నుతున్నాయి, వరి కోత మిషీన్లు వచ్చినాక ఆడ కూలీలకు పని లేకుండా పోయింది, ఒక్క పత్తి ఏరే పని ఒక్కటే దొరుకుతుంది. దాంతో ఏలాంటి పని లేని కమ్మరి, కుమ్మరి వాళ్లు పని లేక ఊరిడిసిపోయిండ్రు"అన్నడు.

మనసు భారమైంది దానితో అప్రయత్నంగా గుట్టకేసి నడచిండు. గుట్టస్థానంలో పెద్ద క్వారీ కనబడింది. తానకు ఎంతో ఇష్టమైన గుట్ట, తమకు ఎన్నో అనుభవాలను, అనుభూతులను మిగిల్చిన గుట్ట భూస్థాపితం కావడాన్ని చూచి, కన్నీరు కార్చిండు. ఆ క్వారీ చుట్టు ఎటుచూస్తే అటు పెద్ద, పెద్ద బండల నుంచి అనేక వందల చిన్న చిన్న బండలు పడి ఉన్నాయి. ఎవరో రాక్షసులు గుట్టను నరికి పోగులేసినట్టుగా అని పించింది.

ఆ క్వారీలోనికి వెళ్ళే దారికి కుడి వైపున తమిళ కళాకారుడెవరో ఒక పెద్ద బండపై పెద్ద దిష్టిబొమ్మ రాకాసుని భయంకరంగా చిత్రించిండు. దానిని చూచి తమ గుట్టను మింగిన రాక్షసుడు వీడే అనుకున్నడు. బాధ పడుతు ఇంటి దారి పట్టిండు. అతని కవి హృదయం కకావికలం అయింది. గుట్ట పోవడం వల్ల, వందలాది కుటుంబాలకు పని లేకుండా పోయిందన్న బాధ, వారంతా పొట్ట చేత పట్టుకొని వలసల పాలైన సంగతి తలచుకోగానే తల్లడం మల్లడం అయిండు.

ఆకలిగా అనిపించలేదు. ఏదో తల్లి బాధ పడుతదని తిన్నాననిపించిండు. విచారంతో పోయి అరుగు మీద మంచం వాల్చి ఒరిగిండు. ఆయనలోని కవితావేశం కట్టలు తెంచుకుంది వెంటనే డైరీ తీసి రాసిండు.

తండ్రి వింతగా చూస్తు "ఎం రాస్తున్నావురా" అని అడిగిండు.

"పాట రాస్తున్ననే" అన్నడు వెంకటగౌడు.

"గదేందిరో కైతుకాలు మన ఇంటావంటా లేవు బిడ్డా!అది అన్నం పెట్టది. మనం చేతుల్ని నమ్ముకోవాలి" బిడ్డా అన్నడు.

తండ్రి మాట విని వెంకటగౌడు నవ్వి ఊరుకున్నడు.

సాయంత్రం వెంకటగౌడు చుట్టూ కొందరు మిత్రులు పోగయింద్రు. చూడటానికి కొందరు ఆడోళ్ళు, వారి పిల్లలు వచ్చింద్రు. ఇంటి ముందు ఉన్నకల్లు పాకలో కల్లు త్రాగటానికి కొందరు వాడుకం ఉన్న గ్రామీణులు వచ్చింద్రు. గొంతు సవరించు కొని తాను పగలు రాసిన బండ పాటను పాడటం మొదలు పెట్టిండు. వింటూ అందరూ అందరూ నోళ్లు తెరచింద్రు. ఆ పాట ఇలాగుంది.

"రాతి బండో, రాతిబండా!

లోకమే మోపింద నీకు నిందా
లేదందా నీకు కరిగె గుండె,
కాని లోకానికే లేదు జాలి గుండె! రాతి బండో!
ఆదిలోనే అరంభమైనావు, ఆది మానవుల తోడువైనావూ
అగ్గిని జనులకు అంద జేశావూ, ఆయుధ బల్లెమై వేటకెళ్లావూ
నవతకు నీవు బాటవైనా -
కాలానికే కొలమానవైయినా! రాతిబండో!
రాజశాసనాలు రాసుకుంటివీ-
రాజసౌధానికి చిహ్నమైతివీ
మౌనంగనిలుసుండి మాటలాడితివి-
బౌద్ధ రూపమయ్యి బొధజేసితివి
మందీరు, మసిదు చర్చివైనా-
దైవానికే నీవు నీడవైనా! రాతిబండో!
పరుపు బండవైయ్యి పరుసుకున్నా-
పల్లెసోయగాల్లో భాగమైనా
పంట సేల్లకాడ ఎండుగైనా-
ఇంటి పునాదిలో గుండువైనా
ఎక్కినా నిన్నుతొక్కినా-
చెక్కినా నిన్నుమొక్కినా! రాతి బండో!
అడవి జీవాలను ఆదరించి-
శత్రువు వేటకు దూరముంచి
గుహనే గూడుగ మలచి-
చేసేవు మంచి మేలు నీవు
జాతివైరమేమి నీకు లేకున్నా-
జగతిమేలే నువ్వు కోరుతున్నా! రాతి బండో!
ఇంటిలోన ఇస్సుర్రాయి వమ్మా-
ఊరిలోన బొడ్రాయివమ్మా
నమ్మినోనికి అమ్మవమ్మా-
అమ్ముకున్నోనికి సొమ్ముమమ్మా! రాతి బండో!
ఒడిసెల గుండయ్యి గుయ్యిమన్నా-

జకమొకరాయయ్యి జగ్గుమన్నా
తూటాలనెదిరించె ధైర్యమైనా-
కదనరంగానా కవచమైనా
వీరయోధుని స్థూపానివైనా-
త్యాగానికే ప్రతిరూపమైనా! రాతిబండో!
తాజ్‌మహలని నిన్ను పిలిచారా-
ప్రపంచ వింతల్లో ఒకటి జేసారా
ప్రేమకు గుర్తుగా నిన్ను మలిచారా-
మలిచేవేళ నీ నిందమరిచారా
ప్రేమకు గురుతు తాజ్‌మహలైతే-
అందులో ఉందంత గుండు బండే కదా! రాతిబండో!
క్వారీలు మైనింగు పేరులేవైనా-
కతము జెయ్యానికే ప్లానింగులైనా
పరువాల నీరూపు పగులగొడుతంద్రూ-
పర్యావరణన్నాంత పాడు జేత్తాంద్రు
బడాబాబు లంత ఏకమౌతుంద్రు-
నీ భవిష్యత్తుకే ఎసరుబెడుతుంద్రు
ముందు తరానికి లేకుండ సూత్తుంద్రు-
ముక్కలుగ నిన్ను చెక్కల్లు జేస్తూంద్రు
కొండలన్నిటిని పిండి జేస్తూంద్రు-
గ్రాపిక్సులోచూసి మురవమంటుంద్రు! రాతి గుండో!
రాతిబండో రాతిబండా లోకంతీరే వేరు సూత్తువుండా
రాతిబండో రాతిబండో ఉంటాము నీకిక అండదండా
రాతిబండో రాతిబండో కాపాడు కుంటాము ప్రతి ఊరకొండ! రాతిబండో!

పాట విన్నంక అందరూ చప్పట్లుతో వెంకటగౌడును మెచ్చుకున్నరు. నోరు తెరచి పాట విన్న స్వాతికి ఆశ్చర్య, ఆనందాలు కలిగినాయి. దానినుండి కోలుకొవడానికి కొంత సమయం పట్టింది. తన భర్త, స్వంతగా రాసుకొని, స్వర గతులు కట్టి పాట పాడటం చాలా గర్వంగా తలచింది. తన భర్త ఒక కవే కాక వాగ్గేయ కారుడనుకుంది. మనసు ఉప్పొంగి పోయింది.

పాట ఐపోయిన తరువాత. తిరుపతి అనే పదిహేడేళ్ల పిల్లగాడు, "మామ నువ్వు

బాగా పాడుతున్నవు, సినిమాలకు పో మస్తుగా షైనైతవు" అన్నడు, చిరంజీవి పోజుపెట్టి, వెంకటగౌడు నవ్వి ఊరుకున్నడు.

# 13

తెల్ల వారింది పది గంటలు కావస్తోంది ఎండా కాలపు ఎండ చిటపట లాడుతోంది. ఆ సమయంలో బజారున పోతున్న తిరుపతి కనిపించిండు వెంకటగౌడుకు.

"తిరుపతి! ఓ తిరుపతీ!" అంటూ కేక వేసిండు. తిరుపతి వెంకటగౌడు ఇంట్లోకి అడుగు పెట్టిండు.

దాంతో వెంకటగౌడు "ఎటో పనిమీదపోతున్నవ్"అన్నడు

"ఎంలేదు ఊరికేనే బజారు తిరిగొద్దామని" నసిగిండు తిరుపతి.

"ఐతే తిరుపతి కర్నాలబాయికి ఈతకు పోదాం వస్తవా" అడిగిండు వెంకటగౌడు.

తిరుపతికి నవ్వాగింది కాదు. "మామ ఈతకు పోతడట ఈతకు"అంటూ నవ్వుతున్నడు

తిరుపతి ఎందుకు నవ్వతున్నడో వెంకటగౌడుకు సమజైతలేదు. "ఎందుకు నవ్వతున్నవొ చెప్ప రాదురా తిరుపతిగా"అన్నడు.

అప్పుడు తిరుపతి మాట్లాడుతూ "ఇంకెక్కడి కర్నాలబాయి, మామ అది ఎండి పోయి మూడు సంవత్సరాలైంది. వట్టిబాయి బొందతప్ప ఇప్పుడు బాయిలో నీళ్ళేలేవు" అన్నడు.

అప్పుడు లచ్చయ్య మొన్న బావుల్లో నీళ్లు ఎండిపోయినవని చెప్పిన మాట యాదికచ్చింది. తను, తనతో పాటు తన ఈడువారు, చిన్నా, పెద్దా అంతా ఆ బాయిలో ఈతలు నేర్చుకున్నవారే.

ఆ బాయి ఆ ఊరి కరణం పంతులు కృష్ణారావుది. దానికింద ఒక ఎకరం బాగాయతీ తోట, మరో ఐదు ఎకరాల పొలం ఉండేది. ఆ బాయి గుట్టకు కింద ఉత్తరాన ఊరికి దగ్గరగా ఉంది. దాని వైశాల్యం దాదాపు పది గుంటలుగా వుండేది. గంగాలం లాంటి బాయి. గుట్ట దిక్కు లోతు తక్కువగా వుంటూ దక్షణానికి వచ్చిన కొద్దీ లోతుండేది. వానాకాలంలో నయితే గుట్టనుండి వచ్చే జాలుతోనే ఉత్తరంగా ఆ బాయినుండి కొద్దిగా తవ్విన కాలువ ద్వారా పొలానికి నీరు పారేది. వానా కాలం తరువాత కొద్దిగా జాలు వెనుక పడ్డప్పుడు. దక్షిణాన ఉన్న సంగడి మోటతో నీటిని పొలానికి, తోటకు పెట్టేవారు. ఆ సంగడి మోట రాయితో గట్టిగా కట్టబడింది. మోటలకు చిమ్ములను రాయి కణీలతోనే కట్టినారు. అక్కడి నుండి బావి ఎంత లోతున్నదో అక్కడివరకు రాయి గోడ వున్నది, ఆ

గోడనానుకుని పైదాకా మెట్లు ఉన్నాయి. బాయి చుట్టూ బావిత్రవ్విన మట్టిని ఎత్తైన మట్టిగడ్డలుగా బావి చుట్టే పోసినారు. ఆ మట్టి దిబ్బలపైన బావి అంచులకు తూర్పువైపున రెండు మేడి చెట్లు ఎత్తుగా పెరిగి తన కొమ్మలను బావి నీటిలోని ఉపరితలానికి ఎత్తుగా పరచింది. ఇక పడమటి వైపున మోట దగ్గరగా ఒక రాలె చెట్టూ. దానికి కొద్ది ఎడంగా మర్రి చెట్టు పెరిగి తమ కొమ్మలను బావి పైకి విస్తరించుకొని, మేడి కొమ్మలతో కరచాలనం చేస్తూనట్టుగా వుండేవి. బాగా ఈత నేర్చిన వారు ఆ చెట్టు కొమ్మల పై కెక్కి బావిలో దుంకే వారు, మొగ్గలు వేసేవారు. ఇంకొందరు మోటబాయి చిమ్ములపై నుండి బావినీళ్ళలో దుమికేవారు. ఆ విధంగా ఆ ఊరి వారికి ఈతలు రావడానికి ఆ బావే కారణం.

తాను ఈత నేర్చుకున్న కొత్తలో జరిగిన సంఘటన కళ్ల ముందు మెదిలింది వెంకటగౌడుకు.

ఒక వేసవిలో ఒక్కపూట బడి అయిపోయిన తరువాత చాలా మంది పిల్లలు ఆ బావి నీళ్ళలో ఈదుతూ. ఆటలు ఆడుతున్నారు. పిల్లలు పోటీపడి ఎవడు ముందు నీటిలో మునిగి మట్టి తీసుకువస్తరో అని పోటీలు పడుతున్నరు. కొందరు చెట్ల కొమ్మల నుండి దుంకుతున్నరు. కొత్తగా ఈత నేర్చుకున్నవారు చెట్ల కొమ్మల నుండి బావిలో దుంకడానికి ప్రయత్నిస్తున్నరు.

అంతా గడబిడగా వుంది. పిల్లలు అరుస్తూన్నరు. ఒకటే ఈతలు. వారు బైట ఎంజరుగుతుందో గమనించే స్థితిలో లేరు.

వారంతా పదిహేను ఏండ్ల లోపువారు, దాదాపు అందరూ దిసమొలలతోనే ఉన్నరు ఒక్కరికైనా కనీసం బుడ్డగోచీలేదు. వారి బట్టలను ఉత్తరం దిక్కున ఉన్న బాయి గడ్డపై పెట్టి ఈతలకు దిగినారు.

వారి ఈతల్లో వారుండంగా. సుంకరి నారాయణ వారి బట్టలన్నింటిని తన గొంగడిలో చుట్టుకొని చాకలి బట్టలమూటను ఎత్తుకున్నట్లుగా వాటిని తీసుకొని కరణం కృష్ణా రావు ఇంటి ముందు గల వేప చెట్టువద్ద పెట్టి మళ్ళీ బావి వద్దకు పోయిండు. ఇంకా పిల్లలు ఈదుతూనే ఉన్నారు. వారితో పాటు సుంకరి నారాయణ కూడా దిగి ఈత కొట్టి, తన పెయ్యి కడుక్కున్నడు.

నీళ్ళలో ఆడి, ఆడి పిల్లలు అలసి పోయింద్రు. అప్పటికి ఆకల్లు అయినట్లున్నాయి

ఒక్కొక్కరుగా పైకి ఎక్కి బట్టల కొరకు వెతికింద్రు. వారి బట్టలు వేసిందగ్గర లేవు. అటు ఇటు జూసింద్రు. బట్టలు లేక ఇంటికి పోతే వీపులపై విమానం మోగిస్తారు తల్లి, తండ్రులు ఎలా అనుకున్నరు.

పెయ్యి కడుక్కొని పైకి వచ్చిన సుంకరి నారాయణ, పిల్ల నుద్దేశించి,

"మిమ్మల్నందరినిపోలీస్ పటేలు, కర్నపు పంతులు కచేరీకి రమ్మన్నడు. మీ బట్టలన్ని జప్తు జేసిండు" అని చెప్పిండు

అందరిని తీసుకొని సుంకరి నారాయణ వారికి ముందుగా నడచిండు. అతని వెనుకాల తమ దిశమొలలను చేతులతో దాచుకుంటూ పిల్లల సైన్యం నడుస్తున్నది.

వారిని చూచిన ఆడ పిల్లలు వెక్కిరిస్తుండ్రు. పెద్దవారు ముసిముసి నవ్వులు నవ్వుతున్నరు.

కొందరు "మీ వీపులు పోలీస్ పటేల్ వాయగొడ్తడు" అన్నరు.

ఇంకో నడీడు మనిషి "కోడెలకు పిచ్చులు కొట్టినట్టు మీ పిచ్చులను పోలీస్ పటేల్ తీస్తడు" అన్నడు. పిల్లలందరూ గొర్రెపిల్లల్కెక్క ఒకరి వెంట ఒకరు నడుస్తున్నరు.

వారందర్ని పట్వారీ కృష్ణారావు గారి ఇంటి ముందున్న కచేరికి ఎదురుగా ఉన్న గోడకు వరుసగా నిలుచోబెట్టిండు. కచేరీలో పట్వారీ కృష్ణారావు. పోలీసు పటేలు రమణా రెడ్డి ఇద్దరు చెరో తట్టుకుర్చీలో చేరగిలపడి కూచున్నరు. మరో ఇద్దరు పెద్ద మనుషులు తక్తుబల్లపై కూసున్నరు. పోలీస్ పటేల్ అంతకు ముందే రెండు చింత బరిగెలు తెప్పించిండు. మొత్తం మంది పిల్లలను లెక్కిబెట్టిండు. నలభై ఒక్కరు ఉన్నారు అందులో కృష్ణారావు కొడుకు వెంకటేశ్వర రావు ఉన్నడు. ఇంకా కొంత మంది రెడ్డి పిల్లలు. కోమటి పిల్లలు, కాపులు, గొల్లకుర్మలు, గౌడ పిల్లలు, ఇద్దరు ముగ్గురు మాల పిల్లలు ఉన్నారు. కాని ఆ గుంపులో కొందరు రెడ్లు, కర్నపు పంతులు కొడుకూ ఉన్నందున వారిని చింత బరిగెలతో సన్మానించే ప్రక్రియకు స్వస్థి చెప్పిండు.

"ఇక నుండి మేము ఈతకు పోము" అంటూ అందరినీ ముక్కులు నేలకు రాయమన్నడు పటేల్. అందరూ మోకాళ్ళ పై కప్పల తీరుగా వంగి ముక్కులను నేలకు రాసిండ్రు.

"మేము ఇక ముందు ఈత కొట్టమంటూ ఇరవై గుంజిల్లు తీయమన్నడు" పటేల్ సాబ్. తీసిండ్రు పిల్లలు. "మొన్న సరీగా ఈత రాని పోరడొక్కడు బావిలో ఈతకు దిగి సచ్చి పోయిన సంగతి యాది లేదురా మీకు, ఇక ముందు ఈత గొడితే వాయగొడుత" తెలిసిందా అంటూ పిల్లలను బెదిరిస్తూ, వారి బట్టలను వారికి ఇప్పిచ్చిండు పోలీసు పటేల్. వారు చప్పుడు చేయకుండా బట్టలు తొడుక్కొని ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఎవరి ఇళ్ళకు వారు పోయిండ్రు

ఇంటికి పోతూ పోతూ కొంటెౌవెంకటగౌడు, "ఇవ్వాల్ల పోలీస్ పటెల్. పట్వారీ సాబ్‌లు, నలభై ఒక్క లింగాలను దర్శించు కున్నారని" గుసగుస పెట్టిండు పిల్లలందరూ వినేటట్లుగా, పిల్లలంతా గట్టిగా నవ్వుకుంటూ ఇంటి దారి పట్టిండ్రు.

మళ్లీ రెండో రోజునే పిల్లలంతా బావిలో ఈతలు కొడుతున్నరు.

"పిల్లలే గంత, తాను చిన్నప్పుడు కూడా ఇట్లనే గదా ఈతలు నేర్చుకున్నది" అనుకొని ఇక చెసేది లేక పోలీస్ పటేల్ నీరటి వెంకటిని ఎవరైనా పిల్లలు మునిగి పోకుండా చూడటానికి నియమించిండు, ఆ నీరెటి వారం రోజులు క్రమంతప్పకుండా పిల్లలు ఈతలు కొడుతున్నప్పుడు వచ్చేవాడు. తరువాత రావడం మానుకున్నాడు, బావి ఎప్పటిలాగానే పిల్లల రాజ్యం అయింది.

ఈ సంఘటన జరిగి దాదాపు పదిహేను సంవత్సరాలైనా నిన్నమొన్ననే జరిగిందన్నట్లుగా అన్పించి వెంకటగౌడుకు నవ్వు వచ్చింది, వెంటనే తమకులాగానే ఈ కాలం పిల్లలకు ఈత కొట్టడానికి బాయి లేకుండాపోయిందని బాధ కల్గి, మనస్సు వికలమైంది. వెంకటగౌడుకు ఆకర్షించిన విషయం ఇంకోటి ఉంది ఆ ఈత బాయిలో. ప్రతీ రోజూ ఈతనేర్చుకునే క్రమంలో, ఒక సారి ఎల్లెలుకల ఈత గొట్టడం నేర్చుకున్నడు. ఆప్పుడు బావి నీటిై పరచుకున్న కొమ్మల చివరలకు "బండారి గాడు"అనే పక్షుల గూళ్లు చూచిఆశ్చర్యంగా నోరు తెరచిండు. నోట్లోకి నీళ్ళుపోయి నీటిలో మునిగిండు. పైకి తేలి ఈ సారి మరింత పరీక్షగా వాటిని చూసిండు. ఇంతకు ముందు చాలా సార్లు వాటిని చూసిండు, కాని నేడు బావిలో నుండి వాటిని చూడటం ఇంకా చాలా బాగుంది. ప్రతీ సారి ఈతకొట్టినప్పుడు వాటిని గమనించేవాడు, ఆ పక్షులు ఎలా గూళ్ళు అల్లుకొనేది, అందులో ఈ పక్షులు చూపే నైపుణ్యానికి ఆశ్చర్యపడేవాడు. ఆ పక్షులు అందులో గుడ్లుపెట్టి పిల్లలను ఎలాసాకేదీ గమనించేవాడు. ఆడ మొగ పక్షులు చిన్నచిన్న గింజలను ఏరుకొని తేగా, వాటి పిల్లలు ఆ గూటిద్వారానికి ఈవలగా నోరుతెరచి వుంచగా వాటిని ఆ పిల్లల నోట్లో ఏవిధంగా ఉంచేవో నోరెల్లబెట్టి చూసేవాడు. ఆది అంతా బుర్రలో తిరిగింది వెంకటగౌడుకు.

ఓ సారి ఆ బావి ఉన్న చోటుకు వెళ్ళి వద్దామని తిరుపతిని వెంటపెట్టుకొని బయలు దేరిండు వెంకటగౌడు. అక్కడ నీళ్ళు లేని బావిలో ఊరిలోని చెత్తా చెదారంతో పాటుగా. పగిలిన గూన పెంకలతో సగం పూడిపోయి ఉంది. రాళ్లు ఎవరో తీసికెల్లగా, మోటులున్న ఆనవాళ్లు లేవు. చెట్లులేని బావి గడ్డల మట్టిని ఎవరో ఇతర అవసరాలకు తవ్వి తీసుకు పోయిన ఆనవాళ్లుఉన్నాయి. ఒకప్పుడు, నిండైన నీళ్ళతో ఇక్కడో బావి వుంది అంటే, ఇప్పుడు నమ్మటం కష్టం అనుకొన్నాడు వెంకటగౌడు.

యం. టీ. రామారావు జమానాలోనే పట్వారీలను తీసివేయడం గుర్తుంది వెంకటగౌడుకు పట్వారీ తనం పోవడంతోనూ, తన పెద్దకొడుకు ఇంజనీరై అమెరికాకు వెళ్ళడంతోను, తన చిన్న కొడుకు వెంకటేశ్వరరావు చదువు నిమిత్తం, తన చిన్న కూతురు

పెండ్లి నిమిత్తం భూములను, ఇంటిని ఆ ఊరి రెడ్లకు అమ్మి పట్వారీ పంతులు హైదరాబాదు వెళ్ళిపోయిండు. ఇంత పెద్దబావి ఎండిపోవడం వల్ల ఈ కాలం పిల్లలకు ఈతలు రాకుండా పోవడం చాలా బాద కలిగించింది వెంకటగౌడుకు. ఒకప్పుడు ఈత రాని పల్లెటూరు పిల్లలు ఉండే వారు కారు, ఇక నుండి గ్రామాల్లో కూడా ఈతలు రాని తరాలు ఉంటాయి అను కోగానే ఈ పర్యావరణ విధ్వంసం పై చాలా విచారం కలిగింది. ఉత్తరాన ఉన్న తెట్టుగుట్ట పూర్తిగా తొలగించడమే పెద్దబావి ఎండి పోవడానికి కారణం అనుకొన్నాడు.

ఊరిప్రక్కన గల చెరువుకు కూడా గుట్టపైనుండి వర్షాకాలంలో వచ్చు నీటి జాలులు లేక నీరు రావడం లేదు. పైగా ఆ చెరువు శిఖం ప్రక్కన గల దలిత ఎడ్ల రాజయ్యకు చెందిన మూడు ఎకరాల అసైన్డ్ భూమిని క్వారీ వారు అధిక ధర ఇచ్చి కొని దానిలోను దాని ప్రక్కనగల చెరువు శికం లోనూ చిన్నచిన్న రాళ్లను, మట్టిని గుట్టగా రాశి పోసినారు. దానితో సగం చెరువు నిండి పోయింది. అందు వల్ల చెరువు క్రింద ఉన్న పొలాలలో రైతులు ఎడాపెడా బోరుబావులు తవ్వుకున్నారు వాటికొరకై చాలా మంది రైతులు అప్పుల పాలైనారు. క్రమంగా గుట్ట క్వారీవారిచే నేలమట్టం చేయబడడమే కాక, ఇంకా భూగర్భంలోనికి కూడా వెళ్ళి మైనింగ్ చేయడంవల్ల బోరుబావులు కూడా ఎండి పోయినాయి దానితో చేసేదేమీలేక రైతులు తమ సంప్రదాయ పంటలను విడిచి ప్రత్తి పంటను వర్షాధారంగా పండించడం మొదలు పెట్టినారు.

ఆ రాత్రి తన ఇంటి ముందు కూచున్న ఇరుగు పోరుగువారికి, తిరుపతికి, తన కల్లు మండువాకు కల్లు త్రాగడానికి వచ్చే వారికి వినపడునట్టుగా, తాను దుబాయిలో ఆల్‌బుర్జులో పని చేసినప్పుడు రాసుకున్న బండారిగాడు పిట్ట పాటను గొంతెత్తి పాడిండు వెంకటగౌడు.

పాట విన్న అందరి హృదయాలు బరువెక్కినయ్. నిశ్చింతగా తాము గడిపిన గత కాలపు బ్రతుకుల్లో నిప్పులు పోసిన గ్రానైటు మైనింగ్‌ను, అనుమతి ఇచ్చిన గ్రామపంచాయతీని. ఆ గ్రామ మాజీ సర్పంచును తిట్టుకుంటూ ఎవరి ఇంటికి వారు వెళ్ళి పోయినారు.

తెల్లారితే శుక్రవారం కోట్లనర్సింహస్వామికి మన మొక్కులను తీర్చుకోవడానికి పోవలసి ఉందని కావున తొందరగా తిని పడుకొని రేపు పొద్దునే వెళ్లిపోదాం అని తొందరపెట్టింది లక్ష్మమ్మ.

దానితో అందరూ రాత్రి భోజనాలు చేసి నిద్రలోనికి జారుకున్నారు.

# 14

తెల్లారింది కోట్ల నరసింహ్మాస్వామికి మొక్కుకున్న సరంజామా అంతా తీసుకోని కోట్ల నర్సింహుల పల్లికి అందరూ ఆటోలో బయలు దేరింద్రు. సర్వారెడ్డి పల్లెనుండి వెంకటగౌడు. అత్తమామాలు బయలు దేరి ఆ రెండు గ్రామాల మద్యనున్న కోట్లనర్సింహులపల్లెకు వచ్చింద్రు.

కోట్ల నర్సింహుల పల్లె ఒక పెద్ద బోడగుండు గుట్టను ఆనుకొని ఉంది. ఆ బోడ గుట్టపై క్రీ॥పూర్వమే ఆ గుట్టపై ఒక పెద్దకోట కట్టినారు. ఆ గుట్ట క్రిందనే ఒక పెద్ద కందకం, దాని లోపలి ప్రక్కన ఆ కందకం తవ్వకానికి తీసిన మట్టితో ఆ గుట్టచుట్టూ మట్టితో ఎతైన మట్టి కోట గోడ కట్టినారు. ప్రస్తుత గ్రామం ఆ కాలంనాటి మట్టి గోడల పై నిర్మించ బడింది. కావున ఆ గ్రామానికి కోట్ల నర్సింహులు పల్లె అని పేరు వచ్చింది, ఆ గ్రామం గుట్టకు దిగువన దక్షిణం వైపు ఉంది. ఆ గుట్టకే దక్షిణం దిక్కున, ఊరికి పడమటి వైపున గుట్టకు ఒక యాభై అడుగుల ఎత్తున విశాలమైన నరసింహ్మ స్వామి దేవాలయం ఉంది. ఆది పూర్తిగా రాతితో నిర్మితమైంది. దానికి ఎరురుగా ఒక ఎతైన రంగమంటపం కూడా నిర్మించబడింది. ఆ నరసింహ్మాస్వామి దేవాలయం వెనుక గల గుట్టకు చాలా ఎత్తున పంచముఖ నరసింహ్మాస్వామి విగ్రహం చెక్కబడింది, కొంత భిన్నమైనా అది చాలా అందంగా వుంది, ఈ దేవాలయం క్రీ॥ పూర్వమే శాతవాహనుల కాలంలో నిర్మించ బడిందని చరిత్రకారులు చెపుతున్నారు. ఆ దేవాలయానికి తూర్పున, ఆ కొండ అంచులో మరో యాభై అడుగుల ఎత్తున ఒక నీటి గుండం వుంది, ఆ గుండం ప్రక్కనే చిన్న శివాలయం వుంది. దాని ముందు భాగంలో చిన్న రాతి మంటపం వుంది. నరసింహ్మాస్వామిని దర్శించు కోవడానికి వచ్చిన భక్తులు ముందుగా ఆ పుష్కరిణిలో స్నానం చేయడం ఆనవాయితి.

అందరూ కోనేటిలో దిగి స్నానాలు చేసినారు. ఆ కోనేటిలో వేసవి కాలంలోనయినా నీరు వుంటుంది. వెంకటగౌడు ఆ కోనేటిలో ఈ దరి నుండి ఆ దరి వరకు ఈది తన ఈత సరదా తీర్చుకున్నడు. స్నానాదులైనంక అక్కడ వున్న శివుని దర్శించుకుని, కొబ్బరికాయ కొట్టినారు. తరువాత అంతా ఆ శివాలయానికి గోడలాగా వున్న పాత కాలం కోటగోడకు గల చిన్న ద్వారం గుండా మెట్ల నుండి గుట్ట క్రిందకు దిగి, ఆ గుట్ట పాదం చెంతనే ఊరికి ఆనుకొని ఉన్న బండ్లబాటపొంట పడమరవైపున ఉన్న నరసింహ్మాస్వామి దేవాలయం క్రిందకు చేరుకున్నారు.

అక్కడ గుట్టను ఆనుకొని ఒక యాభై అడుగుల ఎత్తున గుడికి మెట్లు నిర్మించబడినవి.

ఆ మెట్లకు కుడి వైపున రథశాల, అందులో ఐదు అంతస్తుల ఎత్తుతో నిర్మించ బడిన రథం ఉంది.

ఆ రథశాలకు ముందు మరో వంద మీటర్ల దూరంలో ఒక పెద్ద మంచినీటి బావి ఉంది. దానికే పంపు బిగించబడి త్రాగు నీటిని గుట్టపైని దేవాలయానికే కాక, ఊరికి త్రాగటానికి కూడా సరఫరా చేస్తున్నారు. ఆ బావి ప్రక్కనే ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వుంది. ఆ ప్రక్కనే యాత్రికులు బస చేయడానికి చిన్న మంటపం వేయబడింది. దానికి మూడు వైపుల గోడలు. పై కప్పుతో వుంటుంది కాని తలుపులు లేవు. గుట్ట మెట్లు ఎక్కడానికి ముందు లక్ష్మమ్మ ఓ కొబ్బరికాయను మొదటి మెట్టుమీద కొట్టి దేవుడికి మొక్కుకున్నది. తరవాత అందరూ దేవాలయం లోని గర్భగుడికి చేరుకున్నరు.

వెంకటగౌడు చేత నరసింహ్మాస్వామికి వెండి కోరమీసాలను ఇప్పించింది లక్ష్మమ్మ, తరువాత వారివారి నామాలపై దేవునికి పూజ చేసికొని తలో కొబ్బరికాయ కొట్టినారు అయ్యగారికి ఒక యాభై రూపాయలు దక్షిణ సమర్పించు కున్నారు. పూజ ఐపోయిన తర్వాత క్రింద గల మంటపంలో నరసింహ్మాస్వామి పేర రెండు కోళ్లను కోసుకొని వండుకున్నరు.

అందరూ భోజనాలు చేసి కొద్ది కాసేపు ఆ ఆవరణలోనే విశ్రమించినారు. సాయంత్రం మరోసారి దేవుని దర్శించుకున్నారు. పగలు తినగా మిగిలిన కోడికూరతో రాత్రి భోజనం చేసి అక్కడే నిద్రచేసే మొక్కు ఉన్నందున ఆ మంటపం లోనే నిద్ర చేద్దామని, నిర్ణయించుకున్నారు.

పూజారి జనార్ధానా చార్యులు రాత్రి పూజాదికాలు ముగించి ఇంటికి పోతున్నవాడల్లా ఆగి సూరయ్యను పిలిచి, "రాత్రి ఇక్కడ పడుకోవడం క్షేమకరం కాదని, గుడ్డేలుగులు తెల్లందాక తిరుగుతాయి కావున మీరంతా తానుండే దొరగారి ఇంటి ఆవరణలో నిద్ర చేసినా ఫలితముంటుంది. అక్కడికే రండి" అని చెప్పడంతో వారంతా తమ సామాను సర్దుకుని పూజారి వెంట దొరగారి ఇంటికి పోయినారు, పూజారి కూడా భోజనం చేసివచ్చి వరండాలో నున్న తక్తబల్ల మీద తీరుబడిగా కూర్చున్నాడు

"గుడ్డెలుగులు ఎందుకు గుడి ఆవరణలోనికి వస్తూన్నాయని"వెంకటగౌడు, తనను తొలుస్తున్న సందేహాన్ని బైటపెట్టిండు.

పూజారి నిట్టూర్చి "ఏముంది ఈ గుట్టకు పడమటివైపున ఉన్న మీ గ్రామ తెట్టుగుట్టను, అటు తూర్పువైపున ఉన్న సర్వారెడ్డి పల్లె గుట్టలను గ్రానైటు మైనింగ్‌లో కూల్చి నందున ఆ గుట్టల మీద నివాసమున్న గుడ్డేలుగులన్ని ఈ గుట్టకు వచ్చి చేరినయి, అవన్ని గుట్టకు ఉత్తరంవైపున, తూర్పు, మరియు పడమటి వైపున గుట్టకు దిగువన

ఉన్న బండల సొరికెలలో నివాసమేర్పరచు కున్నాయి. ఇక దక్షిణం వైపున ఊరు వుండటంతో ఇటువైపు ఉండవు, కాని రాత్రి గుట్టపై నున్న కోనేరులో నీరుత్రాగడానికి గుడ్డేలుగులు ఈ వైపుకు వస్తాయి, ఆ క్రమంలోనే కొన్ని సార్లు ఊళ్లోకి వస్తాయి. రాత్రి ఐందంటే గ్రామస్తులు బయటకు రావడానికి జంకుతున్నారు" అన్నాడు

"అంతే కాక "మీ ఊరి తెట్టుగుట్టను గ్రానైటు రాయికి తీసుకున్న కంపెనీ వారు ఈ గుట్టకు కూడా ఎసరు పెట్టినారు" అని చెప్పిండు.

"మరి ఏమైంది" అని వెంకటగౌడు అడిగిండు

అదో పెద్ద రామాయణం అంటూ పూజారి మొదలు పెట్టిండు. "నిజానికి ఈ దేవాలయం, గుట్టపై కోటను క్రీ॥ పూర్వమే శాతవాహనుల కాలంలో కట్టబడింది, తరువాత వేములవాడ చాళుక్యుల కాలంలో కూడా ఉన్నతమైన దశలో ఉండింది, తురక రాజుల కాలంలో కొద్దిగా రాజాదరణ తగ్గినా, స్థానిక కలికోట కరణం దొరలు దీని బాగోగులు చూచేవారు, వారు రామడుగులో గడికట్టుకొని, దీనిని సంరక్షించుతూ ఉన్నారు, ఇప్పుడు ధర్మకర్తగా నున్న కీర్తికుమార్ గారి తాత గారైన వెంకట రంగారావు దొరగారు, కోనేరువద్దనున్న శివాలయాన్ని తిరిగి నిర్మించి శంకారాచార్యులచే మళ్ళిప్రతిష్ట చేయించినారు. నిజానికి వారు స్మార్త వ్యాపారులైనా నరసింహ్మస్వామిని కూడా వారి ఇలవేల్పుగా భావించి ఆదరిస్తూఉన్నారు, కీర్తికుమార్ దొరగారికి తమ వంతుగా ఇక్కడి భూములు, ఈ ఇల్లు సంక్రమించినాయి, వారు వృత్తిరీత్యా కరెంటు డిపార్టుమెంటులో సూపరింటెండెంట్ ఇంజనీరుగా రిటైరు అయినంక కరీంనగరంలో స్థిరపడినారు, వారే నన్ను ఇక్కడ పూజారిగా నియమించి, ఈ ఇంటిలో ఉంచి, నరసింహ్మస్వామికి ధూపదీప నైవేద్య లోటు రాకుండా కాపాడుతున్నారు. వారి కొడుకు అమెరికాలో ఉంటాడు. తన తల్లి తండ్రులను కొడుకు ఆర్నెల్ల వరకు తమ వద్ద ఉండటానికి పిలిపించుకున్నారు.

దొరగారు ఇక్కడ లేని సమయంలో తెట్టుగుట్టను గ్రానైటు మైనింగ్ చేసిన కంపెనీ వారు, ఈ నరసింహ్మ స్వామి గుట్టకు కూడా పర్మీషన్ తెచ్చుకున్నారు. అప్పటి సర్పంచుకు, మరియ పంచువులకు చాలా డబ్బులు ముట్టచెప్పగా అందరూ గుట్టుచప్పుడు కాకుండా అనుమతి ఇచ్చినారు. దాని తర్వాత ఆ కంపెనీవారు గుట్టకు తూర్పువైపున ఉన్న ఒక రైతుకు ఆధిక మొత్తం చెల్లించి ఐదు ఎకరాల భూమిని కొన్నారు.

ఇంతలోనే కీర్తికుమార్‌దొర తిరిగి రావడం జరిగింది. వచ్చిన వెంటనే జరిగినది తెలిసి గ్రామపెద్దలందరినీ కూర్చోపెట్టి మైనింగ్ వల్ల జరుగు కష్టనష్టాలను ఏకరవు పెట్టి, ఘనమైన చరిత్ర గల దేవుని గుట్టను కాపాడుకొవలపిన ఆవసరం గూర్చి వారికి తెలియ చెప్పిండు. మళ్ళీ గ్రామస్తులందరితో మా గుట్ట మాకే కావాలని ఇంతకు ముందు

సంతకాలు చేసి ఇచ్చినది మమ్ము మోసంచేసి తీసుకున్న సంతకాలనీ, ఆ గ్రామ సర్పంచు మమ్ములను తప్పుదారి పట్టించాడని కావున ఆ గుట్టకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని ఒక వినతి పత్రాన్ని కలెక్టరు గారికి మైనింగ్ డిపార్టుమెంటు వారికి ఇచ్చినారు.

అంతేకాక అటవీశాఖ నుండి ఆ గుట్టపై గల జీవరాసుల వివరాలను, చెట్టుచేమల వివరాలను తీసుకున్నారు, అదే విధంగా పురావస్తు శాఖ నుండి ఆ గుట్టపై పురాతనమైన కోటుందని, మరియు పురాతనమైన దేవాలయం కూడా వుందని ధృవీకరణ పత్రం తీసుకున్నారు, హిందూ దేవాదాయ శాఖ నుండి కూడా దేవాలయం ఎండోమెంటు డిపార్టుమెంటు పరిధిలో వుందని వారు నెలకు రెండువేల రూపాయిలు పూజారికి భత్యం చెల్లిస్తున్నారని కావున ఇచ్చిన గ్రానైటు తవ్వకం లీజును రద్దు చేయమని కలెక్టరు గారినుండి ప్రధాన కార్యదర్శి వరకు విన్నవించుకున్నారు. దానితో పాటు పురావస్తుశాఖ కమీషనర్ వారు తమకు ఆ కోటను అప్పగించాలని, ఆలాగే దేవాదాయ శాఖ కమీషనర్ తమకు ఆ దేవాలయాన్ని అప్పగించాలని కోరిన విన్నపాన్ని కూడా ప్రధాన కార్యదర్శికి సమర్పించినారు. ప్రస్తుతానికి గ్రానైటు మైనింగ్ ఆగి పోయింది కాని, ఈ ఊరిలోనే ఇంకా ఆరు గ్రానైటు క్వారీలకు అనుమతులు ఇచ్చారని, ఆ గుట్టలన్ని అయిపోయిన తర్వాత ఈ గుట్టకూడా ఎంకానుందో ఏమో అంతా ఆ భగవంతుని దయ అన్నాడు పూజారి.

అంతా విని వెంకటగౌడు “అసలు పాలకులే దొంగలైనంక భగవంతుడేంజేస్తడు. అడ్డుకుంటే ప్రజలంతా ఐక్యమైతేనే సాధ్యం” అన్నాడు నిద్రకుపక్రమిస్తూ.

తెల్లారింది అంతా మరోసారి కోనేటిలో స్నానం చేసినారు, ఈసారి దూరంగా సర్వారెడ్డిపల్లెలో గుట్టపైన జరుగుతున్న గ్రానైటు మైనింగ్‌ను చూచినాడు. ఈ లెక్కన కరీంనగరం జిల్లాలోని అన్నిగుట్టలను ఈ మైనింగ్ రాక్షసులు మింగేటట్లు ఉన్నారనుకున్నాడు.

మళ్ళీ ఒక సారి నరసింహ్మాస్వామిని దర్శించుకొన్నారు.

ఈ సారి నరసింహస్వామిని తిరిగి అవతరించి ఈ బండాసురుల భరతం పట్టమని మనసారా దేవుని మొక్కుకున్నడు వెంకటగౌడు. తరువాత వారి ఊరికి వెళ్ళి పోయారు.

# 15

మర్నాడు వెంకటగౌడుకు తన చిన్ననాటి స్నేహితుడైన కుమ్మరి రాజేశంను చూద్దామని ఊరి చివర చెరువు ప్రక్కన ఉన్న వాళ్ళ ఇంటికి పోయిండు. ఇల్లు చూడగానే సగం కూలి పోయి ఉంది. ఇంట్లో ఎవరూ లేనట్లుగా వుంది. ఇంటికి ముందు గల కంపౌండు

గోడకూలి పోయి వుంది, సగం కూలిన గోడకు ఇంకో దిక్కున సగం కూలిన కుమ్మరి ఆవం కనబడింది. అందులో కొన్ని కాలీకాలని కుండలు వదలి వేయబడి ఉన్నాయి. కుమ్మరి ఇంటి వారి ప్రక్కన గల దూదేకుల హుస్సేన్‌ను అతని ఇంటి ముందు కూచొని ఉన్నది చూసి,

"కుమ్మరోల్లు ఏరి" అని అడిగిండు.

హుస్సేన్ ఏం చెప్పమంటావన్నట్లుగా చూచి, "గుట్టను తొలగించినంక కోతులు అన్ని ఊరిపైబడి గూన పెంకల ఇళ్ళపై కప్పులను పాడు చేయడంతో గ్రామస్తులందరూ తమ ఇంటి కప్పులను సిమెంట్ రేకులతోను. కొందరు డాబా ఇల్లు నిర్మించు కొవడం వల్లను, ఇక కుండలకు బదులుగా ప్లాస్టిక్, స్టీలు బిందెల వల్ల వారికి ఈ ఊరిలో పని లేకుండా పోయినందున పొట్టగడవడం కష్టమై, కరీంనగరంలో కూలి పనులకు వెళ్ళిండ్రు." అన్నడు.

వెంకటగౌడుకు చాలా విచారం కలిగింది, ఒకప్పుడు ఈ శాలివాహనులే కదా శాలి వాహన సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలించింది. ఇప్పుడు వారికి పట్టిన దుర్గతికి బాధపడ్డాడు. అక్కడి నుండి వెంకటగౌడు కుమ్మరి మట్టయ్య ఇంటి వైపు నడచిండు, కుమ్మరి మట్టయ్య కొడుకు వీరయ్య ఎలా ఉన్నది చూద్దామనే కతూహలంతో.

మట్టయ్య ఇంటికి వెల్లగానే ఆయన భార్య బూదమ్మ ఒక్కసారి బావురు మని శోకం పెట్టింది. వెంకటగౌడు బిత్తరపోయిండు అంతలోనే తేరుకొని "మట్టయ్య మామెక్కడ" అన్నాడు.

బూదమ్మ ఏడుస్తూనే వరండాలో దండ వేయబడి, గోడకు వేలాడుతున్న మట్టయ్య ఫోటోను చూయించింది. దానితో మట్టయ్య పోయిన సంగతి అర్ధమై "మామ ఎలా పోయిండత్తా" అడిగిండు.

ఏడ్పు ఆపి. కన్నీళ్లను, ముక్కును కొంగుకు తుడుచుకుంటూ, గద్గద స్వరంతో బూదమ్మ "ఏమున్నది కొడుకా ఆయన పోయి బాగానే ఉన్నడు, కాని నాకు వచ్చిన కష్టం పగవాడికి కూడా రావద్దు బిడ్డా! నీవు పోయినంక పోలీసుల బాదలు పడలేక కొడుకు వీరయ్య, లక్ష రూపాయల అప్పుతెచ్చి దుబాయి పోయిండు అక్కడ పర్మనెంటు ఉద్యోగం లేక "కలివెళ్ళి"గా పని చేస్తుండు. వాడు అప్పుడప్పుడు పంపే ఐదు, పది వేలు వడ్డీలకే సరిపోతలేవు. ఈ లోగా మీ మామాకు కాన్సరు రోగమచ్చింది. దానికి కరీంనగరంల, పట్నంలోని దావాఖాన్లకు లక్షన్నర ఖర్చైనై. ఆయన కడసారి చూపులకు కూడా వీరయ్య రాలేక పోయిండు. ఉన్న ఎకరం అమ్మి అన్ని అప్పులు తీర్చి, ఇక నేను బొగ్రాయోలే ఉన్న, నారాత గట్లున్నది. ఏంచేసేదుంది బిడ్డా, ఇక కోడలు, తల్లి గారి ఇంటి బాట

పట్టింది. నేనేమొ దొరికిన్నాడు కూలి చేసుకుంటున్నా లేన్నాడు ఉపాసముంటున్న బిద్దా" అంది.

దానితో విచారం చెందిన వెంకటగౌడు తనలో "కలివెళ్ళి" కూలి బతుకులు ఎలా వుంటాయో తెలిసిన వాడు కావున, నిజం చెప్పి ఆ తల్లిని భాద పెట్టే బదులు "అవ్వా! ఏమైతే నేమి వీరయ్య తప్పకుండా వస్తాడు" అత్తా అని రెండు ఉప్పస మాటలు చెప్పి, అయిన వాళ్ళకు నిజాలు చెప్పలేని నిస్సహాయతకు దిగులు పడగా, మనసులో మనసు లేకుండా పోయింది. మనిషి కాలేదు, ఛిద్రమైన పోతున్న గ్రామీణ వ్యవస్థలో కులవృత్తి కర్మకారుల దీన పరిస్థితి వెంకట గౌడు చలించి పోయిండు. ముఖ్యంగా వీరయ్యకు జరిగిన అన్యాయం అతన్ని చాలా కలవర పెట్టగా, పాటగా మారింది.

కుండమ్మ కుండా–ఓ మట్టికుండా
కుండమ్మ కుండా– నువ్వు చరిత నిండా
మాయి ముంతా నుండి–కడకు కాటి కుండ
మా సావుపుటుకల్లో–తోడిడవకుండా! కుండమ్మ!
నాగరికతల్లో నీ ఆనవాళ్ళు–ఆదినుండే అగుపడుతుండా
మృణ్మయ రూపాల్లో సబ్బండ కులాలు–వర్ణాలు నిన్ను వాడుత వుండ
ధాన్యము, దవ్యము, ద్రావణాలెన్నో–దాసుకుంటివి ఖరాబు గాకుండ
కుల, మత, వర్గ భేదాలు లేకుండ–దాహాన్ని దీర్చె మంచి నీళ్ళకుండ! కుండమ్మ!
ఎల్లమ్మ, పోషమ్మ, పెద్దమ్మ అమ్మా–దేవుండ్ల కిష్టమైన భోనంకుండ
అస్సేను ఉస్సేను ఆటల జోరు–పీరీల పండుగకు మట్కీల కుండా
వగరు, పులుపుల. తీపి కలెగల్సి వండా–ఊగాదినాటి పచ్చడి కుండా
జాతర్ల శివసత్తి దుంకాడుతుండా–నెత్తిన భోనం ఏటుకదలకుండా! కుండమ్మ!
ఊరందరీ మురికి సాకరి కుండల్లో–తెల్లమల్లెగా ఉడుకుతూ వుండా
గౌడన్న ఆశలు కల్లుకుండా నిండి–సుయ్యంటు మీదికి పొంగుతా వుండా
పాలు, పెరుగుతో నిండి కిందికందాకుండా–ఊట్టి మీదావుండి ఊరించుతుండా
సందు దొరికిందంటే పిల్లులూకొన్ని–కుండనా మూతెట్టి ఊరుకు దొరకాకుండా ! కుండమ్మ!
తెలుగు సామెతలల్లో నిలిచి జనుల నోళ్ళల్ల నానుతూ ఊండా
పురాణ కథలల్లో వెదికినా కొద్దీ–నువ్వే మాకు దొరువుతా వుండా
పుణ్యకార్యమైనా, కర్మకాండలైనా–అంతటా నువ్వు ఉందువే నిండా
ఆంతటా నువ్వే నిండా పరుచుకున్నా–నేడు చేసెవ్వడూ నిన్ను ఎటూ గాకుండా! కుండమ్మ!
సారె తిరగాకుండ వాముగాలకుండా

కుమ్మరన్న ఇంట కుండ ఉడుక కుండ
ఆకలి కొలువుండ దీపమెలగా కుండ
కుండమీద ఎవ్వడేసెర బండా....
పట్టాలిరా పట్టు వాన్నోదలకుండా! కుండమ్మ!
అంటూ వ్రాసుకునే సరికి మనసు తేలికపడింది వెంకటగౌడుకు.

తెల్ల వారింది వెంకటగౌడు అన్ని కార్యక్రమాలు ముగించు కొని దుబాయిలో మరణించిన కుమారస్వామి ఇంటికి పోయి ఆయన భార్య నరసమ్మను మందలించిండు నర్సమ్మ వెంకటగౌడును చూడగానే "అన్నను ఏడిడిసి పెట్టి వస్తివి తమ్మీ" అంటూ శోక గీతం అందుకున్నది,

"ఆక్కా సైసు అక్కా సైసు, నివ్వే గిట్లయితే బిడ్డలేం కావాలే అక్కా" అంటూ ఊరడించిండు.

"ఆయన పోయిన రెండేళ్ళకే ఆయన తల్లితండ్రులు పోయింగ్రు తమ్మీ, తానోక్కతే అప్పుకొరకు ఉన్న నాలుగెకరాలలో రెండెకరాలు అప్పులవాల్లకు ఇచ్చిన, మిగిలిన రెండెకరాలు పాళ్ళకు ఇచ్చి తానూ, తన పెద్ద బిడ్డ కూలి నాలి చేసుకుంటున్నాం. చిన్న దానిని సర్కారు బడికి పంపిస్తున్నా రెండవ తరగతి చదువుతుంది. దేవుడి దయవల్ల నీవు సుఖంగా ఇంటికి అచ్చినవు" అంది.

ఇలా వెంకటగౌడు, ఆ ఊరునుండి గల్ఫు వెళ్ళిన కుటుంబాల వారిని కలిసి వారి యోగక్షేమాలు కనుక్కున్నాడు. అందరి ఇండ్లల్లోనూ ఒక్కటే విషాదం. గల్ఫుదేశాలకు వెళ్ళిన వారిలో ఏ నలుగురైదుగురో కొద్దిగా ఆర్థికంగా కుదురుకున్నారని, అదీ ఇక్కడ కుల వృత్తులు ఇంకా పూర్తిగా నశించని గౌడ, వడ్ల మరి కొందరు ఒక మోస్తరు కాపు కుటుంబాలు తప్ప అందరూ ఇంకా అప్పుల్లో కూరుకున్నారని గమనించిండు.

గల్ఫులో పర్మనెంటు పని పై వెల్లిన కుటుంబాల వారు, వారి కొడుకులు పంపిన డబ్బుతో అప్పులు తీర్చినారు, అంతే కాక, మారిన పరిస్థితుల్లో వ్యవసాయాలు నడువవని ముందే గ్రహించిన ధనిక రెడ్డి భూస్వాములు అమ్మిన భూములను తలా ఐదు ఎకరాల నుండి మూడు ఎకరాల వరకు కొన్నారు. కాని ఆ భూముల్లో బోరుబావుల కొరకు మళ్ళీ అప్పులు తెచ్చినారు, ఎప్పుడైతే గుట్ట నేల మట్టమైందో బోర్లలో నీళ్లు రాక అందరూ జూదంలాంటి పత్తి పంటలకు అలవాటు పడ్డరు. అందులోనూ వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

వారంతా ఐదు సంవత్సారాల క్రితం వారివారి కుల వృత్తులైన వేట, పండ్లు సేకరణల ద్వారాను, ఆ గుట్టకే తమతమ గొర్రె, మేకలను పెంచుకొని జీవించే తెనుగు, గొల్ల,

కుర్మలు ఎలాంటి అప్పులు లేని నిశ్చింత జీవితాలు గడిపిన వారు.

వారు అంతకు ముందు వ్యవసాయం చేసినవారు కారు. వారి వారి కుల కసిపులు నశించినంక చేసేదేం లేక రెడ్డి భూస్వాములు భూములు అమ్మినా కొద్దీ వీరు కొన్నారు. కొత్తగా వ్యవసాయం లోనికి అడుగుపెట్టినారు.

ఇక దళితులు గుట్టచుట్టూ ఉన్న తమ అసైన్డు భూములను. అధికధరలకు క్వారీయజమానులకు అమ్మినారు. కాని అవి క్వారీ యజమానులకు పట్టాలు కావు, కావున ఆ దళితులచే అవి పంటలకు అనువైన భూములు కానందున ఆ భూములపై వ్యవసాయం చేయలేమని ప్రభుత్వానికి వాపసు చేస్తూ వారి హక్కులను వదలు కున్నారు. అట్లు యజమాన్య హక్కులను వదలు కున్నందులకే వారికి ఎకరానికి మూడులక్షల రూపాయిలు ముట్టచెప్పి గుట్టచుట్టూ అసైన్డు చేయబడిన భూములను ఖబ్జా చేసినారు క్వారీ యజమానులు. కాని అదే దళితులు కొందరు ఆ డబ్బులతోనే రెడ్డి దొరలు అమ్మిన భూములను కొని సాగు చేస్తున్నారు. వారు కూడా బోరుబావులకు చేసిన అప్పుల్లో కూరుకున్నారు. ఇప్పుడు గ్రామంలో పశువులు లేనందువల్ల పెంటకుప్పలు లేక, సహజ సిద్ధమైన ఎరువులు రైతులకు దొరకడం లేదు.

ఇంకా విషాదం ఏమిటంటే, ప్రతి ఇంటి ముందుగాని. ఇంట్లో గాని అలుకు చల్లడానికి కూడా పెండ కరువై, నీళ్ళలో కృత్రిమమైన పెండరంగును కొనుక్కుని, వాకిల్లు, ఇండ్లు అలుక్కుంటున్నారు.

ఒకప్పుడు అన్ని రకాల ఉత్పత్తులతో స్వయంసమృద్ధిగా ఉన్న గ్రామం నేడు నీళ్ళు కొనుక్కుంటున్నది. పాలు కొనుక్కుంటున్నది, కూరగాయలు కొంటున్నది. మాంసం కొనుక్కుంటున్నదిఒకప్పుడు దాదాపు ఉచితంగా దొరికే పండ్లు ఫలాలు నేడు కొంటున్నది. బారు షాపుల్లో మద్యం కొంటున్నది. ముఖ్యంగా ఇటీవల ప్రతీ వారి చెవిలో జోరీగలోలె సెల్‌ఫోన్‌లు రొద పెడుతున్నాయి, దానితో మాటలను కూడా వారు కొంటున్నారు దాదాపు ఎంత లేదన్నా నెలకు ఆ గ్రామం మొత్తం పైన రెండు లక్షలరూపాయల పైననే సెల్ బిల్లులు కడుతున్నారు.

వ్యక్తిత్వ వికాసానికి పనికి రాని ఇంగ్లీష్ చదువులను కొంటున్నది.

గుట్టపైన దొరికే పొయిలకట్టెలు దొరుకక పోవడంతో చాలా మంది వంట గ్యాసును వాడుతున్నారు, ఈ విధంగా ఒకప్పుడు సర్వ వనరులతో అలరారిన గ్రామం ఇప్పుడు విలవిల లాడుతోంది. పూర్వపు దొరలు నేడు లేకపోయినా, గ్రామంలో నేడు పది హేను ఎకరాల భూములు గల ఆసాములు లేకపోయినా, ఆందరు రైతులు సరాసరిన రెండు లక్షల నుండి ఐదు లక్షల రూపాయిల అప్పులల్లో కూరుకున్నారు. నేడు ఈ విధంగా

ధర్మారం దాదాపు ఏడు కోట్ల రూపాయల అప్పులో మునిగింది.

ఇదంతా మననం చేసుకున్న వెంకటగౌడుకు ఆ నాడు చాలా సేపటికి గాని నిద్ర రాలేదు.

అప్పుపడిన మొత్తంగ్రామాన్ని బండాసుర రాక్షసులు తీసుకొని మొత్తం ఊరిని, ఊరిలోని ఇండ్లను, మనుష్యులను అందరిని భూగర్భంలోనికి చొచ్చుక పోయిన గ్రానైటు మైన్ లోకి తెడ్డు లాంటి ఒక మైలు పొడవైన క్రేన్‌తో తోస్తున్నారు. ఆ క్రేన్‌కున్న బూంకు తగిలించిన బకెట్‌లో లోకి తన ఇంటిని పెకలించిన క్రేన్ ఆపరేటర్, నెమ్మదిగా తిప్పి ఇదివరకు చాలా లోతుగా తీసిన క్వారీలో జార విడువడానికి బకెట్ లివర్‌ను లాగగా, బకెట్ నెమ్మదిగా తలకిందౌతూంటే, తాను, ఆ మైన్‌లో తోయబడే ప్రమాదాన్నుండి తప్పించుకోవడానికి ఆమాంతం కెవ్వు, కెవ్వు మంటూ అరుస్తూ కిందకు దూకిండు వెంకటగౌడు.

ప్రక్కనే పడుకున్న స్వాతి ఆయన నిద్రలో చేస్తూన్న అరుపులతో లేచి, “ఏమైంది నీకు ఏమైంది” అని అరచింది, ఈ సందడికి సూరయ్యా, లక్ష్మమ్మలు కూడా లేచి కొడుకుకేమైందో నని పరేషానైంద్రు.

“ఏంలేదు ఏదో పీడకల” వచ్చిందని నీళ్ళు తాగిండు వెంకటగౌడు.

లక్ష్మమ్మ ఎండు మిరపకాయ, ఉప్పు తీసుకొచ్చి కొడుకుకు దిష్ఠి తీసింది. అప్పుడు లక్ష్మమ్మ ఇంక కొడుకు కోసం వేములవాడ, సమ్మక్క సారక్క, కొండగట్టు అంజన్న మొక్కులు త్వరలోనే తీరుస్తానని మళ్ళీ మొక్కింది, మళ్ళీ చాలా సేపటికి నిద్ర రాలేదు వెంకటగౌడుకు.

“లేదు ఇట్లా గ్రామాలను గ్రానైటు మైనింగ్ పరం కాకుండా చూడాలి” అని నిర్ణమానికి వచ్చిన తరువాత గాని నిద్రపోలేక పోయిండు వెంకటగౌడు.

తెల్ల వారింది సూరయ్యతో వెంకటగౌడు మాట్లాడుతూ, “వచ్చి పదిహేను రోజులైంది, ఇక నేను వేరె పన్నేదైనా చూసుకుంటా నాయనా” అన్నడు, దానికి అడ్డం పోతూ సూరయ్య “నీకు మన కుల కశిపి వచ్చుకదా, నాకా ఇక శాతనైతలేదు వూళ్ళోనే వుండి మన వృత్తితో పాటు, ఇటు యవుసం పని కూడా చేయి” మళ్ళీ దుబాయికి పోతనంటాడేమో అన్నభయంతో తండ్రి అన్నడు, “తాను అక్కడ దుబాయిలో నేర్చుకున్న ప్లంబరు పని ఇక్కడ కరీంనగరంలో కూడా చేయవచ్చుని. తాను కరీంనగరం వెళ్లి పనులు చేస్తానని అన్నడు'', అన్నాడు వెంకటగౌడు. కొడుకు మళ్ళీ దుబాయికి పోయే ఆలోచన మానుకున్నందుకు సంతోషపడి సరే నన్నడు సూరయ్య.

# 16

ఆ ఊరి రెడ్డి దొర ఒకాయన కరీంనగరంలో ఇల్లు కడుతున్న సంగతి తెలిసికొని, ఆయనను కలసి, ఆ ఇంటికి అవసరమైన ప్లంబింగ్ పనులు తాను చేస్తానని చెప్పడంతో ఆయన "సరే" నన్నడు.

వెంకట గౌడు, కరీంనగరం లోనే ఉన్న తన సడ్డకుడి సహాయంతో ఒక మూడు గదుల ఇంట్లో, టికానా పెట్టిండు. తిరుపతి, మరో ఇద్దరి యువకులను సహాయకులుగా తీసుకొని కరీంనగరంలో ప్లంబింగ్ పనులు మొదలు పెట్టిండు.

ఒక రోజు జిల్లా టాబ్లాయిడ్‌లో "దేవుడా నీ గుట్టను నువ్వే రక్షించుకో" అనే శీర్షికన ఒక వార్త వెంకటగౌడుకు ఆకర్షించింది, దానిని ఆతురతతో చదివినాడు. అది బద్దిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి గల దేవుడి గుట్టను గీతా గ్రానైటుకు లీజుకు ఇచ్చినారని, వారు దానిని త్రవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారని, కాని బద్దిపల్లి గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారని, ఆ లీజును రద్దు చేయాలని గ్రామస్తులు ర్యాలీగా వెళ్ళి జిల్లా కలెక్టరుగారికి విన్నవించు కున్నారని ఆ వార్తా కథనం ఆ గుట్ట పోటోతో సహా వేసినారు.

వెంకటగౌడు తీరిక చేసుకొని కరీంనగరంలో తన సడ్డకుని ఇంటికి వెళ్లి నప్పుడు, అక్కడ ముందు గదిలో ఒక ఆజాను బాహుడైన వ్యక్తి కూర్చోని ఉన్నాడు.

సడ్డకుడు, "ఇతను శివరామం, బద్దినల్లి శ్రీ వెంకటేశ్వర ఆలయ కమీటీ అధ్యక్షులు" అని పరిచయం చేసిండు. "నమస్తే" అంటూ, తనను తాను పరిచయం చేసికొన్నాడు వెంకటగౌడు.

తాను పత్రికలో చదివిన విషయాలు యాదికి వచ్చి, "మీ దేవుని గుట్ట పరిస్థితి ఏమిటి" అని అడిగిండు వెంకటగౌడు.

శ్రీ వెంకటేశ్వర ఆలయ కమీటీ అధ్యక్షుడైన శివరామం మాట్లాడుతూ, "మా ఊరికి తూర్పున యాబై ఆరు ఎకరాల గుట్ట ఉంది. అది ఊరికి కేవలం అర కిలోమీటరు దూరంలోనే ఉంది. దానిపై వెనుకట ఎప్పుడో శ్రీ వెంకటేశ్వర ఆలయాన్ని నిర్మించారు, దానికి మెట్లు గూడా నిర్మించారు. ఆ గుట్ట పెద్దపెద్ద గ్రానైటు బండలతో చాలా గంభీరంగా వుంటుంది. దానిని ఆనుకొని ఒక చిన్న కుంట, కొద్ది దూరంలోనే ఒక చెరువు ఉంది దానికి ఈ గుట్టనుండి వచ్చు వర్షాకాలపు వాన జాలులే ఆధారం. అంతే కాక ఆ గుట్టకు తూర్పున కమాన్‌పూర్ గుట్టలు, ఉత్తరం వైపున మల్యాపూర్ గుట్టలు ఉండి మద్య ఒక లోయ లాగ ఉందని. ఆ గుట్టల మద్యన గల కమాన్ పూర్ చెరువు వల్ల ఆ భూముల్లో వరి సాగుచేస్తారు, కాని గత పది సంవత్సరాలుగా కమాన్‌పూర్ గుట్టలకు క్వారీలు నడు

పుతున్నందు వల్ల పొలాలన్ని దెబ్బతిన్నాయి, ఆ గుట్టలలో గల గుడ్డేలుగులు, కోతులు ఈ గుట్టకు వచ్చి చేరినాయి, వాటి వల్ల ప్రజలు రాత్రి వేళల్లో బయటకు రాలేక పోతున్నారు" అన్నాడు.

ఇంకా "మా ఊరు కరీంనగరం పట్టణానికి దగ్గరగా ఉన్నందున పండిన కూరగాయలు, పాలు కరీంనగరంలో అమ్మి ప్రజలు బతుకుతున్నారు. ఈ గుట్ట పోతే ఇదివరకు క్వారీలు ఉన్న ఊళ్ళ లాగానే మా ఊరిలోను నీళ్ళకు కరువు రానుంది. దానితో మా గ్రామ ఆర్థిక వ్యవస్థ కుప్పకూల నుంది, కావున ఎట్టి పరిస్థితి లోనూ క్వారీని అడ్డు కోవాలను కున్నట్లు గ్రామస్థులు నిర్ణయించు కొన్నారని" చెప్పిండు శివరామం.

"మరి మీ గుట్టకు గ్రానైటు క్వారీకి ఎలా అనుమతి వచ్చింది" అని అడిగిండు వెంకటగౌడు.

"ఏముంది పాత సర్పంచును, పంచువులను ప్రలోభాలకు లోను చేసి "నో ఆబ్జక్షన్ లెటరును" గ్రామ పంచాయతీ నుండి పొందినారని. అప్పుడు ఈ విషయం గ్రామస్తులకు ఎవరికీ తెలియదు. కాని తెలిసిన తర్వాత గ్రామస్తు లందరూ నిలదీసిన తర్వాత, మా గుట్టకు క్వారీ పెట్టవద్దని మరో తీర్మానం ఆమోదించి అధికారులకు సమర్పించినారు, కాని ఏం లాభం లేకుండా పోయింది ఇంకో గమ్మత్తుఅయిన విషయం ఏమంటే ఈ గుట్టను ఆనుకొనే ఉత్తరం వైపు దాదాపు ఐదు వేల ఇందిరమ్మ ఇండ్ల గృహసముదాయాన్ని బలహీన వర్గాల వారి కొరకు కేవలం వంద మీటర్ల దూరం లోనే నిర్మించినారు, పైగా ఆ గుట్టకే వన సంరక్షణ సమితి వారు లక్షలు ఖర్చు పెట్టి వృక్షాలను పెంచినారు. ఆ గుట్టపై సీతాఫల వనం ఉంది. దానికి దగ్గర లోనే దళితుల ఇండ్లు కూడా ఉన్నాయి. కాని దీనిని క్వారీకి తీసుకున్న వారు స్థానిక యంఎల్ ఏ కుటుంబ సభ్యులు కావున మేము ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం మా మాటలు వినడం లేదు." అన్నాడు.

పైగా కరీంనగరం పట్టణానికి కూత వేటు దూరంలోని, చింత కుంట, కమాన్‌పూర్, మల్కాపూర్, బద్దిపల్లి, రేకుర్తి గ్రామాలను కరీంనగరం కార్పోరేషన్ లో చేరకుండా అడ్డుకుంటున్నారు.

"మరి మీరేం చేస్తున్నారని అడిగిండు వెంకటగౌడు".

"మేమేం జేస్తం సాధ్య మైనంత వరకు కొట్లాడుతం. మా ఆందోళనను గమనించిన మానవ హక్కుల సంఘం తరపున నలుగురు కార్య కర్తలు శ్రీమతి శాలినీ, కరీం, కనకస్వామి రామారావు హనుమంతు, మరియు ఇక్కడి శాతవాహన యూనివర్శిటీలో అధ్యాపకురాలిగా పని చేయు చున్న దుర్గాదేవి గారలు వచ్చి మాకు సంఘీభావం తెలిపినారు" అన్నాడు శివరామం

"అంతే కాక మా గ్రామంలో గుట్ట పోతే ఏం నష్టం జరుగుతుందో తెలుపుతూ దుర్గాదేవి అధ్వర్యంలో "బద్దిపల్లి వేంకటేశ్వర స్వామి గుట్టను గ్రానైటు రాక్షసుల నుండి రక్షించుకుందాం రండి" అనే కరపత్రాన్ని ప్రచురించి మా గ్రామస్తులను చైతన్య పరచినారు." అన్నాడు శివరామం.

"మళ్ళీ ఎల్లుండి పొద్దున ఊళ్ళో మీటింగ్ ఉంది, దాని తర్వాత గుట్టచుట్టూ మానవ హారం ఏర్పాటు చేస్తాము" అన్నాడు శివరామం.

"అయితే, నేను తప్పక వస్తాను" అన్నాడు వెంకటగౌడు.

"వెల్ కం సార్" అన్నాడు శివరామం.

బద్ది పల్లి గ్రామస్తులంతా అనుకున్న రోజున గ్రామంలోని పంచాయతీ ఆఫీసు ముందు గూమి కూడింద్రు. దుర్గాదేవి, కనకస్వామి, రామారావు, హనుమంతు వచ్చినారు. అప్పటికే అక్కడికి వచ్చిన వెంకటగౌడును వారికి పరిచయం చేసిండు శివరామం.

మీటింగ్ ప్రారంభం అయింది. అందరూ ఏట్లైనా శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్టను కాపాడు కోవాలని అన్నారు.

వారి నుద్దేశించి దుర్గాదేవి, మాట్లాడే ముందు వెంకట గౌడు లేచి "రాతి బండ పాట" పాట పాడి ప్రజలను ఉత్తేజితులను చేసిండు. ఒక కరపత్రాన్ని వెంకటగౌడుకు ఇచ్చిండు హనుమంతు.

దానిని చదివిన గౌడు"నేను కూడా మీతో ఉద్యమంలో పాలు పంచుకుంటాను." అన్నాడు.

దుర్గాదేవి మాట్లాడుతూ ప్రజలంతా "ఒక్క తాటి పై నిలుచుంటే మీ గుట్టను రక్షించు కోవటం చాలా సులువని ముఖ్యంగా మహిళలంతా కలసి కట్టుగా ఉద్యమం నడిపితే క్వారీని రద్దు చేయించ వచ్చని" అన్నది.

"ఈ ఉద్యమానికి నాందిగా, నేడు మనమంతా కలసి గుట్టవద్దకు వెళ్ళి మానవ హారంగా ఏర్పడుదాం పదండి" అన్నాడు శివరామం.

క్షణాల్లోనే పక్కకున్న దుకాణ దారున్ని కొన్ని పాత పత్రికలు అడుక్కొని వచ్చి వుండలుగా చేసి, బండా సరుని దిష్ఠిబొమ్మను తయారు చేసిండు హనుమంతు. మరి కొందరు యువకులు దానిని పాడెపై కట్టినారు. దానికి "క్వారీ రాక్షసుడు" అను పేరు తగిలించినారు. ఆ దిష్టిబొమ్మతో పాటు ప్రజలంతా ఊరేగింపుగా శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్ట వద్దకు కదలినారు.

దారిలో, "మా గుట్ట మాకే కావాలి, క్వారీని రద్దు చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ, అంతా గుట్టవద్దకు చేరినారు, అక్కడ యువకులు బండాసురుని దిష్ఠిబొమ్మను

తగుల పెట్టినారు, తరువాత ఆ గుట్ట చుట్టూ మానవ హారంగా ఏర్పడిన గ్రామస్తులంతా నినాదాలు చేసినారు. ఏది ఏమైనా మా గుట్టను కాపాడు కుంటామని ప్రతిన చేసినారు. ఈ ఉద్యమాన్ని గురించి అన్ని పత్రికలు జిల్లా పేజీల్లో పోటోలతో సహా ప్రచురించినారు.

బద్దిపల్లి లొల్లి తరువాత దుర్గాదేవి, కనకస్వామి, హనుమంతు, రామారావు, వెంకటగౌడు దుర్గాదేవి ఇంట్లో సమావేశమైనారు. రామారావు మాట్లాడుతూ“కరీంనగరం జిల్లాలో ఏడు వందల క్వారీల ద్వారా వున్న గుట్టలనన్నిటిని కూల్చుతున్నారని దీనిని ఎట్టిపరిస్థితుల్లోను అడ్డుకోవాలని, ఆదే లక్ష్యంగా ఒక ఉద్యమ సంఘాన్ని నిర్మించాలని అన్నాడు” దానిని దుర్గాదేవి బలపరిచింది. మిగతా సభ్యులు కూడా అంగీకరించారు. దానితో ఆ సంఘంకు ఏ పేరైతే బాగుంటదని చర్చ మొదలైంది.

వెంకటగౌడు మాట్లాడుతూ “ఒక్క గ్రానైటే కాక బొగ్గు, ఇసుక, ఇనుము, రంగురాళ్ళు, సున్నపు రాయి ఇతర ఇరవై ఎనిమిది రకాల ఖనిజ సంపదే కాక నీటి వనరులను కూడా పెట్టుబడిదారులు దోస్తున్నారు. చివరకు మొత్తం తెలంగాణానే మరో బొలీవియా లాగా మార్చనున్నారు”, అంటూ,

“అందు కొసమే చంద్రబాబు మైనింగ్ పరిశ్రమను ముఖ్యమైన “గ్రోత్ ఇంజనుగా” తన విజన్2020 లో చేర్చిందు” అన్నాడు.

ఇంకా మాట్లాడుతూ “మొత్తం తెలంగాణాను మైనింగ్ చేయాలంటే, తెలంగాణాలోని, తాగు. సాగు నీటి వనరులను ధ్వంసం చేయాలి, అందులో భాగంగానే, భూమాత రొమ్ములుగా నుండి, ప్రజలను పోషిస్తూవున్న గుట్టలను, వాటి ప్రక్కన ఉన్న చెరువులను నాశనం చేయందే సాధ్యంకాదనే ఆలోచనతోనే గ్రానైటు పరిశ్రమను ప్రభుత్వం ముందుకు తెచ్చింది.” అంటూ, “ఆదే సమయంలో నీరురాని దేవాదుల, ప్రాణహిత చేవెళ్ళలాంటి మోసపూరిత ప్రాజక్టుల పేర కూడా అనేక గుట్టలకు సొరంగాలు తవ్వుతుంద్రు. దీనితో ప్రజానీకం నీరు లేని భూములను వదలివేయగా, మొత్తం తెలంగాణా ప్రజలను సులభంగా నిర్వాసితులను చేసి, సమస్త తెలంగాణాను మైనింగ్ చేయవచ్చనే ప్రణాళికతోనే, కనపడ్డ గుట్టలన్నీటిని పగలగ్గొడుతున్నారు” అన్నాడు వెంకటగౌడు.

మరో వైపు కరెంటు సరిగా ఇవ్వక రైతులను సతాయించడం కూడా అందులో భాగమేనని, ఈ మైనింగ్‌తో చివరకు నీళ్లు లేక ఎడారిగా మారుతుంది. కావున మన సంఘం తెలంగాణా వనరుల రక్షణ కొరకై పని చేయాల్సి ఉంది. కావున మన సంఘం పేరు “తెలంగాణా భూమి రక్షణ సంఘం” గా వుంటే బాగుంటుదన్నడు. దుర్గాదేవికి కూడా ఈ పేరు నచ్చింది. వెంటనే ఆ సంఘనికి “తెలంగాణా భూమి రక్షణ సంఘం” అన్న పేరు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

ఇక నియమ నిబంధనల గురించి దుర్గాదేవి మాట్లాడుతూ "మన సంఘం కేవలం భావవ్యాప్తికే పరిమితమౌతుందని, కావున రిజిస్ట్రేషన్ అవసరం లేదని, అదే విదంగా ఏలాంటి నిధుల సేకరణ చేయకూడదని కేవలం మన స్వంత డబ్బులతోనే దీని కార్యక్రమాలు నడుపాలని, అందుకే మనమంతా ఈ సంఘానికి కన్వీనర్లమే" అంది.

దానితో వెంకటగౌడు"అది కాదు మీకు ఇదివరకు పోలేపల్లి ఉద్యమం నడిపిన అనుభవం వుంది. దేశ దేశాలు తిరిగినారు. కమ్యూనికేషన్ నైపుణ్యం వుంది, కావున దుర్గాదేవి గారు కన్వీనర్‌గాను, మిగతా వారంతా కో–కన్వీనర్లుగా వుంటే బాగుంటుంది" అన్నాడు.

మిగతా సభ్యులు అంగీకరించారు. దానితో మేడం దుర్గాదేవి గారు కన్వీనర్‌గాను, మిగతా వారంతా కో–కన్వీనర్లుగా ఉండుటకు అంగీకరించింద్రు.

"మరి మనం నలుగురిమే కదా", అని వెంకటగౌడు అనగా మిగతా వారిని మన ఉద్యమక్రమంలో చేర్చుకోవచ్చు అంది దుర్గాదేవి.

# 17

భారత దేశ చరిత్రలో తెలంగాణాకు విశిష్ఠ మైన చరిత్ర ఉంది. చరిత్ర పూర్వయుగం నుండి కూడా ఇక్కడ మానవ అవశేషాలు లభించాయి. తెలంగాణా అంతటా ఆదిమ మానవుల శిలా యుగపు బృహత్శిలా సమాధులు కోకొల్లలుగా ఉన్నాయి. మహా భారత యుద్ధంలో తెలంగాణా పాలకులు పాండవుల తరఫున, ఆంధ్రా పాలకులు కౌరవుల తరఫున యుద్ధం చేసినట్లుగా తెలియుచున్నది.

మొదటి స్థానిక రాజులైన గోబద రాజులు ఏడుగురు క్రీ॥ పూర్వమే సుమారు నాలుగు వందల సంవత్సరాలనుండి రెండు వందల సంవత్సరాల వరకు పరిపాలించారు వారు కరీంనగరం లోని కోటిలింగాలను రాజధానిగా పరిపాలన సాగించారని తెలియుచున్నది. వారికి సమ కాలికులుగా నాగులు, కాదంబులు దక్షిణ కరీంనగరంను, తూర్పు కరీంనగరంను పరిపాలించారు. బహూశా వీరి కాలంలోనే బౌద్ద. జైనాలు తెలంగాణా ప్రాంతానికి పరిచయం అయి ఉంటాయి, అనడానికి చాలా దాఖలాలు ఉన్నాయి. తర్వాత కాలంలో సాతవాహన రాజుల పాలన క్రీ॥ పూర్వం రెండు వందల నుండి క్రీ॥ శకము రెండు వందల సంవత్సరాల కాలం నడిచింది. ఈ కాలంలోనే బౌద్ధ మతం తెలంగాణాలో చాలా ప్రాచుర్యంలోనికి వచ్చింది.

అంతకు పూర్వమే బాదరాయణుడు (అతనే భోధాయనుడు గాను భావరి గాను పిలువబడ్డాడు) బుద్దుని సమకాలికుడు. బుద్దుడు కొత్త మతాన్ని ప్రచారం చేస్తున్నాడని

తెలిసికొని, తన శిష్యులను ఐదుగురిని "కొండ" అను నాతని అధ్వర్యంలో బుద్ధుడి వద్దకు పంపుతాడు, అప్పటికే బాదరాయణుడు చాలా ముదుసలి. కొండ తన అనుచరులతో బుద్ధుని కలసి ఐదు సంవత్సరాలు బౌద్ధం గురించి తెలిసికొని, "కొండ" తిరిగి వచ్చేవరకు ఎదురు చూచిన గురువు గారు మరణిస్తాడు. అప్పటి నుండే ఎవరైనా ఆలస్యంగా వస్తే"కొండకు(కొండ కొరకు) ఎదిరి చూచినట్లు" అనే సామెత పుట్టింది. బుద్ధునితో కొండ జరిపిన చర్చలే"కొండ ప్రశ్నలుగా" బౌద్ధ పాళి భాషలో లిఖించబడినవి. చివరకు బుద్ధునితో ప్రభావితుడైన కొండ బౌద్ధమతాన్ని అవలంభించి, బౌద్ధాన్ని విరివిగా తెలంగాణా ప్రాంతంలో ప్రచారం చేసినాడు, ఆయన ఆ కాలంలో ఎక్కడైతే బౌద్ధాన్ని ప్రచారం చేసినాడో ఆ గ్రామాలన్ని "కొండాపురాలుగా" పిలవ బడినాయి. అప్పటినుండే బౌద్ధ పాదుకలను పూజించడం ఆ చారంగా వస్తు ఉన్నది.

దాదాపు ఇప్పటి ప్రాచీన దేవాలయాలన్ని గతంలో బౌద్ధుల లేదా జైనుల చైత్యాలో లేదా బసదులో ఆయి ఉంటాయి. బాదరాయణుని స్వస్థలం బాదనకుర్తి కరీంనగరం జిల్లాలో ఉంది. ఆచార్య దిగ్నాగుడు కోటిలింగాలకు ఎదురుగా నున్న మునుల గుట్టపై నివసించి, బౌద్ధ ఆరామాన్ని నిర్వహించినట్లు కాళీదాసు రచనలవల్ల తెలుస్తున్నది.

బౌద్ధుల ఆరామాలు, , జైనాల బసదులే, ఆ మతాలు వెనుకబడిన తరువాత వైష్ణవ లేదా శైవ ఆలయాలుగా మార్చబడినాయి. సాతవాహనుల కాలంలో నిర్మించ బడిన దుర్గాలలో అధిక మొత్తం తెలంగాణాలోనే ఉన్నాయి. ఆ కాలంలోనే పురాణాలు వ్రాయబడినాయి, గుణాఢ్యుడు పైశాచీ భాషలో "బృహత్కథ" అను కథల సంకలానాన్ని కూర్చినాడు. ఇది ప్రపంచంలోనే మొదటిది. అందులో అనులక్ష్మి, అనులబ్ధ, రేవా లాంటి ఇరవై ఆరుగురు మహిళా రచయితల కథలు కూడా ఉన్నాయి.

ఈ కాలంలోనే లీలావతి కావ్యాలు, వాత్స్యాయన కామ సూత్రాలు, నాగార్జునుని రస రత్నాకరము ఆ కాలములో వెలుగులోనికి వచ్చినాయి. ఈ నాగార్జునుని నివాసము వెల్ధి, మానేటి ఓడ్డున ఉంది. అతని ప్రయోగశాల మానేరుకు అవతలి ఓడ్డున గల "మూలసాల" సాతవాహనులు సాంచీ స్థూపాన్ని తిరిగి అలంకరించారు. ఆ విధంగా తెలంగాణా సాహిత్యం ప్రపంచ వ్యాప్తమైనది. వారి కాలంలోనే అజంతా గుహలు నిర్మించబడినవి. సాతవాహనుల తరువాత. ఇక్ష్వాకులు, భృహత్పలాయనులు, ఆనంద గోత్రికులు, పల్లవులు, శాలంకాయనులు, తూర్పు చాళుక్యులు, రాష్ట్రకూటులు కల్యాణీ చాళుక్యులు, కాకతీయులు కందూరి చోళులు, పద్మనాయక, రెడ్డి, బహమనీసుల్తానులు, గోలకొండ, ఆసఫ్జాహీలు, తెలంగాణాను పరిపాలించారు. మొత్తం భారత దేశ చరిత్రలో ఇరవై ఐదు సంవత్సరాల కాలం అశోకుని పాలనలోను, కేవలం ఇరవైఆరు సంవత్సరాలు

మాత్రమే మొగలాయిల క్రింద పరిపాలనలో ఉంది.

ఇప్పుడు గత అరవై సంవత్సరాలుగా ఆంధ్రుల, మరియు కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో నలిగి పోతున్నది తెలంగాణా ప్రాంతం. ఉత్తర తెలంగాణాలో సుమారు ఎనిమిది వందల చదరపు కి॥లో మీటర్ల పరిధిలో బొగ్గు గనుల ఓపెన్ కాస్టులతోనూ, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు నీటిప్రాజెక్టుల వల్లను., కరీంనగరం, వరంగల్లు, ఖమ్మం. నిజామాబాదు, మెదక్, ఆదిలాబాదు, జిల్లాలో సమారు మూడున్నర వేల గ్రానైటు మైనింగుల వల్లను, సున్నపురాయి గుట్టల మైనింగ్ ఇసుక, ఇంకా ఇతరముల్లైన మైనింగ్‌ల వల్లను, అటవీ సంపద తరలింపుల వల్లను, చివరకు చెరువులు కుంటలు కూల్చబడటం ద్వారాను, , తెలగాణాలో హైదరాబాదు చుట్టుపట్ల భూములను పెట్టుబడి దారులకు ధారాదత్తం చేస్తున్నారు. అదే విధంగా ఈ అరవై సంవత్సరాల కాలంలో తెలంగాణా ప్రాంతం ప్రజలు తమ వనరులను, నీటిని చివరకు జీవించే హక్కును కూడా కోల్పోతున్నారు. కావున సమస్త తెలంగాణా ప్రజలు, రావణా సుర సంతతి అయిన ఆంధ్రుల ఆధ్వర్యంలోని, తమిళనాడు, మరియు ఇతర దక్షిణాత్యుల మరియు కౌరవ సంతతి వారైన ఉత్తారాది ఢిల్లీల దోపిడి, పాలనల దాష్ఠిక పెత్తనం నుండి, ఎంత తొందరగా బయట పడితే అంత మంచిది.

తెలంగాణా ప్రజల అంతరంగ స్వంతంత్రేచ్ఛకు ప్రతి రూపంగానే 1946లో తెలంగాణా సాయుధ పోరాటంగాను, 1956 లో ఇడ్లీసాంబారు గోబ్యాక్, ఉద్యమంగాను, 1969లో తెలంగాణా రాష్ట్రఉద్యమంగాను, 1967 నుండి నక్సలైట్ ఉద్యమంగాను, మళ్ళీ 1996 నుండి ప్రత్యేక రాష్ట్రఉద్యమంగాను పునరావృత్తమౌతూనే ఉన్నాయి.

2009 లో తెలంగాణా ఉద్యమం ఊపు అందుకొంది. కెసీఆర్ నిరాహార దీక్షతో అంతకు ముందున్న తెలంగాణా భావజాల పోరాటం ప్రజా ఉద్యమంగా మారింది. ఈ ఉద్యమంలో తెలంగాణా ప్రజలంతా పాల్గొన్నారు. అన్ని వర్గాల ప్రజలు తెలంగాణా రాష్ట్రనికై వీధుల్లోకి వచ్చినారు. దాదాపు ప్రతీ గ్రామంలో జాయింట్ యాక్షన్ కమీటీల ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలు, విధ్యార్థి సంఘాలు. ప్రజా సంఘాలు. కుల సంఘాల వారు పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో తెలంగాణా దీక్షా శిబిరాలు ఏర్పాటు చేసికోన్నారు. కరీంనగం పట్టణంలోని ఇందిరా చౌకు తెలంగాణా చౌకు దీక్షా శిబిరంగా మారింది.

జిల్లామహిళా జేఏసీ అధ్వర్యంలోతెలంగాణా చౌకులో దుర్గాదేవి అధ్యక్షతన జిల్లా మహిళా జేఎసీ బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది.

ఆ సభలో ఎదురుగా ఉన్న శర్మ ప్రక్కనున్నాయనతో "ఇంత చిన్న పిల్లేనా గంత పెద్ద పోలేపల్లి సెజ్‌కు వ్యతిరేకంగా మూడు సంవత్సారాల పోరాటం నడిపింది" అని అంటూ ఆశ్చర్య పోయిండు.

"పోలేపల్లి సెజ్ వ్యతిరేక పోరాటమా అది ఏమిటి నాకు తెలియదు శర్మాజీ" అని ఆయన మిత్రుడు అనగానే శర్మ గారు "హైదరాబాద్ దగ్గరలోని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో, హైదరాబాద్ బెంగుళూర్ హైవే మీద గల పోలే పల్లి, ముది రెడ్డిపల్లె, గుండ్లగడ్డ తండా అను మూడు గ్రామాలలో, లోగా బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన మూడు వందల ఎకరాలతో పాటు ఒక వేయి ఎకరాల రైతుల వ్యవసాయ భూములను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ప్రా స్ట్రక్‌శ్చర్ కార్పోరేషన్ అనే సంస్థ ద్వారా ప్రజాప్రమోజనాల పేర, రైతులకు కేవలం ఎకరాకి పద్దెనిమిది వేలకు కొని, పారిశ్రామిక వేత్తలకు ఎకరాకు ముప్పది లక్షల రూపాయిలకు అమ్మింది. ఈ విధంగా ప్రభుత్వమే ప్రజలను మోసగించింది. ఆ విధంగా గవర్నమెంటుకు అధిక లాభాలను ఆర్జించి పెట్టే దాళారీ సంస్థగా ఆ సంస్థ వ్యవహరిచింది. ఆ గ్రామాలలోని చాలా మంది రైతులకు నామమాత్రపుడబ్బులు నష్ట పరిహారంగా చెల్లించ బడింది. మూడు వందల ఎకరాల అసైన్డు భూములకు ఏమాత్రం చెల్లించ లేదు, దానికి వ్యతి రేకంగా ప్రజలు ఉద్యమించినారు. ఎవరూ వారిని పట్టించు కోలేదు".

శర్మ ఇంకా మాట్లాడుతూ "ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యంఏ సామాజిక శాస్త్రాన్ని చదువుతున్న సమయంలో చదువుల్లో చురుకుగా ఉండేది. ఆ కోర్సుల్లో భాగంగా గిరిజనుల జీవన. స్థితి గతులను క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా గిరిజనులలో లింగ వివక్షత లేకపోవడం ఆమెను చాలా ఆకర్షించింది, వారితో అభివృద్ధి చెందిన సమాజాలలో గల లింగ వివక్షతను బేరీజు వేసింది. నేటి సమాజంలోని లింగ వివక్షతను తీవ్రంగా వ్యతిరేకించింది. దానితో "అన్వేషి" లాంటి మహిళా సమాజాలలో చేరి పని చేయడం ఆరంభించింది. కొన్ని రోజులకు శ్రీలంకలోని సంస్థ ఒకటి పంపిన ఫేలోషిప్ పై బ్యాంకాక్, థాయిలాండ్, బర్మా దేశాలలోని మహిళా సమస్యలపై పరిశీలనలు చేసింది, దానికి కొనసాగింపుగా జెనీవాలో కూడా మూడు నెలల వర్కుషాప్‌లో పాల్గొంది. తరువాత ఇండియా తిరిగివచ్చి ఒక ప్రవేటు కాలేజీలో ఉపాధ్యాయురాలిగా పనికి కుదురుకున్నది.. ఆ కాలంలోనే మురికి వాడల్లోని ఆడపిల్లల చదువుల కొరకు రాత్రి పాఠశాలలు నడిపింది. ఆ క్రమంలోనే ఒక నాడు పోలేపల్లికి తన సహచరులతో వెళ్ళడం జరిగింది.

"పోలేపల్లి, ముదిరెడ్డిపల్లె, గుండ్లపల్లె గ్రామాల శివారుల చివరలనున్న సన్నకారు, చిన్నకారు దళితుల, గిరిజనుల కొరకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సేకరించి వారిని నిర్వాసితులను చేయడం ఆమెకు చాలా బాధ కలిగించింది, ఆ క్రమంలో ఆయా గ్రామాలలోని ధనిక రైతుల భూములను తీసుకోకుండా కేవలం బడుగు, బలహీన వర్గాల, మరియు మైనారిటీ వర్గాల రైతుల భూములనే సేకరించడం గమనించింది. దానితో

చాలా మంది రైతులు తమకున్న ఉపాధి వనరులను కోల్పోగా భూనిర్వాసితులుగా మారినారు, దాదాపు అరవై మంది రైతులు తమ ప్రాణాలను దిగులుతో కోల్పోయినారు, కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకోన్నారు. ఈ క్రమంలోనే దేశం మొత్తం మీద ఇప్పటి వరకు గత అరవై సంవత్సరాలలో దాదాపు కోటిన్నర మంది ప్రజలు వివిధ ప్రాజెక్టుల కిందనైతే నేమి, పారిశ్రామిక వాడల క్రింద భూనిర్వాసితులుగా మారినారని తెలిసికొన్నది. అందులో తొంబది శాతం మంది ప్రజలు దళితులు, గిరిజనులే ఉన్నారు, వారంతా తమ తమ ఉపాధులు కోల్పోయి నిర్వాసితులుగా మారినారు. దానితో ఆమె తన కర్తవ్యంగా పోలేపల్లి నిర్వాసితులకు అండగా వుండి పోరాడాలని నిశ్చయించుకుంది, దానితో ఆమె వారి ఉద్యమాన్ని క్రమమైన పద్దతిలో, స్థిరంగా జరుపుటకు కావలసిన ప్రణాళికతో ఉద్యమ కార్యకలాపాలను, అందరిని ఏకీకృతం చేసి నడపటానికి సమాయత్తమైంది" అన్నాడు.

"మేన్ రోడ్డు ప్రక్కన టెంటు వేసి గ్రామస్థులతో నిరహర దీక్షా ఉద్యమాలు మొదలు పెట్టింది. అలా మొదలు పెట్టిన ఉద్యమం మూడు సంవత్సరాల వరకు నిరంతరంగా కొనసాగింది, ఈ ఉద్యమంతో భారీగా నష్ట పడిన రైతులు తమ సమస్యను పట్టించుకునే వారు ఉన్నారన్న ధీమా పెరిగి ఆత్మహత్యలు విడిచిపెట్టి పోరాట బాట పట్టినారు ఈ ఉద్యమం జరుగుతున్న క్రమంలో చాలా రాజకీయ పార్టీలవాళ్లు, అనేక స్వచ్ఛంద సంస్థలు, ఆ నిరసన శిభిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపినారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల నాయకురాలు రత్నమాల, మానవహక్కుల వేదిక బాలగోపాల్ కూడా తమ మద్దతును తెలిపినారు"

"ఈ విధంగా ఈ పోరాటం దేశ, విదేశాల్లో చర్చనీయాంశంగా మారింది, ఆ ఒత్తిడికి దిగివచ్చిన ప్రభుత్వం పట్టాఉన్న రైతులకు కొంత అదనంగా చెల్లించింది, దానితో వారు ఆ ఉద్యమ శిబిరాన్ని వీడినారు, ఇక ఈ సెజ్ ద్వారా లబ్ధి పొందిన యాజామాన్యాలు వారి ఫ్యాక్టరీలకు అవసరమైన సివిల్ పనులకు పెద్ద రైతులను కంట్రాక్టర్లుగా పెట్టుకున్నారు. కొందరికి ఆభ్కారీ దుకాణాలు దక్కినాయి, దానితో కొందరు ఉద్యమ కారులు ఉద్యమం నుండి తప్పుకున్నారు."

"ఇక కుల సంఘాల నాయకులను రంగంలోనికి దింపి వారి నాయకుల ద్వారా ఆయా కులస్తులను రకరకాలుగా సంతృప్తి పరచి, వారిలో చీలికలు తెచ్చి మరి కొందరిని ఉద్యమం నుండి తప్పించినారు, చివరకు ఏమీ భూములు లేని అట్టడుగు వర్గాల ప్రజలు మాత్రమే ఉద్యమంలో మిగిలినారు. ఆ విధంగా ఉద్యమాన్ని నీరుగార్చిన తరువాత, చివరకు ఏ భూమిలేని వారికి ఆరు వందల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తమని గవర్నమెంటు

అంగీకరించింది. ఇంకా ఆ భూముల్లో పెట్టిన పరిశ్రమల్లో నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రజలు పోరాడుతున్నారు." అన్నాడు శర్మ.

"ఈ ఉద్యమంతో మమేకమైనందుననే అనేక అంతర్జాతీయ సెజ్‌వ్యతిరేక సంస్థలు దుర్గాదేవి గారిని తమతమ దేశాలలో తనయొక్క అనుభవాలను గూర్చి ప్రసంగించ వలసిందిగా ఆహ్వానించారు. ఆమె ఇప్పుడు ఉద్యోగరీత్యా కరీంనగరం లోని శాతవాహన విశ్వ విద్యాలయంలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది" అన్నడు శర్మ. ఇంతలో కార్యకర్త, ఇతర జిల్లాస్థాయి నాయికురాళ్ళను వేదిక మీదకు పిలిచింది. అందరూ వేదికపైకి ఎక్కినారు. మరో ముఖ్య అతిథిగా ఏనుగు భీమారెడ్డి, జిల్లా జేఏసీ కన్వీనర్ గారిని వేదికపైకి పిలిచింది.

ఆ సమావేశంలో దుర్గాదేవి మాట్లాడుతూ "జై తెలంగాణా అంటే ప్రతీ తెలంగాణా జీవికి, వనరులు, పర్యావరణంతోపాటు, జంతు జీవ జాలానికి విజయం కలుగాలని అర్థమని, వాటన్నిటి పై ప్రజలకే హక్కులుండాలని, అందరూ జాగ్రత్తమై తమ వనరులను రక్షించు కోవాలని, కానిఇప్పుడు తెలంగాణా, ఆంధ్రా, మరియు కేంద్ర వలసవాదుల నిరంకుశ పాలనలో నలుగుతున్నది. తెలంగాణాలో ఓ వైపున బొగ్గు గనుల ఓసిపీల తోను అనేక వందల గ్రామాల ప్రజలు నిర్వాసితులౌతున్నారని, మరో వైపున మూడున్నర వేల క్వారీల ద్వారా గుట్టలను విధ్వంసం చేస్తున్నారు. తద్వారా తెలంగాణా మొత్తం భూగర్భజలాలు అడుగంటగా గుట్టలు లేక పోవడంవల్ల వర్షాలు కురియక తెలంగాణా అతి త్వరలోనే ఎడారి కానుందని, ఇంకొక వైపు పోలవరం ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా అటవీ ప్రాంతాన్ని జలసమాధిలో ముంచివేస్తూ ఒక వైపు. బయ్యారం ఇనుప గనులతో మరోవైపు, గిరిజనులను నిర్వాసితులను చేసే కుట్ర పాలక వర్గాలు చేస్తూన్నాయని. తెలంగాణా ప్రాంతాన్ని మొత్తంగా పోలేపల్లెలు చేయనున్నారు. సమస్త తెలంగాణాను మరో బొలీవియా లాగా మైనింగ్ ప్రాంతంగా మార్చ చూస్తున్నారని, కావున సమస్త తెలంగాణా ప్రాంతం జాగ్రత్తమై తమ వనరులను తమతమ గ్రామ జనులకు సంబందించిన సామాజిక ఆస్తులైన గుట్టలను చెరువులను జంతుజాలాన్ని రక్షించుకోవలసి ఉన్నదని" చెప్పుతూ, "కేవలం భౌగోళిక తెలంగాణానే మన సమస్యలను పరిష్కరించ లేదని, కావున ప్రజలు తమ వనరులను కాపాడుకునే ఉద్యమాలు కూడా చేయాలని" చెప్పింది.

ఆ సభికులకు తెలంగాణా భూమిరక్షణ సంఘం వారు ప్రచురించిన "మన గుట్టలను ధ్వంసం చేస్తే...." అన్న కరపత్రాన్ని ప్రతీ ఒక్కరికి అందజేశారు వెంకటగౌడు, హనుమంతులు.

# 18

వెంకటగౌడు, హనుమంతులు కలసి ఊరూర గుట్టల రక్షణ ఆవశ్యకత గురించి ప్రచారం చేస్తూ అన్నారం గ్రామానికి వెళ్ళినారు. ఆ ఊరిలోని ఉన్నత పాఠశాల లోనికి వెళ్లి, ఆ కరపత్రాన్ని పెద్దసారుకు ఇచ్చినారు.

పెద్దసారు ఆ కరపత్రాన్ని చదివి "చాలా బాగుంది, ఇన్నాళ్లకు మీరైనా వచ్చి గ్రానైట్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు, మీకు మేం ఏం సహాయం చేయగలం" అన్నారు

"ఏం లేదు సార్ రాబోవు తరం పిల్లలదే కావున వారికి గుట్టలవల్ల ప్రయోజనాలు, వాటి విధ్వంసంవల్ల కలిగే నష్టాలు చెప్పగలిగితే వారైనా రాబోవు రోజుల్లో ఈ విధ్వంసాన్ని ఆపుతారని మా ఆశ, కావున వారితో ఓ పది నిమిషాలు మాట్లాడే సమయం ఇవ్వండి సార్" అన్నడు వెంకటగౌడు

"చాలా సంతోషం" అని పెద్దసారు ఓ అర గంటలో పిల్లందరిని బడి ముందుగల చెట్లనీడన కూర్చోబెట్టినారు పెద్దసారు చిన్నసార్లు అందరూ పిల్లల ముందు కుర్చీలు వేయించుకుని కూర్చున్నారు, పెద్దసారు లేచి వెంకటగౌడును, హనుమంతును పిల్లలకు పరిచయం చేసినాడు.

తర్వాత వెంకటగౌడు మాట్లాడుతూ"ప్రియమైన విద్యార్థులారా నేను మాట్లాడే ముందు మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను జవాబు చెప్తారా?" అన్నాడు.

పిల్లలు ఏక కంఠంతో "ఓ" అన్నారు అన్నారు.

అప్పుడు గౌడు "పిల్లలు మీరెప్పుడైనా గుట్టలను ఎక్కినారా?" అడిగిండు.

పిల్లందరూ "ఓ" అంటూ చేతులెత్తినారు,

"ఏ గుట్టను ఎక్కింద్రు?" గౌడు అడిగిండు,

వెంటనే పిల్లలు "నాగులమ్మగుట్టను" అన్నారు,

"ఎందుకు గుట్టలు ఎక్కుతాం మనం?"అడిగిండు.

పిల్లలకు జవాబు ఎం చెప్పాలో తెలియక నిశ్శబ్దంగా ఉన్నారు.

"ఊ జవాబు చెప్పాలి!" రెట్టించిండు గౌడు.

ఒక పిల్లగాడు లేచి "గుట్టఎక్కుతే చాలా బాగుంటది. అందుకే ఎక్కాలి" అంటూ", అంతే కాక ఎత్తుకు పోయే కోద్దీ చిన్నచిన్న అగ్గిపెట్టెల్లాగ ఇండ్లు, దారులు సన్నగా రిబ్బన్ల లాగా, చెట్ల కు ఉన్న కొమ్మల పై భాగాలు వేలాడుతున్న పచ్చని మొగులు మబ్బుల లెక్క వుంటాయి, పొలాలు చిన్నవిగా కనపడుతాయి, పొలాల్లో మేస్తూన్న గొడ్లు చిన్నవిగా ఉంటాయి. యవుసం జేసేటోల్లు చీమలోలె ఏయే పనులు చేసేది చక్కగా. చిన్నగా,

కపడతాయి. దూరంగా మానేరు నది కనపడుతది గుట్టను ఆనుకుని ఉన్న చెరువు అద్దం లెక్క మెరుస్తది. ఇటువైపు చెరువుకు, ఊరుకు ఆవల నున్న నల్లటి తారు రోడ్డు నల్ల తాడి జర్రి లాగుంటది. అ రోడ్డుపై పోయే అన్ని బండ్లు కనబడుతయి, అవన్ని చూడటానికి గుట్టలు ఎక్కాలే"అన్నాడు.

"వెరీగుడ్" అన్నాడు గౌడు.

"మరి గుట్ట మీకు ఏమి ఇస్తది?" అని అడిగిండు గౌడు.

ఇంకో పిల్లగాడు లేచి"సీతపలుక పండ్లిస్తది" అన్నడు.

ఇంకొకరు లేచి "గొర్రెలకు మేకలకు, పశువులకు మేతను ఇస్తది" అన్నడు,

ఓ విద్యార్థి లేచి "పొయిల కట్టెలు ఇస్తది" ఆన్నాడు.

మరొకరు లేచి "మోదుగు పూలను ఇస్తది, దానితో హోళీ రంగులు చేస్తాం"అన్నాడు

ఒక అమ్మాయి లేచి "మోదుగు ఆకులు ఇస్తది వాటితో విస్తార్లు కుడుతరు" అన్నది.

వేరొకరు లేచి "ఇండ్లకు బండను ఇస్తది" అన్నాడు.

పెద్దసారు కల్పించు కొని "శ్రీనూ నీవు పెద్ద పెరిగినంక గ్రానైటు ఓనర్‌వైతవు అన్నడు" అందరు ఒక్కసారి ఘొల్లున నవ్వినారు.

"ఇంకేమిస్తయో చెప్పండి?" అని గౌడు అనగానే

ఒక విధ్యార్థిని లేచి "తంగెడుపూలు, రకరకాల కట్ల పూలు ఇస్తుంది" అని బతుకమ్మ పండగను గుర్తు చేసుకుంటూ అంది.

ఇంకో అమ్మాయి లేచి"కుందేళ్ళను, ఉడుములను, అడవి పందులను, నెమళ్ల మాంసాన్ని"ఇస్తుంది అంది.

ఇంకో అమ్మాయి లేచి"తేనెను ఇస్తుంది" అంది.

ఇంకో పిల్లగాడు లేచి "గుట్టపైన నాగులమ్మ విగ్రహాలు ఉన్నాయి, మేము ప్రతీ సంవత్సరం గుట్టపైకి వండుక తినడానికి పోతం"అన్నాడు.

మరో అమ్మాయి లేచి"బతుకమ్మ పండగ నాడు గుట్టపైనగల పరుపు బండల పై బతుకమ్మలు ఆడి, క్రింద చెరువులో బతుకమ్మలను వేస్తామని" అన్నది.

"ఇంకా చెప్పండి" అన్నాడు గౌడు. ఇక పిల్లలు సప్పుడు చేయలేదు.

"మీరు ఎప్పుడైనా గుట్టల మీద రాత్రులు పడుకున్నారా" అడిగిండు గౌడు. పిల్లలు సప్పుడు చేయలేదు.

అప్పుడు నారాయణ సారు లేచి"నేను పడుకున్నాను" అన్నాడు.

"ఎప్పుడు? ఎక్కడ? అడిగిండు గౌడు.

"ప్రతి ఎండ కాలం, మా ఊరి బెజ్జంకి గుట్టపైన జాతరకు" అన్నాడు.

"అప్పుడు మీరు ఏం గమనించారు అడిగిండు" గౌడు.

అర్ధరాత్రి వరకు గుట్టపై చాలా ఉక్క పోస్తూంటుంది, ఇక అప్పటి నుంచి చలి మొదలై, తెల్లవారగట్ల చలి విపరీతంగా ఉంటుంది" అన్నాడు నారాయణసారు.

"పిల్లలూ? మీకు సైకిల్ మోటర్ ఇంజనుకు ఉండే పిన్స్ తెలుసా అడిగిండు" గౌడు.

పిల్లలు సప్పుడు చేయలేదు. అప్పుడు హనుమంతు తన సైకిల్ మోటర్ ఇంజనుకు ఉన్న పిన్స్‌ను పిల్లలకు చూయించిండు.

అప్పుడు గౌడు మాట్లాడుతూ, "ఈ పిన్సు వల్ల సైకిల్ మోటర్ ఇంజను ఉపరితల వైశాల్యం పెరిగి, బయట గాలి ఎక్కువగా తగలటం వల్ల, ఎప్పటి కప్పుడు ఇంజను చల్ల బడుతుంది, అందు వల్ల ఇంజన్ నిరంతరాయంగా పని చేస్తుంది. అవి లేక పోతే ఇంజన్ వేడెక్కి తొందరలోనే ఆగిపోతుంది."అంటూ,

"పిన్స్ వల్ల ఎలాగైతే ఇంజను చల్లబడుతుందో, ఆలాగే, గుట్టలు కూడా భూమికి పిన్స్ లాగా పని చేసి, పగలు సూర్యుని నించి వచ్చిన వేడిని గ్రహించి, రాత్రి ఆ వేడిని వాతావరణం లోనికి విడుదల చేసి భూమిపైన ఉష్ణోగ్రత పెరుగకుండా చేస్తాయి" అని చెప్పుతూ, అందులకే గుట్టపై అర్ధరాత్రి తర్వాత చలిగా ఉంటుంది" అని గుట్టలు వాతావరణాన్ని ఎలా అదుపులో ఉంచుతాయో విడమరచి చెప్పిండు గౌడు.

క్షణమాగి గౌడు "మీ గుట్టమీద నీటి గుండాలు ఉన్నాయా?" అన్నాడు,

"ఓ ఉన్నాయి" అని అరచింద్రు పిల్లలు.

వాటిలో "ఏ కాలమైనా నీరు ఉంటుందా?"అడిగిండు గౌడు.

"ఎప్పుడూ ఉంటాయి సార్" పిల్లలు ఏక కంఠంగా అరచినారు.

"ఆ ఇప్పుడు చెప్పండి ఇంకా గుట్ట మనకు ఏమి ఇస్తూంది?" అడిగిండు గౌడు.

"నీళ్ళు, నీళ్ళు" అరచింద్రు పిల్లలు.

"ఆ ఇప్పుడు చెప్పింద్రు, గుట్టలు మనకు నీళ్లు ఇస్తాయని, మరి గుట్టకు నీళ్లు ఎక్కడి నుండి వస్తాయి" అడిగిండు గౌడు.

"వర్షాల వల్ల" పిల్లల జవాబు

"గుట్టలు, వాటి పైన ఉన్న చిట్టడవి వల్ల వర్షాకాలం వాన మబ్బులు గుట్టలకు తట్టుకొని బాగా వర్షాలు పడుతాయని, ఆట్టినీటిని మొదట గుట్టలు పీల్చుకొని గుట్ట బండల మధ్య గల సొరికెలలోను, మట్టి లోనూ ఇంకి పోయి సంవత్సరం పొడుగూత నీటిని గ్రామాల్లోని బావులకు, బోర్లకు సరఫరా చేస్తాయి. ఈ విధంగా గుట్టలు ప్రకృతి సిద్దమైన ఓవర్ హెడ్‌ట్యాంకు లాగా పని చేసి దిగువ గ్రామాలకు నీటిని అందిస్తాయి" అంటూ గౌడు, ఇంకా మాట్లాడుతూ,

అంతే కాక మీ నాగులమ్మ గుట్టకు వచ్చు జాలు వల్ల ఆ గుట్ట ప్రక్కనున్న చెరువు నిండుతుంది. పైగా ఆ చెరువుకు సహజసిద్దంగా కట్టలాగా గుట్ట పని చేస్తుంది. మీ నాగులమ్మ చెరువు నిండిన తర్వాత మత్తడి నుండి నీరు దుమికి ఒర్రె గుండా మీ ఊరికి, మానేరుకు మధ్యనున్న రంగసాయి పల్లె చెరువును నింపుతాయి, ఆలాగే మీ ఊరికి ఉన్న మరో చెరువు ఊర చెరువుకు, దాని పైన గల గట్టుదుద్దెన పల్లె లోని గుట్టల ద్వారాను, మీ ఊర గుట్ట ద్వారాను వానవరదల వల్ల నిండుతాయి, ఆ మత్తడి నీటితోనే రంగసాయి పల్లెలో మరో చెరువు నిండుతుంది. ఆ రెండు చెరువుల నీరు రెండు ఒర్రెల ద్వారా కొంత దూరం ప్రవహించి ఒకటిగా మారి పక్కనున్న మానేరు నదిలో కలుస్తాయని. అట్లె అన్ని గుట్టల వల్ల చిన్న వాగులు వంకలు బయలు దేరి నదులుగా మారుతాయి" అంటూ క్షణ మాగి మళ్ళీ చెప్ప సాగిండు.

"మన మానేరు నది కూడా నిజామాబాదు, మెదక్, కరీంనగరం జిల్లాలోని గుట్టల వల్లనే ఏర్పడింది. కాని ఇప్పుడు గ్రానైటు రాక్షసులు పై మూడు జిల్లాలోని గుట్టలను పగులగొట్టి విదేశాలకు పంపిస్తూన్నారు.. దాని వల్ల ఉపరితల జలాలు అనగా కుంటలు, చెరువులు, వంకలు, వాగులు, నదులు ఎండి పోతాయి. చివరకు మన మానేరు కూడా ఎండి పోతుంది అన్నాడు. అటు భూగర్భజలాలు కూడా అడుగంటుతాయి. కావున మనం మన గుట్టలను కాపాడుకోవాలి మరి" అంటూ,

మీ వంతుగా "మీరు ఏంచేస్తారు అని" పిల్లలను అడిగిండు గౌడు.

దానికి పిల్లలు ఏక కంఠంతో "మా గుట్టలను కాపాడు కుంటాం" అన్నారు.

వెరీ గుడ్ అంటూ మళ్లీ గౌడు మాట్లాడుతూ, "ఏం లేదు ఇంకొద్ది సేపట్లో ప్రతి ఒక్కల్లకు "మన గుట్టలను ధ్వంసం చేస్తే" అన్న కరపత్రాన్ని పంచి పెడతాము, దానిని మీరు మీ ఇండ్లల్లకు తీసుకొని వెళ్ళి మీ పెద్దలకు ఇవ్వాలి, ఒక వేళ వారికి చదువు రాక పోతె మీరు చదివి వినిపించండి చాలు"అన్నడు.

జిల్లా దళిత లిబరేషన్ ఆధ్యక్షుడైన హనుమంతు మాట్లాడుతూ, "ఇప్పటికి రెండువేల ఐదు వందల సంవత్సరాలకు పూర్వమే చైనాలో ఆ నాటి చక్రవర్తులు, ఆ దేశంలోగల గుట్టలను పగులగొట్టి దాని ఉత్తర సరిహద్దుల్లో ఆరువేల కిలో మీటర్ల పొడవుగల కోటగోడలను నిర్మించారని, దానివల్ల గుట్టలు అన్ని నశించగా, ఉత్తరం నుండి వచ్చు చల్ల గాలులకు ఆటంకం లేక, చైనాలో చలి పెరిగిందని పైగా ఉత్తర చైనా ఇప్పటికి తరచుగా కరువు కాటకాలకు గురౌతుందని" అన్నాడు.

"ఆదే విధంగా దక్షిణ అమెరికా ఖండంలో చిలీకి దగ్గరలో గల ఈస్టర్ దీవులలోని మూడు గుట్టలను పగులగొట్టి, ఓక్కోటి ముప్పై ఫీట్ల ఎత్తు గల దాదాపు ఒక వెయ్యి

విగ్రహాలను ఆ దీవి చుట్టూ. పూర్వం వారి రాజు నిలబెట్టినాడని, ఆందు వల్ల ఆ దీవులలో వర్షాలు పడక, నీరు లేక ప్రజలు కరువు కాటకాలతో సతమతమై చివరకు ఒకరినొకరు చంపుకొని తినే "కన్నిబాల్సు"(నరమాంస భక్షకులు) గా మారినారని, చివరకు మిగిలిన ప్రజలు ఆ దీవులను శాశ్వతంగా విడిచి వెళ్ళింద్రు" అన్నడు.

"క్రీ|| శకము 1722 లో జాకబ్ రొగ్గీవెన్ అను డచ్ నావికుడు, ఆ నిర్జన దీవులను ఈస్టరు పండుగనాడు చేరుకుని ఆ దీవులకు "ఈస్టర్" దీవులని నామకరణం చేసాడు" అన్నాడు.

"అంతెందుకు మన దేశంలోనే అక్బర్ చక్రవర్తి. ఢిల్లీ, ఆగ్రాల మధ్య ఫతేపూర్‌సిక్రి లో గల ఎర్ర రాతి కొండలను తొలచి పెద్ద రాజధానిని కట్టుకున్నాడు, కాని గుట్టలు నశించడం వల్ల ఆ నగరంలో నీళ్ల కరువు ఏర్పడింది. దానితో ఆగ్రావద్దగల యమునా నది నుండి ఏనుగుల ద్వారాను, ఒంటెల ద్వారాను నీళ్ళను తెప్పించు కొని ఏడు సంవత్సరాలు అక్కడి నుండే పాలించాడు కాని చివరకు సాధ్యం కాక మళ్లీ తన రాజధానిని ఢిల్లీకి మార్చినాడు. కావున ఇప్పుడు మన తెలంగాణా లోని గుట్టలు అన్నీ పగుల గొడితే మనకు కూడా అదే గతి పడుతుంది, కావున మనం మన గుట్టలను ఎట్టిపరిస్థితుల్లోనూ రక్షించు కోవాలి" అంటూ. శ్వాస పీల్చుకొని ఇంకా మాట్లాడ సాగిండు. "మరి మనము రోజూ మన సంపదలైనగుట్టలను, అడవులను, ఇసుకను, నదులను మరియు అన్ని రకాల జాతి సంపదలను విదేశాలకు ఎగుమతులు చేసి, అంద మైన పరిసరాలను నాశనం చేస్తున్నాము, రేపటి మీ కొరకు జంతు, వృక్ష జాలాన్ని లేకుండా చేస్తున్నారు పాలకులు. అంతే కాక బహు విధమైన మన సంస్కృతిని కూడా నాశనం చేసికొంటున్నాము, దీనిక వ్యతిరేకంగా మీరు పోరాడుతారా" అడిగిండు పిల్లలను హనుమంతు.

"పోరాడుతాం, పోరాడుతాం" హామీ ఇచ్చారు పిల్లలు.

తరువాత వెంకటగౌడు"రాతి బండో, రాతి బండ" పాటను పాడినాడు. తరువాత హనుమంతు, గౌడులు కరపత్రాలను పిల్లలకు, ఉపాధ్యాయులకు పంచినారు.

ఈ విదంగా వారిద్దరు దాదాపు ఒక వంద గ్రామాల్లోని ప్రతీ పాఠశాలను సందర్శించి దాదాపు ఒక యాభై వేల కరపత్రాలను విద్యార్థుల ద్వారా ప్రజల్లోకి పంపి గ్రానైటు త్రవ్వకం వల్ల జరిగే, జరుగబోయే ప్రకృతి విధ్వంసాలపై ప్రజలకు ఒక అవగాహన ఏర్పడటానికి దోహదం చేసినారు. ఆ ప్రభావం వల్ల కొన్ని గ్రామాలలో ప్రజలు గ్రానైటు క్వారీలకు వ్యతిరేకంగా సంఘలు నిర్మాణం చేసుకొన్నారు.

తరువాత కొద్ది కాలానికే కొన్ని గ్రామాలలో గ్రానైటు వ్యతిరేక సంఘాలు ఉద్యమబాట పట్టినాయి.

# 19

ఇటు తెలంగాణా ఉద్యమం నడుస్తూండగానే సమ్మక్క సారలమ్మ జాతరొచ్చింది. సమ్మక్కకు సారలమ్మకు మొక్కుకున్న మొక్కులన్ని చెల్లించుకోవడానికి తగిన మోఖా దొరికిందివెంకటగౌడుకు

తన భార్యనే కాక, తల్లితండ్రులను, అత్తామామలను. బావ మరిది, అతని భార్యతో కలసి వారు మాట్లాడుకున్న జీపులో నాలుగు రోజుల ముందుగానే ధర్మారం చేరుకున్నరు.

కుటుంబసభ్యులు అందరూ భోజనాలు చేసి జీపు ఎక్కి, మొదటగా తమ తల్లింటి ఇలవేల్పు అయిన రామస్వామిని దర్శించుకొనుటకు కురిక్యాలకు బైలు దేరినారు. కురిక్యాలలో రామస్వామి గుట్టను చేరుకొన్నారు. తల్లి తండ్రులు, అత్తమామాలు గుట్టపైకి ఎక్కలేక కిందనే వుండి పోగా, మిగతా వారు ప్రయాస పడి పైకి ఎక్కి రామస్వామికి కొబ్బరికాయ కొట్టి కిందకు దిగింద్రు.

గుట్టకింద తమ దూరపు బందువువైన రామచంద్రం ఆ గుట్ట ప్రక్కనే ఉన్న తాటి చెట్లకు కల్లు తీయడానికి వచ్చిండు, అతను ఇంటరు వరకు చదువుకున్నడు, దదాపు వెంకటగౌడు వయస్సే వుంటుంది.

"బాగున్నావే రామన్నా" అనిఅడిగిండు వెంకటగౌడు.

"అంతా బాగే ఎంకన్న" అన్నాడు రామచంద్రం.

వెంకటగౌడు తల్లీతండ్రులు, అత్తామామలు గుట్టపైకి ఎక్కనిది గమనించి

"పెద్దోళ్ళు గుట్ట ఎక్కలేదేంది" అని అడిగిండు రామచంద్రం.

వెంకటగౌడు కల్పించుకొని "కురిక్యాల వాళ్ళు తమ దేవుని గుట్టకు మెట్లు బాగా కట్టించింద్రాయె మరి, ఎక్కలేక పైకి రాలేదని" ఎకసక్క మాడిండు, కనీసం గుట్టపైకి మెట్లు కట్టించ లేని కురిక్యాల గ్రామస్తులనుద్దేశించి.

దానికి జవాబిస్తూ రామచంద్రం"కొద్దిలో తప్పిపోయింది కాని లేక పోతే ఈ పాటికి గుట్ట మొత్తం గ్రానైటు క్వారీల పాల బడి కూలి పోయి ఉండేది" అన్నాడు. దానితో వెంకటగౌడు కూతూహలం కల్గి, "ఎట్లా! గ్రానైటు క్వారీ నుండి రక్షించగలిగింద్రు?" అని అడిగిండు. రామచంద్రం తనకు తెలిసిన సమాచారాన్ని చెప్పసాగిండు

"మొదటగా ఆంధ్రభూమిలో కల్చరల్ జర్నలిస్టుగా పని చేస్తున్న శర్మకు ఎలా సమాచారం అందిందో కాని ఆయన చారిత్రాత్మకమైన కురిక్యాల గుట్ట పై గ్రానైటు మాఫియాల కన్ను అన్న శీర్శికన ఒక వార్తను వెలుగులోనికి తెచ్చిండు. దానితో ఆ గుట్టకు పక్కన ఉన్న కొండన్నపల్లె ప్రజలు కలవరం చెందినారు. నిజానికి ఆ గుట్ట వారి

ఊరి శివారు కానప్పటికి, అది వారి గ్రామానికి దగ్గరగానూ, కురిక్యాలకు దూరంగాను ఉంటుంది, దానిని క్వారీ చేయడానికి మా ఊరిలోని ఇద్దరు దొరలు కూడా దరఖాస్తులు పెట్టుకున్నారు. కాని ఆ గుట్టను మైనింగ్ చేస్తే తమ గ్రామానికి ముప్పు అని తలచిన కొండన్నపల్లి గ్రామస్తులు, సర్పంచు మరి కొందరు యువకులు దానిని రక్షించు కోవడానికి ఒక సంఘంగా ఏర్పడినారు" అంటూ,

"వారి చొరవతో అనేక మంది చరిత్ర కారులు, కవులు కురిక్యాలలో గల బొమ్మలమ్మగుట్టకు గల ప్రాచుర్యాన్ని అనేక పత్రికలల్లో ప్రచురించినారు. వాటి ప్రకారంగా ఈ బొమ్మలమ్మ గుట్ట క్రీ॥ పూర్వమే జైనుల బసదిగా ఉండేదని తెలుస్తున్నదని, కాని క్రీ॥శకము 946వ సంవత్సరంలోనే ఆ గుట్టపైన జైన సన్యాసులైన పంపడు, ఆయన తమ్ముడు జినవల్లభుడు జైన పీఠాన్ని ఏర్పాటు చేసినారని, వేములవాడ చాళుక్య రాజైన రెండవ అరికేసరి వద్ద జినవల్లభుడు ఆస్థాన కవిగా ఉండే వాడని తెలుస్తున్నదని. వారు ఆ గుట్టకు తూర్పువైపున ఒక చెరువు తవ్వించినారని దానిని వారు వర్ధమాన మహర్నవంగా పిలిచే వారని, కాని రానురాను ఇప్పుడది ఒడమాన్ చెరువుగా పిలువబడుతున్నదని" చెప్పిండు.

పంపడు మొట్టమొదటి కన్నడ కవి అని, ఆయన "విక్రమార్జున విజయం" పేరున కన్నడ మహా భారతాన్ని ప్రారంభిచాడని, అతని తరువాత "రణ్ణ", "పోన్న" అను కన్నడ కవులు దానిని పూర్తి చేశారని వారి ముగ్గురు కన్నడ కవిత్రయంగా గుర్తించబడ్డారని పత్రికలు రాసినాయి.

ఈ విధంగా కరీంనగరం జిల్లాలోని కురిక్యాల గ్రామం తెలుగు, కన్నడ భాషలకు పుట్టినిల్లయింది.

జినవల్లభుడు ఈ బొమ్మలమ్మ గుట్ట శిఖరాగ్రమున గల గండ శిలకు జైన మొదటి తీర్థంకరుల తల్లియైన ఛక్రియమాత విగ్రహాన్ని, దాని క్రిందుగా కుడి వైపు మొదటి ఇద్దరు జైన తీర్ధంకరుల, ఎడమవైపు చివరి ఇద్దరి తీర్ధంకరుల విగ్రహాలు కడు రమ్యంగా చెక్కించినాడు, ఆ విగ్రహాలు గుట్ట కిందికి కూడా కనపడుతాయి. ఆ విగ్రహాల కిందనే ముప్ఫై అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పున సంస్కృత, కన్నడ, మరియు తెలుగు భాషలలో ఒక శాసనాన్ని జిన వల్లభుడు చెక్కించినాడు. ఆ శాసనంలో మూడు తెలుగు కంద పద్యములు కూడా ఉన్నాయి.

ఈ శాసనం వల్లనే తెలుగుకు కూడా ప్రాచీన హోదా లభించింది." అన్నాడు రామచంద్రం.

"అటు తరువాత గుట్ట మైనింగ్ కాకుండా వుండటానికి ఒక నాడు ప్రముఖ

చరిత్రకారులు, జయధీర్ తిరుమల రావు, జితేంద్ర బాబులు, నాగేంద్ర శర్మ, ప్రముఖ రచయిత, చరిత్ర కారులు మలయశ్రీ గారు, తెలంగాణా భూమి రక్షణ సంఘం, కన్వీనరైన దుర్గాదేవి, రామారావు, నారాయణ, హనుమంతు, కొండన్నపల్లి గ్రామ సర్పంచు, ఉప్పు లింగయ్య మొదలగు వారంతా ఆ బొమ్మలమ్మ గుట్ట వద్ద సమావేశం ఆయినారు ఏలాగైనా ఈ గుట్టను కాపాడు కోవాలని తీర్మానం చేసి, గుట్టరక్షణకు పూనుకున్నారు.” అంటూ.

“జితేంద్రబాబు ప్రభుత్వం వారికి, దీని ప్రాచీనతను, శాసన ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఒక వినతి పత్రాన్ని రాష్ట్ర పురావస్తూ శాఖ మంత్రికి, డైరెక్టరుకి పంపినారు. అంతే కాక కర్నాటక ముఖ్యమంత్రికి కూడా కురిక్యాల శాసన ప్రాశస్థ్యాన్ని తెలుపుతూ ఎట్టైనా ఈ గుట్టను మైనింగ్‌క్వారీకి ఇవ్వకుండా ఆపాలని కోరినారు, ఉప్పు లింగయ్య కూడా ఆలాంటి వినతి పత్రాన్నే కర్నాటక ముఖ్యమంత్రికి పంపినాడు. దానితో కన్నడ ముఖ్యమంత్రి యద్యురప్ప ఆ గుట్టను, శాసనాన్ని కాపాడ వలసిందిగా మన ముఖ్యమంత్రి రోశయ్యను కోరినారు. ఆ విధంగా ఒత్తిడి పెరిగినందున ఈ గుట్టకుఇచ్చిన మైనింగ్ ప్రక్రియ ఆగిపోయింది” అని కొద్దిగాగి.

“దీనికి ప్రధానంగా కొండన్నపల్లె ప్రజలకు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సి ఉందని” అన్నాడు రామచంద్రం.

“అయినా తెలుగు భాషపట్ల గాని, చరిత్ర సంస్కృతుల పట్ల మన పాలకులకు ఏలాంటి ప్రేమ. గౌరవాదరాభిమానాలు లేక పోవడం వల్ల తెలుగు భాషకు, చరిత్రకు, సంస్కృతికి చాలా దుర్గతి పడుతున్నదని, రానున్న కాలంలో తెలుగు భాష కనుమరుగు కానున్నదని. అందులో ఈ ఆంధ్రా పాలకుల వల్ల తెలంగాణా ప్రాంత భాషా, సంస్కృతులు విపరీతమైన నిర్లక్ష్యానికి గురిఅవుతున్న విషయం తెలంగాణా ప్రజలకు తెలిసిందే నని” అంటూ

“ఆటు చంద్రబాబు నాయుడైతే నేమి, ఇటు రాజశేఖర రెడ్డి అయితే నేమి, తెలంగాణాలోనే కాదు, ఉత్తర ఆంధ్రా రాయలసీమ ప్రాంతాల్లో ఎడాపెడాగా మైనింగ్ పర్మిషన్లు ఇచ్చి, ఇటు పర్యావరణానికి, అటు నీటి వనరుల విధ్వంసానికి పూనుకున్నారని లేక పోతే సాక్షాత్తు చంద్రబాబు నాయుడి నియోజక వర్గంలోని. తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామివారి తల్లి యగు వకుళా దేవి దేవాలయం గల గుట్టను తొంభై శాతంగా గ్రానైటు మాఫియాలు త్రవ్వగలరా?” అనుకున్నడు వెంకటగౌడు. సరే మంచిది పోయెస్తం అని రామచంద్రంకు చెప్పి అందరూ కొండగట్టుకు పోయింద్రు.

తోవలో గ్రామాల్లో జరుగుతున్న మైనింగ్‌ను గమనించినాడు, కొండగట్టులో అంజన్నకు గల మొక్కులను తీర్చుకొన్నారు. కొబ్బరికాయలు కొట్టినారు, కొద్దిగా విశ్రాంతి

కోసం దేవాలయం దగ్గరలో గల చెట్లనీడన గల బండలపై కూర్చున్నారు వెంకటగౌడు కుటుంబీకులు.

వారి ప్రక్కనే ఓ ఇద్దరు యవకులు మరో బండపై కూర్చున్నారు. ఒక యువకునివద్ద ఓ తెలుగు దినపత్రిక ఉంది, దానిని ఆ యువకుడు తన మిత్రుడికి ఒక శీర్షికను పెద్దగా చదివి వినిపిస్తూన్నాడు,

“కొండగట్టు గుట్టపై గ్రానైటు వ్యాపారుల కన్ను, వ్యతిరేకిస్తున్న భక్తులు”.

అది విన్ని వెంకటగౌడు, “ఇక ఈ జిల్లాను దేవుడు కూడా కాపాడలేడని అనుకున్నడు” కొంచెం సేపటి తర్వాత అందరూ క్వాలిస్ జీపు ఎక్కి వేములవాడకు బయలు దేరింద్రు. వేములవాడలో మొదటగా బద్ది పోచమ్మకు మొక్కులు చెల్లించుకొని కల్లు పోసి దేవస్థానం వారి సత్రంలో దిగింద్రు. రాత్రి తాము తీసుకువచ్చిన బియ్యం పప్పులతో వండుకుని తిని పడుకున్నరు తెల్లవారంగా లేచి రాజరాజేశ్వర స్వామి పుష్కరణిలో స్నానం చేసి, స్వామికి కోడె మొక్కును తీర్చుకున్నాడు వెంకటగౌడు, మిగతావారు కూడా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కొని, ప్రసాదాలు కొనుక్కున్నరు. మళ్ళీ సత్రానికి వెళ్ళి కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని కరీంనగరం మీదుగా మేడారంకు బైలెల్లినారు.

వేములవాడ దాటిన తర్వాత కొడిముంజ నుండి మొదలైన గ్రానైటుక్వారీ భీభత్సాన్ని చూస్తూ చాలా విచార గ్రస్తుడైండు వెంకటగౌడు. “కేవలం అలంకారం కోసం ఇంత ప్రకృతిని అతలా కుతలం చేయడం ఎందుకో” అనుకున్నడు. జీపు ఇంకా ఒద్యారం వచ్చినప్పుడు ఒద్యారంలో జరుగుతున్న మైనింగ్‌ను చూచిన సగటు మనిషి లాగానే వెంకటగౌడు కూడా చలించి పోయిండు. ఈ రీతిగా జరుగుతున్న మైనింగ్‌ను ప్రకృతి పై జరుగుతున్న అత్యాచారమని అతనికి అనిపించింది. ఒక్క సారిగా పాలకులపై కోపం వచ్చింది. తన నిస్సహాయతకు తనపైతనకే అసహ్యం వేసింది. ఈ విపరీతాన్ని ఎలాగైనా ఆపాలి, కనీసం ఆపడానికైనా ప్రయత్నించాలి అని అనుకున్నడు వెంకటగౌడు.

రాత్రి కరీంనగరంలోని సడ్డకుడి ఇంట్లో ఉండి సేద తీర్చుకున్నరు.

# 20

తెల్లవారి జీపులో మేడారం బయలు దేరింద్రు. హనుమకొండలో వేయిస్థంబాల గుడిని చూసి, నేరుగా పాలంపేటలోని రామప్ప గుడికి చేరుకున్నారు, ఆ గుడి చుట్టూ తిరిగి పైన శిల్పులు చెక్కిన అందమైన నిలువెత్తు శిల్పాలను చూచి ఆనందించినారు, గుడిలోనికి పోయి దేవుడిని దర్శించు కునే క్రమంలో దేవాలయం నడి మంటపంలో దాదాపు వంద మంది ఏదో మీటింగ్ పెట్టుకొన్నట్లుగా అనిపించింది, వారి చేతుల్లో

ఉన్న బ్యానర్లులోని సమాచారాన్ని చదివిండు వెంకటగౌడు.

"ఘనమైన మన వారసత్వాన్ని కాపాడుకొందాం కాపాడుకుందాం" అంటూ నినాదాలు ఇస్తున్నారు.

మరో బ్యానర్‌లో "రామప్ప గుడిని కాపాడటంలో. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నేడు జరుగ బోయే పది వేల దీపాలతో రామప్పగుడిని అలంకరించే కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనండి"అనే ఆహ్వానం రాసి ఉంది.

"టన్నలును ఆపండి రామప్పను కాపాడండి" అనే మరో బ్యానర్‌ను చదివిండు వెంకటగౌడు.

వెంకటగౌడు అసలు విషయం ఏమిటో ఓ కార్యకర్తను అడిగి తెలుసు కున్నాడు. ఆ కార్యకర్త మాట్లాడుతూ "ఈ ప్రాచీన గుడికి దగ్గరలోనే కొస్టల్ కన్‌స్ట్రక్షన్ అనే ఆంధ్రా కంపెనీ వారు ఎన్నబై అడుగుల లోతున దేవాదుల నుండి నీళ్లను తెచ్చి రామప్ప చెరువులో నింపుటకు టన్నలు తవ్వుతున్నారని, దానితో ఇది వరకే పునాదులు క్రుంగగా వున్న రామప్ప గుడి కూలడం ఖాయం కావున ఆ టన్నలు తవ్వడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణా లోని రచయితలు, చరిత్ర కారులు, తెలంగాణా ఉద్యమకారులు, పౌరహక్కుల సంఘాలు, తెలంగాణా భూమిరక్షణ సంఘం, తెలంగాణా సహజ వనరుల రక్షణ సంఘం మొదలగు ప్రజా సంఘాలు, ప్రముఖ జానపద సాహిత్య పరిశోధకుడు, రచయిత ఐన జయధీరు తిరుమల రావు గారి ఆద్వర్యంలో ఉద్యమం చేస్తున్నారు.. అగో తెల్లని గడ్డంతో మధ్యలో కూర్చున్న వారు జయధీరు తిరుమల రావు" అని చెప్పిండు.

వెంకటగౌడు కూడా ఆ సమావేశంలో కూర్చున్నాడు, జయధీర్ తిరుమల రావు మాట్లాడుతూ "తెలంగాణాలోని చారిత్రిక ప్రదేశాల పరిరక్షణ పట్ల ఆంధ్రా సర్కారు వివక్ష చూయిస్తుందని, దక్షిణ భారత దేశంలోనే బహు సుందరమైన శిల్పాలతో గత ఎనిమిది వందల సంవత్సరాలుగా కాకతీయుల కాలంనాటి సంస్కృతిని, ఉన్నతిని శిల్పాలలో దాచుకున్న గొప్ప కట్టడం రామప్ప. దాని పునాదులు సరిగ్గా లేక, కూలడానికి సిద్దంగా ఉన్న గుడిని నిజాం జమానాలో కూలకుండా తగు చర్యలు తీసుకున్నారని, కాని నేటి సర్కారు ఆలాంటి గుడిని దేవాదుల టన్నలుతో కూల్చ దానికి సిద్దపడుతున్నదని, కావున తెలంగాణా ప్రజలు ఎట్టి పరిస్థితులలోనూ ఈ రామప్ప దేవాలయాన్ని కాపాడు కోవాలని" అన్నాడు. ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల నేత రత్నమాల కూడా "రామప్పను రక్షించడానికి ప్రజలంతా ఉద్యమించాలి" అన్నారు.

సహజ వనరుల పరిరక్షణ ఉద్యమ నాయకురాలైన విమలక్క తెలంగాణా ప్రజా జీవిత విధ్వంసం పై సభికులు అలోచించే విధంగా చక్కగా పాట పాడింది.

తరువాత మాట్లాడుతూ, "ఈ చారిత్రాత్మక, సుందర నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితిలోనూ ధ్వంసం కానివ్వరాదు, ప్రజలంతా కలసి తమ వారసత్వ సంపదను కాపాడుకోవాలి, తాను కూడా ఈ పోరాటంలో పాలుపంచుకుంటాను" అన్నారు. తెలంగాణా భూమి రక్షణసంఘం నాయకురాలు దుర్గాదేవి మాట్లాడుతూ "తెలంగాణాలో కనపడ్డ గుట్టలన్నిటిని మైనింగ్ మాఫియాలు పగుల గొట్టి విదేశాలకు రాళ్ళను ఎగుమతి చేస్తున్నారు. దానికి ప్రభుత్వమే పూనుకుంటున్నది ప్రజలు అప్రమత్తులై ఇట్టి విధ్వంస కాండను ఎదుర్కోనక పోతే రాబోయే కాలంలో తెలంగాణా అంతా నీరు లేక ఎడారిగా మారే ప్రమాదం ఉంది కావున తెలంగాణా ప్రజలు ఏకమై ఈ ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలి. అందులో భాగంగానే ఈ రామప్ప దేవాలయాన్ని కూడా కాపాడాలి" అన్నారు.

రామారావు మాట్లాడుతూ "ఉత్తర తెలంగాణాలో ఆదిలాబాదులోని సిర్పూరు, కాగజ్‌నగరం నుండి కరీంనగరం, వరంగల్లు, ఖమ్మం జిల్లాల్లో దాదాపు పదకొండు వందల గ్రామాల్లోని, ఆరున్నర లక్షల ఎకరాల వ్యవసాయ, మరియు అటవి భూములను సింగరేణి కంపెనీ సేకరించ నుంది, అందులో భాగంగానే వరంగల్లు జిల్లాలో భూపాల పల్లినుండి మొదలుకొని ఘణపురం, పాలంపేట, రామప్ప చెరువు, వెంకటాపురం, పస్ర, ములుగు, తాడ్వాయి, మంగపేట నుండి మణుగూరు వరకు బొగ్గు గనుల ఓసీపీలు త్రవ్వనున్నారని స్థానికులకు ఏ మాత్రం ప్రయోజనం లేని మరియు పర్యావరణానికి ఎనలేని హాని చేస్తూ. చివరకు గోదావరి నదిని కూడా ఎండగొట్టనున్నారు, కావున ఈ ప్రకృతి వినాశన కర అభివృద్ధి నమూనాను ప్రజలు తిరస్కరించాలి, అందుకు ప్రతీ తెలంగాణా వ్యక్తి పూనుకోవాలి, అందులో భాగంగానే రామప్ప గుడిని, రామప్ప చెరువును రక్షించుకోవాలి" అని ప్రజలకు పిలుపు నిచ్చిండు.

పర్యాటక శాఖ వారి నుండి లైసెన్సు పొందిన గైడు మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ"గత ఎనిమిది వందల సంవత్సరాలుగా సందర్శకులను అలరిస్తూన్న అపురూప శిల్పాల రామప్ప బహు సుందరమైన నిర్మాణము. కాని సరియైన పునాదులు లేనందున దెబ్బతిన్నది. నిజాం జమానాలో "గులాం సందాని"అనే పురావస్తు శాఖ డైరెక్టరు, ఇండియా చరిత్ర సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీకి పోయిండు. అతనికి రామప్పగుడి కూలి పోయినట్లు కల రాగా, వెంటనే రైలెక్కి ఖాజీపేటలో దిగి, సరాసరా రామప్పకు వచ్చి చూడగా కూలడానికి సిద్ధంగా ఉన్న రామప్పగుడి కనిపించింది." అంటూ.

"అతను ఇంకా పరిశీలించగా మిగిలి ఉన్న శిల్పాలలో ఒక శిల్పం కనపడ లేదు. దానిని అప్పటి వరంగల్ జిల్లా కలెక్టరు, పెకలించి హైదరాబాదులోని తన హవేలీకి తరలించినాడని తెలుసుకొని, నిజాం నవాబుకు పిర్యాదు చేయగా, నిజాం ఆ కలెక్టరును

సస్పెండు చేసి. ఆ విగ్రహాన్ని తిరిగి యధాస్థానంలో పెట్టించినాడు. పైగా యుద్ధ ప్రాతిపదికన ఇక్కడున్న ఆరు రాతి స్థంబాలను గుడి పై కప్పుకు సపోర్టులుగా నిలిపి, గుడిని కూలకుండా కాపాడిండు, గులాం సందానీగారు. నిజాం, తురక రాజైనా, వారసత్వ కట్టడాల సంరక్షణలో చూయించిన శ్రద్ధ నేటి పాలకులలో లోపించిందని" విచారం వ్యక్తం చేసిండు. ఖాలిద్.

సమావేశం చివరగా జయధీర్ తిరుమల రావు మాట్లాడుతూ "ఏది ఏమైనా తెలంగాణా ప్రజలంతా ఏకమై రామప్పగుడిని రక్షించు కుందాం. అందుకు ఉద్యమించడానికి అందరూ సిద్ధం కావాలి, ఇంకొంచెం సేపట్లో సూర్యాస్తమయం కానుంది, తర్వాత పది వేల వెలుగుల దివ్వెలను రామప్ప గుడి చుట్టూగల అరుగులపై వెలిగించి, ఈ గుడిని కాపాడుకుందాం అని ప్రతీవాళ్లు ప్రతిన పూనాలి" అని పిలుపు నిచ్చారు.

ఇంతలోనే పాలంపేట నుండి డప్పులు మోగుతుండగా వందలాది మంది ఆడ, మగా, పిల్లలు, అంతా కలసి దీపాలతో ఊరేగింపుగా రామప్ప దేవాలయానికి వచ్చినారు. ఒక్క దీపాన్ని జయధీర్ తిరుమల రావు వెలిగించగా తక్కిన పది వేల దీపాలను గ్రామస్థులతో సహా రామప్ప రక్షణోద్యమ కార్యకర్తలు, గుడిని సందర్శించడానికి వచ్చిన పర్యాటకులు, భక్తులు తలా ఒకటి రెండు దివ్వెలను రామప్ప గుడి చుట్టూ గల ఎత్తైన అరుగుల అంచుల వద్ద వెలిగించినారు. ఆ వెలుగుల ధగధగల్లో రామప్పగుడి మెరిసిపోయింది

ఎవరో పెద్దగా "రామప్ప గుడి వర్ధిల్లాలి" అనగానే, వందల గొంతులు "వర్ధిల్లాలి, వర్ధిల్లాలి" అని అరచినై.

"మన సంస్కృతీ కళలనూ రక్షంచు కుందాం" అని ఇంకో గొంతు అనగానే "రక్షించు కుందాం రక్షించు కుందాం" అని వందల గొంతులు అరచినై.

ఇంతలో విమలక్క "ధూంధాం తెలంగాణా జాతరొచ్చెరా" అంటూ పాట అందు కోగానే వందలాది కంఠాలు కోరసు నిచ్చినాయి, కొందరు ఉత్సాహంగా వలయాలుగా ఏర్పడి నాట్యం మొదలు పెట్టినారు, క్రమంగా తమకు తెలియకుండనే అందరూ గొంతెత్తి పాడుతున్న విమలక్క పాటకు అనుగుణంగా పాడుతూ ఆడినారు. అలా గంటసేపు ఆడినంక

"ఇంక సభ ముగిసింది"అని జయధీర్ తిరుమల రావు ప్రకటించినారు

# 21

వెంకటగౌడు కుటుంబం రామప్పలో అన్ని సర్దుకొని మేడారం వైపు బయలు దేరినారు, పస్ర వరకు సజావుగా జరిగిన ప్రయాణం, ట్రాఫిక్‌జాంలో ఇరుక్కుంది. మెల్లమెల్లగా ఆట్రాపిక్‌తోనే కదులుతూ మేడారం చేరేసరికి రాత్రి రెండయ్యింది వెంకటగౌడు బృందానికి, పోగానే ఒక చెట్టును చూచుకొని వారి వాహనాన్ని ఆపి వెంట తెచ్చుకున్న టార్పాలిన్ పరదాతో గుడారాన్ని ఏర్పరచు కున్నారు. ఆ కాలంలో, కాకతీయ రాజులు. పాకాల రామప్ప, లక్నవరం, ఘణపురం లాంటి పెద్ద, పెద్ద చెరువులను నిర్మాంచగా, అ చెరువుల్లో వందలాది కోయ జాతి గ్రామాలు, అడవులు నశించి నిర్వాసితులుగా మారింగ్రు, అలా గిరిజనులను నిర్వాసితులను చేయడాన్ని వ్యతిరేకిస్తూ, నాయకత్వం వహించి, కాకతీయులతో పోరాడి, వీర మరణం పొందిన గిరిజన సమ్మక్క, సారలమ్మలకు నివాళు లిస్తూ, వారు వీర మరణం పొందిన మేడారంలో ప్రతి రెండేళ్ళకు ఒక సారి పెద్ద జాతర జరుగుతుంది. ఆ క్రమంలో వారు వన దేవతలుగా రూపొందినారు.

తెల్లారే వరకు కోయ పూజారులు చిలకల గుట్టనుండి సమ్మక్కను తీసుకువచ్చినారు. వెంకటగౌడు వాళ్ళు పొద్దుటే జంపన్న వాగులో స్నానాదికాలు ముగించుకొని సమ్మక్కను దర్శించు కున్నారు. సమ్మక్కకు కోడిని ఎగరేసింగ్రు. ఆ నాటి సాయంత్రానికే కోయ పూజారులు సారక్కను కూడా చిలకలగుట్ట నుండి దించి తీసుకువచ్చినారు, గౌడు కుటుంబం సారక్కను కూడా దర్శించు కున్నారు. సారక్కకు కూడా ఒక కోడిని ఎగరేసింగ్రు. తరువాత వెంకటగౌడు తన నిలువెత్తు బంగారాన్ని దేవతలకు నైవేద్యంగా సమర్పించుకున్నాడు.

నేడు కూడా, బొగ్గుగనులకై, ఇనుప, సున్నం, గ్రానైటు గనుల ద్వారా కోట్లాది తెలంగాణా రైతాంగపు బ్రతుకులను ఆగమాగం చేయడానికి పెట్టుబడి దారులు చేస్తున్న ప్రయత్నాలను, రాబోయే కాలంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించ వలసి వస్తుందని. కాని గతంలో కాకతీయుల కాలంలో గిరిజనులు ఓడినట్లుగా కాక, ఈ సారి మాత్రం వారు గెలిచేటట్లుగా ఆశీర్వదించ మని మనసార ఆ వన దేవతలుగా మారిన సమ్మక్క సారలమ్మలను వేడుకున్నాడు వెంకటగౌడు. ఆ రోజు రాత్రి భోజనం చేసి తెల్లారగట్ల తిరుగు ప్రయాణం చేసినారు వెంకటగౌడు బృందం.

తిరుగు ప్రయాణంలో హన్మకొండ, కరీంనగరం రోడ్డుకిరువైపుల ఉన్న గుట్టలను గ్రానైటుల కొరకు పగులగొట్టడం గమనించినాడు, తన ఊరి గుట్ట పోవడం వల్ల తమ గ్రామానికి జరిగిన నష్టమే ఈ గ్రామాలన్నిటికి జరుగనున్నదని అనుకున్నడు. అసలు జిల్లాకే ఓవర్ హెడ్ నీటి టాంకుల లాగా పని చేసే గుట్టలను పగుల గొడితే జిల్లాఅంతా

ఉపరితల, భూగర్భజలాలు అడుగంటి ఎడారి అవుతందని, అంతే కాక కాకతీయ కాలువకు పూర్తి దగ్గరలోనే మైనింగ్ జరగడం గమనించినాడు. ఇంకొక చోట కాకతీయ కాలువలో ఏకంగా పడిపోయినపెద్ద గ్రానైటు బండను చూచినాడు. దానితో ఈ గ్రానైటు రాక్షసులు గుట్టలతో పాటు కాకతీయ కాలువను కూడా ధ్వంసం చేయడం ఖాయం అనుకున్నాడు.

ఇంతలో జీపు మానకొండూరు వద్ద గల పోలీసు ఠాణా ముందుకు వచ్చింది. ఆ ఠాణా ముందు ఒక పెద్ద ప్రజా సమూహం రాస్తా రోఖోకు దిగడం గమనించినాడు ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారు.

వారు పెద్ద ఎత్తున "పోలీసుల దౌర్జన్యం నశించాలి" అని నినదిస్తున్నారు.

కొందరు "మా గుట్టలు మాక్కావలె" అని నినాదాలు చేస్తున్నారు,

ఇంకొందరు "మండలాధికారి డౌన్‌ఢౌన్" అని అరుస్తున్నారు.

మరి కొందరు "అక్రమంగా అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చెయ్యాలి"అని డిమాండు చేస్తు ఉన్నారు.

వారి జీపు రాస్తా రోఖో వల్ల పోలీస్ స్టేషన్ ముందు ట్రాఫిక్ జాంలో ఇరుక్కు పోయింది. జీపు దిగిన వెంకటగౌడు. అతని సడ్డకుడు, బావమరిది దిగి రాస్తా రోకో చేస్తున్న జన సమూహం వద్దకు వచ్చింద్రు. అక్కడే పోలీస్ స్టేసన్‌కు ప్రక్కనున్న చాయ దుకాణంలో నున్న, వేడివేడి మిరపకాయ బజ్జీలకు ఆర్డరిచ్చిందు వెంకటగౌడు.

ఆ హోటల్లోనే ఇంకో ఇద్దరు కూర్చుండి చాయలు త్రాగుతున్నారు.

వారిని ఉద్దేశించి వెంకటగౌడు, "ఈడ లోల్లి జరుగుతూంది, ఎందుకే" అన్నాడు.

చాయ త్రాగుతున్న ఒక రైతు, "మా ఊరు అన్నారం. ఇదివరకు నాగులమ్మగుట్టకు గ్రానైటు మైనింగ్‌ను ఇచ్చినప్పుడే మా ఊరి ప్రజలు అడ్డుకున్నరు. వారు ఆ గుట్టపైకి వెళ్ళి క్వారీలోని డిజిల్ డ్రమ్ములను పగుల గొట్టి, డిజిల్ నేల పాలు చేసినారు. దానితో క్వారీ యజమానులు వారిపై దొమ్మి కేసు పెట్టినారు. ఇప్పటికి వారు ఇంకా కేసుల చుట్టు తిరుగుతూనే ఉన్నారు.

దానికి వ్యతిరేకంగా కొందరు హైకోర్టులో కేసు వేయగా, వారు నియమించిన వకీలు, మైనింగ్ యజమానులతో కుమ్మక్కై సరిగా వాదించలేదు. దానితో కేసు గెలువలేదు. తరువాత వారు వేరే వకీలుతో హైకోర్టు డివిజన్ బేంచీలో కేసు వేసినారు, ఇంకా తీర్పురాలేదు.

ఈ లోగానే మా ఊరిలో ఊర చెరువుకు ఆనుకొని ఉన్న గుట్టకు కూడా కంకర రాయి తీయుటకు మైనింగ్ డిపార్టుమెంటు వారు ఒక దళిత నాయకుడికి పర్మిషన్ ఇచ్చినారు.

దానితో ఆ చెరువు క్రింద సాగవుతున్న రైతులలో ఆంధోళన మొదలైంది. ఆ గుట్టకు ఆంజనేయ స్వామి దేవాలయం కూడా వుంది. ఆ గుట్టపై బడిన వాన నీటితోనే ఆ చెరువు నిండుతుంది. పైగా ఆ గుట్టకు దగ్గరలోనే వెనుకబడిన తరగతుల వాళ్ళ ఇండ్లు ఉన్నాయి. తాటి, ఈత వనాలు. మామిడి తోటలు ఉన్నాయి. అంటూ చెప్పసాగిండు.

"ఈ మధ్యలో ఎవరో ఇద్దరు గుట్టల విధ్వంసం వల్ల కలిగే నష్టాల గురించి వివరాలు

ఉన్న కరపత్రాలను బడి పిల్లలతో గ్రామం లోనికి చేరవేయగా, మా ఊరి యువకులకు, రైతులకు ఇతర వృత్తుల వారికి అన్ని విషయాలు తెలిసినయి. ప్రజలు, ముఖ్యంగా యువకులు గుంపులు గుంపులుగా కూర్చుండి ఆ కరపత్రాలను చదివి విషయాలు తెలుసుకున్నారు. అట్టి యువకుల్లో వాసుదేవ రెడ్డి ఒకడు. చాలా చైతన్యం కలిగిన వ్యక్తి, కరీంనగరం కాలేజీలో చదువుకునే రోజుల్లోనే, ఆ కాలేజీ విద్యార్థుల సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. ఆ రెడ్డి ఒక కరపత్రాన్ని తీసుకొని కరుణారెడ్డి సారుకు ఇచ్చిండు." అంటూ.

"కరుణా రెడ్డి సారు రిటైర్ అయిన ప్రధానోపాధ్యాయుడు. డెబ్భై ఆరు సంవత్సరాల వయస్సు. ఆయన కొడుకు ఒకాయన చైనాలో ఓ వైద్యకళాశాలలో వైద్యవిద్యను భోదిస్తాడు, ఇంకో కొడుకు ఇంజనీరింగ్ చదివి హైదరాబాదులో ఓ ఇంజనీరింగ్ పరిశ్రమను నడుపుతున్నాడు ఇద్దరు బిడ్డలు కూడా మంచి పొజిషన్లనే ఉన్నరు." అంటూ

"కాని రెడ్డి గారికి వ్యవసాయమన్నా, తన ఊరు అన్నా అభిమానము, ప్రేమ ఎక్కువ.

ఈ వయస్సులో ఇక్క డెందుకు, మాతోను, మనమలు మనమరాండ్రతో హైదరాబాదులో సుఖంగా ఉండ మని కూతుళ్ళు, కొడుకులు బతిమాలినా "నాకు మన ఊరేబాగున్నదని నేను నాఊళ్ళోనే ఉంటాను" అని తీర్మానించు కున్న వ్యక్తి, మానకొండూరు నుండి జమ్మికుంటకు పోయే రోడ్డుకు ఆనుకొని ఊరికి దూరంగా, ఊర చెరువుకు దగ్గరగా ఉన్న తన పదిహేను ఎకరాల వ్యవసాయ భూమిలోనే ఇల్లు కట్టుకొని వ్యవసాయమే ఊపిరిగా నిచ్ఛింతగా శేషజీవితాన్ని గడుపుతున్న వ్యక్తి కరుణారెడ్డి సారు. ఊరు వారందరు ఆతనిని గౌరవంగా పెద్దసారు అని పిలుస్తారు."అన్నాడు.

"ముఖ్యంగా వెనుకట తమ గ్రామానికి ఉన్న"మూడు గుట్టలు రెండు చెరువులు, ముప్పైఆరు కుంటల ఆన్నారం"అన్న సార్ధక నామధేయం కలిగి ఉన్నందుకు చాలా గర్వపడే వాడు."అంటూ చెప్పుతూ, "ఇప్పుడు కూడా దాదాపు వెయ్యిఎకరాల మామిడి తోటలు ఊరి చుట్టూ ఉన్నాయి. దానితో పాటు చెరువుల క్రిందా, కుంటల క్రిందా మూడు వేల ఎకరాల వరి సాగవుతుంది. అంతే కాక ఖుష్కి చేలల్లో రైతులు కూరగాయలు పండిస్తారు,

పాడి కూడా చాల ఎక్కువ, వాటన్నిటిని ఇక్కడికి పదిహేను కిలో మీటర్ల దూరంలోని కరీంనగరం పట్టణానికి సరఫరా చేస్తూ నిశ్చింత జీవితాలు గడుపుతున్నారు గ్రామస్తులు"

"మా గ్రామంలో కొద్ది మంది మాదిగ కులస్తులకు తప్ప ప్రతీ వారికి వ్యవసాయ భూమి ఉంది. వారు కూడా ఊర గుట్టకు ఆనుకొని ఉన్న బంజరు భూములను తమకు ఇవ్వమని ఎన్నో ఏండ్లనుండి ప్రభుత్వానికి మొరపెట్టు కుంటూనే ఉన్నారు. కాని ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ కులస్తుడే అయిన యం.ఎల్.ఏ కూడా పట్టించు కోలేదు. వారి ఇండ్లు నాగులమ్మ చెరువు మత్తడికి ఈవలవైపున ఉన్నాయి, ఆదే మత్తడికి ఆవలివైపున నాగులమ్మ గుట్ట ఉంది. ఆగుట్టకు మైనింగ్ జరిపినచో తమ ఇండ్లకు ప్రమాదమని వారు రందిపడుతున్నారు" ఇంకా ఇలా చెప్ప సాగిండు ఆ రైతు

"గ్రామస్థులంతా కరుణారెడ్డిసారు సూచన మేరకు గ్రామ పంచాయతీ ముందు గూమి కూడి వూర గుట్టను ఎలా కాపాడుకుందాం అన్న విషయం పై తర్జనభర్జన పడుతున్నారు. "

కరుణారెడ్డి సారు మాట్లాడుతూ, "మొదటనే నాగులమ్మ గుట్టకు ఒక రెడ్డి గ్రానైటు వ్యాపారికి లీజు ఇచ్చినప్పుడే అడ్డుకోవాలని నేను నెత్తినోరు బాదుకొని చెప్పినాను, కాని ఎవరూ పట్టించు కోలేదు. దానితో ఇప్పుడు ఊర గుట్టకు సూటి పెట్టినారు. మన ఊర చెరువుకు పైన ఉన్న ఈదులగట్టు పల్లె శివారులోని గుట్టలకు ఇదివరకే మైనింగ్ జరుపుతున్నారు, దానితో ఆ గుట్టకు గల గుడ్డేలుగులు ఊరి పై పడి ఆ గ్రామస్తుడిని గాయపరుచగా, మానకొండూరు మహిళా యస్.ఐ. గారు ఆ గుడ్డేలుగును కాల్చి చంపిన విషయం మనకందరికి తెలిసిందే కదా" అంటూ. కళ్ళకు ఉన్న అద్దాలను సవరించుకొని.

"ఇప్పటికే మా ఇంటి ముందు గల వేప చెట్టుకు పెట్టిన తేనెతెట్టనుండి తేనెను తాగడానికి ఒక గుడ్డేలుగు ఎక్కిన సంగతి మీకు తెలిసిందే నాయె, రేపు ఊర గుట్ట కూడా పోతె అన్ని గుట్టల మీద వున్న గుడ్డేలుగులు, కోతులు మన ఊరిపైబడి మామిడికాయలను, ఊరిలోని ఇండ్ల పెంకులను ఖరాబు చేస్తాయి గుట్టకు ప్రమాదం రానుంది. దానితో పాటు ఊర గుట్టను కూడా మైనింగ్ చేస్తే చెరువులోనికి నీరు రాక ఎండి పోతుంది. ఇప్పటికే కొండపల్కల. చల్లూరు మొదలగు గ్రామాలలోని గ్రానైటు రాళ్లను తరలించ డానికే మన గ్రామం మధ్యనున్న రోడ్డుకు ఇరువైపుల ఇండ్లను కూలగొట్టి వెడల్పు చేసినారు. ఊర చెరువు శిఖం పై భాగాన ఉన్న గట్టు దుద్దెన పల్లె గుట్టకు మైనింగ్ చేయగా మిగిలిన చిన్నచిన్న బండలను, మట్టిని చెరువులో గల శిఖం భూమిలో పోసి చెరువుకు ముప్పు తెస్తున్నారని, ఆ క్రమంలోనే ఇప్పుడు చెరువు కట్టపై గల సింగిల్ రహదారిని కట్టను కూల్చి డబుల్ రోడ్డుగా మార్చనున్నారని. కావున మనకు అక్కర లేని.

నష్టపరిచే పనులను అభివృద్ధి పేర గ్రానైటు కంపెనీల సౌకర్యార్థం చేయనున్నారని అందుకే మనం ఐకమత్యంతో ఉండి దీనిని వ్యతిరేకించాలని" అన్నాడు.

దానితో ఒక మాదిగ యువకుడు అడ్డుపడుతూ, "మీ ఇల్లు, పొలాలు గుట్టదగ్గరగా వున్నయి అందుకే మీరు బాదపడుతున్నారు, మాకు భూములే లేవాయె గుట్టలు, చెరువులు మాకెందుకు, మాకు ఆ గ్రానైటు కంపెనీలో ఉద్యోగాలు దొరికితే చాలు" అన్నాడు.

దానితో అదే కులానికి చెందిన దళిత యువతి రమాదేవి మాట్లాడుతూ "ఇవ్వల్ల మనకు భూములు లేకపోవచ్చు, ఇప్పటికే మాల వాల్లు దొరల భూములు కొన్నారు. రేపు మనం కూడా కొనుక్కోవచ్చు, అదీ కాక ఇప్పటికే గల పొలాలతోను, మామిడి తోటల, మరియు కూరగాయల తోటలవల్ల మనకు తీరిక లేకుండా పనులు దొరుకుతున్నాయి. ఇప్పటికే ఊర గుట్టకు ఆనుకొని ఉన్న బంజరు భూముల పట్టాల కొరకు మనం ప్రయత్నం చేస్తున్నాము. ఒక వేళ ప్రభుత్వం మనకు పట్టాలిస్తే మనం అచ్చుకట్టుకున్నట్లయితే ఊర చెరువు నీళ్లతోనే మనకు పంటలు పండుతై, లేక పోయినా బోరుబావులు తవ్వు కోవచ్చు. పైగా నాగులమ్మగుట్టకు దగ్గరగా ఉన్న మన ఇండ్లమాటేంది"అన్నది. దానితో ఆ యువకుడు సప్పుడు చేయలేదు.

ఇంకొందరు "అసలు మన అందరి గుట్టలను గ్రానైట్లు కొరకు ఎవరు అనుమతులు ఇచ్చినారని, ముందు వాటిపై విచారణ చేసి అందుకు కారకులపై చర్య తీసుకోవాలని" గట్టిగా అన్నారు.

"సర్పంచు కూడా రెడ్డిదొరనేనాయె, పంచువులు, మరియు కొత్తగా వచ్చిన పట్వారీ వల్లే ఇదంతా జరిగింది. ముందు వారిని పిలిపించి నిలదీసి వారినే అనుమతులు రద్దు చేయించ మందాం" అన్నరు మరి కొందరు.

దానితో కొందరు సర్పంచు కొరకు, మరికొందరు ఇతర ఇతర పంచువుల కొరకు వారి ఇండ్లల్లకు వురికి వారిని పంచాయతీ ఆఫీసుకు తీసుకువచ్చినారు.

వారితో పాటు, కొందరు పెద్దమనుషులు కూడా పంచాయతీ ఆఫీసులో కూర్చోని "ఎందుకు గుట్టలను గ్రానైట్లకు ఇవ్వవలసి వచ్చింది. గ్రానైట్లకు ఇచ్చేముందు గ్రామసభను ఎందుకు నిర్వహించలేదు అని నిలదీసింద్రు.

దానికి సర్పంచు "గుట్టలమైనింగ్ ద్వారా చాలా నిధులు గ్రామ పంచాయతీకి వస్తాయని, దాని ద్వారా మన గ్రామాభివృద్ధికి సరిపడా నిధులు సమకూరగలవని, అంతే కాక ఊరి యువకులకు వుద్యోగాలు దొరకనున్నాయనే కారణం చేత ఇవ్వడం జరిగిందని, అంతే కాక సదరు గ్రానైటు వ్యాపారులే ఊరగుట్టపైనున్న హనుమంతుని గుడిని గుట్ట క్రింద నిర్మించుటకు నిధులిచ్చారని, దానితోనే గుట్టక్రిందుగా ఒక అందమైన

హనుమదాలయాన్ని నిర్మించినం" అన్నడు.

దానితో గుట్టపైన ఉన్న దేవాలయాన్ని క్రిందికి దించి గుట్టను గ్రానైటు గని గా మార్చడానికి జరిగిన ప్రయత్నంగా గ్రామస్తులకు అర్ధమైంది.

దానితో "మీరేదో మంచి ఉద్దేశ్యంతో ఆ గుడిని కదుతున్నారను కున్నాం గాని దాని వెనుక గ్రానైటు వ్యాపారుల కుట్రవుందని మాకు తెలియదు" అన్నారు గ్రామ పెద్దలు.

ఇంకొందరు యువకులు "ఎన్ని లక్షల రూపాయలు లంచంగా తీసుకున్నవ్"అని నిలదీసినారు.

దానితో సర్పంచు, పంచువులు ఏం మాట్లాడలేదు. బయట ఉన్న గ్రామస్తులు సర్పంచును, పంచువులను తిట్లకు లంకించుకున్నారు. కొన్ని రోజులకు ముందుగా తమచుట్టే తిరిగిన గ్రామస్తులు ఆలా తిరుగుబాటు చేస్తారని కలలో కూడా ఊహించని సర్పంచు, ఇతర పంచువులు తలలు వంచుకుని కూర్చున్నరు,

ఇక చేసేదేమి లేక గ్రామస్తులు ఇక నైనా మాకు గ్రానైటు గనులు వద్దని, ఇచ్చిన వాటిని గ్రామక్షేమం కొరకు రద్దు చేయాలని, ఇప్పటికైనా తీర్మానం చేయాలని ఒత్తిడి తెచ్చినారు.

దానితో ఇదివరకు ఇచ్చిన గ్రానైటు లైసెన్సులను రద్దు చేస్తూ సర్పంచు, మరి ఇతర పంచువులు కొత్తగా తీర్మానం చేయగా దాదాపు అక్కడే చేరిన గ్రామస్తులంతా ఆ తీర్మానంపై సంతకాలు చేసినారు.

అక్కడే గ్రామస్థులంతా సమావేశమై గ్రానైట్ల వ్యతిరేక సంఘాన్ని నిర్మించుకున్నారు, దానికి పెద్దగా కరుణారెడ్డి సారును ఎన్నుకొన్నారు.

మరునాడు ఆ పెద్ద మనుషులంతా గ్రామపంచాయితీ ఆఫీసులో కూర్చొని గ్రామ పంచాయితీలోను, గ్రామ పట్వారీని, మరియు మానకొండూరు యం. ఆర్వో ఆఫీసులోనూ, మరియు కరీంనగరం మైనింగ్ ఆఫీసులోనూ గుట్టలకు ఇచ్చిన మైనింగ్ అనుమతుల పత్రాల అన్నిటి కాపీల కొరకు సమాచార హక్కు ద్వారా సమాచారాన్ని సంపాదించటానికి యువకుడైన వాసుదేవరెడ్డికి బాధ్యతలు అప్పచెప్పినారు. కరుణారెడ్డి గారు ఆ వయస్సులోనూ తీరిక చేసికొని డివిజనల్ అటవీ అధికారి వద్ద నుండి ఆ గుట్టల పై ఏమేమి జంతుజాలాలు ఉన్నాయన్న వివరాలను సమాచారహక్కు క్రింద అడుగుతూ దరఖాస్తూ ఇచ్చినాడు. అదే విధంగా చిన్ననీటి వనరుల ఇంజనీరు ఆఫీసులో ఆ ఊరి చెరువులను ఆనుకొని గుట్టలు ఉన్నట్లుగా సర్టిఫికెట్టు కొరకు దరఖాస్తు చేసినాడు. వారం రోజుల్లో తమకు కావలసిన సమాచారం అంతా సిద్దం చేసికొన్నారు. తరువాత తమ ఊరి గుట్టలకు ఇదివరకే మైనింగ్ డిపార్టుమెంటు ఇచ్చిన అనుమతిని రద్దు చేయమని జిల్లా కలెక్టరుగారిని కోరుతూ ఒక

వినతిపత్రాన్ని తయారు చేసి, దాదాపు గ్రామస్తులందరి సంతకాలు తీసుకున్నారు.

తరువాత వినతి పత్రాన్ని ఊరేగింపుగా కరీంనగరం వెళ్ళి కలెక్టరు గారికి ఇవ్వడానిక తీర్మానించు కొన్నారు. అట్టిర్యాలీలో పాల్గొనటానికి భూమి రక్షణ సంఘం వాల్లను కూడా పిలిచినారు.

తర్వాత రోజున ఆ గ్రామంలోని మహిళలు, పురుషులు అంతా బొడ్రాయి వద్ద సమావేశమైనారు. అట్టివారిని ఉద్దేశించి భూమి రక్షణ సంఘసభ్యులైన రామరావు, కనకస్వామి గుట్టల ఆవశ్యకత, వాటి వల్లజరిగే మంచి విషయాలు. వాటిని మైనింగ్ చేస్తే కలుగు వినాశనాన్ని విడమరచి చెప్పగా శ్రద్ధగా విన్నారు.

తరువాత అందరూ పది చిన్న వ్యానుల్లోను, ఊరిలోని ట్రాక్టర్లద్వారాను, మరి కొందరు యువకులు తమకు గల సైకిల్ మోటార్ల ద్వారాను దాదాపు పన్నెండు వందల మందికి పైగా జనం కరీంనగరం పోయినారు. వారు కరీంనగరం లోని కమాన్ వద్ద దిగి ర్యాలీగా కలెక్టరు ఆఫీసువైపు కదలినారు.

ఆ ర్యాలీకి ముందు వరసలో హనుమంతు గొంతు ఎత్తి “మా గుట్టలు” అనగానే గ్రామస్తులంతా “మాక్కావాలే” అని అరుస్తూ నడుస్తున్నారు.

“గ్రానైటు క్వారీలు” అని హనుమంతు అరవగానే ప్రజలంతా “కరీంనగరం జిల్లాకు గోరీలు” అని అరచు కుంటూ నడుస్తున్నారు.

మళ్ళీ హనుమంతు “జై తెలంగాణా”అని అరచిండు, గ్రామస్తూలంతా “జై, జైతెలంగాణా” అన్నరు,

ఆ ర్యాలీకి ముందు వరుసలో ఉన్న కొందరు యువతులు పర్యావరణంపై ఆలోచన రేకిత్తించ గల “నిన్న, నేడు, రేపు” అన్న బొమ్మలున్న బ్యానర్ పట్టుకున్నారు.

అందులో ఒక బొమ్మ గుట్టలతోను, చెరువులతోను, పొలాలతోను, మామిడి తోపులతోను, సస్యశ్యామలంగా ఉన్న ఊరి బొమ్మతోను. మరో బొమ్మలో సగం గుట్టను మైనింగ్ చేయగా, పచ్చదనం నశించిన గ్రామం. గోడలు పగిలిన ఇండ్లు, ఇండ్లపై కోతులు చేరి గూనపెంకులు పగులగోడుతున్న చిత్రాలున్నాయి. ఇక మూడవ బొమ్మలో గుట్ట పూర్తిగా నశించగా, దానితోనే పూర్తిగా శిధిలమైన గ్రామం. జనసంచారం లేకుండా ఉండి గుట్టల నిర్మూలనతో కరీంనగరం జిల్లా ఏ విధంగా మునుముందు మారనున్నదో కళ్ళకుకట్టే విధంగా చిత్రాలున్నాయి.

ఆ ర్యాలీని కరీంనగర పౌరులను విశేషంగా ఆకర్షించింది. చాలా మంది పర్యావరణ ప్రేమికులు కూడా ఆ ర్యాలీలో స్వచ్ఛందగా పాల్గొన్నారు. ర్యాలి పదకొండు గంటల వరకు కలెక్టరేటు వద్దకుచేరుకున్నది.

కలెక్టరేటువద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేయబడింది. మేన్ గేటును మూసి వేసి పోలీసులు ఎవరినీ లోనికి వెళ్ళనీయడం లేదు.

దుర్గాదేవి అక్కడికి వచ్చి ర్యాలీ నుద్దేశించి మాట్లాడుతూ "మీరంతా ఏకంగా వుంటే మనకే విజయం తద్యమని" వారికి ఉత్సాహాన్నిచ్చింది. వారంతా ఎర్రటి ఎండలో గొంతులు చించుకుంటూ గుట్టల మైనింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

ఆ ర్యాలీని, ధర్నాను కవర్ చేయడానికి వివిధ టీ. వీ ఛానల్ల వారు వారి కెమరాలతో సహా వచ్చినారు. కొందరు పత్రికా విలేకరులు. ఉద్యమ కారులతో ఇంటర్యూలు తీసుకున్నారు.

ఇంతలో కలెక్టరు ఆఫీసు నుండి ఓ గిర్దావర్ వచ్చి ఓ ఐదుగురిని వచ్చి మాట్లాడ వలసిందిగా కలెక్టరుగారు అనుమతి ఇచ్చినారని కావున మీ తరఫున ఓ ఐదుగురు వచ్చి మాట్లాడవచ్చని తెలుపగా, కరుణారెడ్డిగారు, రమాదేవి, దుర్గాదేవి. వాసుదేవ రెడ్డి, హనుమంతు. కందస్వామి మరో ఇద్దరు మహిళలు కలసి మెమోరాండం తీసుకుని కలెక్టరు గారిని కలసినారు. వారు చెప్పింది విని, రెండు వేల గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని తీసుకొని నాకు ఏమీ అధికారాలు లేవని, కాని మీరు ఇచ్చిన వినతిని గవర్నమెంటుకు పంపు తానని చెప్పింది. దానితో ఏమీ చేసేది లేక వెనుదిరిగి గ్రామస్తులు వెళ్ళిపోయినారు.

అన్నారం ప్రజలు ఇచ్చిన వినతి పత్రంతో, కలెక్టరు గారు స్పందించి, క్రిందిస్థాయి యం. ఆర్. ఓలకు గల మైనింగ్ అనుమతులు మంజూరు చేసే అధికారం ఉండటం వల్లే ఇబ్బడి ముబ్బడిగా జిల్లాలో దాదాపు ఏడు వందల క్వారీలకు అనుమతులు ఇచ్చారని గ్రహించి, ఇక ముందు గ్రానైటు క్వారీలకు అనుమతులు ఇవ్వడానికి ఐదుగురి ప్రభుత్వ అధికారులతో ఒక కమీటిని తన విచక్షణాధికారంతో ఏర్పాటు చేసింది. ఆ కమీటీలో జిల్లా కలెక్టరు చైర్మెన్‌గాను, అటవి అధికారి, మైనింగ్ అధికారి, స్థానిక యం. ఆర్. ఓ. డిప్యూటీ కలెక్టరు, ఆర్‌డివో, మరియు జిల్లా పర్యావరణ ఇంజనీరులతో ఒక స్క్రీనింగ్ కమీటిని ఏర్పాటు చేసింది. చిన్నదే అయినా ఈ విజయం ప్రజలదే.

కలెక్టరు గారికి మెమోరాండం ఇచ్చిన తర్వాత రెండు మూడు రోజులకే మానకొండూరు దళిత మహిళా యం. ఆర్. ఓ గారు ఆఘమేఘాల మీద మాదిగ దలితులకు ఊర గుట్టప్రక్కనున్న బంజరు భూములను పంచడానికి అన్నారం వస్తుందని, భూమి కావలసిన వారు పంచాయితీ ఆఫీసులో వారిని కలువచ్చునని ఆ ఊరి పట్వారీ చాటింపు వేయించాడు. దానితో ఇంతకు ముందు ఏండ్ల తరబడి అడుగుతున్నా ఇవ్వని సర్కారు ఇంత తొందరపడటం ఊరి వారందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ గ్రామంలోని

గుట్టలకు అనుమతులు ఇచ్చిన మండల రెవిన్యూ ఆధికారిని ఇదే సంధర్భంలో గట్టిగా అడగాలనుకున్నారు గ్రామస్తులు.

గ్రామస్తులంతా పంచాయితీ ఆఫీసు ముందు గూమి కూడినారు. ఆవిడ జీపు దిగి ఆఫీసులో కూర్చున్నాక కరుణా రెడ్డి గారు నమస్కరించి, "మీరు ఏలాంటి బహిరంగ విచారణ లేకనే మాఊరి గుట్టలను పరిశీలించకనే అనుమతులు ఏలాఇచ్చారని నాగులమ్మగుట్టపైన నాగదేవత విగ్రహాలు ఉన్నాయని. పైగా గుట్టపైననే ప్రతి సంవత్సరం గ్రామస్తులు వనభోజనాలకు వెల్తారని, మరియు బతుకమ్మలు ఆడుకుంటారని, ఊర గుట్టపైన ఆంజనేయస్వామి గుడి ఉందని. పైగా గుట్టలపైన జీవ. జంతుజలాలు ఉన్నవని చిట్టడవి ఉందని, వాటిని ఆనుకొనే చెరువులు ఉన్నాయని ఇవ్వన్ని చూడ కుండా ఎలా అనుమతిఇచ్చారని" అడిగిండు.

ఆ మహిళా మండలాధికారిణి "గుట్టలపైన అటువంటివి ఏమీ లేవని మీ గ్రామ పంచాయితీ తీర్మానంలో ఉందని, పైగా గ్రామ పట్వారీ కూడా తన నివేదికలో అవి వట్టి బోడగుట్టలే నని నివేదిక ఇచ్చినారు కదా" అంది.

"ఈ పట్వారి మా ఊరి వాడు కాదు. ఆయనకు ఊరి మీద ఏం ప్రేమ ఉంటుంది, ఇప్పటి పట్వారీల కంటే, వతందార్లె నయం, వారు ఎట్టి చాకిరి చేయించుకున్నా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండేవారు. వారు ఊరిలోని సామాజిక ఆస్తులను కాపాడేవారు, ఇప్పటి పట్వారీల లెక్క తప్పుడు నివేదికలు ఇచ్చేవారు కాదు" అంటూ,

కరుణా రెడ్డిగారు"మీరు ఏమి అనుకోక పోతే ఒక మాట అమ్మగారు అంటూ, ఎప్పుడో బంజరు భూములు కావాలని పెట్టుకున్న మాదిగ దళితులకు తలా ఒకటి రెండు ఎకరాలు ఇవ్వడానికి ఇన్ని ఏండ్లు తీసుకున్నారు కదా? మరి వందల ఎకరాల గుట్టలను ఏ విచారణ లేకుండా ఏలా మైనింగ్‌కు ఇస్తారు" అని అడిగిండు.

దానితో ఆ అధికారిణికి ఎం చెప్పాలో తెలియక దురుసుగా మాట్లాడుతూ "అంతా మీ గ్రామస్తులే చేసి నన్ను బదునాం చేస్తున్నారు" అంది.

దానితో దళిత యువతి రమాదేవి మాట్లాడుతూ, "గుట్టలు పోయినంక నీళ్ళు లేని భూమి మేం ఏంజేసుకోను, భూములు ఇచ్చి దండుగేకదా, మాకు మా గుట్టలు కావాలి, భూములు కూడా నీటి పారుదల సౌకర్యం కల్పించి ఇవ్వాలి" అంది.

దానితో ఆ ఆఫీసర్ కోపంతో "ఎప్పుడూ లేంది ఇవ్వాల్ల ఆడోళ్లు సిగ్గుశరం లేకుండా నన్ను నిలదీస్తున్నారు. ఇన్ని రోజులు ఎక్కడ పడుకున్నారు, ఇప్పుడేమో లేచిలేచి మీదిమీది కస్తున్నారు" అంది.

అంతే ఇక రమా దేవికి కోపమాగింది కాదు, "ఔను మాకు తిన్నది అరగక,

కొవ్వెక్కి లంచాలు తిని తెగ బలిసి మాట్లాడుతున్నాం, నువ్వు తెలివి ఉన్నదానవు, ఎప్పుడూ నిద్ర ఎరుగని దానివి. మరి మాగుట్టలెట్ల పాయే. బాగా లంచాలు తిని మాఊరిని నాశనం చేయడానికి దాపురించి నావు ఏంచదువుకున్నవ్ మమ్ములనే ఏడ పడుకొన్నారంటావు, చదువుకున్నదానివి గిట్లేనా మాట్లాడేది"అని గర్జించింది.

ఇది విన్న యువకులకు కూడా కోపం వచ్చింది, "మనం కట్టే పన్నులతోనే జీతాలు మేసే వాళ్లు మన నోట్లనే మన్ను పొయ్యవట్టిరి. ఏదయితే అదే అయింది సర్పంచును, పట్వారీని. దీన్ని తలా నాలుగు తగిలించడి" అని వెనుక ఎవరో అరచింద్రు.

దానితో పరిస్థితి ఆదుపుతప్పుతుందని గ్రహించిన కరుణా రెడ్డి, మరి కొందరు పెద్ద మనుషులు. అమ్మగారూ ప్రజలు చాలా కోపంగా ఉన్నారు. మీరు ఏం మాట్లాడకండి. అంటూ మీరు ఇక్కడే కూర్చోండి, అంటూ బయటకు నడిచిండు. బయట ప్రజలు"యం. ఆర్, ఓ డౌన్. డౌన్, యం. ఆర్, ఓ తక్షణమే క్షమాపణ చెప్పాలి" అంటూ నినాదాలు ఇస్తున్నారు

పరిస్థితి అదుపుతప్ప వచ్చని భావించిన కొందరు ఆ ఆఫీసునుండి అందరిని బయటకు పంపించి ఆమె భద్రత కొరకు తలుపులు మూసి బైట గొల్లెము పెట్టి గ్రామ సుంకరిని కాపలా ఉంచారు. బైట పరిస్థితి ఉద్రిక్తంగా వుంది. లోపల సర్పంచు, ఇతర పంచువులు పట్వారీ, యం. ఆర్, ఓ, గిర్దావరులు ఉన్నారు.

బైట గ్రామస్తులు కొందరు ఉద్రేకంతో వారిని "బయటకు ఈడ్చుకరండి తలా ఒక్కటి తగిలిద్దాం, ముండా కొడుకులకు బుద్ధివస్తది" అని తలో మాట తిడుతున్నరు. అంతలో ఒక పెద్దమనిషి మానకొండూరు పోలీసులకు విషయం సెల్‌పోన్‌తో చేరవేసిండు. అర గంటలోనే కరీంనగరం సిఐ. మానకొండూరు యస్. ఐలు తగినంత బందోబస్తుతో వచ్చి ఆమెను విడిపించింద్రు. ఆ ఆఫీసర్ దళిత యువతిని తిట్టిందని గ్రామస్తులు సిఐకి యస్సీ, యస్టీ అట్రాసిటీ క్రింద అప్పటి కప్పుడే ఫిర్యాదు చేసినారు.

"ఏదేమైనా మీరు ఓ ఆఫీసర్‌ను బంధించడం నేరం" అని సిఐ అంటూ, ఆమెను జీపు ఎక్కించు కొని మానకొండూరులో వదలి పెట్టింద్రు.

"గ్రామస్తులు, తన పై దాడిచేసి గ్రామ పంచాయితీలో నిర్బందిచారని" అంటూ ఒక పిర్యాదును పోలీసులు ఆమె నుండి తీసుకొని పోయినారు.

తెల్లారే పోలీసులు గ్రామానికి వచ్చి ఒక వెర్రి బాగులోడితో సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినారు

వారిని విడుపించు కోవడానికే నేడు గ్రామస్తులంమతా పోలీసు స్టేషన్ ఎదుట, రాస్తా రోఖో. ధర్నా చేస్తున్నాం. కొద్దిగా ఆకలిగా వుంటే ఇగో ఈడ చాయ్ తాగి పోదామని

వచ్చినం అన్నాడు ఆ రైతు.

ఇంతలో దుర్గాదేవి, హనుమంతు అక్కడికి వచ్చి సరాసరి పోలీస్ స్టేషన్ లోనికి వెళ్ళి, అక్కడున్న, సిఐ. యస్ లతో, "ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారని, ఏదైనా జరిగితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని" హెచ్చరించడంతో. సిఐ వెనక్కి తగ్గి, "రేపు ఈ ఏడుగురిని కోర్టులో ప్రవేశ పెడుతాం అని నలుగురు పెద్దమనుషులు పూచి ఇస్తే వారిని వదలి వేస్తామన్నారు."

దానితో ఓ నలుగురు హామీ పడగా అరెస్టు చేసిన వారిని వదలి వేశారు. దానితో రాస్తా రోఖోను విరమించి గ్రామస్తులు వెళ్ళిపోయినారు.

తిన్న మిరపకాయ బజ్జీలకు, తాగినచాయలకు బిల్లు చెల్లించి, జీపు ఎక్కి ఇంటిదారి పట్టింది వెంకటగౌడు యాత్రా బృందం.

# 22

ఒక నాడు హనుమంతు తనదైన హడావుడితో వెంకటగౌడు ఇంటికి వచ్చిండు. హనుమంతు "దుర్గామేడం ఇంట్లో మన భూమిరక్షణ సంఘం మీటింగ్ ఉంది. మిమ్ములను తీసుకు రమ్మని మేడం పంపింది" అన్నడు.

"ఏంమంత అర్జంటో" అని గౌడు నసిగిండు.

"ఇవ్వాల్టి పేపరు చూల్లేదా అంతగిరి గ్రామంలో, "చేవెళ్ళ-ప్రాణహిత"ప్రాజెక్టుకు భూమి సేకరణ కొరకు వచ్చే వారంలో ఇల్లంతకుంటలో ప్రజాభిప్రాయ సేకరణ వుంది దానిగురించి మాట్లాడటానికే మీటింగ్ పోదాం పా"అన్నడు హనుమంతు.

"నేను పొద్దున్నే పేపరులో చూసి ఇంటర్నెటులో దానికి సంబందించిన మ్యాపు, ముఖ్యమైన వివరాలు ఎరుకపుల్లలో(పెన్ డ్రైవ్) భద్రపరిచినాను. దాని కాపీలు తీసుకొని పోదామని" అన్నాడు గౌడు.

హనుమంతు మోటారుసైకిల్ మీద తెలంగాణా చౌరాస్తాలో గల సాయి జిరాక్సు సెంటర్లో కొన్నికాపీలు చేయించుకొని, మేడం ఇంటికి ఇద్దరు పోయి, తలుపు తట్టినారు. వాసుదేవ రెడ్డి తలుపు తెరిచినాడు. లోన హాలులో, కనకస్వామి, నారాయణ సారు, మేడం గారు కుర్చీలలో కుర్చున్నారు.

అందరూ చాయలు తాగిన తరువాత, మేడం మాట్లాడుతూ. "నేను కాలేజీలో ఉండగానే ఎవరో భూమయ్య, అనంత గిరి దగ్గరి పోతారం గ్రామం నుండి పోన్ చేసిండు" అన్నది.

"అంతగిరి కాదు, అనంతగిరి" సవరించిండు హనుమంతు.

"పేర్దేదైతే నేం లేవయ్యా! పోతారం గ్రామంలో దళితుల నూటాయాభై ఎకరాలు తీసుకొని, దగ్గరలోని గుట్టకు టన్నలు తవ్వినారట, ఇంత వరకు వారికి నష్టపరిహారం ఇవ్వలేదటవచ్చే వారంలో ఈ విషయం పైననే ప్రజాభిప్రాయ సేకరణ ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో పెట్టినారట, కావున ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టుకు సంబందించిన సమాచారాన్ని ఇంటర్నెటు నుండి డౌన్‌లోడ్ చేసి, ప్రింటు కాపీలు తెచ్చినాను"అంటూ రావు ఆ కాపీలను తలాఒకటి ఇచ్చి

"మేడం మీరు చెప్పేదాన్నిబట్టి ఆ సొరంగం పూర్తిఅయ్యి మూడు సంవత్సరాలైంది, కాని ప్రజాభిప్రాయ సేకరణ వచ్చే ఆదివారం ఉంది. ప్రాజెక్టు పని చేపట్టక ముందు జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ. ఆ ప్రాజెక్టు అయిపోయిన తరువాత జరపడంలో ఏదో పెద్ద తతంగమే వుంది" అన్నాడు గౌడు.

"అవును ఆ విషయాలన్ని మనం ఆ ఊరికి పోయి, ఊళ్ళోల్లతోని మాట్లాడి విషయాలు తెలుసుకున్న తరువాత ఆ టన్నలును, మరియు పరిసరాలను చూడందే మన కేమీ అర్థం కావు, అందుకే రేపే అందరము ఆ గ్రామాలకు వెళ్ళివస్తే బాగుంటది" అన్నాడు కనకస్వామి.

"అవును అట్లైతెనే బాగుంటది" బలపరిచిండు నారాయణ.

"మరి రేపు పోవడం ఎప్పుడు, ఎలా" అన్నాడు గౌడు.

"రేపు నేను కాలేజీకి వెళ్ళి వచ్చిన తరువాత నా కారులోనే అందరం వెల్దాం" అంది

"సరే మంచిది ఈ లోగా మనం ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టు ఆఫీసుకు వెళ్ళి సాధ్యమైనంత సమాచారం లోయర్ మానేరు డ్యాం కాలనీలోని వారి ఆఫీసుకు వెళ్ళి తెలుసుకోవడం మంచిది"అంటూ గౌడు.

"మేడం మీరు రేపు కాలేజీకి వెళ్ళే సమయానికి నేను మీ ఇంటికి వస్తాను, నన్ను కాస్తా డ్యాం ఆఫీసుల వద్ద వదలి మీరు కాలేజీకి వెళ్ళండి, నేను దొరికినంత సమాచారం తీసుకుని వస్తాను" అని అన్నాడు.

మేడం "సరే" నంది. ఆ తరువాత ఎవరి ఇండ్లల్లకు వారు వెళ్ళినారు.

తెల్లారి పది గంటలకు రావు, దుర్గామేడం ఇంటికి వెళ్ళగా, ఆమె కారులో బయలు దేరినారు, మేడం వెంకటగౌడును డ్యాం టౌన్‌షిప్‌లో గల శ్రీ రాంసాగర్ ప్రాజక్టు ఆపీసుల వద్ద వదలి, కాలేజీకి వెళ్ళి పోయింది.

వెంకటగౌడు అక్కడి ఆఫీసులోకి వెల్లి "ఇక్కడ ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజుక్టు ఆఫీసు ఎక్కడ" అని ఒక ఒక ఉద్యోగిని అడుగగా, "అది ఇక్కడ లేదు, జగిత్యాల రోడ్డు లోని

రేకుర్తి గ్రామానికి వెళ్ళే దారిలో వుంది. అక్కడకు వెళ్ళండి", అని చెప్పిండు.

వరద కాలువ ఆఫీసు అక్కడే ఉంది. ఆ కాలువ గురించి ఏమైనా సమాచారం ఏ ఇంజనీరు నడిగినా తెలుస్తుందని గౌడు అక్కడే వున్న వరద కాలువ ఇంజనీరు గారిని కలసి పరిచయం చేసికొని

"వరద కాలువ గురించి, ముఖ్యంగా కురిక్యాలలో గల బొమ్మలమ్మ గుట్ట, మాలగుట్ట, కొచ్చగుట్ట మరియు వెదిరలోని నెమళ్ళ గుట్టల మధ్య నుండి పోతున్న వరద కాలువ దాదాపు వంద అడుగుల లోతులో వుంది, పైనుండి వచ్చు వాన నీరు, మరియు భూగర్భజలాలు ఇవతల ఉన్న తూర్పు గ్రామాలకు రాదుకదా ఏలా?"అనగా,

ఆ ఇంజనీరు "అక్కడ గల మూడు గుట్టల నుండి వచ్చు జాలు కాలువలు, వరద కాలువను దాటుటకు మూడు నీటి వంతెనలు కాలువపై కట్టినామని" చెబుతూ వాటి వివరాలు ఇచ్చిండు.

"మరి కాలువకు అతి దగ్గరలోనే నెమళ్ళ గుట్టకు, ఇటు మాల గుట్టకు జరుగుతున్న బ్లాస్టింగులకు, మరియు జగిత్యాల, మల్యాల, గంగాధర మండలాలలో కాలువకు ఇరువైపుల దగ్గర లోనే జరుగుతున్న గ్రానైటు క్వారీల వల్ల కాలువ దెబ్బతినదా" అడిగిండు గౌడు.

ఇంజనీరు మాట్లాడుతూ "కొంత నష్టం వాటిల్లవచ్చు అన్నాడు. అయినా వాటికి అనుమతులు ఇచ్చేముందు ఇరిగేషన్ డిపార్ట్ మెంటు వారి సలహా తీసుకోవడం లేదని, మా డిపార్ట్‌మెంటు తరఫున మేమే ఆబ్జక్షన్ చెప్పినచో, ఇంకో డిపార్టుమెంటులో ఆతి చొరవతో జోక్యం చేసికొన్నట్లవుతుందని" అన్నాడు.

గౌడు వెంటనే అతని వద్ద గల బ్యాగు నుండి "ఓబయ్య పూజారి మరియు కర్ణాటక గవర్నమెంటు" మధ్య గ్రానైటు క్వారీల విషయంలో సూప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని ఇంజనీరు గారికి వారికి ఇస్తూ,

"దీని ప్రకారంగా ఏదైనా క్వారీగాని, గని గాని నీటి వనరులకు కనీసం ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉండాలన్న నియమం సుప్రీమ్ కోర్టు నిబంధనలు విధించిందని" అన్నాడు గౌడు.

"నైజాం కాలంనుండి ఇటీవలి కాలం వరకు తెలంగాణాలో ఈ నిబంధన ఉన్నదని కాని గ్రానైట్ల క్వారీలకు, మరియు ఇతర గనులకు అనుగుణంగా రాజశేఖర రెడ్డి గారి జమానాలో ఆ దూరాన్ని. జనావాసాలకు, గుళ్ళకు, బడులకు, నీటి వనరులకు పొలాలకు కేవలం నలుబై ఐదు మీటర్లుంటే సరిపోతుందని చట్టానికి సవరణ తెచ్చారు అందుకే మేం ఏమీ చేయలేక పోతున్నాం" అన్నారు ఇంజనీరు గారు.

"మరి ఇంకో విషయంసార్, ఇప్పుడున్న కాకతీయ కాలువకు ఎగువన యాబై

నుండి వంద అడుగుల లోతుల్లో వరద కాలువ తవ్వినారు కదా, దాని వల్ల పడమటి నుండి వచ్చు భూగర్భ జలాలు తూర్పు వైపు రాకుండా పోతాయి గదా"అడిగిండు గౌడు, "నిజమే, కాని వరద కాలువపైన అక్కడక్కడ చిన్నచిన్న చెక్ డ్యాంలు కట్టి నీటిని ఎల్లప్పుడు నిలువ చేసినచో ఆ సమస్య కొంత వరకు సరి చేయవచ్చని, అదే విధంగా కాలవకు కాంక్రీటు లైనింగ్ చేయరాదని, అప్పుడే జిల్లాలోని తూర్పు ప్రాంతానికి న్యాయం జరుగగలదు, కాని ఆ చిన్న. చిన్న డ్యాంలు కట్టడానికి రాజకీయ నాయకులకు దృడమైన సంకల్పం, ప్రభుత్వం పై ప్రజల ఒత్తిడి అవసరం" అంటూ వివరించారు.

"ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టు గురించి ఎమైనా సమాచారం ఇస్తారా" అని గౌడు అడుగగా,

"కనకయ్య గారని ఇక్కడే సూపరింటెండేంటు ఇంజనీరుగా పని చేసి రిటైర్ అయినవారు, ప్రాణహిత–చేవెళ్ళ కంట్రాక్టు కంపెనీకి కన్సల్‌టెంటుగా పని చేస్తున్నారని, వారి ఆఫీసు అల్గునూర్‌లో పెట్రోల్ బంకు పక్కన ఉన్నదని మీరు కలిస్తే ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టు గురించి మీకు కావలసిన సమాచారం దొరకవచ్చు వారిని కలవండని" అని సలహా ఇచ్చినారు ఇంజనీరు.

దానితో "సరే సార్ నమస్తే చాలా సమాచార మిచ్చారు ధన్యవాదాలు" అంటూ గౌడు బయటకు వచ్చిండు.

కనకయ్యగారికి తన్నుతాను పరిచయం చేసికొని "తాను ప్రాణహిత–చేవెల్ల ప్రాజెక్టు వివరాలు తెలుసు కోవడానికి వచ్చినాను" అన్నాడు వెంకటగౌడు."

"చాలా సంతోషం అంటూ ఇన్నాళ్ళకు మీరు ఒక్కరే దీని వివరాలు తెలుసుకొవడానికి వచ్చినారు" అంటూ కనకయ్యగారు

"గోదావరికి ఆదిలాబాదులోని తుమ్మిడి హట్టి వద్ద ఏలాంటి ప్రాజెక్టు లేకుండా నూటాఅరవై టియంసీల నీరు తోడి ఆరువందల మీటర్ల ఎత్తుకి ఎత్తి, సూమారు ఏడున్నర వందల కిలో మీటర్ల వరకు ఎత్తి పోయడం సాధ్యం కాదు, ఎల్లంపల్లి (శ్రీ పాద ప్రాజెక్టు) వద్ద ఇరవై టియంసీలు గోదావరి నీటితోను, మరియు మధ్యమానేరు వద్ద ఇరవైఐదు టియంసీల నీరు వరద కాలువతోనే నిండుతాయి, అందులోనూ శ్రీ పాద ప్రాజెక్టు కేవలం యంటిపిసి, మరియు రామగుండం విద్యుత్ అవసరాల కొరకే సరిపోతాయి, అంతేకాక ప్రాణహిత వరదల కాలంలోనే గోదావరిలో కూడా వరదలు వస్తయని ఏక కాలంలో ఇటు గోదావరి మరియు అటు ప్రాణహిత నీటిని ఈ చిన్న ప్రాజెక్టులు నిలువ చేయలేవు కావున వాటి సామర్థ్యాన్ని ఒక్కొక్కటి యాభై టియంసీలుగా మార్చాలని, తుమ్మిడిహట్టి వద్ద కనీసంఇరవైఐదు టియంసీల సామర్ధ్యంతో ఓ ప్రాజెక్టు కట్టితే గాని

నీటిని పంపింగ్ చేయలేము.”

“అదే విధంగా అనంతగిరి నుండి చేవెళ్ళ వరకు మరో వంద టియంసీల నిలువ సామర్థ్యంతో కనీసం ఒక్కొక్కొటి ఇరవై టియంసి కెపాసిటీ ఐతే ఆయిదు, ఇరవైఐదు టియంసీ లైతే నాలుగు ప్రాజెక్టులు కట్టాలని లేక పోతే చేవెళ్ళ–ప్రాణహిత నీళ్లను అందించలేదని” అంటూ ఇంకా “నందిమేడారం, మోతె చెరువు అనంతగిరి, ఇమామాబాదు, తడకపల్లి, తిప్పారం పాములపర్తి, చేవెళ్ళ వరకు గల బ్యాలెన్సు చెరువుల సామర్థ్యం కేవలం పదమూడున్నర టియంసీలే నని వాటితోనే ఓ య్యాబై టియంసీలను హైదరాబాదుకు తరలించే అవకాశంఉందని, ఇప్పటికే ఈ ప్రాజెక్టులో చూపెడుతున్న ఆయకట్టు అంతా దాదాపు ఇది వరకే శ్రీరాంసాగర్ ఆయకట్టే నని, కావున ఈ బృహత్తర ప్రాజెక్టు చివరకు మహా అయితే హైదరాబాదుకు నీటిని అందించడానికే పరిమితమౌతుందని, దాని వల్ల తెలంగాణా ప్రాంతానికి ఎలాంటి ఉపమోగం ఉండదని, నేను ఆ చిన్న ప్రాజెక్టులస్థానే నాలుగు పెద్ద ప్రాజెక్టులు కట్టాలని ఒక ప్రణాళికను ప్రభుత్వం వారికి పంపినాను కాని ఈ ఆంధ్రాసర్కారు దానిని పరిశీలించ లేదు” చెప్పుతూ,

.

“పైగా ఈ ప్రాజెక్టుకు సుమారుగా నాలుగువేల మెగావాట్ల విద్యుత్తు అవసరమౌతుందని దానికి పెట్టుబడి, ప్రాజెక్టుల, మరియు పైప్లైన్ల, మోటార్ల పెట్టుబడికి, దాదాపు రెండులక్షల కోట్ల రూపాయలు అవసరం, అన్ని పెట్టుబడులు కలుపుకుంటే సరాసరిన ఒక ఎకరానికి పదిహేను వేలనుండి ఇరవై వేల రూపాయల ఖర్చు వస్తుందని అంత ఖర్చు పెట్టగల స్థితిలో తెలంగాణా రైతులు లేరని కావున ఈ ప్రాజెక్టు చివరకు హైదారాబాదుకు నీటి నందించే మరో సింగూరు ప్రాజెక్టు కాగలదు.” అంటూ,

“అంతే కాక కృష్ణా నది, గోదావరి నదులనుండి మన వాటా నీటిని మనం ప్రాజెక్టులు లేక వాడుకోలేక పోతున్నామని, వాటిని పూర్తి చేసినచో సగం తెలంగాణా భూములను గ్రావిటీ నీటి పారుదలతోను, మిగతా సగం భూమిని కొద్దిపాటి చిన్న, పెద్ద లిఫ్టుల ద్వారా పారించు కోవచ్చని ఈ ప్రక్రియలో కాకతీయుల కాలంలో కట్టబడిన చెరువు, కుంటలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అంటూ”, తెలంగాణాకు కావలసిన ప్రాజెక్టుల వివరాలు, మ్యాపులతో సహా వివరించారు పైగా తాను ప్రభుత్వానికి సమర్పించిన ప్రణాళికను వివరించారు.

వెంకటగౌడు మాట్లాడుతూ “నిజాం జమానాలోనే సమగ్ర నీటిపారుదల ప్రణాళికలను ఆనాటి ఇంజనీరైన లాయక్ అలీ, తరువాత చకిలం శ్రీనివాసరావు, మరియు రాయలసీమ ఇంజనీరైన శివరామక్రిష్ణయ్య గార్లవి ఏమైనావని” అడిగిండు,

"వాటికి కూడా నావాటికి పట్టిన గతే పట్టిందని. వారే కాక. భీమయ్యగారు, వెదిర వెంకటరెడ్డిగారు, హనుమంత రావు గారల ప్రణాళికలకు కూడా అదే గతి పట్టిందని" అంటూ

"తెలంగాణా నాయకులకు చిత్తశుద్ధి లేదని, దానితో పాటు ఐకమత్యంకూడా లేదని, దానితో ఆంధ్రులు ఆడుతున్నది ఆట, పాడుతున్నది పాట" అయిందని వారు వాపోయారు.

ఇంకా "సాధ్యమైనంత వరకు వ్యాసాల రూపంలో ఈ ప్రణాళికల గురించి అడపాదడపా పత్రికల్లో రాస్తామని, కాని అన్ని పత్రికలు ఆంధ్రావారివి కావటాన మా వ్యాసాలకు ఎక్కువ ప్రాధాన్యత లభించదని, కాని అదే ఆంధ్రాలో చిన్న ప్రాజెక్టుకైనా చాలా పెద్దఎత్తు ప్రచారం చేసి అక్కడి ప్రజలలో చైతన్యం తెచ్చి ఉద్యమించి పనులు సాధించు కుంటారు. కావున ఇక్కడ కూడా మీలాంటి ప్రజా సంఘాలు తెలంగాణా నీటి వనరులపై విరివిగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచినచో కొంత వరకు ఫలితం దక్కవచ్చుని" వారు అన్నారు. "

ఇంకా మాట్లాడుతూ, "1864లోనే ప్రారంభించ బడిన ఇచ్చంపల్లి, మధ్యంతరంగా ఆగింది, ఆంధ్రాతో బలవంతంగా, తెలంగాణాను విలీనం చేసిన తర్వాత, మొదట ఇచ్చంపల్లి ప్రాజెక్టును నిర్మించాల్సి ఉండే, కాని ఆంధ్రా సర్కార్లు, తెలంగాణా నీటి ప్రాజెక్టులను అటుకు ఎక్కించి, వారికి అవసరమైన నాగార్జునసాగర్, శ్రీశైలం, ప్రాజెక్టులను కట్టి, తెలంగాణాకు అన్యాయం చేసినారు" అన్నాడు.

"మంచి సమాచారం ఇచ్చినారు, థాంక్యూ సార్" అంటూ వెంకటగౌడు కనకయ్య గారి నుండి సెలవు తీసుకున్నాడు.

సుమారు నాలుగు గంటల ప్రాంతంలో దుర్గాదేవి, కనకస్వామి, హనుమంతు, నారాయణ కలసి వచ్చి వెంకటగౌడును కూడా తోలుకొని అనంతగిరి వైపు బయలు దేరినారు.

కనకస్వామి గోదావరిఖనిలోని సింగరేణి బొగ్గుగనులలో ఒక ఓసిపీలో ఫోర్‌మెన్‌గా పని చేస్తాడు, అతడు కారు, లారీలు, జీపులు, డోజర్సు, డంపర్సు, అన్నిరకాల వాహనాలను నడుపుతాడు

గోదావరిఖనిలోని ఓసీపీల వల్ల పర్యావరణానికి జరుగుతున్న హానిని చూసి, అటు ఓసీపీలకు, ఇటు గ్రానైటు మైనింగ్‌లకు వ్యతిరేకంగా భూమిరక్షణ సంఘంలో చేరి యధాశక్తి పోరాడుతున్నడు. అతని స్వగ్రామంలో కూడా ఆయన స్వంత భూమి వద్దగల గుట్టకు జరిగిన మైనింగ్ వల్ల వ్యవసాయం చేయలేక ఆయన తండ్రి తనకున్న నాలుగెకరాల భూమిని క్వారీఓనర్‌కు అమ్మ వలసివచ్చింది. దానితో మరింత పట్టుదలగా గ్రానైటు

క్వారీలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు కనకస్వామి,

ఆయన డ్రైవింగులో అనంతగిరి వరకు ప్రయాణం సాఫీగా జరిగింది

అనంతగిరిలో ముందుగా సర్పంచు గారిని కలువగా వారు "మా ఊరిలోని వ్యవసాయ భూమి తొంబై శాతం. గ్రామంలోని పదిహేను ఇండ్లు మినహా మిగతా ఊరంతా అనంతగిరిలో కట్టే చెరువులో మునిగిపోతుంది, కావున మిగతా పదిశాతం భూములను, మిగిలిన పదిహేను ఇండ్లను కూడా తీసుకొని మాకు వేరేచోట నివాసగ్రామాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ప్రభుత్వాన్ని అడుగుతున్నామని" అంటూ

"మా ఊరికి తూర్పున ఉన్న గుట్టకు, తూర్పు వైపు నుండి పడమరకు టన్నలు తవ్వినారని, దాని గుండానే నీరు వచ్చి మాఊరికి ఎగువగా ఉత్తరం వైపు ఉన్న గుట్టలకు మధ్య మట్టికట్టను నిర్మించి నీళ్ళు నిల్వచేయనున్నారని, అందులో మా ఊరు ఒక్కటే పూర్తిగా మునగనుందని, ఇక చుట్టుపట్ల గ్రామాలలో కొద్దికొద్దిగా భూములను కోల్పోతారని" అనంతగిరి సర్పంచు చెప్పుతూ "గుట్టకు తూర్పువైపున టన్నలు ముఖద్వారం ఉందని దానిని ఏడు వందల కోట్లతో పూర్తి చేసినారని దానిక్రిందనే పోతారం గ్రామస్తుల భూములు పోయినాయి, వారికి ఇప్పటికి నష్టపరిహారం ఇవ్వలేదు" అని చెప్పిండు సర్పంచు.

తెలంగాణా భూమి రక్షణ సంఘం సభ్యులు, అనంతగిరి నుండి, మరో పదిహేను కిలోమీటర్ల దూరం, ఆ గుట్ట చుట్టూ వేయబడిన రోడ్డు గుండా ప్రయాణించి పోతారం గ్రామంలోని నాలుగు వాడల కూడలికి చేరుకోగా, అక్కడే వీరి కొరకు ఎదిరి చూస్తున్న భూమయ్య, తనకు తాను వారికి పరిచయం చేసికుంటూ, "పొద్దు కుంకటానికి వచ్చిందని, ముందుగా గుట్టకు తొలిచిన టన్నలును చూద్దాం పాండ్రి" అంటూ అటువైపు దారి తీస్తూ

"ఆ గుట్ట అనంతగిరి శివారులో ఉన్నా ఆ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోను, మాఊరికి కేవలం రెండు వందల మీటర్ల దూరంలో ఉంది. సర్కారు వారి పైపు లైను మా ఊరి గ్రామస్తుల పొలాల నుంచే పోతుంది. దానికి అడ్డంగా ఆగుట్ట వున్నందున దాని అడుగుగా సుమారు అరవై మీటర్ల లోతుగా టన్నలు త్రవ్విండ్రు, అటన్నలుకు అవసరమైన రాంపు కొరకు సుమారు నూటాయాభై ఎకరాల దళితుల అసైన్డ్ భూములను, మొదట వారిని బుదగరించి, ఎకరానికి ఎనమిది వేల రూపాయల కౌలుకు సదరు కంట్రాక్టరు తీసుకొని రాంపు, మరియు ఆ రాంపు ద్వారానే గుట్టకు టన్నలును కొట్టగా వచ్చిన బండలను, మట్టిని రాంపు పక్కన గల పొలాలలో వేసిండ్రు, వారి పని నడచిన రెండు సంవత్సరాలకు టంచనుగా కౌలు చెల్లించిండ్రు, పని పూర్తిఅయినంక వారు జాడలేకుండా పోయిండ్రు" అంటూ ఒక్క దమ్ము అపుకొని, కొనసాగిస్తూ"ఇటు ప్రభుత్వంనుండి భూమి సేకరణకు నష్టపరిహారం ఇంత వరకు ఇవ్వలేదు,

ఇటు కౌలు పైసలు ఇవ్వటం లేదు. దానితో దళిత రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవణ్ణ లెక్క అయింది” అన్నాడు.

“మరి మీరు మీ ప్రజాప్రతి నిధులను అడుగలేదా” అని మేడం అనగా

“టన్నలు పూర్తి అయ్యే లోపే ప్రభుత్వం చేవెళ్ళ–ప్రాణహిత ప్రాజెక్టుకు భూమి సేకరింస్తూందని అప్పుడు మీ భూములకు నష్ట పరిహారం ఇస్తారని చెప్పి నమ్మించారు. పైగా పంటమీద వచ్చే ఆదాయంకంటే, కౌలు పైకం ఎక్కువగా ఉండడంవల్ల, మళ్ళీ ఎలాగూ మా భూములను ప్రభుత్వం తీసుకొని నష్టపరిహారం ఇస్తుంది కనుక మరో ఆలోచన లేక మా భూములను కాంట్రాక్టరుకు అప్పగించినం” అన్నాడు.

తరువాత వారితో కలసి ఆ బృందమంతా ఆ టన్నలు వద్దకు వచ్చి దానిని పరిశీలించినారు. అధిక కౌలు పేర దళితుల నుండి భూములు చట్ట విరుద్దంగా తీసుకొని వాటిలోనే అర కిలోమీటరు ర్యాంపును, మరియు ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండానే అటవీ ప్రాంతానికి చెందిన గుట్ట క్రిందుగా, అన్ని చట్టాలను ఉల్లంఘించి, మిగాతా ప్రపంచానికి తెలువ కుండా, పెద్ద చట్ట విరుద్ధమైన పెద్ద దొంగ టన్నలు తవ్వి నారని గ్రహించిన భూమి రక్షణ సంఘం సభ్యులు విస్మయానికి గురైంద్రు.

“అన్ని అనుమతులు ఉన్నా, శ్రీశైలం ఎడమ కాలువ టన్నలును, తవ్వకుండా, నల్గోండ ప్రజానీకాన్ని ఫ్లోరైడు వ్యాధి గ్రస్తులను చేస్తూన్న ఆంధ్రా పాలకులు, వారి కొమ్ముకాస్తున్న తెలంగాణా నాయకులు, ఈ చట్ట విరుద్ధమైన టన్నలు తవ్వి తెలంగాణా ప్రజలకు చేస్తున్న మోసానికిది చక్కని నిదర్శనం ఇటు వంటి పాలకులను ఉరి తీసినా పాపం లేదు” అన్నాడు రామారావు. మిగతా సభ్యులు దానితో ఏకీభవించారు

ఆందులో ముఖ్యమంత్రి నుండి, మామూలు క్రింది తరగతి ఉద్యోగులంతా కుమ్మక్కు ఐతేనే సాధ్యం. దానికి తోడు స్థానిక యం.ఎల్.ఎ. మరి ఇతర ప్రతిపక్ష నాయకులకు, పాత్రి కేయులకు, ఎన్ని ముడుపులో చెల్లించి ఉంటారు. లేక పోతే ఇంతటి బహిరంగ దోపిడీ ఏలా సాధ్యమైతది అనుకున్నారు. పైగా దానికి జరిగిన ప్రారంభోత్సవానికి స్థానిక యం.ఎల్.ఎ. మరి ఇతర స్థానిక రాజకీయ, అధికార యంత్రాంగం అంతా హాజరైనారని గ్రామస్తులు తెలిపినారు. ఆ పట్ట పగలు దోపిడీ విలువ దాదాపు ఏడు వందల కోట్లు. ఇటు వంటి పెద్దపెద్ద కుంభకోణాలు భారీ ఇరిగేషన్ డిపార్టుమెంటులో కూడా జరగడం చూసిన రామారావుకి, ఇటువంటివి తరచుగా బొగ్గు గనులలో జరగడం యాదికి వచ్చింది. అలా చేయనిచో చట్ట ప్రకారంమైతే ఒక్క టన్ను బొగ్గుకూడా తీయలేమని చెప్పే సింగరేణి అధికారులు గుర్తుకు వచ్చారు. ఇటువంటి పెద్ద కుంభకోణాలు బొగ్గుగనులలో సర్వసాధారణం.

సింగరేణి కంపెనీలో గోదావరి ఖనిలో ఓ బొగ్గు బావిలో లాంగ్ వాల్ యంత్రాలను

అమర్చడానికి ఇంగ్లండు వారితో ఒక ఒప్పందం కుదుర్చుకుంది, దాని ప్రకారంగా వారు అందించిన లాంగ్ వాల్ యంత్రాన్ని అమర్చిన తరువాత, రెండు సంవత్సరాలు నిరంతరాయంగా ఆ యంత్రంపని చేసి నిర్ధేశించిన ఉత్పత్తి సాధించిన తరువాతనే మిగతా డబ్బులు చెల్లించాలి. కాని ఇంగ్లండ్ కంపెనీ వారు తప్పుడు అంచనాలతో చదరపు మీటరుకు ఎనిమిది వందల టన్నుల బరువు మోయవలసిన హైడ్రాలిక్ స్థంబాలను, నాలుగు వందల టన్నుల సామర్థ్యంతో తయారుచేయడం వల్ల, ఆ స్థంబాలు కృంగి పోగా ఆ యంత్రాలు ఒక్క టన్నును కూడా వెలికి తీయలేక పోయింది. కాని అవినీతి పరులైన సింగరేణి అధికారగణం, కార్మిక యూనియన్‌ల నాయకులతో కుమ్మక్కై నందున ఆ రెండు సంవత్సరాలు, ఇతర బొగ్గు బావులలోని బొగ్గునే ఈ బావి ఉత్పత్తిగా చూయించినారు. అంతే కాక ఆ రెండు సంవత్సరాలలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి సాధించిందనే దొంగ రిపోర్టులు చూయించి, ఆ గని మేనేజరు, జనరల్ మేనేజర్లు రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ మేనేజర్లుగా ఆవార్డులు పోందినారు. తరువాత సంవత్సరమే ఆ బొగ్గుబాయిలోని యంత్రాలు మూసివేయడం జరిగింది. ఈ విధంగా సింగరేణి అదికారులు, యూనియన్ నాయకులు, ఆ ఒప్పందంలో పాలు పంచుకున్న ఇతర నాయకులు కోట్లాది రూపాయిలు దండుకున్నారు.

ఆదే విధంగా రెండవ ఓసిపీలో రెండువందల యాబైకోట్లతో జర్మనీతో కుదుర్చుకున్న ఇన్‌పిట్ క్రషింగ్ టెక్నాలజీ దిగుమతులను, ఒక వేయి రెండువందల కోట్లకు పెంచి మరో భారీ కుంభకోణానికి సింగరేణి అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడి, సింగరేణిని వేయి కోట్ల రూపాయిల నష్టాలకు గురి చేసినారు

ఆ క్రమంలో జరిగిన అవినీతిని అడ్డుకోవలసిన సింగరేణి కాలరీస్ వర్కర్ల సంఘం వారు, వారి నాయకులు మౌనం వహించినందులకు, నజరానగా ఖమ్మం జిల్లాలో ఓ నాయకునికి కుటుంబానికి, మరియు కరీంనగరం జిల్లాలో మరో నాయకుని కుటుంబాలకు మెడికల్ కాలేజీలతో పాటు, టీచింగ్ హస్పిటల్లను ప్రభుత్వ సహాయంతో ఏర్పాటు చేసికొన్నారు. దానితో సింగరేణి కంపెనీయే ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే డిమాండు ఇంత వరకు నెరవేర లేదు. పైగా సింగరేణి దివాళా తీసిందని దానిని రక్షించాలనే నెపంతో కార్మికులను వాలంటరీ రిటైరు మెంట్లకు గురి చేసింది.

దానితో సింగరేణి యాజమాన్యం లక్షా పదిహేను వేల మంది కార్మికులను యాబై వేలకు కుదించుకుంది.

# 23

ప్రాణహిత–చేవెళ్ల గురించి ప్రజాభిప్రాయ సేకరణ, జరుగనున్న, ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి, పది గంటల వరకు దుర్గాదేవి, ఇతర భూమి రక్షణ సంఘ సభ్యులతో కలసి వెళ్ళినారు. వారు వెళ్ళేటప్పటికే షామియానాలు వేయబడినవి.

కొద్దిసమయంలోనే ప్రాజెక్టు ఛీఫ్ఇంజనీరు వచ్చిండు, వారు ఆంధ్రులు. ఇతర ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు వచ్చింద్రు. ప్రజాభిప్రాయం సేకరించాల్సిన డిప్యూటీ కలెక్టరు, స్థానిక శాసన సబ్యులు, రామగుడం శాసన సభ్యులు. పెద్దపల్లి, మరియు కరీంనగరం పార్లమెంటు సభ్యులు వచ్చింద్రు. మంత్రిగారు ఏదో పని వల్ల రావడం లేదని తెలిసిన పిదప పర్యావరణ ఇంజనీరు డిప్యూటీ కలెక్టరును, శాసన సభ్యులను, పార్లమెంటు సభ్యుని వేదిక పైకి పిలిచినారు.

అందరూ వేదిక ఎక్కినంక. ఆ మీటింగ్‌కు అధ్యక్షత వహించిన, డిప్యూటీ కలెక్టరుగారు చేవెళ్ళ–ప్రాణహిత ప్రజాభిప్రాయ సేకరణ కొరకు కావలపిన వివరాలను ఆప్రాజెక్టు ఛీఫ్ ఇంజనీరును వివరించమన్నారు. చీఫ్ ఇంజనీరు మాట్లాడుతూ “ఈ ప్రాజెక్టు వల్ల హైదరాబాదుకు త్రాగునీటితో పాటు తెలంగాణాలోని పదహరు లక్షల ఎకరాలకు, సాగు, త్రాగు నీరు అందగలదు, దానిలో భాగంగానే అనంతగిరి వద్ద ఒకటిన్నర టియంసీల సామర్థ్యంతో ఒక చెరువును నిర్మించవలసి ఉన్నదని. ఆ చెరువులోనికి నీటిని పంపుటకే ఆ చెరువుకు అడ్డంగా వున్న గుట్టకు టన్నలు తవ్వవలసి ఉందని అందుకు అవసరమైన నూటాయాభై ఎకరాల భూమి, మరియు అనంతగిరి గ్రామంలోని భూములు అవసరమౌతాయి కావున ప్రజలు సహకరించి వారి భూములు సదరు ప్రాజెక్టులకు ఇవ్వవలసి ఉంటుందని, దానికి గవర్నమెంటువారు నిర్ణయించిన ధరను భూములు కోల్పోయిన వారికి ఇవ్వగలము” అని చెప్పి కూర్చున్నారు.

“దీనిపై మీ అభిప్రాయాలేమైనా ఉంటే చెప్పవచ్చని” డిప్యూటీ కలెక్టరు సభికుల నుద్దేశించి అన్నాడు.

దానితో భూమిరక్షణ సంఘం సభ్యుడైన కనకస్వామి లేచి వేదిక పైకి ఎక్కి “ఈ ప్రాజెక్టుకు మొదటనే తుమ్మిడిహట్టి వద్ద ఎలాంటి నీటి రిజర్వు ప్రాజెక్టు కట్టనందున నీళ్లను పంపు చేయడం సాద్యంకాదని, పైగా నాలుగువేల మెగావాట్ల కరెంటు ఎక్కడి నుండి తెస్తారని, పైగా ఈ ప్రాజెక్టు క్రింద చూపబడిన ఆయకట్టు చాలా మట్టుకు శ్రీరాంసాగర్ ఆయకట్టేనని, కావున తెలంగాణా ప్రజలకు ఆమోదం కాని ఈప్రాజెక్టును రద్దు చేయాలని కోరినాడు, పైగా ఎలాంటి ప్రజాబిప్రాయ సేకరణ చేయకుండానే

పోతారంలో నూటాయాభై ఎకరాల భూమి సేకరించి గుట్టకు ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకనే టన్నలు కూడా నిర్మించినారని, ఈ ప్రజాభిప్రాయ సేకరణ "దొంగలు పడ్డంక ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టున్నది" ఇప్పటికైనా నష్టపడ్డరైతులకు సరియైన, న్యాయమైన పరిహారంతో పాటు, గత మూడేండ్లుగా ఇవ్వవలసిన కౌలు పైసలు సదరు కంట్రాక్టరు నుండి ఇప్పించాలి అని కోరుతున్నాం" అన్నాడు దానితో సభచప్పట్లతో మార్మోగిపోయింది.

ఇక దుర్గాదేవి మాట్లాడుతూ, "ఎలాంటి ప్రజాభిప్రాయం లేకుండానే, సరియైన అనుమతులు లేకుండానే ఈ సొరంగాన్ని ఎలా తవ్వినారని, పైగా దీనికి ఏడువందల కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని ఖర్చు చేసినారని. లక్ష రూపాయలకంటే తక్కువగా ఖర్చుకాగల చిన్న చిన్న పథకాల శంఖుస్థాపనలకు మరియు ప్రారంభోత్సవాలకు స్థానిక పత్రికలకు పేజీనిండా ప్రకటనలిచ్చుకొని ప్రచారం కల్పించుకునే ప్రజా ప్రతినిధులు ఏడు వందల కోట్ల రూపాయిల ప్రాజెక్టుకు హాజరైనా దానిని పేపర్లకు రానివ్వ లేదేమిటని. కావున ఈ ప్రాజెక్టు మొత్తం దొంగ ప్రాజెక్టు అని, దానిలో అనేక కోట్లరూపాయిల ముడుపులు తినవచ్చని అనుమానం ఉందని దీనికి స్థానిక రాజకీయ నాయకులే కారకులని వారే భాధ్యత వహించాల్సి ఉంటుందని" అన్నారో లేదో స్థానిక దళిత శాసన సభ్యుడు లేచి, "మైకు దుర్గాదేవిగారి నుండి గుంజుకొని, నీవెక్కడి దానవు, నాలుగేళ్ల నుండి ఏడపడుకొని ఇప్పుడు అడుగుతున్నవు, నువ్వుపాఠాలు చెప్పుతావా లేక ఉద్యమాలు నడుపుతావా?" అని గద్దించి అడిగిండు.

అంతే కాక ఒక రైతుని లేపి "నరసయ్య నీ భూమి అ కాంట్రాక్టరుకు లీజుకిచ్చినప్పుడు నన్ను అడిగినవా? పైసలు వాడు ఇచ్చినప్పుడు తీసుకున్నవు నాకేమైనా ఇచ్చినావా? అన్ని మీరే చేసికొని నన్ను బదునాం చేస్తారేంది" అన్నాడు.

దానితో కింద నున్న రైతు ఒకాయన "ఆ టన్నలు ప్రారంభించిన నాడు మీరు హాజరుకాలేదా, మరి ఆ నాడు దీనికి అన్ని అనుమతులు ఉన్నాయా లేదా అని అడుగవలసిన ధర్మం మీకు లేదా! దొంగ తనంగా ఈ టన్నలు తవ్వినప్పుడు దాని భారి నుండి ధళిత రైతులను రక్షంచాల్సింది పోయి, ఏదో డబ్బు ఆశలో పడి మా భూములు వాడికిస్తే తమాషా చూసినట్లు చూశావని దీనికి నీదే భాధ్యత" అని అరచిండు.

దానితో యంపీగారు మాట్లాడుతూ "తనది చాలా పెద్ద నియోజకవర్గమని ఈ మారుమూల ఏంజరుగుతుందో తన దృష్టికి రాలేదని" భుజాలు తడుముకున్నడు

అధికారులు "దొంగకు తేలు కుట్టినట్లుగా" మౌనం వహించారు.

దానితో ఆ మీటింగ్ లో పాల్గోన్న ప్రజలు తమకు న్యాయం చేయవలసిందిగా

గట్టిగా అరుస్తున్నారు.

ఇంతలో వాసుదేవరెడ్డిని మాట్లాడ వలసిందిగా సభాధక్షులు కోరగానే, వాసుదేవ రెడ్డి లేచి "మైకుతీసుకొని సదరు శాసన సభ్యులు, గౌరవనీయురాలైన దుర్గాదేవి గారిని కించపరిచారని, కావున బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేసినాడు" దానితో యంఎల్ఏ అనుచరులు గయ్యిమని ఆయన మీదికి లేచినారు. పోలీసులు ఆయనకు అడ్డంగా నిలబడి రక్షించినారు.

దానితో సభలోని రైతులు కూడా క్షమాపణ చెప్పాలని పట్టుబట్టడంతో గందరగోళం మద్య సభముగిసిందని ప్రకటించి డిప్యూటీ కలెక్టరు గారు వెళ్ళి పోగా, శాసన సభ్యులు, యం, పీలు. కూడా వెళ్లిపోయినారు.

కోట్లాది రూపాయిల కుంభకోణానికి, దొంగ ప్రాజెక్టుకు కారకులైన దొంగ ప్రజానాయకులు అధికారులు దర్జాగా వుంటూ, దీనిని ప్రశ్నించిన తననేమో నీచాతి నీచంగా తిట్టి కించపరచిన నాయకులు ప్రజల ముందు దోషులుగా నిరూపింప బడినారు.

"సదరు శాసన సబ్యుడు ఈ దుస్థితి నుండి తన్నుతాను రక్షించు కోవడానికే తిట్లకు లంకించుకున్నాడని, కావున దీనితో వాడిని వదలివేద్దాం" అన్నారు భమి రక్షణ సంఘం సబ్యులు.

తెల్లారి చాలా పేపర్లలో అసలు వివాదాస్పద విషయాలు విస్మరించి పేపర్లన్ని మేడం మీద జరిగిన దాడిని ఖండిస్తూ కొన్ని దళిత సంఘాలు చేసిన ప్రకటనలు వేసినారు, కాని అసలు టన్నలుకు అనుమతి లేదని, అయినా దానిని తవ్వినారని, అందులో ఏడు వందల కోట్ల రూపాయిల ప్రజా ధనం ఖర్చుయిందని కాని, దానికి సబంధించిన పనులలో అందిన కాడికి ప్రజాప్రతినిధులు, అధికారులు దండుకున్నారని గాని, దానిపై న్యాయ విచారణ జరుపాలె ననికాని డిమాండు చేయలేదు. వ్రాయలేదు. ఇట్లా పత్రికల దిగజారుడు తనం చూసి విచారపడ్డాడు రావు. అంతే కాక ఆ విషయంలో ప్రతిపక్షాల ఉదాసీనవైఖరిని కూడా ఈసడించుకోక తప్పలేదు భూమిరక్షణ సంఘ సభ్యులకు.

కొన్ని ప్రజాస్వామిక దళిత సంఘాల, ఒత్తిడికి లొంగిన శాసన సభ్యుడు చివరకు ఫోన్‌లో దుర్గాదేవికి క్షమాపణ చెప్పినాడు.

# 24

"మర్ల బడ్డ పర్లపల్లి" అన్న శీర్షికన ఒక బ్యానర్ వార్త ఒక నాటి జిల్లా పేజీల్లో వచ్చింది.

ఆ రోజే పర్లపల్లి వాసి ఒకరు దుర్గాదేవిగారికి ఫోన్‌చేసి, "తమ గ్రామంలో కాలుష్యాన్ని

వెదజల్లుతున్న మిథనాల్ ఫ్యాక్టరీ పైకి గ్రామస్తులంతా వెళ్ళి, దాడి చేసి ఆఫీసు లోని ఫర్నీచర్‌ను, అద్దాలను, మరియు ఫ్యాక్టరీ ఆవరణలో గల లారీ అద్దాలను, కారు అద్దాలను పగులగొట్టింద్రు, గ్రామస్తులపై ఫ్యాక్టరీ మేనేజరు, పోలీసులకు ఫిర్యాదు చేసిండు. వారు ఆరుగురిని అరెస్టు చేసింద్రు, ఇంకొందరిని కోసం గ్రామమంతా గాలిస్తుంద్రు మీరు తప్పక రాగలరని" కోరిండు.

దానితో "పగలు రెండు గంటలకు మా తెలంగాణా భూమి రక్షణ సంఘం సభ్యులమంతా మీ ఊరికి వస్తామని" దుర్గాదేవి చెప్పింది. పగలు రెండు గంటల వరకు సంఘ సభ్యులంతా పర్లపెల్లికి చేరింద్రు.

వారు ఆ వూరు చేరుకొనక ముందే, గ్రామంలోని సుమారు వేయి మంది మహిళలు ఆ ఊరిలోని గుడి మంటపంలో సమావేశమైనారు. ఆ సంఘ సభ్యులు అక్కడికి చేరుకోగానే,

ఒక మహిళ లేచి "ఫ్యాక్టరీలో మిథనాలు ఉత్పత్తి మొదలైన గత పది మాసాలలో పెద్ద ఎత్తున దుర్వాసన వెదజల్లు తుంది. దానితో సరిగా ఎవ్వరూ నిద్రపోవడం లేదు, పైగా భూమిలోని నీరు కూడా కలుషిత మైనందున అందరికి చర్మరోగాలు వచ్చాయ" అంటూ చెప్పింది.

మరి కొందరు "కరీంనగరం డాక్టర్ల నడుగగా మీఊరిలోని నీరు కలుషిత మైనందున చర్మరోగాలు వస్తున్నాయని" చెపింద్రు.

చర్మరోగాల బారిన పడిన వారందరిని ఆక్కడికి వెళ్ళిన వారికి చూయించింద్రు. ఒంటినిండా పుండ్లు పడిన ఒక బాలుని, అంగీ విప్పి చూయించింది ఓ తల్లి, చాల మంది ప్రజలు తమ చర్మరోగాలను చూయించింద్రు,

ఇంకో మహిళ మాట్లాడుతూ "గత పది నెలలుగా మాఊరిలో ఒక్క కాన్పుగూడా కాలేదని అన్ని గర్భస్రావాలేనని" వివరించింది.

ముఖ్యంగా వారిని గర్భస్రావాలు మరింతగా ఆంధోళన కలిగించాయి.

దానితో వారంతా ఆ ఊరి సర్పంచుని మిగతా పంచువులను నిలదీసినారు. దానికి సమాధానంగా సర్పంచు "దీనితో ఏలాంటి జల, వాయు కలిషితాలు రావని పర్యావరణ శాఖ వారు మమ్ములను నమ్మించారని, కాని తీరా ఉత్పత్తి మొదలైన తరువాత గాని, దాని తీవ్రత మాకు తెలియలేదని, దానికి మేము కూడా బాధపడుతున్నామని ఎలాగైనా దానిని మూసివేయించాలి" అన్నాడు.

ఒక రైతు తమకు "ఇది విత్తనాల ఫ్యాక్టరీ అని, మీ ఊరిలో మక్క పంటలకు పెట్టుబడులు ఇచ్చి, పండిన మక్కలను కొంటామని" చెప్పింద్రు అన్నాడు.

ఆ ఫ్యాక్టరీ చుట్టుపట్ల ఉన్న కొందరు రైతులు "తమ పొలాలు ఫ్యాక్టరీని ఆనుకొని

ఉన్నందున దాని నుండి వచ్చే వాసనకు తమ పొలాల్లో పని చేయుటకు కూలీలు రావడం లేదని అందువల్ల తమ పంట పొలాలు బీడువడ్డాయని, పంటలు లేక తాము కూలీలుగా మారినామని, అతి తక్కువ ధరకు భూమిని అమ్ముతామన్నా తీసుకునే వారు లేరు" అన్నాడు.

ఇంకో పాడి రైతు "కాలుష్యం వాత పడి తనకు ఉన్న ఐదు బర్రెలు సచ్చిపోయినాయి, గ్రామంలో పాల దిగుబడి బాగా తగ్గింది"అని చెప్పిండు.

ఇంకో గ్రామస్తుడు "ప్రతి సంవత్సరం ఎండా కాలంలో వాకిల్లలో మంచాలు వేసికొని పడుకునే వారం, ఈ వేసవిలో గ్రామంలో ఎవరు కూడా ఆరుబయట పడుకోలేక పోయింగ్రు" అన్నాడు.

ఇంకో మహిళ మాట్లాడుతూ "ఫ్యాక్టరీలో పని చేసే మా గ్రామస్తులు కొందరు, అక్కడ తయారైన సారాని చిన్న, చిన్న సీసాలలో తేగా మాగ్రామంలో తాగుబోతు లెక్కువైనారని" అంది.

దానితో దుర్గాదేవి గ్రామస్తులతో మాట్లాడుతూ "మీరు ఒక విజ్ఞపన పత్రాన్ని కలెక్టరు గారికి, ఊరి వారంతా వెళ్ళి ఇవ్వాలని. ఆలాగే పర్యావరణ కాలుష్య నివారణ మండలికి కూడా పిర్యాదు చేయాలని"సూచిస్తూ "మీరంతా ఏ ప్రలోభాలకు లోను కాకుండా ఐకమత్యంతో ఉద్యమిస్తే ఆ ఫ్యాక్టరీని మూసి వేయంచడం తెలిక ఔతుంది"అన్నారు.

అంతే కాక మీకు "మా భూమిరక్షణ సంఘం మద్దతు ఎల్లప్పుడూ ఉంటుదని" చెప్పినారు.

ఆలా సమావేశం జరుగుతుండగానే, పోలీసులు వచ్చి ఇంకొందరు యువకులను అరెస్టు చేసికొని వెళ్ళినారు. వారు ముఖ్యంగా ఆ ఊరిగుడి యువ పూజారిని కొట్టుకుంటూ అరెస్టు చేసి తీసుకువెళ్ళడం ఆ పూరి వారందరిని కదలించింది.

ఆ సభ్యులు ఫ్యాక్టరీని చూచి, యజమాన్యంతో మాట్లాడటానికి ఫ్యాక్టరీ వద్దకు వెళ్ళింగ్రు. అక్కడ దాదాపు పదిహేను మంది పోలీసులు. ముక్కులకు బట్టలు చుట్టుకొని ఫ్యాక్టరీకి కాపలాగా ఉన్నారు. వారు లోనికి వెళ్ళి మేనేజరు, మరియు ఇంజనీర్లను కలిసినారు.

వారు ఇంకా రైతుల దాడి భయం నుండి తేరుకొన్నట్లుగా లేరు. "ముప్పై అడుగుల ఎత్తైన గోడను వారు ఎలా ఎక్కి వారు ఫ్యాక్టరీలో అడుగు పెట్టినారో మాకర్థం కావడం లేదు"ఇంకా నయం వారు ఫ్యాక్టరీ జోలికి వెళ్లలేదు, అదే జరిగివుంటే చాలా ప్రమాదం జరిగి ఉండేది" అన్నాడు ఇంజనీరు. మేనేజరు మాట్లాడుతూ, "తమ ఫ్యాక్టరీ రోజుకూ ఆరవై వేల లీటర్ల ఇథనాలును మక్కలు, మరియు బియ్యంతో తయారుచేస్తూంది. దానివల్ల

చుట్టుప్రక్కల గ్రామాల రైతులు పండించిన మక్కలకు మంచి రేటుపలుకుతుంది" అంటూ,

"వాడిన నీటిని శుద్ధి చేసే యంత్రాలు ఇంకా సమకూర్చు కోలేదని, ఆ అందువల్లే ఆ ఊరి భూగర్భజలాలు కలుషితమై ఉండవచ్చని" ఒప్పుకున్నాడు

దానితో వెంకటగౌడు''మీ ఫ్యాక్టరీకి కావలసిన నీటిని ఎక్కడి నుండి తెచ్చుకొంటున్నారని" అడిగిండు.

మేనేజరు "మా ఫ్యాక్టరీ ముప్పైమూడు ఎకరాలలో విస్తరించి ఉంది, కాని మేము నూటాముప్పై ఎకరాల భూమిని మార్కెట్టు ధరలకే రైతులనుండి కొన్నాము. మిగాతా వంద ఎకరాలలో దాదాపు డెబ్బైకి పైగా బోర్లు వేసినాము, ఆనీటి తో పాటు మరింత నీటిని పక్కన ఉన్న మానేరు రిజర్వాయరు నుండి టాంకర్లలో తెస్తున్నాము"చెప్పుతూ.

"గత సంవత్సరమే పర్యావరణ అనుమతులు పొందటానికి ప్రాజాభిప్రాయం సేకరించాం" అంటూ దానికి సంబంధిచిన రికార్డులు చూయించినారు.

"దాదాపు నూటయాభై మంది పరిసర గ్రామస్తులకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇచ్చాము" అన్నాడు

తిరిగి కరీంనగరం చేరుకున్న తరవాత దుర్గాదేవి గారు హైదరాబాదులో నున్న బాబురావు అనే కెమికల్ సైంటిస్టుకు పోన్ చేసి వివరాలు సేకరించింది.

వారు ఫోనులోనే మాట్లాడుతూ "ఒక్కలీటరు ఇథనాలు తయారికి ఇరవై ఐదు లీటర్ల నీరు డైరెక్టుగా కావాలని, అదే డిరివేటివ్సు (మక్కలు, బియ్యం పండించడానికి ఐనవి మిగతావి కలుపుకుంటే) లెక్క తీసుకుంటే మూడు వందల లీటర్ల నుండి మూడువందల అరవై లీటర్ల నీరు అవసరం, అంతే కాక ఈ ఇథనాలును పెట్రోలులో కలపడానికి వాడుతారు, అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ లాంటి ప్రాజెక్టులు నలుబదికి పైగాకి అనుమతులు ఇచ్చింది. ఒక్కొక్క ఫ్యాక్టరీకి దాదాపు సాలీనా రెండు నుండి మూడు టియంసీల వంతున రవాణా నష్టాలతో కలుపుకుంటే మొత్తం నూటాయాభై టీయంసీల నీరు అవసరమౌతుంది. దీని వల్ల పంటలకు ఆ మేరకు నీరు కరువౌతుంది. పైగా ఈ ఫ్యాక్టరీలకు, మక్కలు, బియ్యం ముడి సరకు, దానితో వాటి ధరలు విపరీతంగా పెరిగి ప్రజలకు ఆహారభద్రత కరువవుతుంది, ఇప్పటికే ఇటువంటి ఫాక్టరీల వల్ల మూడవ ప్రపంచ దేశాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కావున ప్రజాస్వామిక వాదులు, ప్రజా క్షేమంకోరుకునేవారు ఇటువంటి ఫ్యాక్టరీలను వ్యతిరేకించ వలసి ఉన్నది" అన్నారు

దుర్గా దేవిగారు "మరి కాలుష్యం సంగతేమిటి"అని అడుగగా.

వారు జవాబిస్తూ "దుర్వాసన అనివార్యం, కాని వాడిన నీళ్ళను తిరిగి శుద్ధి చేసి విడుదల చేస్తే, పరిసర ఉపరితల, భూగర్భ జలాలు కలుషితం కాకుండా వుంటాయి,

కాని మీరు చెప్పిన దానిని బట్టి ఈ ఫ్యాక్టరీకి నీటిశుద్ధి కార్మాగారం లేక నీటిని భూగర్భంలో వదలి వేయడం వల్ల ప్రజలకు అనారోగ్యం సంభవించింది" అన్నారు.

అదే నాడు రాత్రి ఏడు గంటలకు మొత్తం గ్రామంలోని ఆడ, మగా అంతా కలసి, ఆ గ్రామస్తులను అరెస్టు చేసిన తిమ్మాపూర్ పోలీసు స్టేషన్ ముందు గల రాజీవ్ రహ దారిపై బైఠాయించింద్రు.

అది తెలిసి మళ్ళీ భూమిరక్షణ సంఘు సభ్యులు తిమ్మాపూర్ పోలీస్ ష్టేషన్ చేరుకున్నారు.

రాస్తా రోఖో చేస్తున్న ప్రజలు, పోలీసులు "అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదలచేయాలి" అని నినాదాలు చేస్తున్నారు.

హనుమంతు తన ఖంగుమనే కంఠంతో "ఇదేమిరాజ్యం ఇదేమి రాజ్యం" అనగానే గ్రామస్తులంతా "దోపిడిరాజ్యం. దొంగల రాజ్యం" అన్నారు. "కాలుష్యకారకమైన ఇథనాలు ఫ్యాక్టరీని" అనగానే "వెంటనే మూసి వేయాలి" అని, నినాదాలు చేస్తూ మైళ్ళకొద్ది ట్రాపిక్‌ను ఆపివేసినారు, ఆ ట్రాఫిక్‌లో చిక్కుకున్న కరీంనగరం శాసన సభ్యులు, మరియు రామగుండం శాసన సభ్యులు కూడా వారిని విడుదల చేయాల్సిందిగా పోలీసులను కోరినారు, కాని ప్రయోజనం లేక పోయింది. ధర్న, మరియు రాస్తారోఖో రాత్రి రెండుగంటల వరకు జరిగింది.

చివరకు దుర్గాదేవి గారు కల్పించుకొని, పోలీస్ స్టేషన్‌లో ఉన్న డియస్‌పి గారితో

"ప్రజలు చాలా ఆగ్రహంగా వున్నారు, వారు ఎంతకైనా తెగించేటట్లు వున్నారు, వారికి ఏమైనా అయితే పోలీసులే భాధ్యత వహించ వలసివస్తుంది" అని వాగ్యుద్ధం పెట్టుకున్నది, చివరకు ఏమనుకున్నాడో ఏమోగాని ఆ పోలీసు ఆఫీసర్ సరే "పట్టుకున్నవారిని మేజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టి బెయిల్ పై విడుదల చేయిస్తానని" చెప్పి, అరెస్టు చేసిన వారిని ప్రజల ముందే జీపులో ఎక్కించి కరీంనగరం పంపిండు. దానితో ప్రజలు శాంతించి వారి గ్రామానికి మరలింద్రు.

ప్రొద్దున్నే విడుదలై వచ్చిన యువకులకు ఘనమైన స్వాగతం లభించింది ఆగ్రామంలో.

ఆ రాత్రే దుర్గాదేవి గారు గ్రామస్తులకొరకు ఒక వినతి పత్రాన్ని తయారు చేయగా పొద్దున ఊరేగింపుగా వచ్చిన పర్లపల్లి గ్రామస్తులు ఆ వినతి పత్రాన్ని కలెక్టరుగారికి ఇచ్చినారు, దానితో కలెక్టరుగారు తాత్కాలికంగా ఫ్యాక్టరీని మూసివేయవలసిందిగా ఆదేశిస్తూ, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారిని దర్యాప్తు చేయవలసిందిగా కోరుతూ ఉత్తరం రాయటమే కాక, నీటికై ఏలాంటి అనుమతులు లేకుండా

వాడుతున్నందుకు, ఆ కంపెనీ వారిపై "నీటి దొంగతనం" కేసు పెట్టించింది.

పొల్యూషన్ కంట్రోలు బోర్డువారు దర్యాప్తు చేసి ఆ ఫ్యాక్టరీ వారు నీటికాలుష్యం గురించి తగు జాగ్రత్తలు తీసుకోలేదని, మరియు నీరు వాడుకోవడానికి ఎలాంటి అనుమతులు లేనందున, మూడు నెలలపాటు ఫ్యాక్టరీని మూసివేయాలని తీర్పుచెప్పినారు.

తరువాత గ్రామస్తులకు సంఘీభావంగా విమలక్క తన సహచరులతో వచ్చి గ్రామస్తులు ఐక్యంగా వుండ వలసిన ఆవసరాన్ని నొక్కి చెప్పింది. పౌరహక్కుల సంఘాల వారు, మానవ హక్కుల సంఘాల వారు, తెలంగాణా జాయింట్ యాక్షన్ కమీటీ అధ్యక్షులు, తెలంగాణా జేఏసీ అధ్యక్షులు కోదండరాం గారితో పాటు, కెమికల్ సైంటిస్టు బాబు రావు గారు కూడా వచ్చి గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు.

ఈ మూడు నెలలోనే ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రామస్తుల ఐక్యతను దెబ్బతీయడానికి సామ, దాన, బేధ, దండో పాయలన్నింటిని పన్నినారు. అందులో భాగంగా, మహిళా గ్రూపులకు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించాలని ప్రభుత్వ అధికారులు మహిళలను వేదించారు. ఇంకొంత మంది త్రాగుబోతుల్ని ఫ్యాక్టరీ యజమాన్యం లొంగదీసుకున్నది, ఇంకొందరు గ్రామస్తులను ప్రలోభాలకు గురి చేసింది. కుల సంఘాల నాయకులకు పని కల్పించి వారిచే కులాలవారీగా ప్రజలను చీల్చినారు. అధికార పార్టీ శాసన సభ్యులు తన అనుయాయులను ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఉసికొల్పిండు, యథావిధిగా అన్ని ప్రతిపక్షాలు ప్రజలకు మద్దతు తెలుపకుండా నిర్లక్ష్య వైఖరి అవలంభించినాయి.

పొల్యూషన్ కంట్రోలు బోర్డు వారు విధించిన నిబంధనలను అమలు పరిచామని, మరియు దిగువ మానేరు నుండి నీటి సరఫరాకు పర్మిషన్ తెచ్చుకొన్నామని కంపెనీ వారు మళ్ళీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు వారికి విన్నవించు కోగా, ఆ బోర్డు వారు మళ్ళీ ఫ్యాక్టరీని యథావిదిగా తిరిగి ప్రారంభించవచ్చని అనుమతి ఇచ్చినారు.

దానితో రెవేన్యూ డివిజనల్ అధికారిణి గ్రామస్తులను సమావేశ పరచి ప్రజల అభిప్రాయాన్ని మళ్ళీ సేకరించింది.

ఆ సభలో కూడా ప్రజలు ఆ ఫ్యాక్టరీని మూసివేయవలసిందిగా కోరినారు. కాని యజమాన్య ప్రలోభాలకు లొంగిన వారు, త్రాగుబోతులు కలసి తిరిగి ఫ్యాక్టరీని తెరిపించాలని ఆ అధికారిణికి విన్నవించారు.

దానితో ప్రజలు రెండు వర్గాలుగా చీలి గొడవ పడ్డారు. ఫ్యాక్టరీ నియమించిన ఒక త్రాగుబోతు వ్యక్తి, తన భార్య ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా మాట్లాడినందున అందరూ చూస్తుండగానే జుట్టు పట్టుకొని కడుపులో పిడి గుద్దులు గుద్దినాడు. వచ్చిన మహిళా రెవిన్యూ ఆఫీసర్ గాని. రక్షణ కు వచ్చిన పోలీసు సిబ్బంది గాని ఆ తాగుబోతు యువకున్ని

ఆపడానికి ప్రయత్నించ లేదు.

మూడు నెలల క్రిందటి గ్రామైక్యత లోపించడంతోనూ. పోలీసుల బెదిరింపుల, గుండాల ఆగడాలతో ప్రజలు భయభ్రాంతులకు లోనైండ్రు. ఆ గందర గోళంలోనే ఫ్యాక్టరీ తిరిగి నడుప బడుతుందని ఆర్, డీ, ఓ గారు ప్రకటించి వెళ్ళింది.

తరువాత పోలీసు బందోబస్తుతో తిరిగి ఫ్యాక్టరీలో ఇధనాలు ఉత్పత్తి ప్రారంభమైంది.

ఆ ప్రజా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిదని మహిళా డ్వాక్రా గ్రూపులకు కోఆర్డినేటరుగా పని చేస్తున్నామెను ఉద్యోగం నుండి తీసివేసినారు అధికారులు.

పర్లపెల్లి గ్రామస్తులు ఫ్యాక్టరీ చుట్టుపట్ల గల పది, పదిహేను గ్రామస్తులను ఈ కాలుష్య ఫ్యాక్టరీకి వ్యతిరేక ఉద్యమంలోకి సమీకరించ లేక పోవడం, మరియు కాకతీయ కాలువపై ఆధారపడిన రైతులు తమనీరు అక్రమంగా ఫ్యాక్టరీకి తరలించినా దానిపై అవగాహన లేక సమీకృతులు కాక పోవడం, తోటి రైతులకు జరిగిన అన్యాయానికి ఇతర గ్రామ రైతులు స్పందించక పోవడం సరియైన రైతు సంఘాలు లేక పోవడం, వారిని అన్ని రాజకీయ పార్టీలు కూడా పట్టించుకోక పోవడం, చివరకు తెలంగాణా కోసం పోరాడుతున్నామనే పార్టీకూడా మౌనంగా వుండటం కూడా ఆ గ్రామస్తుల ఉద్యమం తాత్కాలితంగా నిలిచిపోయింది.

కాని ఈ ఉద్యమం ప్రజలలో చాలా చైతన్యాన్ని నింపింది.

# 25

ముస్తాబాద్ మండలం, నామాపూర్ గ్రామంలోని పల్లగుట్టలో యాభైఆరు ఎకరాలను రంగురాళ్ళ కొరకు ప్రభుత్వం లీజుకీయనుంది. కావున ఇరవై ఆరు జులై రోజున ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని పత్రికలలో ప్రకటన ఇచ్చారు, కాలుష్య నివారణ మండలి వారు. దానితో ఎలాగైనా ఆ గుట్టను మైనింగ్ కాకుండా చూడాలని, అందుకోసమై ఆ గ్రామ ప్రజలలో చైతన్యం పెంచి, ప్రజాభిప్రాయ సేకరణలో అ గుట్ట మైనింగ్‌కు వ్యతిరేకించేలా ప్రేరణ ఇవ్వాలని తెలంగాణా భూమి రక్షణ సంఘం వారు నిర్ణయించు కున్నారు.

దానితో వారంతా కలసి ఆ గ్రామాన్ని, గుట్టను పరిశీలించడానికి నామాపూర్ వెళ్ళింద్రు. హనుమంతుకు తెలిసిన నారాయణ రెడ్డి అనే రైతును కలిసి, ఆ ప్రకటన ఆయనకు చూపగా,

“మా గుట్టపోతె ఎట్లా దానిని మా శాయశక్తుల అడ్డు కుంటాము, ఆది మాఊరికి తూర్పు వైపున ఉంది, పడమరవైపున, ఉత్తరం వైపున ఉన్న గుట్టలన్ని ఫారెస్టు భూములు,

కాని ఈ ఒక్కగుట్ట మాత్రం ప్రభుత్వ భూమిలో ఉంది, దానిపై నెమళ్ళు, అడవి పందులు, రకరకాల చెట్లు చేమలు ఉన్నాయి, దానిపై తునికి చెట్లు కూడా ఉన్నాయి, పైగా అది ఫారెస్టు భూమి కానందున ప్రజలకు అవసరమైన కట్టెలు దానినుండే తెచ్చుకుంటారు, నిజానికి ఆ గుట్ట మా ఊరి శివారులోనే ఉంది, కాని మా ఊరికి దూరంగాను, గూడూరు గ్రామం ఆ గుట్టకు తూర్పువైపు ఆనుకొనే ఉంది. దానిపై నుండి వచ్చు వానజాలులతోనే మాఊరి రెడ్డి చెరువు నిండుతుంది. దాని నుండి వచ్చు జాలు తోనే గూడూరు. గూడెం, ఆవునూరు చెరువుల ద్వారా నీరు మానేరుకు చేరుతుంది. ఆది పోతే ఆ నాలుగు గ్రామాలకు ఉపరితల, మరియు భూగర్భ జలాలు అడుగంటుతాయి" అంటూ బాదగా వివరించిండు.

ఇంకా మాట్లాడుతూ, "దాని ఆధారంగానే మా ఊళ్లో ఆరువేల గొర్లు, మేకలు ఉన్నాయి. ముందుగా గొల్ల పెద్దలను కలవడం బాగుంటది" అంటూ, ఆ గ్రామ బస్టాండు వైపున ఉన్న గొల్ల వాడకు దారి తీసిండు.

అక్కడ గొల్ల పెద్ద బీరయ్యను కలిసి వివరాలు, చెప్పగా అతను. "మేమంతా ఒకటి రెండు రోజుల్లో మాట్లాడుకొని ఏ విషయం తెలియజేస్తాము" అన్నాడు.

దాంతో నారాయణ రెడ్డి గారు"మీరు రెండు రోజుల తర్వాత వస్తే బాగుంటుంది. ఈ లోపు గ్రామస్తులందరిని ఒక్కతాటికి తెస్తాం, అప్పుడు పల్లగుట్ట మైనింగ్ చేయకుండా అడ్డు కుంటాం" అన్నాడు.

"సరే" నంటూ భూమి రక్షణ సంఘం వారు, వెనుకకు మర్లుతూ, ఆ ఊరి రోడ్డుకు ఎడమ వైపున ఉన్న పల్లగుట్టను పరిశీలించారు.

దాదాపుగా ఆ గుట్ట రెండు వందల ఎకరాలకు పైగానే ఉంటుంది. ఆది నామాపూర్‌కు, తూర్పున రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆదే గుట్టకు ఆనుకొనే గూడూరు గ్రామం ఉంటుంది. అప్పర్ మానేరు ప్రాజెక్టు నుండి వచ్చు కాలువ, ఆ గుట్టను తూర్పు వైపున ఆనుకొనే, గూడూరు, నామాపూర్, గూడెం, ఆవునూరు గ్రామాలకు వెలుతుంది. నామాపూర్ గ్రామానికి పడమరన, ఉత్తరాన మరియు తూర్పున పల్ల గుట్ట ఉన్నందుననే ఆ ఊరిలో భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి.

దుర్గాదేవి కారులో తిరుగు ప్రయాణం లోనే, క్వార్జు మైనింగ్ వల్ల జరుగు అనర్థాల గురించి, గ్రామీణులకు అవగాహన కలిగించుటకు ఒక కరపత్రాన్ని, వెంకటగౌడు రాయలని, దాని ప్రింటింగ్ బాధ్యతలు దుర్గాదేవి గారికి, తెలంగాణా భూమిరక్షణ సంఘం అప్పగించింది.

రెండు రోజులలో కరపత్రం ప్రింటింగ్ భూమిరక్షణ సంఘం తరపున చేయబడింది.

దానిని తీసుకొని హనుమంతు, వెంకటగౌడులు నామాపూర్, గూడూరు, గూడెం,

ఆవునూరు గ్రామాలలో పంచినారు.

ఈ వార్త విన్న విమలక్క తన బృందంతో, "తెలంగాణ సహజ వనరులను కాపాడుకుందాం" అనే కరపత్రాన్ని పంచుతూ, నామాపూర్ చుట్టుపట్ల గ్రామాలేకాక, ముస్తాబాద్ మండల గ్రామాలన్నింటిలోనూ, తమ అరుణోదయ బృందం ఆట. పాటలు పాడుతూ నిర్విరామంగా ప్రచారం చేసినారు.

అట్టి సమావేశాల్లో కొన్నింటిలో జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. భూమిరక్షణ సంఘం తరపున దుర్గాదేవిగారు హనుమంతు, వెంకటగౌడులు కూడా పాల్గొన్నారు. దానితో మొత్తం ముస్తాబాదు మండల ప్రజలకు గుట్టలమైనింగ్ వల్ల జరుగు నష్టాలపై అవగాహన పెరిగింది. ఎట్టి పరిస్థితుల్లోను మైనింగ్‌ను ఆపాలని ప్రజలు కోరుకున్నరు..

ముస్తాబాదులో విమలక్క అధ్వర్యంలోని తెలంగాణా సహజవనరుల పరిరక్షణ సంఘం, తెలంగాణా భూమిరక్షణ సంఘం, పౌరహక్కుల సంఘం అందరు కలసి స్థానిక పత్రికా విలేకరుల సమావేశంలో పల్లగుట్టను రక్షించుకోవలసిన ఆవసరాన్ని నొక్కి చెప్పినారు. తెల్లారి పేపర్లు అట్టి వార్తలను స్థానిక టాబ్లాయిడ్‌లలో వేసినారు. ఆ క్రమంలోనే ఈ సభ్యులంతా ఆనాటి సాయంత్రం వేళ గూడూరు గ్రామం చేరుకున్నారు. ఆ గ్రామాన్ని ఆనుకునే పల్లగుట్ట ఉన్నది.

ఆ గుట్టప్రక్కనే ఎగువ మానేరు కాలువ ఉన్నది. ఆ సాయంత్రం ఆ ఊరి శివారులోనే ఒక నెమళ్ళ గుంపు ఆ బృందానికి ఎదురు వచ్చింది. ఆ నెమళ్లు కూడా మనతో కలుస్తున్నాయని దుర్గాదేవి గారు చమత్కరించారు

గూడూరు గ్రామం చాలా చక్కగా వుంది, విశాలమైన బజారులతో పరిశుభ్రంగా వుంది, ఆ ఊరిలో కొన్ని బోర్డులపై ఈ గ్రామంలో మధ్యం త్రాగటంగానీ, పాన్, గుట్కాలు, సిగరెట్లు, బీడీలు. ఇతర మత్తు పదార్థాలు అమ్మడం, కొనడం తినడం నిషేధించడమైనది అనే బోర్డులు ఉన్నాయి, దానిని ఉల్లంఘుంచిన వారికి వేయి రూపాయిల జరిమాన విధించ బడును అన్న ప్రకటనలు గ్రామాభివృద్ధి సంఘం పేరున ఉన్నాయి.

వెంకటగౌడు మీ ఊరిలో ఎవ్వరు త్రాగరా అని ఓ గ్రామస్తుడిని ప్రశ్నించగా, "ఎవ్వరూ త్రాగరని, గుట్కా. పాన్. పొగాకు, బీడీలు, సిగరెట్లు కూడా త్రాగరని. చివరకు ఆబ్కారీ మధ్య దుకాణానికి ఎవరూ వేలంపాట పాడరని" సగర్వంగా చెప్పిండు.

దీనికి ఎవరు కారకులనగా "మా గ్రామమంతా ఐకమత్యంతో సాధించుకున్నామని ఈ గ్రామ చట్టానికి ఎవరూ ఆతీతులు కారని" అన్నాడా గ్రామస్తుడు.

దానితో వెంకటగౌడు ఆ గ్రామ "సర్పంచు ఎవరనగా", ఆతను ఇక్కడ ఉండడని

హైదరాబాదులో ఉంటాడని అవసరమైన్నప్పుడల్లా వచ్చి పోతుంటాడు” అని ఆ గ్రామస్తుడు చెప్పిండు.

మీరు మీప్రక్కనున్న పల్లగుట్టను మైనింగ్ చేస్తే ఏంచేస్తారనగా, “అంతా గ్రామకమీటి తీర్మానం మేరకు నడచుకుంటామని, ఇదివరకు ఒక సారి మైనింగ్ కొరకు ఒకరు వస్తేనే ఊరంతా కలసి వెళ్లగొట్టినామని, ఇప్పుడూ కూడా వ్యతిరేకిస్తాం” అన్నాడా గ్రామస్తుడు. రామారావు ఆ గ్రామ సర్పంచును, మరియు గ్రామస్తులను అభినందించిండు. “ప్రజాభిప్రాయ సేకరణ నాడు మాగ్రామమంతా తరలి వచ్చి తప్పక మా వ్యతిరేకతను వెల్లడిస్తాం” అన్నాడా గ్రామస్తుడు.

ప్రజాభిప్రాయ సేకరణ ప్రజలకు దూరంగా వుంటుందని పల్లగుట్ట వద్దనే ఏర్పాట్లు చేసినారు అధికారులు. ఆ గుట్టవద్దనే షామియానాలు ఏర్పాటు చేసినారు. తీరా ప్రజాభిప్రాయ సేకరణ సమయానికి భోరున వర్షం వచ్చే సూచనలు కనపడ్డాయి, దానితో ఆ పల్లగుట్టపైనున్న నెమళ్ళు ఒకదాని వెంట ఒకటి యెడతెగకుండా అరుస్తూన్నాయి. ఇంతలో నామాపూర్ గ్రామస్తులు గుంపులు గుంపులుగా పల్లగుట్టవద్ద జరుగబోయే ప్రజాభిప్రాయ సేకరణ స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి తెలంగాణా భూమిరక్షణ సంఘంవారు దుర్గాదేవి అధ్వర్యంలోనూ, తెలంగాణా వనరుల పరిరక్షణ సంఘం నుండి విమలక్క తన అరుణోదయ కళాకారుల బృందంతోనూ. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వారు మానవహక్కుల సంఘాల వారు చేరుకున్నారు. గూడూరు గ్రామస్తులు కూడా చేరుకున్నారు.

వివిధ పత్రికల పాత్రికేయులు ప్రజాసంఘాల సభ్యుల అభిప్రాయాలను తమ కెమరాల్లోకి ఎక్కిస్తున్నరు

ఇంతలో వర్షం ఎక్కువైంది. ఆ వర్షంలోనే అందరూ తడిసి ముద్దైండ్రు. కొద్ది సేపటికి పెద్ద వర్షం తగ్గి చిన్నగా చినుకులు పడుతున్నాయి. ఆ సమయంలోనే ఆర్‌డిఓ గారు, పర్యావరణ ఇంజనీరు, తహసీల్‌దారు తో పాటు పోలీసు బందోబస్తుకూడా దిగింది. అందరిని పర్యావరణ ఇంజనీరు వేదికపైకి పిలిచిండు. డిఆర్ఓ గారు, పర్యావరణ ఇంజనీరు గారు, మిగతా అధికారులు అందరూ స్టేజీపైకి ఎక్కినారు. స్టేజీపైన గల కుర్చీలన్ని వర్షానికి తడువగా అందరూ వేదికపైన నిలుచుండే సమావేశాన్ని ఆరంభించారు.

కాలుష్య నివారణ ఇంజనీరు, తన తలపై పడిన వర్షపునీటిని తన కర్చిఫ్‌తో తుడిచి, “మీ ఊరిలో గల పల్లగుట్టను మైనింగ్ చేసి క్వార్ట్జు మరియు ఫెల్డుస్పర్ అను ఖనిజాలను వెలికి తీయడానికి శ్రీనివాసరెడ్డి గారు దరఖాస్తు చేసికొన్నారు, ముందుగా కంపెనీ వారు తమ రిపోర్టును మీకు వినిపిస్తారు. దాని తరువాత మీకు గల

అభ్యంతరములను, మరియు నిరభ్యంతరములను సభాముఖంగా తెలియజేయవచ్చు" అని చెప్పి ముందుగా శ్రీనివాసరెడ్డి గారిని తన రిపోర్టును వివరించవలసిందిగా కోరినాడు.

శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ "మీ ఊరిలోని గుట్టకు పలుగు రాళ్ళ ఉన్నందున వాటిని వెలికి తీసి అమ్ముకొనుటకు ధరఖాస్తు చేసికొన్నాను, దాని వల్ల మీ గ్రామాలలోని వారికి చాలా మందికి ఉద్యోగాలు..." అన్నడోలేదో

వేదిక క్రింద గల గ్రామస్తుల నుండి పెద్దగా నిరసన వెల్లడయ్యింది. "మాకు గుట్టే కావాలి మీ ఉద్యోగాలు వద్దు" అంటూ పెద్దగా అరచిండ్రు. ఆర్‌డిఓ గారు జోక్యం చేసికొని "మీకేమైనా అభ్యంతరాలు ఉంటే ఒక్కొక్కరు వేదికమీదకు వచ్చి మాట్లాడ వచ్చు, కావున ఒక్కొక్కరు వచ్చి మాట్లాడండి" అన్నాడు.

దానితో నామాపూర్ గొల్ల కుర్మ పెద్ద బీరయ్య వేదిక నెక్కి "మా నామాపురంలోనే ఆరువేల గొర్రెలు, మేకలు, మరియు గూడూరులో రెండు వేల సన్న జీవాలు ఈ గుట్టపైననే మేతకు ఆధారపడతాయని. ఒక్క సారి లక్షమందికి సరిపడే మాంసాన్ని మా రెండు గ్రామాలు ఇస్తాయని, పైగా గొంగళ్ళకు ఉన్నిని, మరియు చర్మ కార్మికులకు తోళ్ళను సరఫరా చేస్తాయని కావున గుట్టలేక పోతే ప్రజలకు మాంసాహారంతో పాటు మా రెండు గ్రామాలలో వంద కుటుంబాలకు పనిపోతది. మేం ఎట్లబతుకాలె, మేం బతకాలంటే ఈ గుట్టమాకు జరూరుగుండాలే. ఇది పోతే మేము ప్రక్కనున్న జంగ్లాతు గుట్టలకు మేపుకోవాలి, జెంగ్లాతు వాల్లతో కిరికిరి మాకు వద్దు, మా ఊరు ఎప్పుడు పుట్టిందో అప్పటి నుంచి మా పెద్దలు గిదే గొర్లను గాగుట్టకే మేపిండ్రు, మేంగూడా గా గుట్టకే మేపుతున్నం. గుట్టను కొట్టి మా నోట్లో మట్టి గొట్టకుండ్రి. అప్సర్లు కొద్దిగ దయుంచాలి"అన్నాడు.

ఇక తెనుగు పెద్ద మొండయ్య మాట్లాడుతూ "దొరలూ మేం మా బుద్ధి తెలిసినప్పటినుంచి, ఈ గుట్టల్నే సీతపల్కపండ్లు తెంపుకున్నం, మమ్ముల్ని ఎవ్వరూ పన్ను గట్టమని అడ్గలే, మా ఊళ్లోకూడా సీతపల్కపండ్లు తెంపుకునుడు తెనుగోల్ల పని అని అందరికీ తెలుసు, వాటిని పిందెలప్పటి నుండి కాపుగాసి, తెంపి పావులో పరకో వెనుకేసుకుంటం ఇది మా ఆచారం, మా బతుకులు దాని మీదనే ఎల్లదీస్తం. అడవి రేగుపండ్లు, మొర్రి, తునికి, పరికి, తుర్రి, మేడి. అల్లనేరేడు పండ్లు కూడా దులిపి అమ్ముకొంటం, ఎప్పుడైనా గుట్టమీది చెట్లకు తేనెటీగలు తేనెపెడితే దులిపి అమ్ముకుంటం. పైగా మా ఊరొళ్లందరికి పొయ్యిలకట్టెలు ఈ గుట్టనుండే తెచ్చుకుంటం, ఈ గుట్టను దీసి మా పొట్టమీద గొట్టకుండ్రి" అన్నడు.

ఒక మహిళ లేచి "అయ్యా! ఈ గుట్టకు తునికి అకులు, మోదుగుఆకులు, మోదుగ, తుమ్మ బంకలు ఏరుకొని బతుకుతం, బతకమ్మ పండగకు పూలు తెచ్చి అమ్ముతం,

దసరా నాడు మాఊరంతా ఈ గుట్టెక్కే జమ్మిఆకు తెచ్చుకుంటరు. సావన మాసంల ఊరోల్లందరం వండుక తినడానికి ఈ గుట్టకే పోతం, ఈ గుట్టను కొడితే ఊరిని కొట్టినట్లే, మాగుట్ట మాగ్గావలే అంతే"అంటూ కూర్చుంది.

గూడూరి బెస్తపెద్ద మైసయ్య లేచి. "ఈ గుట్టజాలుతోనే రెడ్డి చెరువు, గూడూరి ఊరచెరువు నిండుతాయని, ఆ చెరువుల్లోకి నీళ్లురాంగానే చేపపిల్లల్ని వేసి చెరువు నీరు అయి పోయేముందు పట్టుకొని అమ్ముకొని మాబ్రతులు మేం బతుకుతున్నం, మాతో పాటే తెన్గోల్లుకూడా చేపలు వద్దరు గుట్టందీసి మా పొట్టలపై మన్నుగొట్టొద్దు జెర దండంబెడ్త" అన్నడు.

ఇంకో యువకుడు లేచి, ఆవేశంగా మాట్లాడుతూ, "గుట్టపైన జాతీయపక్షి నెమళ్లు ఉన్నాయి అగో ఒకటే గోలగ అరుస్తున్నాయి. అడవి పందులున్నయి, నక్కలున్నాయి, జింకలు కూడా ఉన్నాయి. రకరకాల జీవజాలాలు ఉన్నాయి. వృక్షజాతులుఉన్నాయి. ఆ మేరకు పారెస్టు డిపార్టుమెంటు వారు ఇచ్చిన రిపోర్టు" అంటూ ఒక కాయిదాన్ని ఆర్‌డిఓ కు అంద జేసిండు, తరువాత ఇంకా మాట్లాడుతూ, "అంతే కాక ఈ ప్రభుత్వభూమిలోగల గుట్టపై గల అడవి, రెండు గ్రామాల అవసరాలను తీర్చుతుంది. కావున ఈ రెండు గ్రామాల ప్రజలు తమ దైనందిన అవసరాలకు ప్రక్కనేగల అడవి లోనికి పోరు. అందువల్ల అడవి రక్షించ బడుతున్నది. ఇది పొయినచో అడవిపైన ఒత్తిడి పెరిగి అసలు అడవికి ముప్పు రాగలదు కావున ఎట్టి పరిస్తితుల్లోనూ గుట్టను గనులకు ఇవ్వరాదు" అన్నాడు.

ఇక ఆ ఊరి వాడైన టీచర్ నారాయణ లేచి "క్వార్జు మరియు ఫెల్డుస్పర్లు వెలికి తీత, మరియు శుద్ధి ప్రక్రియ చాలా ప్రమాదకరమైన, విషతుల్యమైన కాలుష్యాలను వాయు, నీరు మరియు భూమిలోనికి వ్యాపిస్తుంది, రానున్న రోజులలో ఇక్కడి పరిసరాలే కాక మానేరు ద్వారా మానేరు పొడుగుతా నీటి కాలుష్యం జరుగుతుందని. కావున ఈ గని కరీంనగరం జిల్లా ప్రజలకే హానికరం కావున ఈ గుట్టను మైనింగ్ చేయకూడదు" అన్నాడు.

రైతు నారాయణ రెడ్డి మాట్లాడుతూ "మా ఊరి రెడ్డి చెరువు, గూడూరి ఊర చెరువుకు, గూడెం, ఆవునూరి చెరువులు కూడా నిండటానికి ఈ గుట్టకూడా కారణం, మాఊరికి ఇది తూర్పుగా వుండటంవల్ల మా ఊరిలో భూగర్భజలాలు ఎక్కువగా వుండి దాదాపు ఐదు వేల ఎకరాలు సాగులో ఉంది. గూడూరికి పోయే ఎగువ మానేరు కాలువ ఈ గుట్టప్రక్కనుండే పోతుంది, మా రెండు గ్రామాల సమస్త జన జీవనం ఈ గుట్టచెట్టూతనే ఉంది కావున దీనిని తీసివేసే మైనింగ్ మాకు వద్దు"" అన్నాడు.

ఇక నామాపూర్ గ్రామసర్పంచు లేచి "మా గ్రామంలో ఐదు వేల జనాభా,

గూడూరులో రెండు వేల జనాభా బట్టకు, పొట్టకు లోటు లేకుండా. ఏ మాత్రం ప్రభుత్వ సహాయం లేకుండానే బతుకుతున్నామని, ఈ గుట్టను తీసివేసి మమ్ములను కరువు కాటకాల, వ్యాధుల బారిన పడవేయకండి"అన్నారు.

ఇంకా సర్పంచు మాట్లాడుతూ "ఈ గుట్టకు మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ మా గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది" అంటూ అట్టి తీర్మానం కాపీని డిఆర్ఓ కు సమర్పించినారు.

ఇక గూడురు సర్పంచు గారుకూడా "మా గ్రామపంచాయతీ కూడా ఈ గుట్టను మైనింగ్ చేయుటను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది" అని చెప్పి, కాపీని అధికారులకు అందించారు.

ఇంకా ఎవరైనా ఈ విషయంలో మాట్లాడవచ్చు అని పర్యావరణ ఇంజనీరు అంటూండగానే గూడూరు సర్పంచు గారు లేచి

"మా రెండు గ్రామాలలో మైనింగ్‌ను సపోర్టు చేసేవారు ఎవరూ లేరని, కావున ఏకగ్రీవంగా ఈ రంగురాళ్ళ గనులను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసినాము" అని వివరించగా.

డిప్యూటీ కలెక్టరుగారు మాట్లాడుతూ"ప్రజలు ఏకగ్రీవంగా ఈ రంగురాళ్ళ గనులను వ్యతిరేకించిన విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం. ఇక ఇంతటితో ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని ప్రకటించి" వేదిక దిగి వెళ్లి పోయిండు.

తరువాత విమలక్క విలేకరులో అన్ని ప్రజా సంఘాల తరఫున మాట్లాడుతూ "ఇతర ప్రజాసంఘాల వారిని మాట్లాడ నివ్వక పోవడం, , దానికి గూడూరు సర్పంచు గారు సహకరించడం, అప్రజాస్వామికమైంది, ప్రభుత్వ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన స్ఫూర్తికే విరుద్దమైంది. ఈ చర్యను అన్ని ప్రజాసంఘాల తరఫున ఖండిస్తూన్నాను" అంటూ

"ఇంకా ఏదిఏమైనా ఈ ప్రజాబిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని ఒకటై నిలచి ఆపల్లగుట్ట మైనింగ్‌ను విజయవంతగా వ్యతిరేకించడం ప్రజల విజయమే, ఈ ఉద్యమంలో మా ప్రజాసంఘాలకు అండదండలిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు" అని చెప్పింది.

## 26

ఓ ఆదివారం పొద్దున్నే దుర్గాదేవి పోన్ చేసి భూమిరక్షణ సంఘం సభ్యులందరిని తన ఇంటికి పిలిచింది. అందరూ వెళ్ళే సరికి అదివరకే ఆమెఇంట్లో ఉన్న నలుగురిలో గల ఒక మహిళను పరిచయం చేస్తూ "వారు "డౌన్ టూ ఎర్త్" విలేఖరి గారని హైదరాబాదు నుండి వచ్చారని, మరో ముగ్గురిని పరిచయం చూస్తూ ఒకరు "ఎకనామిక్ అండ్ పొలిటికల్

వీక్లీ" పత్రికా విలేకరి గారని, మరొకరు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో ఎకనామిక్స్‌లో ప్రొఫెసర్ గారని మరొకరిని వీరు ఫ్రిలాన్సు జర్నలిస్టు గారని పరిచయం చేస్తూ వీరంతా మన జిల్లాలో జరుగుతున్న గ్రానైటు మైనింగ్ గురించి అధ్యయనం చేయడానికి వచ్చారని, కావున మనమంతా వీరితో కలసి కరీంనగరం జిల్లాలో జరుగుతున్న మైనింగ్ ప్రదేశాలను వారికి చూయించి రావాలే" అంది.

ఇంతలో మేడం గారి సెల్‌ఫోన్ రింగ్ అయింది. హలో అంటూ ఫోన్ ఎత్తింది. అవతల నుంచి మాట్లాడే మాటలు విని నవ్వుతూ, అందరూ వినునట్లుగా పౌండు పెంచింది.

అవతలనుంచి ఒక చిన్న పిల్లావాడి గొంతు "హలో మాది గట్టుభూత్కూరు, నేను తొమ్మిదో తరగతి మా ఊళ్లోచదువు కుంటున్నాను, మాఊరి గుట్టలన్నిటిని పగులగొడుతున్నారు మీరేంజేస్తున్నరు, వాటిని ఆపండి"అన్నడు అధికారస్వరంతో.

మేడం నవ్వుతూ, జవాబిస్తూ "ఇవ్వాల మేము మీ ఊరికి వస్తున్నాము" అని చెప్పగా అ పిల్లవాడు ఫోన్ కట్ చేసిండు.

దానితో మేడం ముఖం సంతోషంతో విప్పారింది. "ఇది మనకు ఒక విజయం, ఎందుకంటే మన ప్రచారానికి చిన్నపిల్లవాడు కూడా స్పందించాడంటే మన ప్రయత్నం ఫలించినట్లే నన్నది"

ఈ సంఘటన ముఖ్యంగా వెంకటగౌడుకు బాగా సంతృప్తినిచ్చింది. తాను, హనుమంతు చేసిన ప్రచారకార్యక్రమం వృధాకాలేదు అనుకున్నడు. మా భూమి రక్షణ సంఘం సభ్యులకు ఈ సంఘటన చాలా ఉత్సాహాన్నిచ్చింది.

వారంతా బయలు దేరి మొదటగా కరీంనగరం దగ్గరలోని కమాన్ పూర్ గ్రామంలో జరుగుతున్న గుట్టల విధ్వంసాన్ని చూసినారు. తదుపరి ఒద్యారం వైపు వెలుతుండగా, ఒక గొర్రెల కాపరి, తన మందతో కనపడగా ఆగి అతనిని పలకరించారు.

అతను మాట్లాడుతూ "క్వారీలు లేనప్పుడు మా ఊరిలో దాదాపు పది వేల గొర్రెలు ఉండేవి. ఇప్పుడు అన్ని క్వారీలు చేయబట్టి నేనొక్కడనే గొర్రెలు మేపుతున్నా, వచ్చే సంవత్సరం నేను కూడా మానివేస్తా" వారికి చెప్పిండు.

ఒక జర్నలిస్టు "మరి మీరు మీగొల్లకుర్మ సంఘం వారు క్వారీలను అడ్డుకోలేదా?" అడిగిండు.

ఆ కాపరి "సార్ గొర్రెలు మేపేవారికి తీరిక ఉండదని, చదువుకున్న వారి చేతుల్లోనే సంఘమున్నది, వారు మావృత్తిని పట్టించుకోరు. ఇప్పటికే దాదాపు ఒక లక్ష గొర్రెల ఉత్పత్తి ఈ ఒక్క జిల్లాలోనే నశించింది, పైగా మాలో కొందరు క్వారీల వారితో షరీక్

అయినారు, దానితో చాలా మంది వృత్తి వదలి రోజుకూలీలుగా మారినారు, మరి కొందరు ఆ క్వారీలలో అడ్డమైనచాకిరీ చేస్తున్నారు” అన్నాడు.

తరువాత వారు గీతాగ్రానైటు కంపనీని దర్శించినారు. యజమాన్యం ఇచ్చిన సమాచారాన్ని నోటు చేసుకొన్నారు, తరువాత మైన్ పనితీరును పరిశీలించి నారు.

గట్టుబూత్కూరులో గల పదిహేడు క్వారీలలో పదకొండు ఒకే సర్వేనెంబరు గుట్టలో

ఉన్నాయి. గట్టుబూత్కూరు లోని గుట్టల్లో జరుగుతున్న విధ్యంసాన్ని చూస్తూ ఒక విలేకరి, “గుట్టలనే జంతువును, గ్రానైటు మైన్లనే సింహాలు తలో వైపున పీక్కుతిన్నట్లుగా వుంది” అని వర్ణించినాడు.

వెంకటగౌడు మాట్లాడుతూ “ఒక్క ఒద్యారం గ్రామంలోనే ముప్పైతోమ్మిది క్వారీలు ఉన్నాయి, అసీఫ్ నగరంలో ముప్పై ఆరు. కమాన్ పూర్‌లోఇరవై ఒక్కటి, నాగుల మల్యాలలో పద్దెనిమిది, జయ్యారంలో పదహారు, కదంబాపూర్ లో పద్నాలుగు, వెల్గటూరిలో ఏకంగా నలభైరెండు, బొంపల్లిలో పదమూడు, మిగతా ఇరవై రెండు గ్రామాలలో సరాసరిన పది చొప్పున గ్రానైటు క్వారీలు ఉన్నాయని, రాబోవు రోజుల్లో ఈ ముప్పై గ్రామాలు పూర్తిగా గ్రానైటు ఓపెన్ కాస్టులు కానున్నాయి”అని వివరిస్తూ, “రాబోవు కాలంలో మొత్తం కరీంనగరం జిల్లానే మైనింగ్ చేయ నున్నారు.” అన్నాడు.

ఇతర గ్రామాలలో క్వారీలకు వ్యతిరేకంగా తన అరుణోదయ కళా బృందంతో ప్రచారం చేస్తూ, అదే సమయానికి విమలక్క అక్కడకు వచ్చింది.

వారంతా అక్కడ వుండగానే కొన్ని నెమళ్లు వచ్చి ఒక పెద్ద బండపై వాలినాయి.

దానితో అక్కడి క్వారీ వారు “ఇవి మాకు ఎప్పుడూ కనపడవని ఇవ్వాళ్ళే వచ్చాయని” అన్నారు.

“వాటికి శత్రువులు ఎవరో మిత్రులు ఎవరో తెలిసినట్లుంది” అని ఒక విలేకరి చమత్కరించారు.

తరువాత వారు ఆ ఊరిలో కూలిపోతున్న గృహాలను పగుళ్ళ బారిన పడిన పాఠశాల భవనాన్ని చూసి బాధ పడ్డారు.

# 27

తరువాత కరీంనగరంలో జరిగిన ఇష్టాగోష్ఠి సమావేశం జరిగింది. సమావేశ ప్రారంభంలో వెంకటగౌడు రాతి బండ పాట పాడి అందరిని అలరించినాడు.

తరువాత హైదరాబాదు యూనివర్శిటీ ఆర్థికశాస్త్ర ఆచార్యులు మాట్లాడుతూ “ఈ గ్రానైటు పరిశ్రమలో దాదాపు ఎనిమిది వేలకోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నదని,

కొద్దిపాటి పెట్టుబడులతోనే అత్యధిక లాభాలను వ్యాపారులు పొందుతున్నారని, కాని మీ జిల్లాలో ఇప్పటికే దాదాపు ఒక లక్ష గొర్రెలు మాయమైనాయని నీరులేక మొత్తం వ్యవసాయం దెబ్బతినగలదని, పైగా జనబాహుళ్యపు ఉమ్మడి ఆస్తులైన గుట్టలు, చెరువులు నశించనున్నాయని, తరతరాల నుండి సంచితమైన విలువైన సామూహిక నష్టం ముందు ఈ లాభం ఒక్కశాతం కూడా కాదని, ఎందుకూ పనికిరాదని" వివరించారు.

ఇంకో విలేకరి "ఈ లాంటి ఎక్లూసివ్ డెవలప్‌మెంటు(ప్రత్యేకమైన అభివృద్ధి) అభివృద్ధి మాడల్ వల్ల అతి త్వరలోనే మీజిల్లా ఎడారికానుందని, ఆహారభద్రత కరువౌతుందని అన్నారు."

ఇంకా మాట్లాడుతూ "రంగారెడ్డి, మెదక్, వరంగల్లు, నిజామాబాదు, మహబూబ్‌నగర్, నల్లగొండ ఖమ్మం, ఆదిలాబాదు జిల్లాలన్ని కూడా దక్కన్ పీఠభూమిలో బాగాలని, ఈ జిల్లాల్లో ఎక్కువగా గొర్రె, మేకలున్నాయని వాటి ఆధారంగా మీట్ పరిశ్రమను, ఆనంద్ డైరీ తరహా, సహకార సంస్థను డెవలప్ చేసినచో ఇటు గొర్రెల కాపరులకు, అటు మాంసవినియోగదారులకు సమృద్ధిగా మాంసం దొరకగలదని, కాని మన పాలకులకు గాని, ప్రణాళికా వేత్తలకు గాని ఈ ఆలోచనలు రావు గాక రావు, అదే సమయంలో ఆస్ట్రేలియానుండి కే. యఫ్. సి. అనే బహుళజాతి సంస్థచే మాంసం అమ్మే దుకాణాలకు, హోటళ్లకు ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇస్తున్నారు" అంటూ. "దీనికి ప్రజలనుండి వ్యతిరేకత రాకుండా ఉండటానికే కొంతమంది గొల్లకుర్మ కులస్తులను ఇన్‌క్లూసివ్ డెవలప్‌మెంటు పేరు మీద చేరదీసి, వారి వృత్తిని నాశనం చేస్తూన్నారని, ఆ విదంగా మన ఆహారభద్రత అంతర్జాతీయ సంస్థలచేతుల్లోకి పోతుంది" అన్నారు.

అదే విధంగా "చర్మకారులను సహకారసంస్థల్లోకి సమీకృతులు కాకుండా చేసి, మన దేశంలోని జంతుజాల చర్మాలను కారు చవకగా విదేశీ సంస్థల పరం చేసి,

మళ్లీ వారివద్దనుండే చర్మంతో తయారైన వస్తువులను కొనుగోలు చేసున్నారు, కాని అవి చాలా ఖరీదు కావున వాటికి బదులుగా ప్లాస్టిక్, రబ్బరు, రెగ్జిన్, ఇతర రకాల వాటితో తయారైన చెప్పులు, బ్యాగులు ఇతర వినియోగవస్తువులు మనం వాడటం వల్ల మన పరిసరాలు కలుషితం అవుతున్నాయి. ఇంకోవైపు దేశంలో నిరుద్యోగం పెరుగుతుంది" అన్నారు

దానికి ఒకరు అడ్డువస్తూ "చర్మపరిశ్రమ వల్లనే అంటరానితనం ఉందని. కుల వృత్తుల వల్లనే కులాలు పెరుగుతున్నాయిని కులసంఘాల వారు గగ్గోలు పెడుతున్నారుగా" అనగా, దానికి ఆయన జవాబుఇస్తూ "నిజానికి నేటి కులసంఘాలన్ని ఏవో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కొరకే పోట్లాడుతున్నాయి. అవి కూడా చాలా వరకు పట్టణాలలోనే

పని చేస్తూన్నాయి. కాని అదే సమయంలో వారి కులవృత్తిలో గల కోట్లాది రూపాయిల విలువ గల పరిశ్రమలను బహుళజాతి సంస్థల చేతుల్లోకి గాని, లేదా దేశీయమైన పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిపోతుంటే ఏం చేయలేకపోతున్నారని" అంటూ "నిజానికి కుల, మరియు అంటరాని తనం అన్నవి నిర్మూలించడానికి సరియైన వేదిక ఒకే విధమైన, స్వభాషలో నిర్భంద విద్య మాత్రమే సాధిస్తుంది కాని, వృత్తుల విధ్వంసం వల్లకాదని. అందుకే మన రాజ్యాంగలో నిర్భంధ విద్యకు అంబేద్కర్ ప్రాధాన్యతను ఇచ్చారు. కాని మన పాలకులు దానిని ప్రాథమిక హక్కులలో కాకుండా, ఆదేశిక సూత్రాలలో బొందపెట్టి, ఇటు కులాలను బలపరిచే క్రమాన్ని అటు ఆర్థికంగా సామాజిక కులవృత్తులను, వృత్తి పని వారలను దివాళా తీయించారు" అంటూ క్షణ మాగి

"ఆ సమస్యను ప్రక్కతోవ పట్టించడానికే ఇన్‌క్లూసివ్ గ్రోత్ పేర, ఇంతవరకు పైకి వచ్చిన దళిత, బీసీల వారికే అబివృద్ధిని పరిమితం చేయగల విద్యావ్యాపారాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అంటే ఇంకో రకంగా ఇప్పటికి వెనుకబడి వున్నవారిని ఇక అక్కడే వుంచే కుట్ర అన్న మాట" అంటూ, "ఇంకో దిక్కు కుల వృత్తుల, కులాల నుండి లాగివేయబడిన వృత్తులను అగ్రవర్ణాల వారు చేపట్టి బారుషాపులు, బ్యూటీపార్లర్లు, మటన్ షాపులు, చెప్పుల దుకాణాలు మొదలగునవి నడుపుతున్నారని, కాని వారి సామాజిక హోదా వృత్తికులాల స్థాయికి దిగజారలేదు, కావున వృత్తివల్లే సామాజిక హోదా వుంటుందన్నది అబద్ధమని తేలుతుంది కదా" అంటూ,

"నిజానికి గాంధీగారి ఆర్థిక సూత్రాలు మన దేశ ప్రగతికి ఇరుసుగా వుండాలని, కాని మన పాలకులు ఆయన ప్రతిపాదించిన పనికిరాని రాజకీయ పంథాను, ఎత్తుగడలను ఆచరిస్తూ, ఆయన ప్రతిపాదించిన ఆర్థిక సూత్రాలను తుంగలో తొక్కినారు. నేడు నడుస్తున్న ప్రజా వినియోగ పరిశ్రమలన్ని వృత్తిపనివారల చేతుల్లోనే ఉండి, మౌలిక భారీ పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఉండి ఉంటే మన దేశ సంపద విదేశీ పెట్టుబడిదారుల మరియు దేశీ పెట్టుబడిదారుల పాలపడకుండా వుండేది. ఆదే విధంగా ఇంకోవైపు నిర్బంద సార్వత్రిక విద్య అమలులో వుండి వుంటే సామాజిక సమస్యలు ఎప్పుడో పరిష్కరించబడేవి" అన్నారు.

"ప్రస్తుత మన విద్యారంగ విధానం వల్ల సాంకేతిక నిపుణులు, మేధావులు తయారైతున్నారు కదా" అని ఒకరు అనగా,

ఆయన మాట్లాడుతూ "మీరన్నది నిజమే, కాని వారివల్ల దేశానికి ఒనగూరుతున్న ప్రయోజనం ఏదైనా వుందా? నిజానికి మన విద్యా విధానం పెట్టుబడిదారిదేశాల వారికి అను కూలంగా తయారైంది.

మన దేశంలో చదువులు కొనుక్కొన్న సాంకేతిక నిపుణులు కాని మేధావులు కాని

విదేశీయులకు ఉపయోగ పడుతున్నట్లుగా మన దేశ ప్రజానీకానికి ఉపయోగపడటం లేదు.

సాంకేతిక విద్య, పొందిన వాళ్లు విదేశాలకు వలస కూలీలుగా తరుమబడుతున్నారు.

మన వారు అక్కడ వారికి కూలీలుగా పని చేయగా అక్కడి యువకులేమో విదేశాలలో వారి దేశాల తరపున యుద్దాలు చేస్తున్నారు" అన్నారు.

"మరి మన వాళ్లు విదేశాలకు వెళ్ళ కూడదా" అని మరోకరు ప్రశ్నించగా,

"నా దృష్టిలో విదేశాలకు వెళ్లడం నాలుగు విధాలుగా వుంటుంది, ఒకటి మేధావులు తత్వవేత్తలు కవులు, కళాకారులు, పండితులు మొదలగు వారు ఆయా దేశాల ఆహ్వానాల మీద వెళుతారని, వారి విదేశీయానం అత్యున్నత గౌరవప్రదం, ఇక రెండో రకం వారు మన దేశ ప్రయోజనాలకై విదేశాలకు యుద్దాలకై వెల్లడం, నేడు ప్రపంచవ్యాప్తంగా అమెరికన్, మరియు ఇతర అభివృద్ది చెందిన దేశాల యువకులు అట్లే విదేశాలకు వెళ్ళుతున్నారు. వారిని వారి స్వంత దేశాల ప్రజలు హీరోలుగా పరిగణిస్తున్నారు, ఇక మూడవ రకం విదేశీ ప్రయాణాలు వ్యాపారనిమిత్తం సాగేవని. వాటి చుట్టే ప్రస్తుత రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు నడుస్తున్నాయని, ఈమూడు రకాల విదేశీ ప్రయాణాలు సమర్థనీయం కాని విదేశీయులకు మేధోపరమైన, శారీరకశ్రమలను కారు చవకగా అమ్ముకోవడానికి వెళ్లడం అన్నది నీచాతి నీచమైన పని, కాని నేడు మన దేశంలో ఈ విధమైన మేధో వలసత్వం గౌరవ స్థానాన్ని, విదేశీ శారీరక శ్రమజీవితం అవశ్యకమైనదిగా గుర్తించ బడటం ఆత్యంత శోచనీయమైంది, అత్యంతనీచమైన ఈ ప్రకియనే నేడు మానవ వనరులుగా గుర్తించబడి, మానవులను అంగడి సరకులుగా మార్చేస్తున్నది." అంటూ "మన దేశం సాధ్యమైనంత త్వరలో ఈ భావదాస్యం నుండి బయటపడటం నేటి అవసరం" అన్నారు.

ఆ విధంగా ఆ రోజు ఆపక్తికరమైన చర్చసాగింది. భోజనాలు చేసి వారు వీడ్కోలు తీసుకున్నారు.

కొన్నాళ్లకు "డౌన్ టూ ఎర్తు" అన్న ఆంగ్ల పత్రిక, కరీంనగరం జిల్లాలో జరుగుతున్న గ్రానైటు మైనింగ్ పై ఒక వ్యాసాన్ని "గ్రానైటు గ్రీడీ" అన్న శీర్షికన ప్రకటించింది.

అలాగే "డిఫెన్‌డింగ్ ది కామన్సు" అన్న పేరుపై "ఎకనామిక్స అండ్ పొలిటికల్ వీక్లీ" వారు ఒక వ్యాసాన్ని ప్రచురించి ప్రపంచానికి అందించారు.

ఈవిధంగా భూమిరక్షణ సంఘం వారు ప్రపంచంలోని ప్రకృతి ప్రేమికులకు, కరీంనగరం జిల్లాలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని తెలియ చేయడంలో కొంతమేరకు సఫలీకృతులైంద్రు.

# 28

నారాయణ సారు తన ఇంటిలో తెలంగాణా భూమి రక్షణ సంఘం సభ్యులను సమావేశ పరచి, తన ఊరిలో జరుగుతున్న క్వారీ వ్యతిరేక పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరినాడు.

మరునాడు, భూమిరక్షణ సంఘసభ్యులు మరియు గౌడ సంఘ సభ్యులు కలసి పది గంటలవరకు సైదాపూర్ చేరుకోన్నారు. అక్కడ ఒక కల్యాణ మంటపంలో మండలగౌడ సంఘం ఆధ్యర్యంలో సమావేశం ఏర్పాటు చేసినారు. ఆ సమావేశానికి మాజీ గౌడ శాసన సభ్యులు ఐన దేశిని చిన మల్లయ్యగారు, జిల్లా, మరియు రాష్ట్ర గౌడ సంఘనాయకులు వచ్చినారు.

ఆ సభకు నారాయణ గౌడు అధ్యక్షత వహించారు. వారు లేచి "పదిహేడవ శతాబ్దిలో ఇటు గోల్కొండ నవాబులు, జాగీర్దార్ల మధ్య, అటు ఔరంగజేబు దండయాత్రల వల్లను, మహారాష్ట్రుల దాడుల వల్లను విపరీతమైన దోపిడీ పీడనలకు గురియైన సామాన్యుల రక్షణ కొరకు వెనుక బడిన తరగతులందరిని ఏకంచేసి తనదైన చిన్న రాజ్యాన్ని నిర్మించి ఇటు గోల్కొండ నవాబులకు, అటు ఔరంగజేబుకు ముచ్చెమటలు పట్టించిన గౌడ విప్లవకారుడు సర్వాయి పాపన్న.. అతడు మొదటగా నిర్మించిన కోటలు ఇప్పటికి బయ్యన్న గుట్టపై ఉన్నాయి. అతని దళిత ప్రియురాలిని ఆతడు కోట సంరక్షకురాలిగా నియమించాడని, ఆమె పేరున ఇప్పటికి అక్కడ "బుచ్చమ్మ అర్ర" పేరున ఒక రాతితో నిర్మించిన గది ఉంది. సర్వాయిపల్లిలో కూడా ఒక కోటను నిర్మించాడు. అతడు సర్వాయిపల్లెలోని గుట్టల సముదాయాన్ని తన సైనిక కేంద్రంగా చేసికొని క్రమంగా గోల్కొండను కూడా పట్టుకున్నాడు, కాని ఔరంగజేబు బలం ముందు ఓడిపోయి, శత్రువు చేతిలో చావడం ఇష్టం లేక అత్మబలి దానం చేసికొన్న వీరుడు. ఈ పాపన్న గుట్టను క్వారీల పరం కాకుండా సంరక్షించు కోవడం ప్రతీగౌడు కర్తవ్యం" అన్నారు,

ఇక కనకస్వామి మాట్లాడుతూ "సర్వాయి పాపన్న తన తల్లి పేరున సర్వాయిపల్లెలో సర్వాయి చెరువును ఆ గుట్టలమధ్య నిర్మించాడని, అది ఇప్పటికి పొలాలకు నీళ్లు అందిస్తున్నదని, అంతే కాక దాని క్రింద అనేక గొలుసుకట్టు చెరువులను నింపుతూ సైదాపూర్ మండలంలోని చాలా గ్రామాలకు నీటినందించడమేకాక, శంకరంపట్నంలోని వాగుకు ఈ గుట్టల సముదాయం నుండి వచ్చు వరద జాలులే కారణం. అంతటి చారిత్రిక ప్రాముఖ్యంగల సర్వాయిపాపన్న గుట్టలను నేడు ప్రభుత్వంవారు గ్రానైటు మైనింగ్ చేయడానికి అనుమతులు ఇచ్చింద్రు, కావున గౌడ కులస్తులే కాక అందరూ ఈ గుట్టలను

కాపాడు కోవాలి”అన్నాడు.

ఇక ఇప్పుడు గుట్టల విద్వంసం వల్ల కలుగు పర్యావరణ విధ్వంసాన్ని గురించి వారి నాయకురాలు దుర్గాదేవి గారు మాట్టాడుతారని నారాయణగౌడు గారనగానే, దుర్గాదేవి గారు గుట్టల విధ్వంసం వల్ల జరిగేనష్టాలను వివరించారు.

ఆదే సమయంలో హనుమంతు తన వద్దనున్న “గుట్టలను విధ్వంసం చేస్తే” అన్న కరపత్రాన్ని సమావేశం లో పాల్గొన్న వారికి పంచిపెట్టినాడు.

తర్వాత గౌడ సంఘ పెద్ద కొండయ్య గౌడు మాట్లాడుతూ “సర్వాయి గుట్టలను, చెరువును, మరియు కోటలను రక్షించు కోవడం ప్రతి గౌడు కర్తవ్యం, అంతే కాక ఆ చెరువును ఆనుకొని ఉన్న గుట్టపై సర్వాయి పాపన్న విగ్రహన్ని ప్రతిష్ఠించు కోవాలని, దానిపై సర్వాయి పాపన్న దేవుడైన బయ్యన్న దేవుని గుడి కట్టాలని, గుట్టపైన కోటలను, సర్వాయి పల్లె లోని కోటను. సర్వాయి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ప్రభుత్వంపై మన సంఘం ఒత్తిడి తేవాలి” అని ప్రతిపాదనలు చేసినారు.

ఇందుర్తి నియోజక వర్గాల నుండి నాలుగు దఫాలుగా యం. ఎల్. ఏ గా ఎన్నికైన దేశిని చిన మల్లయ్యగారు మాట్లాడుతూ, “ఈ గుట్టల్లో ఒక్క సర్వాయి పాపన్న కాలంలోనే కాక, తెలంగాణా సాయుధ పోరాట కాలంలో అనభేరి ప్రభాకరరావు గారి అధ్వర్యలో సాయుధ పోరాటం జరిగింది. అదే గుట్టలపైననే అనభేరి ప్రభాకరరావుతో సహా మరో పదకొండు మంది విప్లవ యోధులు పోలీసు కాల్పుల్లో మరణించారు. కావున ఎట్టి పరిస్థితుల్లోను ఈ గుట్టలను రక్షించు కోవాలని”అన్నారు.

సభ నుద్దేశించి వెంకటగౌడు మాట్లాడుతూ “ఈ గుట్టల సముదాయం తెలంగాణా చరిత్ర పొడుగునా విప్లవ కారులకు నెలవుగానే ఉన్నది. ఇక్కడికి దగ్గరలోనే ఉన్న పొట్లపల్లి గ్రామం లోని గుట్ట వద్ద పూర్వకాలంలోనే నాగజాతి ప్రజలు నివాసమున్నారు. వారికి సబంధించిన నిలువెత్తు నాగ ప్రతిమలు పదుల కొద్ది అక్కడ దొరికినవి, కాకతీయుల కాలంలో వారి సైన్యానికి, మరియు రాకుమారులకు ఇక్కడే యుద్ధవిద్యా కేంద్రాలు ఉండేవి, అంతే కాక ఆ గుట్టకు అడ్డంగా ఆ చివర నుండి ఈ చివర వరకు పెద్ద సొరంగం ఉంది. ఆ గుట్టల పక్కనే ఆదిమానవుల బృహత్శిలా సమాధులు వందకు పైగానే ఉన్నాయి, అదే గుట్టకు అతి పురాతనమైన రేణుకా ఎల్లమ్మగుడి వుందని. ఆ గుట్టల సముదాయాల్లోని రేకొండ గుట్టలో ఆదిమానవులు గీచిన చిత్రాలు ఉన్నాయి” అంటూ ఊపిరి పీల్చుకొని “కాని ఇవేవి పట్టని ఆంధ్రా సర్కారు ఈ గుట్టలన్నిటిని మైనింగ్‌లకు ఇచ్చిందని ప్రభుత్వం, పురావస్తుశాఖ వారి నిర్లక్ష్యం వల్లను, గుప్త నిధుల కొరకు రాత్రుల్లో త్రవ్వే తవ్వకాల వల్ల ఆయా గ్రామస్తులు తీవ్రమైన భయభ్రాతులకు గురిఅవుతున్నారని, కావున ప్రజలందరూ

ఏకమై ఇట్టి మైనింగ్‌లను ఆడ్డుకోవాలని. మరియు ప్రభుత్వం, పురావస్తుశాఖ వారు ఈ గుట్టల సముదాయాలను, వాటిపై గల కోటలను, మరియు సర్వాయి పల్లెలోని కోటను స్వాధీనం చేసికొని రక్షించాలి" అన్నారు.

జిల్లా, రాష్ట్ర గౌడ కుల నాయకులు కూడా మాట్లాడుతూ ఈ గుట్టపైన సర్వాయి పాపన్న విగ్రహాన్ని పెట్టాలని తీర్మానం ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది, సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పుటకు నిధుల సేకరణ కొరకై నారాయణ గౌడు సారథ్యంలో ఒక చిన్న కమిటీ వేయబడింది. కొందరు దాతలు అప్పటికప్పుడు విరాళాలు ప్రకటించారు,

తరువాత "సభ ముగిసింది" అని నారాయణ గౌడు ప్రకటించిండు.

ప్రతినిధులంతా తిరుగు ప్రయాణంలో సర్వాయి పల్లెలో పాపన్న కట్టించిన పురాతన శిధిల కోటను చూచినారు. భూమిరక్షణ సంఘ సబ్యులు, గౌడ కుల సంఘ సభ్యులు అందరూ కలసి కోట ముఖద్వారం వద్ద ఫోటోలు దిగింద్రు.

ఆ కోటలోనే గల నిధుల బావిగా పిలువబడే చేదబావిని అందరూ పరిశీలించినారు, వయస్సు మళ్ళిన ఓ గ్రామ ముదుసలి మాట్లాడుతూ "మా చిన్నప్పుడు, పైవరకు ఒక ఇనుప గొలుసు ఉండేదని దానిని కొంత వరకే లాగగలిగే వారమని, తరువాత ఇంత బలాన్ని వినియోగించినా ఒక్క ఇంచు కూడా గొలుసు పైకి వచ్చేది కాదని, లోపల ఎక్కడో ఏదోరకమైన తాళం పద్దతి ఆ ఇనుప గొలుసును అడ్డుకునేదని, కాని ఎప్పుడైతే గుప్తనిధుల వేట గాళ్ల కన్ను ఈ కోటపై బడిందో అప్పుడు గ్రామస్తులు ఆ గొలుసును బావిలోనికే వదలింద్రు" అన్నాడు.

దానితో వచ్చిన వారంతా రాతి కణీలతో మూసివేయబడ్డ చేదబావిని ఆసక్తిగా చూసింద్రు.

హనుమంతు కోటగోడకుగల ఎత్తైన బురుజు పైకి ఎక్కి తెలంగాణా జండాను దానిపై ఎగురవేసిండు. ఉత్సాహన్ని ఆపుకోలేక పైనుండే", జై తెలంగాణా"జైజై తెలంగాణా" నినాదాలు ఇచ్చినాడు. "మన వారసత్వాన్ని కాపాడుకుందాం, కాపాడు కుందాం" అంటూ నినదించిండు. శర్మగారు పోటోలు తీసినారు.

ఆంధ్ర భూమి పత్రికకు చెందిన సాంస్కృతిక విలేఖరి శర్మ గారు ఈ కార్యక్రమానికి సంబంధించిన విశేషాలన్నిటిని, తన కెమరాలో బంధించిండు.

మరి కొన్ని రోజుల్లోనే, గౌడసంఘం వారు సర్వాయిపల్లెలోని బయ్యన్నగుట్టపై సర్వాయి పాపన్న విగ్రహాన్ని కరీంనగరం పార్లమెంటు సభ్యులచే, ఆవిష్కరణ చేయించినారు, ఆ ఆవిష్కరణ సభలో సర్వాయి పాపన్న గుట్టను, అతని కోటను రక్షించడానికి తను

కూడా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చిండు, యం. పి గారు.

మరుసటి రోజే "గ్రానైటు రాళ్లను రవాణా చేయుటకు ప్రత్యేకముగా ఒక రైల్వే టర్మినల్‌ను కరీంనగరంలో నెలకొల్పాలని కరీంనగరం పార్లమెంటు సభ్యులు, రైల్వే మంత్రికి విన్నవించారు" అనే ఒక పత్రికా ప్రకటన అన్ని పత్రికలలో వచ్చింది.

ఆ జిల్లా మంత్రిగారు. మరియు పార్లమెంటు సభ్యులు కలసి, కరీంనగరంలో విలేకరుల సమావేశం జరిపి, "రైతులకు ఎరువులు విరివిగా సరఫరాచేయగా, రైల్వే ఫ్లాట్ ఫాం చాలా దెబ్బతిన్నది, కావున రైతుల సౌకర్యం కోసం ఫ్లాటు ఫాంను యుద్ధ ప్రాతిపదికన తిరిగి నిర్మించాలని రైల్వే అధికారులను కోరినారు.

వాస్తవానికి ఆ ఏడు రైతుకు ఎరువులు అందక రైతులు నానా కష్టాలు పడ్డారు. అంతే కాక ప్రతీ యేటా, జిల్లాలోని రామగుడం, పెద్దపల్లి, సుల్తానాబాదు, జమ్మికుంట, ఉప్పల్, హసన్‌పర్తి, గంగాధర, పూడూరు. జగిత్యాల, కొత్తపల్లి, కరీంనగరం లాంటి అన్ని రైల్వేస్టేషన్‌లలో ప్లాటు ఫారంముల నిండా జాగా లేకుండా గ్రానైటు రాళ్లతో ఎల్లప్పుడు నిండి వుంటాయి. రైల్వే వ్యాగన్లు, మరియు లైన్లు ఖాళీగా దొరకక కరీంనగరం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం ఎగుమతులు సకాలంలో కావడం లేక, మరియు ఇతర వస్తువులకూ రైల్వే వ్యాగన్ల కొరత వల్ల ఇతర సరకు రవాణా దారులకు మరియు వినియోగ దారులకు రోడ్లే గతి అవుతున్నాయి.

అంతే కాక కరీంనగరం నుండి హైదరాబాదుకు ప్రజలకోసం రైలు ఇంతవరకు వేయ బడలేదు. నిజానికి కరీంనగరం ప్రజలు అవసరాలకు హైదరాబాదుకు, బ్రతుకుదెరువు వలసలకు ముంబాయి వెలుతారు, జగిత్యాల నుండి నిజామాబాదుకు రైల్వేలైను పూర్తి చేయిస్తే, ముంబాయికి నేరుగా రైలు సౌకర్యం ఏర్పడి, ప్రజల మరియు వ్యాపార వర్గాలకు చాలా ఉపయోగం వుంటుంది, దాని మీద శ్రద్ధ చూపని ఇక్కడి నాయకులు ఇక్కడి నుండి గ్రానైటు వ్యాపారుల సౌకర్యం కొరకు, కరీంనగరం నుండి తిరుపతికి రైలు వేయించినారు. పైగా రైతుల పేర గ్రానైటు వ్యాపారుల కోసం యుద్ధ ప్రాతిపదికన రైల్వే స్టేషన్లలో గ్రానైటు లోడింగ్ యార్డులను నిర్మింప చేసినారు. ఈవిధంగా ఈ జిల్లాలో రైళ్ళయినా, రోడ్లయినా గ్రానైటు వ్యాపారులకే గాని వాటి వల్ల సామాన్య ప్రజలకు వీసమెత్తు ఉపయోగం లేకుండా పోయింది.

అంతకు చాలా రోజుల ముందే భూమిరక్షణ సంఘం వారు కరీంనగరం పార్లమెంటు సభ్యుల వద్దకు వెళ్ళి,

"ఇంత విచ్చలవిడిగా గ్రానైటు మైనింగ్‌లవల్ల పది సంవత్సరాలలోనే జిల్లా ఎడారిగా మారి పోనుంది" అని వెంకటగౌడు అనగా వారు "ఏం? ఎడారిలో జనాలు బతుకటం

లేదా?" అని ఎదురు ప్రశ్నించారు.

"ఇక ప్రజలందరికి వలసలే గతి" అని హనుమంతు అనగా,

"పోతేంది" అన్నారు.

"చాలా మంది కరువులవాత పడి చస్తారు" అని దుర్గాదేవి గారనగా,

"చావనీ, ప్రభుత్వానికి కావలసింది, డబ్బు, విదేశీ కరెన్సి.మాత్రమే కావాలి" అని నిర్లక్ష్యంగా జవాబులిచ్చారు.

"మరి ఉపరితల, భూగర్భజలాలు అడుగంటుతున్నాయి కదా" అని కనకస్వామి ప్రశ్నిస్తే

"నీళ్ళను కూడా అమ్ముతం" అంటూ అసహనం వ్యక్తం చేసాడు.

దానితో "అసలు మనం ఇక్కడికి రావడమే బుద్ధి తక్కువ పని" అని వెంకటగౌడు అంటూ బయటకు వచ్చారు.

"ఈ సమయంలోనే, ఒక్కరినైనా గుట్టల సంరక్షణ గురించి అవగాహన కలిగించినా మనం ఒక్క అడుగు ముందుకు పోయేవారం" అంది దుర్గాదేవి,

ఈ సంఘటన వెంకటగౌడుకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది.

ఆయన మాట్లాడుతూ "మొన్నటి వరకు ఈ జిల్లాను వెలమ దొరలు, రెడ్డిదొరలు, కొందరు బ్రాహ్మణ దొరలు పాలించారు.వారు అప్పటి వరకు కేవలం ప్రజాబాహుళ్యపు శ్రమశక్తినే దోచినారని, కాని నేటి వెనుకబడిన, దళితుల ప్రజా ప్రతినిధులు వెనుకబడిన, దళితుల పేర, వారికే అధికారం కావాలన్న పేరుతో అధికారం సంపాదించిన తరువాత, పాత దొరల వారసులతో కలసి, ఇక్కడి ప్రజల ఉమ్మడి ఆస్తులైన గుట్టలు, బంచరాయలు, చెరువు శిఖాలు, గ్రామ కంఠాలు, దేవుని మాన్యాలు, నదులలోని ఇసుకను, సారా వ్యాపారాన్ని, నీటి వనరులను బాహటంగా పెట్టుబడిదారులకు, మరియు పట్టాణాలకు వలస వెళ్ళిన మాజీ భూస్వాములకు ఏజంట్లుగా మారి దోపిడీకి కారకులైతున్నారు," అంటూ,

"కనీసం మొన్నటి దొరలు బాహాటంగా శత్రువులుగా గుర్తించ బడితే, నేటి బిసీ, యస్సీ నేతలు కుల సంఘాల చాటున చేసే దోపిడీ ఇంకా బటకు రాకుండా వున్నదని, అలా వీరి దోపిడీకూడా బయటకు వచ్చేవరకు ప్రజలకు ఏమీ మిగలదని" వెంకటగౌడు అన్నాడు.

అంతే కాక "తాను యువకునిగా ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీలలో గాని, పార్లమెంటులోగాని ప్రవేశపెట్టబడిన ముసాయిదా చట్టాలపై రోజుల తరబడి చర్చలు, క్లాజుల వారీగా జరిగేవని, ఆ క్రమంలోనే ప్రజలకు వారు చేసేచట్టాలు ప్రజలకు

ఉపయోగపడేవా, కావా? అన్నది తెలిసేదని, కాని ఎప్పుడైతే ప్రపంచీకరణ, సరళీకరణలు మొదలు పెట్ట బడినవో రాష్ట్ర అసెంబ్లీలల్లో గాని, పార్లమెంటులో గాని బిల్లులపై ఏలాంటి చర్చలు లేకుండానే చట్టాలుగా వస్తూన్నాయని, తీరా అవి అమలులోకి వచ్చిన తరువాతనే అ చట్టాలను చట్టసభలు ఆమోదించినాయని తెలుస్తుంది. ఎలాగైతే గ్రామాల్లో గుట్టలను గ్రానైటు కంపెనీవారు మైనింగ్ చేయడానికి వచ్చిన తరువాత గ్రామస్తులకు తమ గ్రామ పంచాయతీ వారు అనుమతులు ఇచ్చిన సంగతి తెలుస్తూందో, అలాగే మన పార్లమెంటు గానీ, అసెంబ్లీలు గానీ రహస్యంగా చట్టాలు తెస్తున్నాయని. అందులకు సౌలభ్యంగా ఉండటానికే పార్లమెంటు కాని లేదా రాష్ట్రాల అసెంబ్లీల సమావేశాల ముందు ఏదో ఒక అవినీతి కథను పత్రికలకు లీకు చేయించి, దానిపైననే వాగ్వివాదాలతోను. కృత్రిమమైన వాదోపవాదాలతోను పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వాయిదాల మీద వాయిదాలు పడుతూ, చివరలో మూజువాణి పద్ధతిలో చట్టాలను గిలిటెన్ చేసి ప్రజలపై రుద్దుతున్నారు. అలనాటి బోఫోర్సు నుండి నిన్నటి అగష్టా హెలీకాప్టర్ల కుంభకోణాలన్ని పార్లమెంటులో చర్చలు జరుగ కుండా చేయడానికే కాని, దోషులపై తగిన చర్యలు తీసుకోవడానికి కాదు. అంటూ,

"ప్రజలు చెల్లించే సోమ్ములతో జీత, భత్యాలు మేస్తూ ఈ లాంటి చట్టాలు చేయడానికి, పార్లమెంటు, అసెంబ్లీలు ఎందుకు, ప్రజా ప్రతినిధులకు జీత భత్యాలు దండగ" అన్నాడు

"ఇదే విషయాన్ని అరవైయవ దశకంలో, ఈ నాడు చట్టసభలు పందుల దొడ్లుగాను బాతఖానీ క్లబ్బులుగా మారినాయంటూ ప్రకటించి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి విప్లవ మార్గ కార్యాచరణకు పూనుకున్నాడు, తరిమెల నాగిరెడ్డి గారు" అంటూ కనకస్వామి.

ఇంకా "కాకపోతే అప్పుడు జన సామాన్యానికి ఇంకా ఈ చట్టసభల పట్ల నమ్మకం చాలా వుండేది, కాని నేడు చాలా వరకు చట్టసభలు తమమీద రాజ్యాంగం ఉంచిన గురుతర భాద్యతలను మరచి ప్రవర్తించడం వల్ల చాలా మంది ప్రజలకు వాటిపట్ల గౌరవభావం లేకుండా పోతున్నదని అన్నాడు, నేడు జన సామాన్యానికి రాజకీయ నాయకులంటే ఎనకటి జాగీర్దారులు, జమీందారుల లెక్క అగుపడుతున్నారని, అందుకనే ప్రతీ రాజకీయ నేత పోలీసు కాపలా లేకుండా ప్రజలమధ్య తిరుగలేక పోతున్నారు" అన్నాడు.

అందరూ అతని వాదనతో ఏకీభవించారు.

# 29

దుర్గాదేవికి తెలంగాణా రాష్ట్ర సమితికి చెందిన ఒక శాసన సభ్యుడు ఫోన్ చేసి "తన నియోజక వర్గలోని ధర్మారం గ్రామం నుండి కొందరు వ్యక్తులు మీ వద్దకు వస్తారు. వారికి కావలసిన సలహాలు ఇవ్వాలి" అని కోరినాడు.

"సరే" అంది దుర్గాదేవి

తెల్లారి పది మంది ధర్మారం గ్రామస్తులు వచ్చి దుర్గాదేవిని కలసి "తమ ఊరిలోగల తెట్టుగుట్టను తమిళనాడు నుండి వచ్చిన యునైటెడ్ గ్రానైటు కంపెనీ వారు పగులగొడుతున్నారు, దానిని ఏలాగైనా మీరు రక్షించాలి" అన్నారు

"మీ ఊరి వారంతా ఏకమై అడ్డుకుని పోరాడితే అది అసాధ్యమైనదేమీకాదు, కాని మీఊరిలో పరిస్థితి ఏలా వుంది" అంది దుర్గాదేవి. వారు "కొంత మంది అటు, కొంత మంది ఇటుగా వున్నారు" అన్నారు వారు.

దానితో కొంత సేపు ఆలోచించి, "సరే ఒక పని చేద్దాం" అంటూ "ముందుగా మీ గుట్టపైన ఏయే అడవి జంతువులు ఉన్నాయో వాటి వివరాలు జిల్లా అటవి శాఖ వారి నుండి తీసుకొండి, అలాగే ఆ గుట్టను ఆనుకొనే చెరువు ఉన్నందున, ఆ విషయాన్ని దృవీకరిస్తూ, నీటిపారుదలశాఖ నుండి ఒక లెటరు తీసుకోని రండి, వాటి ఆధారంగా హైకోర్టులో కేసు వేయవచ్చు" అన్నది.

"సరే" అంటూ వాళ్లు వెళ్ళిపోయారు.

ఆదే విషయాన్ని తిరిగి ఏంఎల్ కు ఫోన్చేసి చెప్పి, "మీకు తెలిసిన హైకోర్టు లాయర్ గారి అడ్రసు" చెప్పండి అంది. ఆయన ఆనందరావు గారనే న్యాయవాది పేరు సూచించి, వారి అడ్రసు, ఫోన్ నంబరు ఇచ్చిండు.

ఓ వారం రోజుల తరువాత అన్ని అవసరమైన పత్రాలతో వచ్చిన వారిని ఆనందరావు గారివద్దకు పంపింది.

ఆనందరావు గారు హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాన్ని పది మంది పేర వేసినారు.

కొన్ని నెలల తర్వాత ధర్మారంలోని గ్రానైటు క్వారీని మూసివేయ వలసిందిగా హైకోర్టు తీర్పు ఇచ్చింది.

తీర్పుననుసరించి దానిని రెండు ఏండ్లకు పైగా మూసివేసినారు మైనింగ్ అధికారులు.

తెలంగాణా రిసోర్సెస్ సెంటర్, హైదరాబాదులో కరీంనగరం జిల్లాలో జరుగుతున్న గుట్టల విధ్వంసం పై వెంకటగౌడు గారిని, వారి వేదిక పై నుండి మాట్లాడ వలసిందిగా కోరినారు.రామారావు గారు ఆ వేదికకు హాజరై గుట్టల విద్వంసం వల్ల జరుగుతున్న

పర్యావరణ నాశనాన్ని, మరియు గ్రామాలకు జరుగుతున్న నష్టాలను ఆ సభలో సభికులకు తెలియచెప్పినాడు. తెలంగాణాలోని చైతన్యవంతులైన వారు, ప్రజలు ఉద్యమిస్తేనే ఈ గుట్టలు రక్షించ బడతాయని తన ఉపస్యాసాన్ని ముగించారు. ఆ సమావేశంలోనే తాను ఇదివరకు రాసిన "మరో సరస్వతి కానున్న గోదావరి" అనే పుస్తకాన్ని సమావేశానికి పరిచయం చేసినాడు. అందులో రానున్న కాలంలో తెలంగాణాకు జరుగనున్న పర్యావరణ ముప్పు గురించిన వ్యాసాలు, మరియు గుట్టల విధ్వంసం వల్ల జరుగనున్న ముప్పు గురించిన వ్యాసాలు ఉన్నాయి.

అదే సమావేశానికి వచ్చిన ఆనందరావు వకీలు గారు మీటింగ్ తరువాత వెంకటగౌడు ను కలసి పరిచయం చేసికొని,

"ధర్మారం గ్రానైటు క్వారీని మూసివేయాలని, హైకోర్టులో వాదించింది నేనే" అంటూ, "రేపు సాయంత్రం మా ఆఫీసులో కలవండి" అని వెంకటగౌడును కోరినాడు, ఆనందరావు వకీలు.

మరుసటి రోజు సాయంత్రానికి ఆ వకీలు ఇంటికి పోయిండు వెంకటగౌడు.

వకీలు గారు మాట్లాడుతూ "యంఎల్ ఏ గారి సూచన మేరకే తాను ధర్మారంగ్రానైటు కేసును హైకోర్టులో వాదించానని, కాని ఆయనే ఐదుగురు ఫిర్యాది దారులను తీసుకొని మళ్లీ కేసును వెనుకకు తీసుకొమ్మని నాపై ఒత్తిడి తీసుకు వచ్చాడని, కాని అది ప్రజోపయోగవాజ్యమైనందున వాపస్ తీసుకోవడం కుదరదని అన్నాను, దానితో వారు నన్ను వకాల్తా నుండి తప్పుకొమ్మన్నారని, నేను తప్పుకొన్నానని" అన్నారు,

"మళ్లీ ఇప్పుడు అ కేసులో జోక్యం చేసికొని, మొత్తం కరీంనగరం జిల్లాలోని గ్రానైటు క్వారీలన్నిటిని మూసివేయవలసిందిగా కొరుతూ హైకోర్టులో కేసు వేయవచ్చా" అడిగిండు వెంకటగౌడు.

"వేయవచ్చు, కాని మొదటి లెక్కన మధ్యలో గ్రానైటు కంపెనీల ప్రలోభాలకు లొంగని వ్యక్తులు కావాలి" అన్నారు వకీలుగారు.

"అయితే నేనే ఇంప్లీడ్ పిటీషన్ వేస్తాను" అన్నాడు వెంకటగౌడు.

దాంతో ఎంతో సంతోషించిన ఆనందరావు వకీలుగారు"ఐతే వకాలత్ నామాలపై సంతకాలు చేయండి" అంటూ,

గుమాస్తాను పిలిచి "వకాలతునామాల మీద వీరి సంతకాలు తీసుకో అన్నడు"

సంవత్సరం తర్వాత రెండు వందల డెబ్బై తొమ్మిది గ్రానైట్లకు గాను, నూటా పద్దెనిమిది గ్రానైటు క్వారీలను మూసివేయ వలసిందిగా హైకోర్టు తీర్పు చెప్పింది.

ఆ తీర్పు తెలంగాణా భూమిరక్షణ సంఘం వారికి చాలా నైతిక బలాన్నిచ్చింది.

# 30

ఒక నాడు మీర్జాపూర్ చెరువులోని చేపలన్ని చచ్చిపోయినాయని ఒక వార్తవచ్చింది దుర్గాదేవి, కనకస్వామి, హనుమంతు, వెంకటగౌడు, నారాయణలు కలసి అక్కడికి చేరినారు. మానవ హక్కుల సంఘనాయకులు బుర్రా రాములు గారు కూడా వచ్చినారు.

ఆ చెరువుకు మూడు వైపులా గుట్టలు ఉండి మధ్యలో చెరువు ఉంది. ఉత్తరాన ఉన్న మీర్జాపూర్ గుట్టకు గ్రానైటు మైనింగ్ జరుగుతున్నది. ఆ చెరువు క్రింద, గుట్టకు దగ్గరలో లంబాడీలకు కొందరికి పొలాలు ఉన్నాయి. మైనింగ్ ప్రేలుళ్ళకు ఆ గుట్టనుండి అడవి పందులు వచ్చి వారి పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని వారు తెలుపగా, భూమిరక్షణ సంఘం సభ్యులంతా అడవి పందులు వరి పైరుకు చేసిన విధ్వంసాన్ని చూసినారు.

ఇంతలో కొందరు బెస్త వారు వచ్చి వారిని కలసి చెరువువద్దకు తీసుకువెళ్ళి చచ్చిన చేపలను చూయించినారు.

వెంకటగౌడు వాటికి "ఏమైనా రోగాలు వచ్చి పోయినాయా" అని అడిగిండు.

ఆ బెస్త చచ్చిన చేపలను వెటర్నరీ, మరియు ఫిషరీస్ డిపార్టుమెంటు వారు చూచి "ఏరోగాలు రాలేదని. అవి ఎందుకు చచ్చినాయో మాకు కూడా అశ్చర్యంగా ఉంది" అన్నారని చెప్పిండు అప్పుడు వెంకటగౌడు మరి చనిపోక ముందు కొన్ని గంటల ముందు ఏమైనా గుట్టకుకు బ్లాస్టింగులు జరిగినయా అని అడిగిండు. దానికి ఆ పెద్ద "అవును రాత్రి మేము చేపల కావలికి పడుకొన్నం, తెల్లారి గట్ల ఢాం, ఢాం అని ఉత్తరం వైపున ఉన్న గుట్టల్లో బండలు పేల్చినారు" అన్నాడు,

అప్పుడు వెంకటగౌడు "మరి ఈ పేలుళ్ళు ఇప్పుడే జరిగినయా, ఇంతకు ముందు నుంచి జరుగుతున్నాయా" అడిగిండు.

దానికి అతడు "మూడు నెలల నుంచి జరుగుతున్నాయి కాని ఏనాడు చేపలకు ఏమి కాలేదు" అన్నాడు.

అప్పుడు వెంకటగౌడు "బహుశా మీ చేపలు చని పోవడానికి ఈ బ్లాస్టింగులకు సంబంధం ఉండి ఉంటది" అన్నాడు,

దానికి అతను "ఏమోసార్ అన్నడు".

"మరి మీరు ముందే ఈ గుట్టల మైనింగ్‌ను అడ్డు కోలేదా" అనంగానే

"మా ఊళ్లో కొందరుతెనుగువారు, మరి కొందరు లంబాడాలు వ్యతిరేకించింద్రు, కాని వారిపై పోలీసులు కేసులుపెట్టింద్రు." అన్నాడు.

ఇక భూమిరక్షణ సంఘం సభ్యులు ఆ ఊరి లోని గ్రామపంచాయతీకి పోయి అక్కడి గ్రామస్తులతో మాట్లాడగా,

"ఊరి సర్పంచు, పంజువులు, మరి యంఏల్ ఏ గాని, తెలుగు దేశం, సిపిఐ లాంటి పార్టీలు గాని ఆ గుట్ట చుట్టు వున్న రైతులను, ఏడు లంబాడ తండాలను కాని, తెనుగు, బెస్త వాళ్ళను గాని పట్టించు కోలేదని" ఆ గ్రామస్తులు అన్నారు.

కనక స్వామి ఆ గుట్టల సముదాయాల చుట్టూ ఎన్ని ఊళ్ళు ఉన్నాయో, ఎన్ని చెరువులు, కుంటలు ఒర్రెలు వంకలు, వాగులు ఉన్నాయో సమాచారం ఆ గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నాడు

దాని వల్ల తెలిసిందేమంటే ఆ గుట్టలు హుస్నాబాదు, సైదాపూర్, ముల్కనూరు మండలాల్లో విస్తరించి ఉన్నాయని, వాటి చుట్టు దాదాపు నూటాయ్యాబైకి పైగా కుంటలు, పదిహేనుపెద్ద గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని తెలిసింది, అంతే కాక ఆ గుట్టల సముదాయాల నుంచే మీర్జాపూర్ నుండి ఒక వాగు బయలు దేరి, కమలాపూర్‌లోని పెద్ద చెరువుకు నీటినందించి, వాగుగా మారి వరంగల్లులోని చిట్యాల మండలం గుండా ప్రవహించి, మీర్జంపేట వద్ద మానేరులో కలుస్తుందని, మొదట్లోనే ఈ వాగుకు గట్ల నరసింగాపూర్‌లో ఒక అడ్డు కట్టకట్టి నీటిని మాజీ ప్రధాని గారి స్వంత గ్రామమైన వంగర చెరువుకు తరలిస్తారని, అలాగే ఇంకో వాగు శంకరం పట్నంగుండా ప్రవహించి, కోరకల్లు వద్ద మానేరులో కలుస్తుందని, మరో వాగు బతుకమ్మ వాగు పేర దక్షిణంగా ప్రవహించి మోయదుమ్మెద నదిలో కలుస్తుందని సమాచారం తెలిసికొన్నాడు, అంతే కాక ఏ మాత్రం సాగు నీటి వనరులు లేని హుస్నాబాదు మండలంలోనూ, సైదాపూర్, ముల్కనూర్ మండలాల్లో భూగర్భనీటిని ఈ గుట్టలే రిఛార్జి చేస్తాయని తెలిసింది. అవన్ని నోటు చేసికొన్నంతలోనే ఒక లంబాడ యువకుడు అక్కడికి వచ్చి వయోజనులకు అక్షర ఉజ్వలకార్యక్రమంలో అభ్యాస నిమిత్తం ఇచ్చిన చిన్న పుస్తకాన్ని తెచ్చి,

"చూడండి సార్ ఈ పుస్తకంలో గుట్టల వల్లనే వానలు కురుస్తాయని రాసి వుంది, మరి మన పాలకులేమో గుట్టలను పగులగొడ్తున్నరు అన్నాడు"

దానితో "మన పాలకులు తమ స్వంత ప్రయోజనాలకు, ప్రకృతిని చివరకు మంచినీళ్ళ కూడా ప్రజలకు అంద కుండా చేస్తున్నారు" అన్నాడు కనక స్వామి.

అయినా ఎద్దుపుండు కాకికేం ముద్దు, "ప్రజలు ఎట్లా చస్తేంది మాప్రయోజనాలు మాకు చాలా ముఖ్యం" అన్న కరీంనగరం పార్లమెంటు సభ్యుని మాటలు మళ్ళీ చెవుల్లో గింగురుమన్నాయి వెంకటగౌడుకు.

తరువాత కొన్ని రోజులకు వెంకటగౌడు ఉస్మానియా యూనివర్శిటీ లోని జియోఫిజిక్సు

డిపార్టు మెంటుకు వెళ్లి మధుసూదన రావు అనే అధ్యాపకుని కలిసినాడు. వారికి ముందున్న కుర్చీలో ఒక వయసు మళ్ళిన వ్యక్తికూడా కూర్చున్నారు. వెంకటగౌడు వచ్చిన పని చెప్పగానే కూర్చోమని ఒక కూర్చీ చూయించి, అటెండరును పిలిచి చాయలు తెమ్మని చెప్పిండు, "వీరు శాస్త్రి గారు, ఇక్కడే ప్రధానా చార్యులుగా పని చేసి రిటైరు అయినారు. అన్నారు. చాయలు త్రాగిన తరువాత,

వెంకటగౌడు మాట్లాడుతూ"మీర్జాపూర్ చెరువులో చేపలు చనిపోవడానికి, గుట్టల బ్లాస్టింగులు కారణమౌతయా సార్" అని అడుగగా, శాస్త్రి గారు కల్పించుకొని, "గౌడుగారు మీరు ఊహించింది కరెక్టే, ఎక్కడైనా గాని నీటి వనరులకు దగ్గరలోని భూగర్భంలోగాని, కొండలలో గాని బ్లాస్టింగులు చేస్తే మొదట చనిపోయేటివి నీటి ప్రాణులు, మాత్రమే" అన్నారు.

"కారణం ఎమిటి సార్" అడిగిండు గౌడు.

దానికి వారు "భూగర్భంలోని రాతి పొరలు విశాలమైన ప్రదేశాల నాక్రమిస్తాయని, వాటి పైననే గుట్టలు ఎత్తుగా ఉంటాయని, కాని ఆ గుట్టలన్నిటికి సామాన్యంగా ఒకే విశాలమైన పరుపు బండ పై వుంటాయని, కావున ఒక్క గుట్టను పేల్చినా దాని ప్రకంపనలు అన్నిదిక్కుల ప్రభావం చూపిస్తాయని. ఒక బండను డ్రిల్ చేసి డైనమేట్లతో పేల్చితే 360 డిగ్రీల పరిధిలో దాని ప్రభావం పడుతుంది, కావున ఆ బ్లాస్టింగ్ వల్ల భూగర్భంలోనూ బండ పగిలి పర్రెలు ఏర్పడుతాయి. ఆ నెర్రెల లోనికి భూమి ఉపరితల నీళ్ళు, భూగర్భంలోనికి వెలుతాయని. అవి, భూగర్భం లోని వేడినీటితో కలువడం వల్ల నీటి ఆవిరి తయారై అ నెర్రెలలో ఒత్తిడి ఎక్కువై పేలుతాయని, ఆ పేలుళ్ళు , మరింత కాలానికి మరో పెద్ద ప్రేలుడికి దారి తీస్తుందని, అందువల్ల కొన్నిసార్లు డైనమైట్లతో మళ్ళీ పేల్చినప్పుడు ప్రక్కనున్న చెరువులలోగానీ, కుంటలలో గాని నీరు, భూగర్భం లోని నీటితో కలువగా, ఆ నీటిలోని ఆమ్లజని సాంద్రతలో తేడా వచ్చి చేపలు చచ్చిపోతాయి" అని వివరించారు. ఇంకా మాట్లాడుతూ "అంతెందుకు, అప్పుడప్పుడు హైదారాబాదులో కూడా భూప్రకంపనలు రావడానికి కూడా ఇక్కడి గుట్టలను తొలగించడమే కారణం" అన్నారు.

"ఈ ప్రక్రియ చాలా కాలం నెమ్మది నెమ్మదిగా జరిగి ఎప్పుడో ఒకప్పుడు తీవ్రమైన భూకంపాలకు దారి తీయవచ్చు అన్నారు" అన్నారు శాస్త్రి గారు.

దానితో తరచుగా కరీంనగరం జిల్లాలోని చెరువుల్లో చేపలు ఎందుకు చస్తున్నాయో అర్థమైంది వెంకటగౌడుకు.

అంతకుముందెప్పుడో ఒక సారి తెలంగాణా భూమిరక్షణ సంఘసభ్యులు, ముస్లిమ్ మహిళలకు గుట్టల విధ్వంసం గురించి వివరించినప్పుడు,

వారు ఖురాన్‌లో, “దేవుడు భూమి కదలకుండా భూగర్భం లోనికి కొట్టిన మేకులే గుట్టలు, పర్వాతాలు” అని చెప్పింది గుర్తుకొచ్చింది.

నిజానికి ఒకప్పుడు పలుచగా వున్న భూగర్భపొరల్లోనుంచి లావా చీల్చుకొచ్చి ఏర్పడినయే కదా ఈ పర్వతాలు, వాటిని పునాదులతో సహా పెళ్ళగిస్తే మళ్ళీ అగ్ని పర్వతాలు పుట్టవని గ్యారంటీ ఏది అనే ఆవేదన కలిగింది వెంకటగౌడుకు.

గంగపుత్ర కుల సంఘపెద్దలు కొందరు, తమ కులాన్ని అడ్డు పెట్టుకుని గ్రానైటు మైన్లను చేజిక్కించు కొని, ఇటు తమ కులస్తులు తరతరాలనుండి పొందుతున్న ఉపాధి లేకుండా చేయడం, మరోవైపు ప్రజలకు చవకగా లభించే చేపల ఆహారాన్ని అందకుండా చేయడం వెంకటగౌడుకు విచారం కలిగించింది.

అదే సమయంలో ఇతర కులాల పెట్టుబడి దారులు చేపలచెరువులు త్రవ్వుకొని కోట్లకు పడగలెత్తగా, గంగపుత్రులేమో కూలీలుగా మారడం చాలా విచారం కలిగించింది వెంకటగౌడుకు.

గోదావరి ఒడ్డున తవ్వుతున్న బొగ్గుబావుల వల్ల గోదావరి ఎండి పోగా వేలాది జాలరులు తమ ఉపాధిని కోల్పోయిన విషయం యాదికొచ్చింది వెంకటగౌడుకు. ఇదే విషయాన్ని భూమిరక్షణ సంఘం వారు తమ తదుపరి కరపత్రాలలో పొందు పరచినారు వెంకటగౌడు మనసులోని బాధ కవిత రూపంలో పొంగుకొచ్చింది.

## భూస్థాపితం

మా భూదేవికి మొదటి బిడ్డ,
మా ఊరి ప్రక్కన నిటారుగా తలెత్తుకుని
అందంగా, గంభీరంగా నిలబడ్డది.
ఎంత పాతదో దాని మేని నిండ
ముడతలు ముడతలుగాను దాని తాలూకు నల్ల బడ్డ శరీరం
దాన్నిండా పెద్దపెద్ద నల్లని గుండ్లు
ప్రతీ వత్సరం వచ్చే వానల్లో తాను స్నానం చేస్తుంది,
ఎల్లప్పుడు పచ్చని చీరపై
అందమైన పక్షి. జంతు జాల జరీ అంచు చీరకట్టుతో
ఠీవిగా ఎన్ని లక్షల వసంతాలు గడిపిందో
దాని నీటిపాల ధారల్తో చెరువు, కుంట పొదుగులనింపి
మాకు గోవర్ధనగిరి అయింది.

పిడుగుల జడినుండి మాకు గొడుగు పట్టింది
ఎండలు చెరిగినప్పుడు చల్లని గాలులిచ్చింది
ఎముకలు కొరికే చలికి మాకు వున్ని దుప్పటి కప్పింది
తెల్లారక ముందే మా పొయిల్లో పిల్లులను లేపింది.
తీయటి ఫలాలనిచ్చింది, మాంస మద్యాలతో మమ్ములను మత్తెక్కించింది.
దిగంతాలకెదిగి మాకు అనంతానందాలనిచ్చింది
మా కాళ్ల క్రింది భూమి కదలకుండా నొక్కి పట్టింది
దాని పై కెక్కి తొక్కినా మా అవ్వ అయి గలగల నవ్వింది
మేము అరచి, చప్పట్లు ఛరిస్తే, తిరుగు జవాబు లిచ్చింది
ఎప్పటి నుండి దాచిందో మా పాతతరాల పురాణాలు విప్పింది
మా దేవదేవుళ్లకు ఆవాసాలనిచ్చింది.
మాకు తెలియకుండా ఎక్కనుంచో, ఎప్పుడొ ఎవడోచ్చాడో, ఎక్కడుంటాడో తెలియని బండాసుర రాక్షసుడు
రాజ్య యంత్రపు దవడలు తొడుక్కుని, పెట్టుబడి కోరల్తో, రాకాసి యంత్రాలతో,
మా అవ్వను ముక్కముక్కలుగా కోస్తూ, బకాసుర బండ్లలో ఎక్కడెక్కడికో పంపుతూ
పాతాళంలోని దాని పునాదులను తెగనరికి
భూస్థాపితం చేస్తూ మా ఊరిని కూడా అందులోకి తోస్తూఉన్నాడు.

# 31

ఒక రోజు భూమిరక్షణ సంఘ సభ్యులందరిని తన ఇంటిలో సమావేశ పరచింది దుర్గాదేవి.ఆ మీటింగ్ లో ఒక కొత్త యువకున్ని సభ్యులకు పరిచయం చేస్తూ, ఇతను ఆదివాసి గుర్రం సమ్మయ్య అంటూ పరిచయం చేసింది.

ఆ యువకుని మాట్లాడమని కోరగా“ఆ యువకుడు నెమ్మదిగా మాట్లాడుతూ “తాను తోటి జాతికి చెందిన వాడిని, మాది అదిమ జాతికి చెందిన ఆదివాసీజాతి మా నాన్నది ఆదిలాబాదు లోని మారుమూల ప్రాంతం, పూర్వం ఇంగ్లీషోల్లు రైలు మార్గాలు ఆదిలాబాదులో నిర్మిస్తున్నప్పుడు, మా తాత తండ్రిని నిర్బంధంగా రైల్వే కూలీగా మార్చినారు.మా తాత కూడా మంచిర్యాల వద్ద కట్టబడిన రైల్వే వంతెన పనుల్లో కూలీగా పని చేసిండు.తర్వాత మా నాన్న కాగజ్నగర్లో స్థిర పడి, కూలీగా పని చేసేవాడు. ఆ విధంగా నా చదువంతా కాగజ్నగర్లోనే సాగింది. ఇప్పుడు వృత్తి రీత్యా నేను ఆర్, టి.సీలో డ్రైవరు పని చేస్తున్నాను” అని పరిచయం చేసికొన్నాడు.

ఇంకా మాట్లాడుతూ "మేము కూడా గోండు వాళ్ళ లెక్కనే, జంగుబాయిని, నాగోబాను కొలుస్తాము. గొండి మాట్లాడుతాము, కాని నాకు మా భాష రాదు.మా తల్లి మాట్లాడగలదు" అన్నాడు.

కొంచెం ఆగి మళ్ళీ మాట్లాడుతూ " కరీంనగరం జిల్లాలోని ఇబ్రాహీంపట్నంనుండి, మొదలుకొని, గోదావరి నది ఒడ్డున గల అన్ని గ్రామాలలోను, నాయక్ పోడ్‌లు, గొండులు, తోటీలు, మరియు మన్నేవార్ జాతి ఆదివాసిలు ఉన్నారు" అంటూ

"ముఖ్యంగా మంథని, మహాదేవపూర్, మత్తారం, కాటారం మండలాలలో దాదాపు లక్ష మంది జనాభా పైననే ఆదివాసీలు ఉంటారు, అయితే అక్కడున్న నాయకపోడ్ జాతి జనులను, కుట్ర పూరితంగా "నేతకాని" అని రికార్డు చేయించారు ఆధికార వర్గాలు.దానితో వారు తమ ఉనికిని కోల్పోయినారు.వారు ఎంత మొత్తుకున్నా "నాయకపోడ్"కు బదులు, "నేతకానీ" అనే షెడ్యూల్డు కులాల కింద చూయిస్తూ ఉన్నారు.దానితో మా జనాభా ఇప్పుడు యాభై వేలకు మించడం లేదు." అంటూ,

మంచినీళ్ళు తాగి, "దానితో మాకు ఐటిడియే రాకుండా పోయింది, దానితో పాటు ఒక యం ఎల్ ఏ సీటు కూడా దక్కలేదు " అన్నాడు విచారంగా

"మరె మీరు పోట్లాడ లేదా" అని వెంకటగౌడు అనగా

"మా వెనుకటి తరం వారు పూర్తిగా అమాయకులని, ఇపుడిప్పుడే కొద్ది మంది చదువుకుంటున్నారని, దానితో మేము కొందరం, ఆదివాసి సంఘంగా ఏర్పడి తిరిగి మా జనాభాను ఆదివాసీలుగా నమోదు చేయాలని ఉద్యమిస్తున్నాం.కాని మా గోడు వినిపించుకున్న నాధుడే లేడు" అన్నాడు.

"దానికి తోడు, తాడి చెర్లలో బొగ్గు గనుల క్రింద, రోడ్ల పేరున, మరియు సున్నపు గనుల క్రింద మా గ్రామాలను ఆక్రమిస్తున్నారు" అన్నాడు. ఆదే విధంగా ఇటీవలనే ధర్మపురి మండలం లోని ఆక్సాయి పల్లిలో, నాయకపోడ్ జాతి వారి భూములను సేకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి, ఇటీవలనే ఆ భూములను సర్వే చేయడానికి రెవిన్యూ అధికారులు ఆ గ్రామానికి రాగా, ఆ తండా వాసులంతా కలసి వారి వద్దనున్న దస్త్రాలన్నిటిని గుంజు కొని, వారిని తరిమి వేశారు. అందులకు వారిని పోలీసులు అరెస్టు చేసి వేదిస్తున్నారు, మీరు దయ చేసి ఆ గ్రామానికి

వెళ్లి నిజనిర్ధారణ చేసి వారికి న్యాయం చేయవలపిందిగా కోరుతున్నాను. అన్నాడు.

దానితో "రేపు పోద్దున మనమంతా ఆక్సాయి పల్లెకు వెళదాం అంది" దుర్గాదేవి.

తెల్లారె అందరూ దుర్గాదేవి కారులో ఆక్సాయి పల్లెకు చేరుకున్నారు.ఆ తండా విశాలమైన వీధులతో, ఒకే రకమైన ఇండ్లతో చాలా పరి శుభ్రంగా ఉంది.

"యన్‌టిఆర్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు, ఈ ఇండ్లు కట్టించిండు" అన్నాడు ఒక గ్రామస్తుడు.

ఆ గ్రామానికి వెనుకవైపు ఒక ముప్పై అడుగుల ఎతైన బొగడ గుట్ట తూర్పు నుండి పడమరవైపుకు విస్తరించి వుంది. ఆది సున్నపు రాయి బొగడ కావడంతో, ఒక్కసారి వర్షం పడితే చాలు దాదాపు పది నెలల వరకు దానిపై భూములు తేమగా ఉండి సంవత్సరం పొడుగూత మెట్టపంటలను ఇస్తుంది

ఆ జమానాలోనే ఆ బొగడ భూములను ఆ నాయకపోడు వారికి రెవిన్యూ అధికారులు తలో మూడు ఎకరాల చొప్పున అసైన్ చేసినారు. వారు దానిపై నున్న చిట్టడవిని నరికి వ్యవసాయ యోగ్యంగా చేసికొని, కందులు, పెసలు, నువ్వులు, మక్కలు, జోన్నలు. బబ్బెరలు మొదలగు మెట్ట పంటలను వర్షాధారంగానే పండించు కుంటారు. వాటితో పాటు దోసకాయలు, బెండకాయలు, బీరకాయలు, వంకాయలు, మిరపకాయలు, చిక్కుడు మొదలగు కూరగాయలను సంవత్సరం పొడుగునా పండిస్తారు.

వాటి నన్నిటిని భూమి రక్షణ సంఘం వారికి చూయిస్తూ ఒక రైతు మాట్లాడుతూ "మా గూడెంలో పాడి కూడా ఎక్కువగా ఉండటంతో పాలు, పెరుగు, కూరగాయలు పండించిన పప్పు ధాన్యాలు కూడా ధర్మపురిలో అమ్ముకొని, ఇప్పుడిప్పుడే నాలుగు పైసలు చూస్తూన్నామని" అన్నాడు. ఇంకా మాట్లాడుతూ "పులి మీద పుట్రలాగా ఇంతలోనే ఆ బొగడ గుట్టను సున్నపు రాయికి లీజు కిస్తామని, వచ్చారు అధికారులు" అన్నాడు.

ఇంతలో ఆ ఊరి పట్వారి, మరియు గిర్దావర్‌లు అక్కడికి వచ్చి, "ఆ ఊరి గిరిజనులు, మా ఫైళ్ళను గుంజుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించ మని దుర్గాదేవిని అడిగినారు,

దానితో మేడం ఆ గ్రామస్తులతో "వారి ఫైల్లు వారికి ఇవ్వమని, అడుగగా, వారు ఆ ఫైల్లను తగులపెట్టినం" అని చెప్పినారు. దానితో వారు వెళ్ళిపోయారు.

ఇంకా దుర్గాదేవి వారితో మాట్లాడుతూ, "ఏది ఏమైనా మీరంతా ఐకమత్యంతో ఎదిరించారు కాబట్టి, ఇక వారు మీ జోలికి రాకపోవచ్చుని, ఒక వేళ వస్తే మాకు తెలియచేయండి, మేము వచ్చి వారితో మాట్లాడుతామని" చెప్పింది.

ఇక ఆ సంఘసభ్యులు తిరుగు ముఖం పట్టగా ఆ వీధికి ఉన్న బడికి సమీపంలో ఒక పెద్ద మంచి నీటి బావి, సిమెంటు గాజులతో నిర్మించబడింది గమనించి, దానిని పరీశిలించగా ఆ గ్రామస్తులు, "ఈ బావినుండే మాకు మంచినీరు అందిస్తారు, పోయిన సంవత్సరం గోదావరిలో నీళ్లు లేక పోవడంతో, ఈ బావి నుండే టాంకర్లలో నీటిని ధర్మపురికి సరఫరా చేసినారని" గర్వంగా చెప్పినారు

అక్కడి నుండి తిరిగి బయలు దేరే సమయంలోనే, వెంకటగౌడు దృష్టి, ఆ గ్రామం

ప్రక్కగా ధర్మపురికి పోయే రోడ్డుకు ఆవలి వైపున ఉన్న ఒక పెద్ద గుట్టపై, ఎండకు తళతళ మెరుస్తూన్న ఒక పెద్ద గుండు పై పడింది. ఆ మెరుస్తున్నది ఏమిటని ఆ గ్రామస్తులను అడుగగా వారు మాట్లాడుతూ

"ఒకప్పుడు ఆ గుట్టపై ఒక నరసింహ్మ స్వామి గుడి ఉండేదని, కాని బెజ్జంకి పాలకులు దాడి చేసి, ఆ దేవున్ని ఎత్తుకు పోయి వారి గుట్టపై పెట్టుకున్నారని, దాంతో ఆ దేవాలయం పూర్తిగా కూలి పోయిందని" అన్నాడు.

దానితో వెంకటగౌడు మిగతా సభ్యులతో మాట్లాడుతూ "ఆ ఊరి పేరే ఆక్సాన్‌పల్లె, చాలా అజీబుగా ఉందని, అది చైనా పేరువలె ఉందని, బహూశా క్రీ.శ. ఏడవ శతాబ్దిలో ఆ గ్రామాన్ని చైనా యాత్రీకుడు, యూవాన్ చాంగ్ కొన్ని రోజుల పాటు నివసించి యుండవచ్చు, దానినే ఆయన ఆక్సాన్ అనే పేరు పెట్టి ఉంటాడని, ఏది ఏమైనా ఈ దేవాలయం గురించి, ఈ ఊరి గురించి చరిత్ర కారులు పరిశోధించ వచ్చని" అన్నాడు వెంకటగౌడు.

రక్షణ సంఘు సభ్యులను మండల కేంద్రమైనా ధర్మారం రావలసిందిగా ఆహ్వానించిండు ఆదివాసి సమ్మయ్య. వారు ఆ గ్రామానికి చేరుకోగానే, గ్రామంలోని నాయకపోడ్ వాడలో జరుగుతున్న సమావేశానికి తీసుకు పోయిండు వారు అక్కడ ఒక టెంటు వేసుకుని సమావేశం జరుపుకుంటున్నారు.

ఆ సమా వేశంలో గడ్డం లక్ష్మి మాట్లాడుతూ, "ధర్మారం గ్రామంలో గల గుట్ట క్రింద గల మా కుల దేవతయైన పుస్కలయ్య, లక్ష్మి దేవరల స్థలాన్ని, చుట్టు పక్కల గల గొల్లవారు ఆక్రమించుకుంటున్నారని. మా దేవతలు కొలువైఉన్న స్థలాన్ని కాపాడాలని" కోరింది.

తరువాత వారు ఊరేగింపుగా ఆ దేవతల స్థలానికి కదలినారు. వారి ఊరేగింపు ముందుగా ఆ తెగకు చెందిన వారి డప్పు కళాకారులు, వట్టి చేతులతోనే డప్పులను లయభద్దంగా వాయిస్తూ బయలు దేరి, గొల్లవారి వీధిలో గల వారి దేవతల స్థలానికి చేరినారు.

అది ఒక విశాలమైన బృహత్‌శిలా సమాధి. పెద్ద, పెద్ద బండలు వృత్తాకారంగా పాతిపెట్ట బడ్డాయి. దాని మధ్యలో ఒకటి ఎత్తైన. మరోటి కొద్దిగా చిన్నదైన కణీలు పాత బడి ఉన్నాయి. అవే పుస్కలయ్య, లక్ష్మి దేవర దేవతలు.

"ఒకప్పుడు ఆ గుట్ట దిగువన అలాంటి సమాధులు చాలా వుండేవని, కాని కాల క్రమేణా అవి అన్ని అక్రమణలకు గురి కాగా, ఇది ఒక్కటే ఇంకా మిగిలి ఉందని" వారు అన్నారు.

ఆ సమాధి బహూశా క్రీ.పూ. నాలుగు, గైదు వేల సంవత్సరాల క్రితంది కావచ్చు, అప్పటి నుండి దానిని కొలుస్తూ.ఇప్పటికీ కాపాడాలని తలుస్తున్న నాటి ఆదిమవాసుల నేటి వారసుల తాపత్రయానికి, వారిని అభినందించినారు తెలంగాణా భూమిరక్షణ సంఘం సభ్యులు.

ఇప్పటికైనా పురావస్తు శాఖవారుకాని, లేదా గ్రామ పంచాయతీ కాని, దానిని చారిత్రిక స్థలంగా గుర్తించి సంరక్షించాల్సి వుంది.

రెండు వేల సంవత్సరాల క్రితం, ఆ గ్రామ మూల వాస్తిలైన నాయక్‌పొడ్ జాతి జనులు, నేడు ఆ గ్రామంలోనే ఒక మూలగా, వారి దేవతలకు దూరంగా విసరివేయ బడినారు.

ఇంకొన్ని రోజుల తర్వాత, ఆదివాసి సమ్మయ్య, తెలంగాణా భూమిరక్షణ సంఘ సభ్యులను రెడ్డి పల్లె అను మహదేవపూర్ మారుమూల పల్లె గ్రామానికి తీసుకుని వెళ్ళిండు.వారు అక్కడికి వెళ్ళే సరికి ఆ ఊరిలో ఒక తోటి వారింట్లో పెళ్ళి జరుగుతుంది.

ఆడపెళ్ళి వారు తమ పిల్లని, మగపెళ్ళి వారింటికి తీసుకురాగా, వారికి మగపెళ్ళివారు, కట్నంగా ఐదు అందుగు ఆకులతో పాటు ఐదు రూపాయిలు ఇచ్చినారు.మగ పె ళ్ళివారుకూడా ప్రతిగా మరోఐదు కానుగ ఆకులను, ఐదు రూపాయిలు మొగపెళ్ళి వారికి ఇచ్చినారు.తరువాత పిల్లా, పిల్ల వాడిని దప్పుల చప్పుళ్ల మధ్య పిల్లావాడి ఇంటి వెనుకాల ఉన్న పెంట కుప్పపై ఎదురెదురుగా కూర్చోపెట్టి.వారిపై బురద పూసినారు.ఇంతలో, ఇరువైపుల ఆడవారు చెరో ఐదు తట్టల చెత్త తీసుకువచ్చి వరుని ప్రక్కన, వధువు ప్రక్కన పెట్టిగా, ఒక తట్టెడు చెత్తను వధువు, వరునిపై తలువాలుగా కుమ్మరించింది, ప్రతిగా వరుడు ఒక తట్టెడు చెత్తా చెదారాన్ని వధువుపై కుమ్మరించాడు.ఆ విధంగా పరస్పరంగా వధూ, వరులు చెరో ఐదు తట్టల చెత్తను తమ తలలపై తలువాలుగా పోసుకోగా, వారి కుల పెద్దలు వారిద్దరికి పెళ్ళి జరిగిందని ప్రకటించారు,

తరువాత ఆడవారందరూ వలయాలుగా ఏర్పడగా, మగవారు వారి సంప్రదాయిక వాద్యాలు లయ బద్ధంగా మ్రోగిస్తుండగా, పాటలు పాడుతూ నృత్యాలు చేపి తమ సంతోషాన్ని వ్యక్తపరచింద్రు. తరువాత ఆ గూడెం వారందరికి ఏటమాంసం, ఇప్ప సారాతో కూడిన విందు జరిగింది.

తరువాత వారంతా వారి కుల దేవతయైన జంగుబాయిగా పిల్చుకునే చావడి ముందు తెలంగాణా భూమిరక్షణ సంఘ సభ్యులతో సమావేశమైనారు.

బద్ది పోశవ్వ మాట్లాడుతూ.తరతరలుగా తాము అడవిని కొట్టి, సాగు చేస్తున్న భూములు మావి అంటూ, మా ఊరిలోని కొందరు తెనుగువారు, గొల్లవారు, కొందరు

నేతకాని దళితులు ఏవో కాగితాలు పట్టుకొచ్చి, చేతికొచ్చిన పంటను కోసుకొని వెళ్ళినారు. మేము ఎదుర్కోగా పోలీసులు వారికి అండగా వచ్చినారు, మీరు ఏలాగైనా మా భూములను మాకు ఇప్పించ వలసిందిగా కోరినారు.

దానితో దుర్గాదేవి మాట్లాడుతూ "ఆ భూములు గిరిజనులైన మీకు చట్టప్రకారం చెందాలి, లేదా, అటవీ శాఖ ఆధీనంలో నైనా ఉండాలి, కాని ఎట్టి పరిస్థితిలోనూ వేరెవరికి చెందకూడదు. కావున మీరంతా కలసి ఆ భూములను మాకే పట్టాలు చేయాలని ఉద్యమించాలని, మీ న్యాయమైన పోరాటానికి మా చేతనైన సహాయం అందిస్తామని చెప్పుతూ, మీ భూములను మీరు తిరిగి దున్నుకొండని, ఈ సారి ఎవరైనా అడ్డుపడితే మాకు తెలియచేయండని" చెప్పింది.

దీనితో వారికి కలిగిన చైతన్యంతోనూ, వారి ఐకమత్యం వల్లను వారి భూములు తిరిగి వారి వశమైనాయి.

ఇప్పటి వరకు ఆదివాసి సమ్మయ్యతో ఆదివాసిలు ఉన్న మంగేలా, చిత్రవేణి గూడెం. సారంగాపూర్, జైన, నక్కల పేట, దుబ్బల గూడెం, మరికొన్ని మహదేవ పూర్ లోని ఆదివాసీలు దాదాపు మూడు వందల ఎకరాల భూమిని రక్షించుకున్నారు.

తరువాత ఒక రోజు దాదాపు వేయి మంది ఆదివాసి గిరిజనులు, కరీంనగరం లోని కోర్టు చౌరాస్తా నుండి కరీంనగరం జిల్లా కలెక్టరు ఆఫీసు వరకు పెద్ద ప్రదర్శన జరిపింర్రు. ఆ ప్రదర్శనలో చిత్రవేణి గూడెం, మంగేళా నుండి తమదైన ప్రత్యేక ఆహార్యంతో గోండు ధింసా నృత్య కళాకారులు వచ్చింర్రు. ధర్మారం, ఆక్సాయి పల్లె, నుండి నాయక్ పోడ్ వారు డప్పులతో వచ్చింర్రు. మహదేవపూర్ నుండి తోటీలు, గోండులు, కోయలు, మన్నేవార్లు తమతమ ప్రత్యేక ఆహార్యంతో వచ్చినారు. వారు దారి పోడుగూతా వారివారి ఆట పాటలతో పాటు, ఉడుం ఆటలు ఆడుతూ, ప్రదర్శన నిర్వహించారు

ఆ ర్యాలికి ముందు వరుసన హనుమంతు నడుస్తూ "మా భూములు" అని అరవగానే మిగతా వారు "మాకే కావాలి" అని నినదిస్తున్నారు. ఇంకా "మా అడవి మాకే కావాలని" జిల్లాలో ఆదివాసి గిరిజనులను తిరిగి లెక్కించాలని, అన్ని గిరిజన చట్టాలను అమలు పరచాలని. జిల్లాలో కొయ్యూరు, కాటారం, మహదేవపూర్, ముత్తారం మండలాలను ప్రత్యేక గిరిజన ప్రాంతంగా గుర్తించాలని, జిల్లాలో గిరిజనులకు ఒక్క యంఎల్ఏ సీటు కెటాయించాలని. జిల్లాలో ఐటిడిఐ ప్రాజెక్టు పెట్టాలని జిల్లా కలెక్టరు గారికి మహాజరు, దుర్గాదేవి సమక్షంలో అందించారు కాని ఆ వినతి పత్రం బుట్టదాఖలైంది.

దానితో భూమిరక్షణ సంఘం సభ్యులకు, గత అరవై సంవత్సరాలుగా, ఆ గిరిజనులు ప్రభుత్వ రికార్డులలో ఉనికి కోల్పోగా, వారికి చెందాల్సిన ఐటిడిఏ నిధులు, మరియు

యంఎల్ఏ సీటు కోల్పోవడం చాలా బాధకలిగించింది.

దానికి కారకులైన అధికార వర్గాల, కుట్రను అసహ్యించు కున్నారు. అదే సమయంలో ఇతర బీసీ, దళిత, మైనారిటీ వర్గాల నాయకులను కూడా, అసహ్యించుకోకుండా ఉండలేక

"ఇలాంటి నాయకులు, ఇంకా వెనుకబడినవారిని, గిరిజనులను. పీడిత జనాలను తమ కులాల క్రింద సమీకరించు కోవడం కేవలం తమ స్వార్థం కోసమేతప్ప. బడుగుల బాగు కొరకు కాదు. ఈ లాంటి నాయకులను ప్రజలు నమ్మినన్ని రోజులు ఈ దేశం ఏమాత్రం బాగుపడదు అనుకున్నారు ఆ సంఘ సభ్యులు

"సుసంపన్నమైన, బహువిధమైన వారసత్వ సంపదను పెంపొందించుటకై నేను సర్వదా కృషి చేస్తాను" అని పాఠశాలల్లో విదార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తూనే ఉంటుంది ప్రభుత్వం.

# 32

"మోటపల్లి మహిళలు తమ గ్రామంలో జరుగుతున్న గ్రానైటు క్వారీలకు వ్యతిరేకంగా, పోరాడటానికి ఆ సాయంత్రమే సమావేశమౌతున్నారు, మీరు తప్పక రావాలి, మేడం" అని మోటపల్లి నుండి భూదేవి అనే మహిళ దుర్గాదేవికి ఫోన్ చేసింది.

ఆ సాయంత్రం మేడం, జరీనా బేగమ్ అనే రిటరైన లెక్చరర్ గారిని తీసుకొని, ఇతర సంఘ సభ్యులతో కలసి మోటపల్లికి చేరినారు,

మొదట్లోనే దళితుల ఇండ్లు ఉన్నాయి. దాని తర్వాత ఎతైన గడ్డమీద ఊరు ఉంది, మధ్యలో వేపచెట్టు. దానినానుకొనే అంజనేయస్వామి గుడి, ఆ వేప చెట్టు చుట్టూ రాళ్లతో ఎత్తుగా కట్టిన గద్దె మూడు కూడళ్ళ మధ్య ఉన్నది. ఊళ్లోకి పోయే దారి ఎడమ పక్కన చిన్న టీ దుకాణం ఉన్నది.

హనుమంతు అక్కడికి పోయి "భూదేవి ఇల్లెక్కడ" అని టీ కొట్టులో ఉన్న మహిళను అడిగిండు

దాంతో ఆమె "ఈ వాడలోని ఐదారు ఇండ్ల తరువాత వారి ఇంటివాకిట్లో అందరూ జమఅయింద్రు, మీరు అటేటు పోతె కన్పిస్తరు" అని చెప్పింది.

అక్కడికి పోయే సరికి దాదాపు వంద మంది మహిళలు క్రిందనే కూర్చోని చర్చించు కోవడం కనిపించింది,

సరీగా పదిహేడు ఏండ్లు కూడా లేని భూదేవి మమ్ములను చూడగానే "అగో కరీంనగరం నుండి భూమిరక్షణ సంఘం వారు వచ్చింద్రు. వారు మిగతా వివరాలు చెప్పుతారు మనం విని ఒక నిర్ణయానికి వద్దాం అని చెప్పి కూర్చుంది .

దానితో మొదట హనుమంతు తనను తాను పరిచయం చేసికొని, తదుపరి దుర్గాదేవిని జరీనాబేగంను, రామారావును, వెంకటగౌడును వారికి పరిచయం చేసిండు.

వెంకటగౌడు క్వారీలకు వ్యతిరేకంగా ఒక పాట పాడుతాడు అని చెప్పగా, వెంకటగౌడు పాటందుకున్నడు. గుట్టరాగుట్టా మన ఊరి గుట్టా

సెరలవడెగుట్టా వాల్ల చేతులకు జెట్టబుట్ట
మన వనరుల మింగుతుంటె ఊకుండేదెట్లా! గుట్టరా!
ఏండ్లనాటి గుట్టమీద ఎవడికన్నుగుట్టే
ఎతైనా కొండలన్ని బొందలవ్వ వట్టే
భూగర్భ జలమింకుతు విషం కక్క వట్టే
తాగేటి నీల్లెట్ల వ్యాపారమైపోయే
కట్టె పిడుకలను మనకు దూరమెవడు జేసే
వంటగ్యాసు ధరపెంచి మంటలెవడు రేపే
గాలి, అగ్గి, ఆకాశం రేపు బందీలవుతాయో
అవి దొరకక ప్రాణాలే పోతాయో! గుట్టరా!

బాంబుల మోతకు ఆడవి జీవులన్ని బెదిరి
దాడులను జెయ్యబట్టె మన ఇండ్లను చేరి
విధ్వంసాన్నాపకుంటే లేదురా దారి
చూస్తూ ఊకుంటే అమ్ముతారు ప్రతిది గీరి
అవుతాయి వనరులన్ని విషంగా మారి
క్వారీలే మానవాళి సామూహిక గోరి! గుట్టరా!

అభివృద్ధి పేర నాటకాలు ఆడుతుండ్రో
రంగురాళ్ళదోయ రింగురోడ్లు ఏత్తువుండ్రో
అంగుళమూ మిగలకుండ ఆక్రమిస్తూ ఉండ్రో
మైనింగ్‌తో మసిచేసి బూడిదిస్తావుండ్రో
గిరుల, తరుల, చెరువుల చెడగొడుతువుండ్రో
సహజ సంపదకు మంగళమ్ము పాడుతుండ్రో! గుట్టరా!

గుట్టలను మింగుతూ కోట్లెవడు కూడబెట్టె

రాజ్యమేలెటోడు, వాడి కాళ్ళు పిసుక వట్టే
చేతుల సేయ్యోసి గుట్టమీదొట్టేసి
మట్టిని నమ్మినోల్లం ఒక్కటై నిలుసున్నం
రాకాసి మిషన్లను ఇకపై రానీయం
మాగుట్ట రాళ్ళను ఎటూ తరలనీయం
సకల జీవకోటితో చలగాటమాడనీయం
మాగుట్ట నిండుగుంచుడే మా ధ్యేయం! గుట్టరా!

ఆ పాట అందరిని కదిలించింది, పెద్దగా చప్పట్లు గొట్టింద్రు.

హనుమంతు భూమిరక్షణ సంఘం వారు గీయించిన "నిన్న, నేడు, రేపు" అన్న చిత్రాలున్న బ్యానర్‌ను అందరు చూచే విధంగా కాంపౌండు గోడకు వేలాడగట్టిండు

ఇక వెంకటగౌడు గారు ఆ చిత్రాలను చూపిస్తూ గుట్టలు ఉన్నప్పుడు గ్రామం ఎట్లుండేదో, గుట్టలు లేక పోతే ఎట్లుంటదో వివరిచిండు. వాటి విధ్వంసం వల్ల జరుగు నష్టాల గురించి వివరించి చెప్పిండు.

ఇక దుర్గాదేవి మాట్లాడుతూ గుట్టలు పోతే మహిళలు నీటికై చాలా కష్టపడాల్సి వస్తుందని, దానివల్ల మహిళల బతుకులు మరింత దుర్భరమౌతాయని, పంట పొలాలకు నీరు అందక ఊరు పాడవుతుందని, అన్ని వివరంగా చెప్పి, గ్రామం లోని అందరూ ఐకమత్యంతో పోరాడితే మైనింగ్ లను ఆపవచ్చని అన్నది.

ఈ లోగా అదే మీటింగు కాడికి కొంత మంది మొగవాల్లు వచ్చినారు, వారు కాస్తా తాగి ఉన్నారు, వారిలో ఒకడు "మాకు భూములే లేవు ఊళ్లో నీళ్లుంటేంది పోతేంది" అని అరచిండు. ఇంతలో ఒక క్వాలిస్ జీప్‌లో మరి కొంత మంది దిగింద్రు. మరో వోల్వో కారులో మరో ఆరుగురు దిగింద్రు. వారితో పాటు కొందరు గ్రామస్తులు బాగా తాగి వారిచుట్టూ మూగింద్రు.

కొంత మంది బాగా త్రాగిన గ్రామస్తులు ఆ మీటింగ్ జరుగుతున్న వాకిట్లోకి వచ్చింద్రు.

అందులో ఒకడు "ఈ ఆడోల్ల మీటింగ్ లో ముగ్గురు మొగోళ్లు ఎందుకూ" అంటూ అరచి, మేముకూడా మీటింగ్‌లో మాట్లాడుతాం" అంటూ గొడవకు దిగిండు.

దుర్గాదేవి గారు ఇంకా మహిళలతో మాట్లాడుతూనే ఉంది.

వెంకటగౌడు ఆ వచ్చిన వారిని చూసిండు, వారంతా మైనింగ్ మాఫియా గుండాలు అని అర్థమైంది. వారిలో కొంత మంది చేతుల్లో కర్రలు ఉండడాన్ని గమనించిండు. ఆది చూచి వెంకటగౌడు బయటకు వచ్చిండు, ఇంకొద్ది మంది మైనింగ్ గుండాలు

కొద్దిదూరంలోని చిన్న దుకాణం ముందు గల అరుగులపై నిలుచున్నారు.

అందులో ఒకడు“ఇవ్వాళ్ళ వీళ్ళు ఇక్కడి నుండి ఎట్లా పోతరో చూస్తా అని” వెంకటగౌడు వైపు చూస్తూ గట్టిగా అరచిండు. అదేమి పట్టించుకోకుండా వెంకటగౌడు, వారి ముందునుండే చాయదుకాణానికి పోయి, చాయ తాగి మళ్ళీ సమావేశం చోటుకు నడచిండు.

అంతలో, తెల్లటి ఖద్దరు ఫ్యాంట్, షర్టు వేసికొన్న వ్యక్తి ఒకరు వెంకటగౌడుకు ఎదురుగా వచ్చి, “నేనే ఈ ఊరి గుట్టను గ్రానైట్లకు లీజు తీసుకున్నా. దానికి మరియు పెట్టుబడికి లక్షల రూపాయిలైనాయి. కాని మీరు వచ్చి గ్రామస్తులను రెచ్చగొట్టి మా పనులను అడ్డుకుంటున్నారు

గ్రానైటు పరిశ్రమ వల్ల వందలాది మందికి ఉద్యోగాలు, మరియు ప్రభుత్వానికి కోట్లాది రూపాయిల ఆదాయమే, కాక విలువైన విదేశి మారకం వస్తుంది.” అంటూ అలవాటైన ఉపన్యాస దోరణిలో పెద్దగా అంటూ

“చదువుకున్న మీరే దేశ ప్రగతిని అడ్డు కోవడం బాగుండదు”అన్నాడు కోపంతో ఊగిపోతూ అన్నాడు.

దానికి వెంకటగౌడు శాంతంగా “మీరేంచేస్తూన్నారో మీకు తెలియదు, గుట్టలు పగులగొట్టడం వల్ల భావి తరాలకు నీళ్లు లేకుండా పోతాయి, ఆ వివరాలన్ని మా కరపత్రంలో ఉన్నాయి చదవండి” అంటూ ఒక కరపత్రాన్ని మాట్లాడుతున్న పెద్ద మనిషికి ఇచ్చిండు.

దానిని తీసుకొని నలిచి కోపంగా కింద పడేస్తూ, “మీరేమో కార్లల్ల తిరుగుతూ మాకు అడ్డంకులు పెడుతున్నారు, మరి మీ కార్లలోకి పెట్రోలు ఎక్కడి నుండి వస్తుంది. మన బండలు వారికి అమ్మి వారి నుండి పెట్రోలు దిగుమతి చేసుకుంటున్నాం తెలుసా” గుడ్లుఉరిమి చూస్తూ వెంకటగౌడుతో అన్నడు.

దానికి గౌడు మరింత ప్రశాంతంగా, “మనిషికి ముందు కావలసింది నీళ్ళా లేక పెట్రోలా” అడిగిండు. దానితో అతనికి ఏం జవాబు చెప్పాలో తెలియక మౌనంవహించగా, వెంకటగౌడు, అతనిని ఉద్దేశించి, “ఇంతకు మీరు ఎవరు” అని అడిగిండు. ఆయన “నా పేరు రుద్రయ్య, నేను రాష్ట్ర గంగపుత్ర సంఘానికి అధ్యక్షుడను” అన్నాడు.

ఇక ఇక్కడ వీరితో ఏం మాట్లాడినా దండుగే అని భావించి వెంకటగౌడు మళ్లీ మీటింగ్ వద్దకు పోయిండు.

ఇంకా దుర్గాదేవి మాట్లాడుతూ, “మీరంతా ఏకంగా వుంటే మీగుట్టను అడ్డుకోవడం సాధ్యమే, కాని మీలో మీరే కొట్లాడుకుంటే చాలా కష్టం” అని చెప్పి కూర్చుంది.

ఇక జరీనా బేగం గారు మాట్లాడటానికి లేచింది. అప్పుడే బాగా త్రాగిన మైనింగ్ వ్యక్తి పెద్దగా అరుస్తూ ముందు మీతో కలసి వచ్చిన మొగోల్లను అక్కడి నుండి వెళ్లగొట్టండి లేదంటే మేము అందరమూ మాట్లాడతం అంటూ తగవు పెట్టుకున్నడు, అదే గ్రామంలోని కొందరు పురుషులు వారిని వారిస్తున్నారు.

ఆ తాగుబోతు ఇంకా రెచ్చిపోయి, “మగ వారితో కరీంనగరం నుండి ఈ రాత్రి మాట్లాడటానికి వచ్చిన ఆడోల్లకు బుద్దిలేదు, వింటున్న ఆడోల్లకు సిగ్గులేదు” అని గట్టిగా అరచిండు దానితో జరీనాబేగంకు ఎక్కడలేని కోపం వచ్చింది. దాంతో “మీరు కొద్దిగా మర్యాదగా మాట్లాడండి” అంటూ, అంతే కాక “ఈ లాంటి బుద్దిలేని తాగుబోతులతోనే గ్రామాలు నాశనమౌతున్నాయని” ఆ మహిళలకు చెప్పింది.

దానితో ఆ త్రాగుబోతులు, “మా ఊరికి వచ్చి మాకే బుద్ది లేదంటావా” అంటూ మరింత రెచ్చి పోయింల్రు.

ఇక మీటింగ్ ముగిసిందని ప్రకటించింది భూదేవి. వారంతా బయటకు వచ్చి కారువైపు వెలుతుండగా, క్వారీ ఓనర్‌తో సహా త్రాగుబోతు లందరూ వచ్చి భూమిరక్షణ సంఘం సభ్యులను చుట్టుముట్టింల్రు, మీరు మాకు క్షమాపణ చెప్పందే ఇచ్చటి నుండి కదలడానికి లేదు అన్నారు మొండిగా.

వెంకటగౌడుకు చాలా కోపంవచ్చింది, “మీరేం చేసుకుంటారో చేసుకొండి మేం ఇక్కడే కూర్చుంటాం” బజార్లో బైఠాయించారు. దుర్గాదేవి కూడా కూర్చుంది. జరీనా బేగం నిలుచుంది.

వాగ్వాదాలు జరుగుతున్నాయి.

ఇంతలోనే ఆ మీటింగ్‌లో పాల్గొన్న మహిళలంతా చీపుర్లుతోను. కట్టెలతోను, చెప్పులతోనూ ఉరికి వచ్చింల్రు, వచ్చి రాగానే భూదేవి “మీరు గనక వారిని వదలక పోతే మిమ్ములందరిని చీపుర్లతోనూ, కట్టెలతోను, చెప్పులతోనూ కొడతం” అంటూ భద్రకాళిలా అరచింది, పదులకొద్ది మహిళలు వారి చుట్టూమూగిన ఒక్కొక్కడిని లాగివేస్తున్నారు.

ఇంకొందరు మహిళలు “ఇది మైనింగ్ ముండాకొడుకులు చేయిస్తున్న పని ముందు వాళ్ల పని పడదాం పాండి” అని ఆ యజమానులవైపు ఉరికింల్రు.

ఆ దెబ్బతో వారు ఒకేపరుగున వాల్ల కార్లెక్కి పారిపోయింల్రు. ఎప్పుడైతే వారు పారిపోవడం గ్రామస్తులు చూసింల్రో వీళ్లుకూడా అక్కడి నుండి ఒకే పరుగుపెట్టింల్రు.

అప్పుడు భూదేవి మేడంతో “వీరందరిని మైనింగోడు తాగించి పట్టుకొచ్చిండు, దానికి మా తరఫున క్షమాపణ చెపుతున్నాం” అంది.

దానికి దుర్గాదేవి మాట్లాడుతూ "ఇటువంటివి తాను చాలా సంధర్భాలలో ఎదుర్కొన్నామని,

ఉద్యమ కారులకు ఇవి సహజమని" అంది.

సరే మేము వస్తామని చెప్పి రాత్రి రెండు గంటల వరకు కరీంనగరం చేరుకున్నారు.

తరువాత రెండు రోజులకు ఆ గ్రామస్తులంతా ఊరేగింపుగా వెళ్ళి స్థానిక తహసీల్ దారుకు ఆ ఊరిలో గల గ్రానైటు మైన్లను మూసివేయవలసిందిగా కోరుతూ వినతి పత్రం ఇచ్చింద్రు.

నాలుగు రోజులతరవాత వారంతా జగిత్యాల డివిజినల్ రెవిన్యూ ఆఫీసులో కూడా సామూహికంగా వెళ్ళి వినతి పత్రం ఇచ్చింద్రు.

దాని వల్ల కూడా ఏమీ జరుగనందున కొన్ని రోజుల తరువాత దాదాపు వెయ్యి మంది గ్రామస్తులు మగవారు, ఆడవారు ముసలోల్లు, పిల్లలు అందరూ కరీంనగరం లోని తెలంగాణా చౌకునుండి ఊరేగింపుగా బయలు దేరి కలెక్టర్ ఆఫీసుముందు ధర్నాకు దిగింద్రు.

వీరికి మద్దతుగా భూమిరక్షణ సంఘం సభ్యులు, దుర్గాదేవి కనకస్వామి, హనుమంతు, వెంకటగౌడు వారితో నడుస్తున్నారు.

ఇంతలో హనుమంతు "మా గుట్టలూ" అని అరవంగానే వారంతా "మాగ్గావలె" అని నినదించింద్రు. "గ్రానైటు క్వారీలు" అని హనుమంతు గట్టిగా అనగానే వారంతా "కరీనగరం జిల్లాకు గోరీలు" అని పెద్దగా నినదిస్తూ నడచింద్రు.

వీరి ఊరేగింపు కలెక్టరాఫీసుకు చేరగానే, వివిధ ప్రజాసంఘాల వారు తెలంగాణా రాష్ట్ర సమితి క్రిందిస్థాయి కార్యకర్తలు వారికి మద్దతు తెలిపింద్రు, యధావిధిగా అన్ని పత్రికల పాత్రికేయులు, టీవీ ఛానల్లవారు వచ్చి వీరి ధర్నాను కవర్ చేసింద్రు.

ధర్నాకు మోటపల్లి గ్రామస్తూలు వస్తూన్నారని సమాచారము అందు కున్న కలెక్టరు గారు ఆఫీసుకు రానేలేదు. తన ఇంటిలోనే ఉంది.

దానితో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు వద్దకు "ఐదుగురు వచ్చి వినతిపత్రాన్ని ఇవ్వవచ్చని" గిర్దావరు చెప్పగా,

తెలంగాణా రాష్ట్ర సమితి నాయకుడోకరు "కలెక్టరమ్మ వచ్చి తీసుకోవాలని. ఆమె వచ్చేవరకు ఇక్కడే బైటాయిస్తామని" రెచ్చగొట్టిండు. దానికి కొందరు వంత పాడింద్రు.

దానికి ఒకరు అడ్డు చెపుతూ మనం "కలెక్టరుకు ఇచ్చినా. ఆఫీసు గుమాస్తాకు ఇచ్చినా ఒక్కటే, ఏమి చర్యలు తీసుకోరు. అయితే మనం ఊరేగింపుగా రావడం అన్నది, మన న్యాయమైన సమస్యను ప్రజలదృష్టికి తీసుకురావడమే ప్రధానమని, మనం దానిని

సాధించామని, ఇంకా కలెక్టర్రే రావాలే ఆవిడే తీసుకోవాలె అనడంలో అర్థంలేదని" అన్నాడు,

ఆవేశంలో ఉన్న ఉద్యమకారులు ఆగకుండా కలెక్టరు గారి ఇంటివైపు ఉరేగింపుగా వెళ్లింద్రు.

కలెక్టరు ఇంటి ముందు భారీ పోలీసు బంధోబస్తు ఏర్పాటు చేసినారు.

ఉద్యమకారులు కలెక్టరు గారి ఇంటి ముందు నినాదాలు చేస్తూ రోడ్డును ఆక్రమించుకున్నారు

ఇంతలో కలెక్టరు గుమాస్తా వచ్చి "ఐదుగురు వచ్చి వినతి పత్రాన్ని తనకు ఇవ్వడానికి కలెక్టరుగారు సమ్మతించారు, కావున ఒక ఐదుగురు లోనికి వచ్చి వినతి పత్రాన్ని ఇవ్వండి"అని చెప్పిండు,

ఉద్యమకారులు "కలెక్టరు గారే వచ్చి తీసుకోవాలని" మంకు పట్టుపట్టింద్రు.

ఇంతలో మరో గుమాస్తా, మరో పోలీసు ఆఫీసరువచ్చి ఐదు నిమిషాలటైమిస్తున్నాము "ఐదుగురు పోయి వినతి పత్రాన్ని ఇవ్వండి లేక పోతే లాఠీచార్జీ చేస్తా" మని ప్రకటించిండు.

దానితో దుర్గాదేవి, భూదేవి మరో నలుగురు వినతి పత్రాన్ని తీసుకొని వెళ్ళినారు. కలెక్టరు గారు వీరిని చూడగానే "నా ఇంటిపైకి వస్తారా", అనికోపంతో అరచింది. వారు ఇచ్చిన వినతి పత్రాన్ని టెబుల్ పై విసరికొట్టి "ఇక వెల్లండి" అని కసురుకున్నది.

ప్రజలు కట్టిన పన్నులతో జీతభత్యాలు. నివాసాలు, విలాసాలు దక్కించు కున్న ఆధికారులు ఇలాగా ప్రవర్తించితే ఎలా అని దుర్గాదేవి బాధపడింది. అంతాఆవిడ దురుసుతనానికి, అవాక్కయి. వెనుదిరిగి అందరినీ తీసుకొని వెళ్ళిపోయింద్రు. పోతూ పోతూ వాళ్ళు కలెక్టరు డౌన్. ఢౌన్ అంటూ నినాదాలు చేసింద్రు.

"మీ ఊరికి మరోసారి వచ్చి మనం ఏంచేయాలో అలోచించుకుందాం" అంది దుర్గాదేవి.

దానికి భూదేవి "ఇంక ఆలోచించేదేమున్నది ఒక్కపోరాటం తప్ప" అంటూ, "ఇక ఇక్కడ పనులు కావని తేలింది. కావున మా గ్రామంలోనే మేము తేల్చుకుంటం అటో, ఇటో" అంటూ అందర్ని వెంటపెట్టుకుని వెళ్ళింది.

# 33

తరువాత రెండు రోజులకు ఆ గ్రామంలోని మహిళలంతా సమావేశం పెట్టుకొన్న చోటనే గూమికూడింద్రు. దానికి సమన్వయ కర్తగా భూదేవి వ్యవహరించింది.

అందరిని ఒకసారి పరికించి చూసి "మనం మల్యాల తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తిమి, ఆర్‌డిఓకు ఇస్తిమి, కలెక్టరమ్మకు ఇస్తే విసుక్కునే ఇగ ఏడకు పోదాం ఏంజేద్దాం

జర అలోచనజేయింర్డి. మనం ఏది జేసినా ఒక్కటిగానే ఉండాలే. అందరం ఒక్కతాటిపై నిల్చుండాలే” అన్నది.

దానికి తెనుగు మల్లవ్వ లేచి “వెనుకట దొరలు ఉన్నప్పుడు, అన్నలు వచ్చి అన్ని సంగతులు విడమరిచి చెప్పేవారు, వారిని మనం కాపాడుకోలేక పోతిమి, ఇప్పుడేమో మన పోరగాల్లంత దుబాయి, బొంబాయి పోయిరి, ఇక్కడేమో ముసలోల్లము, ఆడోల్లము, పిల్లలము ఉంటిమి. మనూరికి ఇతర ఊళ్లనుండి మేంపిల్లనిత్తం అంటే మేమిత్తమని వచ్చేవాళ్లు. ఇప్పుడు గుట్టలు పోతే మా బతుకులు ఆగమైతయి, మా మొగపోరలకు ఇగనుంచి పెళ్లిండ్లు కావడం కష్టంఅయితది. ఎట్లైనా జేసి గుట్టలను, గుట్టలమీద ఉన్న తునికి, సీతాఫలక చెట్లను, కాపాడుకోవాలే. అందరం ఒకటిగుందాం కొట్లాడుదాం” అంది.

రామక్క లేచి “కొట్లాడుదాం అని అందరికి ఉంది. కాని ఎట్లా కొట్లాడుదామో ఎవరు చెప్తలేరు” అంది.

దానికి సత్తెక్క లేచి “ఎట్లేంది మనం అన్నలున్నప్పుడు మన వూరి దొరను ఉరికిచ్చినట్లు క్వారీవోన్ని ఉరికిస్తే సరిపాయె” అంది,

దానికి రత్తమ్మ అడ్డం వస్తూ “మరి పోలీసోల్లు వస్తే” అంది.

దానికి నాగమ్మ మాట్లాడుతూ “పోలిసులచ్చింర్డని మనం భూములు దున్నడం ఆపినమా, దొరలను తరమడం ఆపినమా” అన్నది.

“పోలీసులు వస్తరు కొడుతరు, కేసులైతయ్ అన్నిటికి తట్టుకొని కొట్లాడాలే” అన్నది.

నర్సక్క లేచి “అప్పుడు మనోల్లే కొందరు దొరలకు, పొలీసులకు అమ్ముడు పోయి, తాగి తందనాలాడి అన్నల పొలీసులకు పట్టిచ్చిరి, పొలీసోల్లు కొందరిని చంపిరి. ఇప్పుడు అన్నలుంటే మన గుట్టల మీద ఈగవాలేదా” అన్నది.

ఇక రాజక్క లేచి “మనమే అన్నలం గావాలే, అక్కలం గావాలే వాళ్ళెవల్లో వస్తరంటే కుదరదు, ఆ మాటకొస్తే మన సర్పంచే కదా అనుమతి ఇచ్చింది, కాబట్టి మన ఊరి గుట్ట మనందరి ఆస్తి, మనకు తెల్వకుండ ఇంత పియ్యితిని వాల్లకు రాసిచ్చే వాని మొల్దారం దెగ, వానింట్ల పీనుగెల్ల, లెంర్డి లెంర్డి మన ఆస్తి మనకు గావాలే, వాడెవడు రాసివ్వడానికి ఏమైతే అది ఐతది, అందరం కలసి క్వారీకి పోయి కాలబెడదాం రాంర్డి ఎవడడ్డం వస్తరో చూద్దాం”అంది

అందరూ ఎలాగైనా ఆ గుట్టపైకి ఎక్కి క్వారీని అడ్డుకుని తీరాలి అని తీర్మానించుకున్నారు. అందరూ రేపు పనులన్నీ బందు పెట్టాలని నిర్ణయించు కున్నరు.

తెల్లవారింది ఆ గ్రామంలోని ఆడోల్లంతా మూడు బజార్ల కూడలిలో చేరింర్డు,

ముసలోల్లు వచ్చింగ్రు, పిల్లలు వచ్చింగ్రు, వారికి మద్దతుగా గ్రామంలోని రైతులు వచ్చింగ్రు, కాని కొందరు రెడ్డి దొరలు మాత్రం ఇండ్లల్లకే పరిమితం అయింగ్రు. మొత్తం మీద దాదాపు వెయ్యి మంది గూమి కూడింగ్రు,

ముందుగా భూదేవి "మాట్లాడుతూ ఇప్పుడు మనమంతా మన గుట్టకు పోదాం నడవండి" అంది.

ఒక యువకుడు "మా గుట్టలు" అని అరచిండు. మిగతావారంతా"మాగ్గావాలే" అని అరచింగ్రు

ఇంకొకల్లు"మా చెరువులూ"అన్నాడు"మాక్కావాలే"అని అరచింగ్రు జనం,

ఇంకొందరు "మా భూములు" అంటే

"మాగ్గావలె" అని అరుస్తూ నడుస్తున్నరు.

ఊరేగింపు ఊరు దాటి గుట్ట వైపు సాగింది. పొలాల మధ్యగల రోడ్డుగుండా ఊరేగింపు నడుస్తూంది. ఆ ఊరేగింపులో, అరవెళ్ళి నుండి లేచి వచ్చిన నాయకురాలు నాగమ్మ కరవాలం పట్టుకుని నడుస్తూంది. సమ్మక్క, సారలమ్మలు విల్లమ్ములు పట్టుకొని వస్తున్నారు. చాకలి ఐలమ్మ ''మా భూములపై మాకే హక్కని'' రోకలి బండ చేతులోపట్టుకున్నది.

రాంజీ గోండు, కొమరంభీంలు ఊన్నారు. అంతా మా అడవి మాదేనంటూ దిక్కులు పెక్కటిల్లేలాగ నినదిస్తున్నారు. బిర్సాముండా తన రాతి గొడ్డలి పట్టుకున్నడు, గుండాదర్ ఉన్నాడు. గుర్రాలపై సర్వాయి పాపన్న, తుర్రెబాజ్ ఖాన్‌లు ఊరేగింపును అనుసరిస్తున్నారు.

ఆ ఊరేగింపు రోడ్డు ప్రక్కనున్న చెరువు కట్టనెక్కింది, చెరువు ఎండిపోయి నెర్రెలు వాసి ఉన్నది.

ఇంతలో బందగి ఆ ఊరేగింపులో కలసిందు, దొడ్డి కొమరయ్య, సాయిని ప్రభాకర్, నల్లఆదిరెడ్డి, శీలం నరేశ్, నేలకొండ రజితలు నడుస్తున్నారు భగత్‌సింగు "జీనాహైతో మర్‌నా సీఖో, కదంకదంపర్ లఢనా సీఖో" నినాదాలు ఇస్తున్నాడు

కాళోజీ, దాశరథి. సోయబుల్లాఖాన్, ముక్ధుం పెద్దపెద్ద అంగలు వేస్తూన్నారు. అన భేరి ప్రభాకర్ రావు తన మిత్రులతో కదం తొక్కుతున్నడు. సీతారామరాజు, సుబ్బారావు పాణిగ్రాహి, జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్‌లు నినదిస్తున్నారు. బెల్లి లలిత పాటలు పాడుతున్నది. తుపాకి పట్టుకొని కిషన్‌జీ ముందున్నడు. అందరూ ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తున్నారు.

బొగ్గు గనుల క్రింద భూములు కోల్పోయిన భూనిర్వాసితులు ఉన్నారు, వివిధ ప్రాజెక్టుల క్రింద నిర్వాసితులైన ప్రజా సమూహాలు ఉన్నాయి. ధగా పడిన రైతులు తమ

క(్రలందుకొని దండుకట్టింద్రు, శేషగిరి రావు, కట్ల నరేశ్, సమ్మిరెడ్డి, రమాకాంత్, జిలాని భాను, రాయలింగు, రత్నంల నాయకత్వంలో సింగరేణి కార్మికులు తట్టాచెమ్మసులతో అనుసరిస్తున్నారు. విద్యార్థులు నినాదాలు చేస్తున్నారు. ఆదివాసులు “మా గుట్టలు, నదులు, అడవులు, సైకతాలు, వన్య ప్రాణులు మాక్కావాలే” అంటున్నారు.

పిల్లలు మాకు ఆందమైన గుట్టలను. అడవులను, వన్యప్రాణులు మాకు కావాలని ఆరుస్తున్నారు.

బాలగోపాల్, బుర్రారాములు, గోపిరాజన్న, జాపలక్ష్మారెడ్డి, పౌరహక్కుల కోరకు కొట్లాడుతున్నరు నరసింహ్మాస్వామి, వెంకటేశ్వరస్వామి, హనుమంతులు, తమ పూజారులతో సహా కదంతోక్కుతున్నరు.

లింగారెడ్డి, చెరబండ రాజు గారలు ప్రజారచయితల, కవుల మద్దతు కూడగడుతున్నరు.

ఊరేగింపులో, ధగా పడినగౌండ్లు. జాలరులు. తెనుగోల్లు, గొల్లలు, కుర్మలు, కమ్మరులు, నేతన్నలు చర్మకారులు అందరూ తమతమ ఇసిరెలతో కదం తొక్కుతున్నరు.

కట్ట మైసమ్మలు. పోచమ్మలు, దుర్గమ్మలు తమ బైండ్ల వారితో నడుస్తున్నారు.

వారందరికి “భూదేవి” నాయకత్వం వహిస్తోంది.

సాయంత్రం కావస్తోంది. ఆ సమూహమంతా గుట్టపైకి చేరుకున్నది. వారి ధాటికి క్వారీ యజమాన్యం పిక్కబలం చూపింది.

నీళ్ళు లేని చెరువులో సూర్యుడు, రేపు ఊదయించడానికి, నేడు అస్తమించిండు.

గుట్టమీది క్వారీలో మంటలు అంటుకున్నాయి, చుట్టూ పది గ్రామాలకు మంటలు మిన్నంటి కనపడుతున్నాయి.

టి. జగన్మోహన రావు.
504, మారుతీ రెసిడెన్సీ
ముకరంపురా, కరీంనగరం.

# ప్రతిపాదిత కొత్త మైనింగ్ జోన్ విధానాన్ని వ్యతిరేకించండి

మల్యాల మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో గల ఒక పాఠశాలలో, కోతులు వచ్చి పిల్లలను కరువకుండా ఉండటానికి సదరు పాఠశాల యజమానులు ఒక కొండెంగను తీసుకువచ్చి, పాఠశాల ఆవరణలో కట్టివేసినారు. కోతుల దాడినుండి పిల్లలను రక్షించడానికి వారికి అంతకన్న ఉపాయం తట్టలేదు. ఆ కొండెంగను భంధించడం చట్ట విరుద్ధం అన్న సంగతి వారు మరచినారు.

అయితే కోతులు ఆ గ్రామంలో దాడి చేయడానికి కారణం ఆ గ్రామంలో గల గుట్టలను యధేశ్చగాతవ్వుతున్న నాలుగు గ్రానైటు క్వారీలే కారణం. ఆంతే కాదు కరీంనగరం జిల్లాలోని సైదాపూర్ మండలంలోని పదిర గ్రామంలో గల చుట్టుపట్ల గల గుట్టలలో గల పదహారు గ్రానైటు క్వారీలవల్ల నిర్వాసితులైన కోతుల బాద పడలేక ఆ గ్రామస్తులంతా రెండున్నర లక్షలు ఖర్చుపెట్టి కొతులను పట్టేవారిని తీసుకొచ్చి రెండు వేల పైచిలుకు కోతులను పట్టించి, వాటిని లారీల కెక్కించి మహాదేవపూర్ అడవుల్లో వదలి వేయించినారుఇంతే కాక, తిమ్మాపూర్. శంకరపట్నం, హూజారాబాద్, గంగాధర, ధర్మారం, పెద్దపల్లి, మానకొండూరు, సుల్తానాబాదు, కరీంనగరం, హుస్నాబాదు మండలాలలోని ప్రతీ గ్రామంలోను ఇదే పరిస్తితి దాపురించింది. కోతులేకాక గుడ్డేలుగులు కూడా తమ సహజ ఆవాసాలను కోల్పోయి గ్రామస్తుల పై తరచుగా దాడి చేస్తున్నాయి. దాదాపు మూడు సంవత్సరముల క్రితం మానకోండూరు మండలం గట్టు దుద్దెన పల్లిలో ఒక గుడ్డేలుగు దాడిలో ఒక వ్యక్తి మరణించగా, సదరు మండల యసైగారు ఆ గుడ్డెలుగును కాల్చి చంపింది.

కరీంనగరం పట్టణ శివారు ప్రాంతాలకు కూడా గుడ్డెలుగుల బెడద తప్పటం లేదు, రాత్రి అయ్యిందంటే కరీంనగరం శివారు గ్రామాల ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుంటున్నారు. కరీంనగరం మండలంలోనే దాదాపు ఎనభైకి పైగా గల గ్రానైటు, కంకర గనుల వల్ల గుడ్డేలుగులు కొతులు తమ ఆవాసాలను కోల్పోయి, కరీంనగరం శివారు గ్రామాలలోని ప్రజలపై దాడి చేస్తున్నాయిఅవన్ని ఇటీవల ఎలుగందుల కోటపై తిష్టవేయడం వల్ల, పారెస్టు డిపార్టు మెంటు వారు ఒక వాచ్‌మను నియమించి ఎవరు ఎలగందుల ఖిలాఎక్కకుండా కాపలా పెట్టినారు. కాని వారు తమకు గల సిబ్బంది కొరత వల్ల, ఎల్లకాలం ఆ వాచర్‌ను కొనసాగించ లేక, ఆ కోటముందు గుడ్డెలుగులున్నాయి జాగ్రత్త బోర్డుతో సరిపెట్టుకున్నారు.

ఈ కోతుల బెడదతోను, గడ్డేలుగుల దాడివల్లను అనేక గ్రామాల ప్రజలు పడరాని

పాట్లు పడటంతో పాటు, పాడి పంటలు నష్టపోతున్నారు. కోతుల దాడివల్ల వారి ఇంటి పైకప్పులు చెల్లాచెదరౌతున్నాయి. అంతే కాకా చాలా మంది గ్రామస్తులు కోతుల బెడద తాల లేక, తమ ఇండ్లలోగల పండ్ల, కూరగాయల సాగును మానుకున్నారు, పండ్ల చెట్లను నరికి వేసినారు.

దీనికి కారణం ఒక్క కరీంనగరం జిల్లాలోనే దాదాపు ఎనిమిది వందలపైగా క్వారీలను ప్రభుత్వం మంజూరు చేయడమే. కేవలం టన్ను గ్రానైటు వల్ల వచ్చే ముష్టి నలభై రూపాయిల ఆదాయం కొరకు జిల్లా లోని గుట్టలన్నింటిని ధ్వంసం చేస్తూ గ్రానైటు రాళ్ళనుచైనా లాంటి విధేశాలకు ఎగుమతులు చేస్తూ కొద్ది మంది గ్రానైటు వ్యాపారుల కొమ్ముకాస్తున్నది సర్కారు. కాని అదే సమయంలో గుట్టలను ఆనుకొని ఉన్న చెరువుల విధ్వంసాన్ని, ఆ చెరువులపైఆధార పడిన నడుస్తున్న వ్యవసాయాలపై ఈ గ్రానైటు పరిశ్రమ చావు దెబ్బ కొడుతున్నది. ఆంతే కాక ఒక్క కరీంనగరం జిల్లాలోనే ఇప్పటికే దాదాపు ఒక లక్ష గొర్రెల వుత్పత్తి తగ్గింది. దానితో వందలాది గొర్రె కాపరులు నిర్వాసితులైనారు.

అంతేకాక ఈ గుట్టలపై కురిసే వానల వల్లనే చిన్నచిన్న వాగులు వంతల ద్వారా చెరువు కుంటలకు నీరు అందుతున్నది.

ఇటీవలి వేసవిలో ఉష్ణోగ్రత యాభై డిగ్రీల పైచిలుకు రావడానికి ఈ గుట్టల విధ్వంసం కూడా కారణం.

గోరుచుట్టుపై రోకలి పోటన్నట్లుగా ఇటీవలి మైనింగ్ డిపార్టుమెంటు వారు తమ "మైనింగ్ 2013 విధాన పత్రంలో పట్టణాల చుట్టుపట్ల గల గ్రామాలను ప్రత్యేక మైనింగ్ జోన్లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇది చట్టమైతే కరీంనగరం చుట్టు పట్ల కూతవేటు దూరంలోనే గల కమాన్‌పూరు, బద్దిపల్లి, రేకుర్తి, తీగలగుట్టపల్లి, నగునూరు, బొమ్మకల్లు, ఇటు తిమ్మాపూర్ మండలం, మానకోండూరుసుల్తనాబాదు మండల గ్రామాలన్నిటిని స్పెషల్ మైనింగ్ జోనుగా మారనున్నది. దానితో కరీంనగరం పట్టణ విస్తరణ ఆసాధ్యమేకాక,

ఇదివరకే వందల ఎకరాలను కొన్న రియల్ ఎస్టేటు వ్యాపారులు కోట్ల కొద్దిగా నష్టపోనున్నారు, పైగా ఆయా గ్రామాల ప్రజలు తమ భూములను గవర్నమెంటు నిర్ణయించిన రేటుకే గ్రానైటు వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తూంది.

## ప్రతిపాదిత ప్రత్యేకమైనింగ్ జోన్‌విధానం వల్ల జరుగు నష్టాలు.

1) మైనింగ్ జోన్‌ప్రాంతంలో అభివృద్ధి పనులన్ని ఆగిపోతాయి.
2) మైనింగ్ జోన్‌లోని గ్రామాల ప్రజల భూములను ప్రభుత్వ ధరలలో సేకరించి, గ్రానైట్ వ్యాపారులకు తక్కువ ధరలకు ప్రభుత్వమే అమ్ముతుంది. కావున ఆయా గ్రామాల వ్యవసాయదారులు, ప్రజలు బారి ఎత్తున నష్టపడనున్నారు.
3) ఇప్పటికే చుట్టుప్రక్కల నున్న గుట్టలన్నీ కూల్చబడగా, ఇక ఇప్పుడు రాబోయే గ్రానైటు ఓపెన్ కాస్టు గనులవల్ల కరీంనగరం పట్టణం, మరియు చుట్టుపట్ల గ్రామాలలో ఉపరితల, భూగర్భజలాలు అడుగంటనున్నాయి. చుట్టుపట్ల గల చెరువులు, వాగులు వంకలు, చివరకు మానేరు నది ఎండి పోనుంది.
4) కరీంనగరం పట్టణ చుట్టుపట్ల ప్రాంతాల గ్రామాలు కార్పోరేషన్‌లో కలప బడవు. దానితో కరీంనగరం పట్టణం అభివృద్ధి ఆగిపోతుంది. ఇది వరకే చుట్టుపట్ల గ్రామాలలో అధిక దరలకు భూములు కొన్నవారు నష్టాలపాలు కానున్నారు.
5) ఇప్పటికే మైనింగ్ గ్రామాల ప్రజలు వాతావరణ కాలుష్యం బారిన పడుతున్నారు. ఆయా గ్రామాలలో గర్భస్రావాలు, మరియు నెలలు నిండని శిశువులు జన్మించడం జరుగుతున్నది.
6) ఈ వేసవిలో ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటింది. రాబోవు ఓపెన్‌కాస్టు గ్రానైటు గనులవల్ల మరింతగా పెరిగి మన జీవితం దుర్భరంగా మారనున్నది. చివరకు కరీంనగరం జిల్లా ఎడారి కానుంది.


ఇటీవల జరిగిన కేదార్‌నాథ్ లో జరిగిన ప్రకృతి భీబత్సం పర్యావరణాన్ని నాశనం చేయడం వల్లే జరిగిందన్నది మనం మరచి పోకూడదు. ఈ సర్పంచు ఎన్నికలలో గ్రానైటు క్వారీ యజమానులు లక్షలాది రూపాయిలు తమ అభ్యర్థులను సర్పంచులుగా, పంచువులుగా గెలిపించడానికి మైనింగ్‌లు ఉన్న గ్రామాలలో ఖర్చుచేస్తున్నారు.

కావున కరీంనగరం ప్రజలు రానున్న చట్టానికి వ్యతిరేకంగాను, గ్రానైటు పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడవలసి ఉన్నది. కావున రానున్న సర్పంచి ఎన్నికలలో గ్రానైటు పరిశ్రమ వ్యతిరేకించే వారినే ఎన్నుకోవాలి. గ్రానైటు మాఫియాలను వ్యతిరేకించ వలసిందిగా

"తెలంగాణ భూమిరక్షణ సంఘం" ప్రజలకు విజ్ఞప్తి చేస్తూంది.

**టి. జగన్మోహన రావు**

తెలంగాణ భూమిరక్షణ సంఘం కో-కన్వీనర్, కరీంనగరం జిల్లా


కరీంనగర్ జిల్లా
GRANITE MINING AREA
COAL MINING AREA
Karimnagar or Bolivia!





తెలంగాణ భూమి రక్షణ సంఘం
కరీంనగరం జిల్లాలోని గ్రానైట్ క్వారీలను రద్దుచేయాలి
క్వారీలకు అనుమతులు ఇవ్వకండి - మానేరు గోదావరి నదులను చంపకం
క్వారీలను ఆపండి - ప్రజలను రక్షించండి
గ్రానైట్ క్వారీలు - కరీంనగరం జిల్లాకు గోరీలు
మానవ మనుగడకై
తెలంగాణ భూమి రక్షణ సంఘంలో చేరండి - క్వారీలకు వ్యతిరేకంగా పోరాడం






నిర్బంధ గ్రానైటు కార్మికులతో
ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షులు శ్రీ వేదకుమార్‌గారు మరియు రత్నమాలగారు



సర్వాయి పాపాన్న గుట్టను రక్షించుకోవడానికి ఉద్యమిస్తున్న కార్యకర్తలు



ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేకానికి పర్లపల్లి మహిళల ఉద్యమం

ఆంధ్రజ్యోతి కరీంన

# గర్శకుర్తిలో చెట్టెక్కిన భల్లూకం...

గంగాధర : గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో వేపచెట్టు పైకెక్కిన ఓ భల్లూకం గ్రామంలో రెండు రోజులు కలకలం సృష్టించింది. సమీప గుట్టల్లో గ్రానైట్ వ్యాపారులు బ్లాస్టింగ్ చేస్తుండడంతో గుట్టల్లో తలదాచుకున్న ఎలుగు బంటి గురువారం రాత్రి గ్రామంలోని ఓ వేపచెట్టు పైకెక్కి శుక్రవారం వరకు కదలకుండా చెట్టుపైనే కూర్చుంది. దీంతో స్థానికులు ఎలుగు బంటి ఎక్కిన చెట్టు వద్దకుబారులు తీరి భల్లూకంను తిలకించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రంగంలో దిగిన ఫారెస్టు అధికారులు చెట్టుపైనున్న ఎలుగు బంటికి తేనెను ఎరగ వేసి కిందికి దింపి తరిమికొట్టారు. దీంతో స్థానికులు తాత్కాలికంగా ఊపిరి పీల్చుకున్నా మళ్లీ రాత్రి వేళల్లో సదరు భల్లూకం ప్రత్యక్షమవుతుందని స్థానికులు వాపోయారు.



చెట్టుపై కూర్చున్న భల్లూకం

## గుర్తు తెలియని వాహనం ఢీకొని


# ఎలుగుబంటి మృతి



మృతి చెందిన ఎలుగుబంటి

హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండలం పందిల్ల జిన్నింగ్ మిల్లు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎలుగు బంటి మృతి చెందింది. ఉదయం హన్మకొండ, సిద్దిపేట్ వెళ్లే రోడ్డుపైన వ్యవసాయ బావుల వద్ద కు వెళ్తున్న పందిల్ల రైతుల కు రోడ్డుపైన ఎలుగుబంటి పడుకుని ఉన్నట్లు కనిపించింది. భయంతో వారు వెనుదిరిగారు. పందిల్ల నుంచి పాలు పోసేందు కు హుస్నాబాద్‌కు వెళ్తున్న పుట్ట రాములు ఎలుగుబంటిని గమనించి ప్రమాదంలో మృతి చెందినట్లు గమనించాడు. ఈ విషయాన్ని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మోహన్‌లాల్‌కు సమాచారం అందించడంతో సిబ్బందితో వచ్చి మృతి చెందిన ఎలుగు బంటిని పంచనామా చేశారు. అక్కడే ఎలుగుబంటిని గ్రామస్థుల సహకారంతో దహనం చేశారు.

# విద్యార్థుల చదువుకు కొండముచ్చు పహారా



విద్యార్థులకు కాపలాగా ఉన్న కొండముచ్చు

**మల్యాల :** కోతుల బెడదతో చదువులకు, మధ్యాహ్న భోజనంకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతుండటంతో కొండముచ్చు కోతుల బెడదను దూరం చేస్తుంది. మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న కోతులు వారి చదువులకు ఆటంకం కలిగించడంతో పాటు గాయపరుస్తుండటంతో వాటిని అక్కడి నుంచి తరిమికొట్టడానికి కొండ ముచ్చులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# గ్రానైట్ క్వారీ రద్దు చేయాలని ధర్నా

19/1/2011

## కలెక్టరేట్, క్యాంపు కార్యాలయం ఎదుట మ్యాడంపల్లి వాసుల బైఠాయింపు

రాంపూర్, న్యూస్‌టుడే: మల్యాల మండలం మ్యాడంపల్లిలో గ్రానైట్ క్వారీలను రద్దు చేయాలని తెలంగాణ భూమి రక్షణ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం కరీంనగర్‌లో ధర్నా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, గ్రామస్థులు మొదట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్య వినాలని పట్టుబట్టారు. జిల్లా రెవెన్యూ అధికారి బాలాజీ రంజిత్ ప్రసాద్ వీరి సమస్యను వినేందుకు వచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో కలెక్టర్‌ను కలుసుకునేందుకు క్యాంపు కార్యాలయానికి వచ్చిన వారు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేస్తూ రోడ్డుపై బతుకమ్మలు ఆడారు. ఫలితంగా దారిపై రాకపోకలు నిలిచిపోయాయి. మరో పక్క కలెక్టర్‌ను కలుసుకునేందుకు అధికారులు ఐదుగురికి అవకాశాన్ని కల్పించారు. గ్రామస్థులు, తెలంగాణ భూమి రక్షణ సంఘం జిల్లా కన్వీనర్ ప్రొఫెసర్ సుజాత, కో-కన్వీనర్ ఎం సుదర్శన్ మాట్లాడుతూ గ్రామంలో గ్రానైట్ కోసం గుట్టలను తవ్వుతూ, చెట్లను కొట్టేయడం వల్ల అడవిలోని జంతువులు జనంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పశుగ్రాసం, పంట చెరువు కరవవడంతో పాటు రోడ్డు చెడిపోతున్నాయని చెప్పారు. క్వారీలను వెంటనే నిలిపివేస్తూ వీటిని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భూమి రక్షణ సంఘం కో-కన్వీనర్లు జగన్మోహన్ రావు, కుమార స్వామి, గ్రామ సర్పంచి ఆర్ రవి, మల్యాల ఎంపీపీ డి.ఆదిరెడ్డి, తెరాస నాయకులు కట్ల సతీష్, గుర్రం పద్మ, సిద్దం వేణు, గోపాల్ రెడ్డి, భాజపా నాయకుడు కె.ఓదెలు, తెదేపా చొప్పదండి ఇంఛార్జి పి.రామారావు, సిర్నాల పద్మ, గంగమ్మ, లక్ష్మి, సరస్వతి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

Eenadu 19/1/2011





## తోటపల్లి జగన్మోహన రావు

జననం : 10-08-1951

తల్లి తండ్రులు : తోటపల్లి ఆండాళమ్మ, నారాయణరావు గారలు

సహచరి : తోటపల్లి సీతామహాలక్ష్మి

గ్రామము : తోటపల్లి
మండలం : బెజ్జంకి
జిల్లా : కరీంనగరం

పూర్వపు రచన : "మరో సరస్వతి కానున్న గోదావరి" 1999
పునర్ముద్రణ 2009

సహజ వనరులను కాపాడాలనే తాపత్రయం ప్రవృత్తి

తెలంగాణా భూమి రక్షణ సంఘంలో కో-కన్వీనర్‌గా గత నాలుగు సంవత్సరాలుగా కరీంనగరంలోని గుట్టలను కాపాడాటానికి పోరాటం.



**BHOODEVI**

*by T. Jaganmohanarao*

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29, Mobile: 9030626288 Fax: 040-27635644
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org